కథలు

వేంపల్లి గంగాధర్

దేవరశిల

వేంపల్లి గంగాధర్

దేవరశిల

USHASSU
PRACHURANALU

Devarasila
by VEMPALLI GANGADHAR
e-mail : vempalli_gangadhar@yahoo.co.in

copyright with writer

First published
November, 2008
by Ushassu Prachuranalu

Cover & Inner Paintings : Chitra

Cover Design : Ramana G.V.

DTP : T.V.Narayana Rao - 9440591530

for copies
Vempalli Gangadhar
4/432/A
Vivekananda nagar
Kadapa - 516001
Andhra Pradesh - India
Cell : 9440074893

Visalandhra Book House
and its branches in A.P.
Prajasakthi Book House
Disa Pustaka Kendram,
Navodaya Book House

Price : Rs. 50/-

తెల్లటి ఆకాశం మీద
నల్లటి మోడాలు కమ్ముకుంటా వుండాయి.
నల్లమబ్బుల ఆకాశాన్ని ఈదుకుంటా
ఎర్రకొంగల గుంపొకటి
బయలుదేరింది ఈ దారిలోనే..!

‘దేవరశిల’ కథలు చదువుతుంటే...

రాత్రి కురిసిన వానకు ఏటి నిండా కొత్త నీళ్లు వచ్చి చేరినట్లు, నెమలి వాగు వంక ఎగువ నుంచి పొంగి పొర్లుతూ తెల్లటి నురగతో నవ్వుతున్నట్లు, చెరువులో బుడుంగు బుడుంగుమంటూ మునిగే నల్లటి చెరువు కోళ్లలా, ఆకుపచ్చని కలల మధ్య అందంగా విప్పారిన తెల్ల తామర పువ్వుల్లా, చెరువు కట్టమీది చీకి చెట్లలోని జీరంగుల సంగీతంలా, ఊడలు దిగిన వూరి మఱ్ఱిమానులా, గాలికి వూగే రావి ఆకుల గలగల సవ్వడిలా, చిటారు కొమ్మల్లోని పక్షి పాడే పాటలా, పంట చేలపై నుంచి పయనిస్తున్న ఎఱ్ఱమూతి కొంగల గుంపులా, నాలుగేళ్ల కరువు దాహాన్ని తనివి తీరా తీర్చిన స్వాతి చినుకుల వానలా... ఇలాంటి అనుభూతులన్నీ ఈ ‘దేవరశిల’లో ఎన్నో ఉన్నాయి. వేంపల్లి గంగాధర్ కలానికి వున్న బలం అది. హృదయం తెరచి ఆహ్వానించగలిగితే, శ్రద్ధగా వినగలిగితే మీరూ ఆస్వాదించవచ్చు. ఈ కథలు కొత్తవి. శాశ్వతమైన హోదా కల్గినవి కూడా!

ఎండపెడ్తాంది. వాన కురుస్తాంది. ఎండావాన. మిట్టమధ్యాహ్నామప్పుడు ఈ సిత్రమేంది? గరుడ స్తంభం పక్కలో పెట్టుకొని గుడిమెట్ల మీద కూర్చున్నవాడు పాడే పాట విన్పిస్తాందా? గుబురు పొదల్లోంచి అడవికోళ్లు కూస్తున్నాయా? ఇప్పపూలు శబ్దం లేకుండా చెట్టునుంచి రాలిపడ్తా వుండాయా? పడమటి కొండ దిక్కు మోడాలు కమ్ముకొని చినుకులు కురుస్తాంటే మట్టివాసన వస్తాందా? రావిచెట్టు కొమ్మలు ఊగుతా ఊగుతా అప్పుడప్పుడు నేలపైకి వాలి భూమి తల్లిని ప్రేమగా ముద్దాడతా వుండాయా? ఒక కంట్లో సూర్య భగవానుడ్ని, మరో నేత్రంలో చంద్రబింబాన్ని చెక్కిన యుద్ధవీరుడి వీరగల్లు నెత్తుటి మాన్యానికి కాపలా కాస్తా వుండాదా?

ఓరి దేవుడా...

మన వూరి కథలన్నీ ఇవే కదా!

- కె.వెంకటేశ్వర రాజు

ఆత్మీయ అంకితం



శూన్యాన్ని ప్రేమతోనూ,

జీవితాన్ని చైతన్యంతోనూ నింపే ఆత్మీయమూర్తులు

శ్రీమతి కొండూరు సాలమ్మ

శ్రీ కొండూరు సుబ్బరాజు గార్లకు

కృతజ్ఞతాభినందనలతో...

Telugu story writer making literary waves

Vempalli Gangadhar, a Telugu story writer of Kadapa district, finds place among 10 literary doyens such as Mahasweta Devi, Ashapurna Devi, Javed Akhtar and likes in the contemporary Indian literature section on 'Indianetzone', an e-magazine on literature.

Gangadhar's book 'Molakala Punnami', a collection of 13 short stories, delineates characters from rural background and is full of pathos of the deprivedand reflects the voices of those who depend on land and vagaries of nature. It is a feather in Gangadhar's cap to figure among writers such as Mulkraj Anand, K.M.Munshi, Jibananda Das, Buddhadev Bose and Dharamvir Bharati and Sunil Gangopadhyay on the site. Gangadhar's short stories were adjudged the best in R.S.Krishnamurthy Memorial story competetions at Visakhapatnam and by Telugu monthly, 'Vipula' this year.

Renowned writer Gunturu Seshendra Sarma, who wrote the foreword in the book 'Molakala Punnami', acknowledged that the stories reflected a similar struggle like that in his popular work 'Adhunika Mahabharatham'. The book by Gangadhar also carries an article 'Kadapa Mandalika Bhasha' (local district of Kadapa) by Boodaraju Radhakrishna. Gangadhar is also the receipient of American Telugu Association Award and a national story award.

- M.V.Subramanyam

Stories with a rural flavour

The inspiring collection of stories delienating its characters from a rural background, speaks in earthy tones through the voices of those who depend on land and the vagaries of nature giving either misery or bounty. The stories are full of pathos of the deprived, both economically and emotionally. They have a distinct quality, which separates them from the run-of-the mill stories.

The title story 'Molakala Punnami' is a powerful with an unexpected ending. So also are stories such as 'Moodu Padunla Vaana', Poola Chetulu', 'Mynam Bommalu', 'Sreeman Doravaariki' which penetrate into the subtle realities beneath the superficial realities of life.

Gangadhar's handling of the characters has a depth which will haunt the reader long after one has finished reading the stories. He sometimes comes across as a poet when he derives inspiration directly from nature, and within the frame work of the story, spills his poetry in prose form. Boodaraju Radhakrishna's essay explains the regional dialects and what 'ideolect' is. The production value and printing of the book is very good, but is priced very low - a truly commendable gesture by the author. A must read book.

- Ambika Ananth

THE HINDU, 12.9.2006.

‘సీమ’ జీవనాడి కథకుడు

“మన మూలాల్లో ప్రతిధ్వనించేవీ, మన ముగింపుల్లో మార్మికమై, అంతుపట్టని మన ఆరంభాల్లో, దైవీయమైన మన విధి బలీయతల పట్ల లోలోపలే గ్రహింపు కలిగి వుండి, ఈ రెంటినీ ఒకటిగానే ఏకం చేయగలిగినవే గొప్ప కథలు” అన్నాడు బెన్ ఒక్రి.

పదహైదు కథల ‘దేవరశిల’ సంపుటాన్ని మనకు అందిస్తున్న వేంపల్లి గంగాధర్ పాఠకలోకం, సాహితీ విశ్లేషకులు గమనించదగినంతగా రాయలసీమ మూలాలతో పరిచయం కలిగివున్నాడు. ఈ యువకథకుడి కథల్లో సీమ సామాన్య జనం దర్శనమిస్తారు. ప్రాచీన కాలం నుంచీ వున్న మానవ సమాజం కావడం మూలాన సీమ జీవనం ఎన్నో సంక్లిష్టతలకూ, విశ్వాస స్రవంతులకూ, వైరుధ్యాల, వైవిధ్యాల, ఊపిరి సలపనీయని ఘటనా క్రమాలకూ, జనాల ఆవేశకావేషాలకూ, పరాక్రమ శీలతకూ ముఖచిత్రం.

వర్షాభావం, నీటి ఎద్దడి, కరవు కాటకాలు, పెద్దగా విద్యావంతులు కాని, మౌలిక ప్రతిభలు తగినంతగా మెరుగు పెట్టబడకుండా జిల్లా కేంద్రాలు, పెద్ద పట్నాలు మినహాయిస్తే గ్రామీణ జనజీవనం ఈ దేశంలో ఏమవుతున్నదీ, ఉనికి కోసం ఎలా అసమాన పోరాటం చేస్తున్నదీ గంగాధర్ కథల్లో చిత్రిస్తాడు.

రాయలసీమ నలుదెసలా తరచిచూసే సంచారనేత్రం, తను చెప్పదలచుకున్న విషయం పట్ల వలసిన అధ్యయనం, స్థానిక పురాగాథలు, ఐతిహ్యాలు, జనాంతికంగా వుండే విశ్వాసాలు పట్ల పరిచయం గంగాధర్ కథలకు ఒక విలక్షణతను సమకూరుస్తున్నాయి. నగరాలు, గ్రామాల్లో నివసించే ప్రజల జీవన తారతమ్యాలు, అమాయకత్వాన్ని, సాధువర్తననూ కలిగి వుండే పేదల జీవితాలను అభివృద్ధి మృగం ఎలా కాటేస్తుందో, వారు ఎంతలా విలవిల్లాడినా ఏమీ చలించని ఒక ప్రగతియాత్ర, నిజానికి వీరి బతుకులతో ఎలా ఆడుకుంటున్నదీ గంగాధర్, పలు వృత్తుల వారి జీవితాలు, కూలి జనం అసహాయతలు చిత్రిస్తూ, వేదనలో వున్న ప్రజలను అక్షరాలు చేసి అశాంతి కలిగిస్తాడు. పాఠకులకు సమాజ పౌరులుగా, మంచిని కోరడం వారి ముఖ్య బాధ్యతగా ఎరుక కలిగిస్తాడు.

గల్ఫ్ దేశాలకు, ఆర్థిక ఆలంబన కోసం పోవాలని కలలుగనే యువకులు, తమ వృత్తులకు ఆదరణ కోల్పోయిన వారి తండ్రులూ, ఖనిజాలూ ఆ నేలలో కనుగొనబడినప్పుడు, ఆయా గ్రామాల్లో నివసించే ప్రజల ఆందోళన, బతుకులు నెత్తుటి మాన్యాలుగా మారితేనే కానీ ఒకడుగు కనీసం వెనుకకు తగ్గని ప్రభుత్వ ధోరణులు, కొత్త ప్రాజెక్టులకు నరబలులిచ్చే మూఢవిశ్వాసం కూడా ఎలా పేదల్నే గురిగా ఎంచుకుంటుందో చెప్పిన తీరు, గంగాధర్ కథల్లో రాయలసీమ గత శతాబ్దాల చరిత్ర, ప్రకృతి ప్రతీకలుగా కథల్లో కొలువుదీరే శైలి, పేదలైనా సరే త్యాగధనులు, పోరాటశీలురు, సమధర్మం లేని సమాజాన్ని నిలదీసే నిరాడంబర వర్తనులు, అన్నీ, అందరూ కోలాహలంగా కదిలిపోతుంటారు. ముఠా కక్షల తగాదాల్లో, హత్యలు, ప్రతి హత్యలు, ఇలా రాయలసీమకే ప్రత్యేకమైన ఫ్యాక్షన్ కొట్లాటల్లో ఏ ప్రమేయం లేకుండా ఇరుక్కునే బడుగు జీవుల యాతన, అలాగే ఏ ప్రోత్సాహమూ లేక అడుగంటిపోయే హస్తకళలు, ఏ కాస్త జీవనోపాధినీ ఇవ్వలేని, ఇవ్వనీయని పలు చట్టాలు, పేదవాడ్ని ఎలా పన్నెండు గంటల పనియంత్రంగా చేసి నగరీకరణ మృగాలకు ఎర వేస్తున్నాయో, గంగాధర్ పెదాలు బిగుసుకున్న ఆగ్రహంతో చెప్తాడు.

శుష్క రచనాపద్ధతి కాక, విషయాన్ని కథగా చెప్పే బలమైన కథన విధానం ఏర్పరుచుకోవడంలో చెప్పుకోదగ్గ పట్టు సాధించిన యువ కథకుడిగా గంగాధర్ ఈ కథల్లో కన్పిస్తాడు. వీటిలో క్షోభిస్తున్న గ్రామీణ జీవనం వుంది. సర్వజన సంక్షేమాన్ని కోరే సనాతన దివ్యత్వం వుంది. కథను కథలా చెప్పి పక్కకు తప్పుకునే వివేకంగల వాడు గంగాధర్. పాఠకుడు తన జ్ఞాన విస్తృతిలోంచి, అనుభవ నేపథ్యం నుంచి కథను అందుకుంటాడు గనుక, పాఠకుడి

పట్ల, కథ స్వరూపం, ప్రయోజనం పట్ల పూర్తి గౌరవంతో, కథను కళాకౌశలంతో ప్రతిపాదించి, తాను మరో కథ దిశగా సాగిపోయే కథాధర్మ నిబద్ధుడు వేంపల్లి గంగాధర్.

గంగాధర్ ఈ సంపుటిలో మనకు అందించిన పదహైదు కథలు పై లక్షణాలను కలిగి వున్నాయి. వీటిని పేరుపేరునా ప్రస్తావించడమో, లేక ఇతివృత్త విపుల వివరణలతో కూడిన సమాచార ప్రస్తావనో చేయడంకన్నా ఈ కథల వెనుకగల తత్వాన్ని నేను దర్శించదలిచాను. తృతీయ సహస్రంలో ప్రథమ శతాబ్దంలో తొలి దశాబ్ది ఉత్తర కాలంలో నిలబడి కథలు రచిస్తున్న గంగాధర్ ప్రాసంగికత ఏమిటి?

దీన్ని సర్వకాల సర్వావస్థలయందు ప్రభావితం చేస్తున్న నేటి ప్రపంచ పరిణాహం ఏమిటి? ఏ వెలుగులకీ ప్రస్థానం? అడగచ్చు మనం కూడా ఒక మహాకవి ఉజ్వల వారసత్వాన్ని స్వీకరిస్తూ.

“భారతదేశపు దారి యూరప్ వారి వంటిది కాదు. భారతదేశమంటే కలకత్తానో, ముంబయి నగరమో కాదు. భారతదేశం జీవిస్తోంది తన ఏడులక్షల పైచిలు గ్రామాలలో” అన్న జాతిపిత మహాత్మాగాంధీ వాణి ప్రస్తుత సంక్షోభ సందర్భంలో ఎంతైనా గుర్తుకు వస్తుంది.

ప్రపంచం ఎల్లెడలా జరుగుతున్న తీవ్రమైన నగరీకరణ, దాడి చేస్తున్నది గ్రామ నైసర్గిక జీవన వ్యవస్థపైనే. నగరాలు, గ్రామాల మధ్య అభివృద్ధి అంతరం పెరిగిపోతుండడం, ముఖ్యంగా గ్రామీణ పేదలు బతుకుతెరువు కోసం పట్నాలకు, నగరాలకు రాక తప్పని పరిస్థితి కల్పిస్తోంది. వారి సహజ నైపుణ్యాలకు గిరాకీ లేక, జీవిక దొరక్క, ఎటువంటి నూతన నైపుణ్యాలు లేక నగర భీకర దేవత మ్రోల కూలివారిగా మారిపోయి రోజురోజుకూ పతనమయ్యే జీవన దశలో ప్రపంచమంతటా పేదలున్నారనేది అతి నిష్ఠుర వాస్తవం.

గంగాధర్ కథల్లో కన్పించే పేదలందరూ తమ జీవన నైసర్గిక మూలాలు విధ్వంసమైనవారే. దశాబ్దాల తరబడి ప్రభుత్వాల లోపభూయిష్ట విధానాల వల్ల వచ్చే కరువు బాధితులుగా, అభివృద్ధి పేరిట గ్రామ జీవన క్రమాన్ని, పర్యావరణాన్ని ప్రభావితం చేస్తూ, పునరావాస విధానాలకు గురయ్యే దుఃఖగ్రస్త జనంగా, ముఠాకక్షల తగువుల మధ్య చిక్కి శల్యమయ్యే బక్కచిక్కిన వారుగా, కులం, మతం పేరిట వివక్షకు గురయ్యే అట్టడుగు వర్గాల వారుగా, రాయలసీమ రక్తసిక్త ముఖచిత్రంపై నిలిచి గంగాధర్ కథల్లో పాఠకులను కలిచివేస్తారు.

తృతీయ ప్రపంచదేశాలకు సంబంధించి ప్రాచీన సమాజాలు, అక్కడి ఉత్పత్తి సంబంధాలు, గ్రామాల్లో నిలకడగా వుండే జీవిత విధానం ఇవన్నీ

ఆధునికీకరణ, పారిశ్రామికీకరణ పేరిట ఎలా సమూల మార్పులకు గురౌతున్నదీ, మనకన్నా వెనుకబడిన దేశాల వారైన ఆఫ్రికన్ రచయితలు చాలా బలంగా చిత్రించారు. చెదిరిన సమాజం గురించి చెప్పిన చినువా అచిబె, అయనదే మరో నవల 'ది యారో ఆఫ్ ద గాడ్', బెన్ ఒక్రి 1991లో రచించిన 'ది ఫామిస్ట్ రోడ్', ఇటీవల 2006లో రాయడం మొదలుపెట్టిన ఉవెం అక్పన్, వీరంతా ఇలాగే యుద్ధమగ్నమయిన, హింసాత్మకమైన, అల్లకల్లోలమవుతున్న ఆఫ్రికన్ సమాజం గురించి రాస్తున్నారు. తీవ్ర ఉద్యోగాల, సామాజిక అశాంతుల, కరువు కాటకాల వల్ల మొండితేరిన బతుకుల్లోంచి వచ్చిన బండ మొరటుదనాల, స్థానిక వీరగాథల, అనుపమ త్యాగాల, ఉద్రేక స్వభావులైన ప్రజల పోలిక తెస్తే రాయలసీమకే ప్రత్యేకమైన ఎన్నో ఆఫ్రికన్ సామాజిక స్వరూపాల సాదృశ్యాలు కన్పిస్తాయి. బహుశా బీదరికం తాండవించే ప్రతి చోటా ఇటువంటి సమధర్మాలుండవచ్చు.

'ది ఫామిస్ట్ రోడ్' నవల పశ్చిమాఫ్రికా యొక్క విశిష్టమైన ఐంద్రజాలిక వాస్తవిక రచనగా పిలుబడింది. గంగాధర్ రాసిన 'నీడలు' కథలోవలెనే ప్రతీకాత్మక రచన మృతులు, జీవన్మృతులు, కలల తర్కాతీత ప్రపంచంలో సంభాషించుకునే తీరున, ఆఫ్రికన్ కథన కౌశల విలక్షణత దర్శనమిస్తుంది. బెన్ రాసిన ఈ ప్రఖ్యాత నవలలో అజరా అనే బాలుడు కథ చెప్తుంటాడు. తాను ఒక 'అబికు' అంటే అతీత శక్తులున్న పిల్లవాడు (SPIRITCHILD). మన చుట్టూ వున్న ప్రపంచంలోని బతికున్న వారేకాక చనిపోయిన వారుసైతం ఈ పిల్లవాడికి కన్పిస్తుంటారు. కథ కలల లోకంలోనూ, ఆకలి, రోగగ్రస్త తీవ్రత, హింస అనే భౌతిక తలంలోనూ సమాంతరంగా నడుస్తుంది. చీకటి ఖండంగా పిలువబడుతూ, నిత్యం చిన్నచూపు చూడబడే ఆఫ్రికన్ ప్రజల జీవన వైభవం, దానిని అలుముకొని వున్న విశాల విషాదం, ఏ తర్కాలకు లొంగని ప్రజల బలీయ విశ్వాసాలు, ఇవన్నీ సముచితంగా వాడుకుంటూ బెన్ ఒక్రి తన నవలలో రచయిత సృజన ద్వారా ఎటువంటి ఇంద్రజాలం చేయవచ్చో చూపుతాడు. గంగాధర్ కథల్లో వచ్చే ప్రకృతి, ఆకాశ వర్ణనలు, పురాగాథల ప్రస్తావన, సీమ నేలమీది జనాంతికాలను తన కథల్లో పొదువుకుని తన రచనలకొక గాఢమైన జీవన సంపర్కాన్ని ఇవ్వగలగడం, ఇవి పాఠకులకు మంచి కథలు చదువుతున్న అనుభూతిని మిగులుస్తాయి.

'వానరాయుడి పాట' ఒక మార్మిక రచన. వెనుకటికి రుష్యశృంగుడ్ని పిల్చుకు వస్తే, ఆయన చేత పిలిపిస్తే, కరువు సీమల్లో వానలు వచ్చేవి అన్నట్టుగా – ఈ కథలో వానరాయుడొక ప్రకృతి శిశువు. సమధర్మం ఆచరించేవారు ప్రకృతిని శాసించగలరు అనేది ఈ కథలో బలంగా ప్రతిపాదిత అంశం. సూడాన్

దేశంలో కరువు విపత్తు విలయతాండవం చేసినప్పటి విషాదం గురించి బెన్ ఒక్రి 1993లో గార్డియన్ పత్రికలో ఒక కథ ప్రచురించాడు. 'A PRAYER FOR THE LIVING' (జీవితులకై ఓ ప్రార్థన). అందులో కరువు కాలపు ఆకలి గురించి రాస్తాడిలా "నాకు ఆకలి అలవికాకుండా పోయి ఎక్కువైపోతున్న కొలదీ, వారంతా కన్పించడం మొదలుపెట్టారు మునుపటి కన్నా ఎక్కువ సంఖ్యలో. నాకన్నా ముందు చనిపోయిన నా స్నేహితులందరూ, ఆకలికి తట్టుకోలేక ఆఖరి గడియల్లోనూ కనీసం ఈగలనైనా పట్టుకుందామని పదేపదే విఫలయత్నాలు చేసినవారందరూ, ఇప్పుడు వాళ్లందరూ గాలి యొక్క తేలికపాటి దనాన్ని తింటున్నారు. చూస్తున్నారు బతికున్న మనందరి వంకా. జాలీ, దయా నిండిన కన్నులతో". వానరాయుడి పాటలోని కరువు గురించి, మనం ప్రకృతితో మన ఆత్మీయ సంబంధాన్ని, సమవర్తననూ, సామరస్యాన్ని తోసిపుచ్చి ప్రవర్తించడం వల్లనే, ఇటువంటి వైపరీత్యాలు కలుగుతున్నాయని కథలో ప్రస్తావించే గంగాధర్‌లో, ఒక నిశితదృష్టి, జ్ఞానస్ఫూర్తి కనిపించి ఈ యువకథకుడు ప్రపంచ విషాదాలను ధ్వనించడంలో సీమ గొంతును కలుపుతున్న ఉత్తమ కళాకారుడిగా గోచరిస్తాడు.

వర్తమానంలోంచి పూర్వగాథామయ విశ్వాస బాహుళ్యం లోనికీ, వాటిని నమ్మే ప్రజల కటువైన బతుకుల గురించీ, వారికి ఆదర్శాలయ్యే పాడుపడిన గుడులలోని ఏకాకి దీప కాంతులు, సీమ నిండా పలకరించే వీరగల్లులు, వారికి ఒసగబడే నెత్తుటి మాన్యాలు, బతుకు పట్ల నిజాయితీతో, కథనచాతుర్యంతో చెప్పే గంగాధర్, వీరుల శౌర్య పరాక్రమాల సీమను ఉజ్వల చైతన్య ప్రవాహభూమిగా, గుండెలు అదిరేలా, గుండెలు కదిలేలా చెప్తాడు. అది తన సీమ మూలాల బలం, కథలో తాను ఏర్పరుస్తున్న వాతావరణంతో ప్రత్యక్ష సంబంధమూ, సంపర్కమూ, వలసినంత సాధికార సమాచారం గల రచయితకే కథ ఇలా చేతికి అందివస్తుంది.

"రావిచెట్టు రాతికట్ట దగ్గర పాడుబడ్డ బసవేశ్వరుడి దేవళానికి ముందు పాతిన రాయలకాలం నాటి వీరగల్లు... యుద్ధవీరుడు అశ్వారూఢుడై ఈటే, ఖడ్గాలను ధరించిన బొమ్మ... క్రింది భాగంలో అతని చేతిలో మరణించిన వారి శవాల బొమ్మలు... వీటన్నిటికి పైన వీరుడు స్వర్గానికి వెళ్తున్నట్టు మూడు అంతస్తులుగా చెక్కబడిన వీరగల్లు... ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ శిథిలం కాకుండా మిగిలిన ఆధారం, దాని పక్కనే మరో పత్ర సంబంధ శాసనమొకటి..." (నెత్తుటి మాన్యం కథలో) గంగాధర్ ఇలా అంటే...

"చల్లటి మంట ఉందీ గాలిలో/ అది వీరుల మాంసమజ్జాదులు తీనేస్తుందని / అమరుల పేవుల్ని / తడార్చి, వడలి కృశించేలా చేస్తుందని / నే విన్నాను /

ఆ మంట పేరు సమాధి ఫలకాలపైన / చెక్కబడుంటుంది; / జీవితపు కందమూలాల్లోంచీ / సామూహిక పిరికితనాల్లోంచీ పిండివేయబడిన పేర్లవి" /

అంటాడు బెన్ ఒక్రీ 'వాయు జ్వలనం' అనే కవితలో. ఇంకా అంటాడిలా –

"కాలపు చేదు ఫలాన్ని రుచి చూసేందుకు / మనం దేవుడు చేసిన మహిమలం

అమూల్యులం / ఒకనాడు మన ఈ కుమిలిపోత / మారిపోతుంది భూమి అద్భుతాలుగా"

ఆఫ్రికన్ జీవిత విషాదాన్ని, అన్ని ఆశలూ లుప్తమైపోయి, మర్యాదల పొలిమేరల్లో బతుకుతున్న దీనమైన కుటుంబపు క్రిస్మస్ రాత్రి విందును చిత్రణ చేస్తాడు కొత్త తరం నైజీరియన్ కథకుడు ఉవెం అక్పన్ తన కథ "ఏన్ ఎక్స్‌మస్ ఫీస్ట్"లో. నైరోబీ నగరపు ఫుట్‌పాత్‌ల పైన నివసించే పేద నల్లవారి బతుకులు, చిత్రించడంలో ఉవెం అక్పన్ పిల్లల ముఖతా కథలు చెప్పిస్తూ, పతితులు, భ్రష్టులూ, బాధా సర్పదష్టుల పక్షాన నిలబడి రచిస్తాడు.

'న్యూయార్కర్' పత్రికలో 2007లో ప్రచురితమైందీ కథ. తండ్రి జేబుదొంగతనాలు వృత్తయిన వాడు. క్రిస్మస్ నాటి వర్షపురాత్రి తనకి తగు బేరాలు వుండవని తెలిసి, ఫుట్‌పాత్ పక్కనేగల వారి గోనెసంచుల కప్పు నివాసంలో గోడకి ముడుచుకు నిద్రపోతుంటాడు. కథను మనకు చెప్పేది చదువుకోవడం ఎంతమాత్రం ఇష్టంలేని పదేళ్ల జిగణా అనే బాలుడు. పన్నెండేళ్ల అక్క మైషా ఒక్కతే ఎంతో కొంత సంపాదనపరురాలు. ఆమె వృత్తికి బాలవేశ్య. తల్లి చెరో రొమ్ముకూ ఇంకా ఇద్దరు పసికవలలు వేలాడుతూ వుంటారు. పై కుర్రాడు తమ్ముడు, మరో ఎనిమిదేళ్ల అమ్మాయుంటుంది మూడో సంతానంగా. అక్కలా తనూ ఎప్పుడు ఇంటికి పెద్దలా మర్యాదలు పొందగలనో, తానెప్పుడు అక్కలా మారగలనా అని ఆలోచిస్తూ వుంటుంది.

మొదట్లో తల్లి వ్యతిరేకించినా "ఇంకా నీకు సరిగా రొమ్ములే పెరగలేదు. నువ్వేం పనికొస్తావే లంజా" అని తిట్టినా, పన్నెండేళ్ల మైషా ఇంటిని ఆదుకుంటూ, కుటుంబం చేసిన చిన్నాచితకా అప్పులను తీర్చివేస్తూంటే ప్రార్థిస్తుంది ప్రభువును "ధన్యవాదాలు ప్రభూ– నీవు మైషాను మంచి తెల్లవిటులతో కనికరించావు ఈ క్రిస్మస్ రాత్రి" అని.

కథలో మైషా తను పూర్తిగా ఎవరో ఒకరి వద్దకు వెళ్లిపోయినా సరే తమ్ముడు జిగరాను చదివించాలని చూస్తుంది. నేను బోలెడు డబ్బు పంపిస్తాను. నువ్వు చదువుకోవాలి. నేను కూడా చదువుకుంటాను. ఎల్లప్పుడూ ఇలా రోడ్డు పక్కన కార్ల కోసం నిలబడతావా ఏమిటి?" అంటుంది. కెన్యా, నైజీరియా, ఇథియోపియా, రువాండా వంటి ఆఫ్రికన్ దేశాల ప్రజల గాథలు రచనగా

ఉవెం అక్పన్, తాను వృత్తిరీత్యా చర్చి ఫాదర్ కావడం మూలాన, కొంత విశ్వాసాలు, పద్ధతుల పాటింపులోని బోలుతనం అన్నీ రంగరించి వెలువరించిన సంపుటం "సే యు ఆర్ వన్ ఆఫ్ దెమ్".

ఈ కథలో అక్క మైషా ఎలా తను ఒళ్లు అమ్ముకునైనా తమ్మునికి బంగారు భవిష్యత్తు ఇవ్వాలని కలగన్నదో, అటువంటిదే ఒక కథ గంగాధర్ తన మొదటి సంపుటి మొలకలపున్నమిలోనే నమోదు చేశాడు.

ఉవెం అక్పన్ కథలో ఆ క్రిస్మస్ రాత్రి తెల్లారాక అక్క తనకు ప్రియమైన వస్తువులన్నీ దాచుకున్న నీలంరంగు పాత ట్రంకు పెట్టెతో ఎవరో ఒకరితో పూర్తిగా వుండేందుకు ఒప్పందం పడి – ఉదయం కాగానే ఆ కారు ఎక్కి వెళ్లిపోవడమూ, చదువు ఏమాత్రం ఇష్టం లేని జిగణా ఈ హడావిడిలో ఇల్లు వదిలి పారిపోవడమూ, నైరోబీ నగరంలోకి పారిపోతూ "మా కుటుంబం గురించిన నా ఆఖరి జ్ఞాపకం ఏమంటే ఆ కవలలిద్దరూ వెక్కిళ్లు పడుతూ, కేరింతలు కొడుతున్న దృశ్యం" అని కథ ముగింపు.

గంగాధర్ కథలలోని విశ్వజనీనత ప్రాంతీయ మూలాల్లోంచి వచ్చింది. అది ఆ కథల జీవనాడి. భాషారూపం మారినా విశ్వ కథా వీధిలో తల ఎత్తుకు నిలబడగల సారాంశ బలమూ, అస్తిత్వ గౌరవమూ, జీవన విలువలుగల కథలు గంగాధర్ రాయగలుగుతున్నాడు. ఈ లక్షణాలనే విశ్వ సాహిత్య సంబంధిగా వివరిస్తూ బెన్ ఒక్రి అన్నదీ ఇదీ–

"సాహిత్యానికి ఒక దేశమంటూ వుండదు. షేక్స్‌పియర్ ఒక ఆఫ్రికన్ రచయిత. ఆయన సృష్టించిన ఫాల్‌స్టాఫ్ పాత్ర ఎంతో ఆఫ్రికన్‌తనాన్ని కలిగి వుంటుంది. జీవన లాలసలో ఆత్మ ఔదార్యంలో, తుర్గెనీవ్ పాత్రలన్నీ మురికివాడల నివాసులవే. డికెన్స్ పాత్రలన్నీ నైజీరియన్ స్వభావం కలిగి వుంటాయి? నేనేం చెప్తున్నానో మీరు గ్రహిస్తున్నారా? సాహిత్యం ఒక నిర్దిష్ట ప్రాంతం నుంచి ఉత్పన్నమవ్వచ్చు గాక, కానీ అది నిత్యమూ తనకే చెందిన ప్రత్యేక సామ్రాజ్యంలో జీవిస్తుంది".

గంగాధర్ గమనించే శక్తీ, కళారూపంగా కథను నిర్మించే దక్షతా, కథా కథన పరిమితులను పాటించే చక్కని నియంత్రణా, వస్తు వైవిధ్యంగల మంచి రచయిత. తృతీయ సహస్రంలోని మొదటి శతాబ్దం ప్రథమార్థ ఆరంభంలో వున్న రచయితలకు అనేక సామాజిక బాధ్యతలున్నాయి. వాటిని సాధించడంలో వేంపల్లి గంగాధర్ వచనం చక్కని సాధనం కాగలదన్న ఆశ, ఈ కథలు చదివిన వారెవరిలోనైనా మరింతగా సజీవం అవుతుంది. అదే గంగాధర్‌కు దక్కే కథా వ్రతఫలం.

ప్రమాదకర ప్రేమ (DANGEROUS LOVE) (1996)లో ఒమొవొ అన్నే పాత్ర కళాత్మక సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు ఇలాంటి ఉపదేశం పొందుతాడు. దీనిలోని తాత్విక గాఢత తన లోలోపలికి రంగరించుకున్న ఏ కళాకారుడైనా ప్రయోజనకరమైన పాత్ర పోషించగలిగే ఉత్తముడౌతాడు.

"గ్రీకులు చెప్తుంటారో నానుడి. భరద్వాజ పక్షి తన తండ్రిని తన తలలోనే ఖననం చేసుకుందని. ఈ అమ్మాయిని నువ్వు కూడా నీ గుండెల్లో, నీ కళలో పాతేసుకో. జీవించు నాయనా, ఆర్పివేయలేని అగ్నితో జీవించు. దేనిదేనితో అయితే నువ్వు బాధపడుతున్నావో, అవన్నిటీనీ ఈ ప్రపంచంలో నీ జీవితం, నీ కళ రెండింటిపై పూర్తిగా పట్టు సాధించడంలో సాయపడనీ. లోతుగా బతుకు, నిండు జీవితాన్ని, నిర్భయుడివై వుండు. తాబేలులా వుండు. ఒక దృఢమైన కవచాన్ని పెంపొందించుకో, నీ దిటవైన గుండెను రక్షించుకునేందుకు, గరుడ పక్షిలా వుండు. ఎగురునీ బాధల అంచులు దాటి పైపైకి. జీవితంలోని అద్భుతాల పతాకలను ప్రపంచపు కొసల దాకా ఎగురవేస్తూ. నీ శక్తిని కూడగట్టుకో. విధి బలయమూ, దుర్గమమూ అయినది. ప్రజలు దాన్ని ఎరుగకుండానే, నీ పక్షాన వుంటారు. వారు నీ ఆత్మను పోషిస్తారు. ప్రజలు కూడా కష్టాలకు, కడగండ్లకు లోనవుతారనీ, సంఘర్షిస్తూనే ఉంటారనీ ఎన్నడూ మరచిపోకు. అప్పుడే నువ్వు నీ కళలో క్షేమంగా వుంటావు."

-రామతీర్థ

14-07-2008

కథా ప్రస్థానం

తూరుపు కొమ్మలు	...	1
నేల దిగని ఊడ	...	18
నెత్తుటి మాన్యం	...	28
వానరాయుడి పాట	...	40
కొయ్యబొమ్మలు	...	50
అంజనసిద్ధుడు	...	64
ముడుపు కొయ్య	...	75
కొలిమ్మాను	...	86
వెనుకటి కాలం కాదు	...	101
నీడలు	...	111
వూరిని మర్చిపోగాకురబ్బీ	...	124
పొద్దు పుట్టింది	...	130
శరణాగతుడు	...	148
చీనీ చెట్లు	...	154
ఏడుతలల నాగు	...	159



తూరుపు కొమ్మలు

కాలి దావకు అవతల గంగమ్మ గుడికి కాస్త దూరంగా వుండే విశాలమైన స్థలంలోని చింతచెట్టు గలగలమని ఈదురుగాలికి శబ్దం చేస్తా వుంది. పూతకాలంతో చెట్టంతా గుభాళిస్తా వుంది. ఉదయాన్నే గంపలోళ్ళు చిగుర్లు కోసుకొని పోవడంతో కిందవుండే కొమ్మలన్నీ గిల్లేసినట్లు వున్నాయి. ఎగబాగి విస్తరించిన తూరుపు కొమ్మలకు బావి చేతాడుతో వేసిన ఊయల పిల్లలెవరూ రాకపోవడంతో మౌనంగా వుంది. దిగువ కొట్టాల్లోని బడి ఇంకా వదిలారో లేదో తెలియదు. ఒకవేళ వదిలేసి వుంటే ఇళ్ళకొచ్చిన పిల్లలు పుస్తకాలను ఏ గూట్లోనో పడేసి ఈ ఊయల దగ్గర వంతులవారిగా ఊగడానికి గొడవపడ్తు వుండేటోళ్లు. సాయంత్రం ఎండలో చెట్టు కొత్త కాంతిని పులుముకుంటోంది.

ఉదయాన్నే కొట్టం బోద గడ్డి కోసం ఎగువ కొండకు వెళ్ళిన లక్షుమ్మ నెత్తిమీద పెద్ద బోదమోపు పెట్టుకొని తన గుడిసెను చేరుకుంది. చమటతో ఆమె తడిసిపోయి వుంది. కట్టుకున్నది పాత చీర కావడంతో దారాలు పల్చబడి అక్కడక్కడ చీరె చినిగిపోయి వుంది. కాళ్ళకు అడ్డుపడకుండా చీరెను పైకెత్తి కట్టుకోవడంతో మెత్తగా సన్నటి గుత్తుతో వుండే గడ్డిముళ్లులన్నీ ఆమె రంగు వెలసిన ఎర్రరంగు లంగా అడుగున అంటుకొని వున్నాయి. తలమీది బోదమోపు కిందకేసి కాసేపు పైటకొంగుతో విసురుకుంది. తర్వాత మెడలోని పసుపుతాడుకే తగిలించుకున్న తాళంచెవితో తలుపుతీసి లోపలికి నడిచింది.

కుండలోని చల్లటి మంచినీళ్ళను కడుపారా తాగాలని సత్తుగ్లాసును లోపలికి ముంచిందిగానీ అడుగు తగిలి శబ్దం రావడంతో నీళ్ళు అయిపోయిన విషయం గుర్తుకొచ్చి తప్పదన్నట్లు ప్లాస్టిక్ బిందె తీసుకొని పుట్ట దగ్గరుండే బోరింగు వైపుకి బయలుదేరింది. అప్పటికే అక్కడ ఎక్కువ బిందెలు వరుసగా వుండడం చూసి అసహనంగా తన బిందెను కూడా వాటి వెనుక వుంచింది.

'క్కా... మంచి బోద గడ్డి దొరికినట్లుంది; ఎప్పుడు కప్పిస్తాండరు మీ కొట్టం...' అడిగింది పాపన్న పెండ్లాం కొండమ్మ.

'తెల్లారి పోతినిమ్మి... కోసికోసి మోసుకొని వస్తాండిప్పుడు. దప్పికగాని. తాగను రోన్ని నీళ్ళు కొట్టు...' ఇంకా నిండని బిందెను తీసేసి తాను వంగింది చేతులు రెండు దోసిలి పడ్తా లక్షుమ్మ.

కడుపు నిండా నీళ్ళు తాగి కాసేపు నిమ్మలపడింది కంపచెట్టు నీడన.

'మధ్యాహ్నమప్పుడు నువ్వు లేవుక్కా... టౌనుకాన్నుంచి సైకిలు మీద గౌన్లు వేసుకొని సాయిబు పీరా వచ్చినాడు. ఏం మెరిసిపోతా వుండాయని గుడ్డలు. నువ్వు వున్నింటే అమ్మి అమ్ములుకు రెండు గవున్లు అన్నా తీసుకొని వుందువు...' నిండిన బిందెను చంకలో పెట్టుకొని పోతా అనింది కొండమ్మ.

లక్షుమ్మ చురచురా చూడడంతో మళ్ళీ తానే అనింది... 'మళ్ళీ రేపు మర్సిపోకుండా రమ్మని చెప్పినాలేక్కా... నాకాడ కూడా దుడ్లు లేక తీసుకోలేదు నా కూతురుకు కూడా!' చెప్పింది సంజాయిషీగా. దాంతో లక్షుమ్మ ఆవేశం కొంత శాంతిచింది. ఇంతలో తన వంతు రావడంతో రెండు చేతులా శక్తికొద్ది నీళ్ళు కొట్టుకొని బిందె నింపుకొని లక్షుమ్మ ఇంటికి కదిలింది.

వున్నట్లుండి ఏదో గుర్తు రావడంతో పడేసిన బోదగడ్డిలోంచి పాతగుడ్డలో కట్టుకొచ్చిన బిక్కిపండ్లు తీసుకొచ్చి గూట్లో పెట్టింది... బడి నుంచి అమ్ములు రాగానే అడిగేది అవే. ఆ పిల్లకు ఆ పండ్లంటే ఎంతిష్టమో! తెచ్చిన ఆ బిందె నీళ్ళు కుండకు పోసి మళ్ళీ ఇంకో బిందె నీళ్ళ కోసం వెళ్ళాలనుకుంది.

దూరంగా సుబ్బరాయుడి ఇంటి దగ్గర ఇద్దరు పిల్లలు ఆడుకుంటున్నారు. 'బడి ఇంకా వదల్లేదు కదా!' అనుకుంది మనసులో. తమ కొట్టాల్లోని పిల్లలు చాలా మంది ఎప్పుడూ బడికెళ్ళకుండా ఇంటిదగ్గరే ఆడుకుంటూ వుండడం గురించి... ముఖ్యంగా సుబ్బరాయుడి పిల్లలు బడి అంటే ఏడుస్తారనే సంగతి గుర్తు చేసుకుంటూ లక్షుమ్మ బోరింగు వైపుకి సాగింది. కానీ తన కూతురు అమ్ములు అలా కాదు. బడి అంటే దానికి చాలా ప్రాణం. సాయంత్రం ఇంటికొస్తుంది కదా... అరుగు మీద కూర్చొని తన ఐదో తరగతిలోని పాఠాలన్నీ గట్టిగా చదువుతుంటే విన్నవాళ్ళంతా ఎంతగా పొగుడుతుంటారో.

ఇంకొందరైతే '...మన ఇండ్లల్లో ఇందిరాగాంధి పుట్టింది. ఎంత లెఖ్ఖ అయినా పర్వాలేదు. అమ్మిని బాగా సదివించాల...' అని అంటా వుంటారు.

కూతురు చదవడానికి కూర్చుంటే వాళ్ళ నాయన నాగులయ్యకైతే ఎంత సంబరమో... ఆయమ్మికి నిమ్మొప్పుల మిఠాయిలు; కారాలు; చాక్లెట్లు కొనుక్కొచ్చి తినిపిస్తానే వుంటాడు. ఇంగ్లీషు పుస్తకం ఆయమ్మి చేతిలోకి తీసుకొని ఆపిల్ పదాలు పలుకుతుంటే దావలో పోతా వుండేటోళ్ళను కూడా పిల్సుకొచ్చి వినమంటాడు.

బడి వదిలారో లేదో తెలియదు కానీ... అమ్ములు ఇంకా రాలేదు.

లక్షుమ్మ చేతుల్లోని సత్తువ కొద్దీ బోరింగు కొడుతూనే వుంది... నీళ్ళు రావడం లేదు.

'యాడుండాయి లేక్కా నీళ్ళు... యేర్లే ఎండిపోతా వుండాయి... యింగ బోర్ల పరిస్థితి ఏముండాది... రా... రొంచేపు కూకొని మళ్ళా కొద్దువుగాని...' పిల్చింది ఆకువక్కా నములుకుంటా సామేలు భార్య.

లక్షుమ్మ కూడా పోయి పక్కనే కూర్చుంది. తన బొడ్లో కుచ్చిళ్ళ కాన్నుంచి ఆకు సంచి బయటకు తీసి కట్లపొడి; ఆకువొక్క కలిపి సున్నాన్ని ఆయమ్మి దగ్గర యిప్పించుకొని దవడన నోటి నిండాకు పెట్టుకుంది లక్షుమ్మ.

ఇద్దరూ నముల్తా వుండారు.

'కొట్టం కప్పిస్తాందరంట కదుక్కా... ఎప్పుడు పని మొదలుబెడ్తారు...' అడిగింది ఆయమ్మి.

'ఏమోమ్మి... ఈదినం పోయి బోద కోసుకొచ్చినా... అది యాడ సాలతాది... మళ్ళా తెల్లారినాకపోయి తెచ్చుకోవాల... కొట్టం జూస్తే తూరుపు దిక్కుండే వాసం వొకటి విరిగిపోయి వుండాది... దాన్ని తీసేసి మంచిదేసి మళ్ళా కొత్తబోదతో కప్పాలా...' పెదవులకు రెండు వేళ్ళు ఆనించి వాటి సందులోంచి ఎఱ్ఱటి ఎంగిలిని కంపచెట్లల్లోకి ఊసింది లక్షుమ్మ.

'మా కొట్టం గూడా అట్నే వుండాది లేక్కా... ఎప్పుడు నెత్తి మీద కూలతాదో... పిల్లోలుండే పని. పెరికేసి కప్పమని నెత్తినోరు మొత్తుకుంటాంటే నా మాట ఎవరింటాండరు... రేత్తిరైతే ఆ నాటుసారాయి తాగను కొట్లాటకు నాపైకి రాను... సరిపోతాంది... నాకూ!' భర్త సామేలు పైనున్న కోపానంతా ఎంగిలి మీద చూపిస్తా 'థూ' అని ఉమ్మింది ఆయమ్మి కసిగా. వీళ్ళిద్దరూ ఇట్లా మాట్లాడుకుంటా వుండగానే ఆ దావంబడే చూసుకుంటా యాడికో త్వరత్వరగా యల్లబారి పోయినాడు ఎంకటయ్య.

వాడట్ట దాటుకొని పోకముందే... 'ఏం మనిషి జన్మమమో... ఏందో... పందితిన్నా బతికితే సరిపోతాది... రోంతన్నా మానం పాణం వుండొద్దు...' వాడ్ని చూస్తా కసికొద్దీ ఎంగిలి మూసింది లక్షుమ్మ.

ఎంకటయ్య తన భర్త నాగులయ్యకు దగ్గరి బంధువు. నాయుడు తోటలో ఇద్దరూ కలిసి పని చేస్తావుండిరి. తన భర్తకు రావాల్సిన కూలీ లెఖ్ఖ కూడా ఎంకటయ్యగాడే తాగి తందనాలు ఆడాడు. ఆ కోపంతో నాగులయ్య తోటలోనే వానితో కలబడినాడు. అప్పటి నుంచి ఇద్దరికి సరిపోవడం లేదు. ఇద్దరూ కలిసి ఎక్కడా పనిచేయడం లేదు. ఈ గొడవ అయిన తర్వాత లక్షుమ్మ కూడా ఎంకటయ్య ఇంటికాడికి పోయి 'కూలీ లెఖ్ఖ' మర్యాదగా వెనక్కి ఇవ్వాలని వాడి పెండ్లాన్ని

జడలు పట్టుకొని కొట్టివచ్చింది. ఇదంతా పెద్ద పంచాయితీ కూడా అయింది. 'మీరు వాళ్ళను కొట్టినందుకు; వాళ్ళు కూలీ లెఖ్ఖ ఎగరగొట్టినందుకు సరిపోయింది పొండి!' అని తీర్పు వచ్చింది నాయుడు కాన్నుంచి.

ఎంకటయ్య కన్పించడంతో ఈ గొడవంతా లక్షుమ్మకు కళ్ళముందు కన్పించింది. బోరింగు నీళ్ళు కొట్టుకొని అన్నుంచి కదిలింది.

తలుపు తెరిచి వుండడం... లోపల ఏదో శబ్దం అవుతుండడంతో... 'మ్మొ... అమ్ములూ... ఏం జేస్తా వుండావు లోపల...?' కేకేసింది కొంతదూరం నుంచే.

జవాబు రాలేదు.

'బిక్కి కాయలు ఇడ్నే గూట్లో వుండాయి. ఆ సామాన్లు ఎతికి కిందకేయ్యాకు...' బిందె అరుగు మీద దించుతా చెప్పింది.

జవాబు లేదు.

'మ్మొ... అమ్ములూ... సామాన్ల శబ్దమేందే...' అంటూ గుడిసె లోపలికి వెళ్ళింది లక్షుమ్మ.

అక్కడ అమ్ములు కాదు వుండేది... కుక్క.

'ఛాయ్... పా... బయటకు... ఎట్లొచ్చినావే లోపలికి. కూడంతా చించుకున్యావ్...' రోకలి పైకెత్తి కుక్కను తరుముతా వెంటపడింది.

తాను నీళ్ళకు వెళ్తున్నప్పుడు తలుపు మూయకుండా మరచిపోయినందుకు కాసేపు తిట్టుకుంది గొణుక్కుంటూనే.

కవ్వం గుట్ట మలుపు దగ్గర... దూరంగా... రైల్వేట్రాక్ పైన లోకల్ రైలు వెళ్తున్నది అనడానికి సాక్షంగా శబ్దం విన్పిస్తోంది లీలగా.

ఎప్పుడూ ఈ సమయానికంతా అమ్ములు ఇంట్లో వుండేది. బడి వదిలేసేవాళ్ళు. మరి ఇవాళ ఇంకా ఎందుకు రాలేదు?

***

లక్షుమ్మ స్నానం చేసి బయటకు వచ్చింది.

సాయంత్రం కావస్తోంది. పిల్లలు ఒక్కొక్కరుగా ఇండ్ల నుంచి బయటకొస్తున్నారు.

'రేయ్... రాముడు... బడి వదిలినారూ...' ఆత్రంగా అడిగింది.

రెండో తరగతి చదివేవాడు... ఏదో చెప్పి సందులోకి పరిగెత్తి పోయాడు.

'క్కా... బడి నుంచి మీ పిల్లోళ్ళు వచ్చినారూ...' ఎడమవైపు సందులో చివర్నుండే పాపమ్మ ఇంటికాటికి పోయి అడిగింది లక్షుమ్మ.

'మధ్యాహ్నానమే వచ్చినారు కదుక్కా... వీళ్ళకు ఈ రోజు మధ్యాహ్నానం నుంచే బడి వదిలేసినారు. ఆ టీచర్‌కు టౌన్లో ఏందో మీటింగుందని పోయినాడంట...' చెప్పింది బారాకట్ట ఆడుకుంటాండే పాపమ్మ.

'ఐతే... ఈయమ్మి... అమ్ములూ... యాటికి పోయిందిబ్బా... ఇంటికాడ ల్యాకుండా...' లక్షుమ్మ ముఖంలో ఆందోళన.

'ఆయమ్మి యాటికిపోతాది లేక్కా... వుంటే ఇంటికాడ్నే సదువుకుంటా వుంటాది. ల్యాకుంటే వాళ్ళ మామగారింటికి పోతాది. అదీ కాకుంటే ఆ చింతచెట్టు ఊయల ఊగుతూ వుంటాది...' చెప్పింది చేతిలోకి పిచ్చుల్ని తీసుకొని త్రిప్పి వేస్తా ఆటలో.

లక్షుమ్మ బడికాడికి పోయింది. మూతేసి వుండారు. కొంతమంది పిల్లోళ్ళు బడి తూరుపు గోడకు బొగ్గుతో మూడు లైన్లు గీసుకొని ఊడిపోయిన బడి కిటికీ చెక్కతో క్రికెట్ ఆడుకుంటున్నారు.

'...బ్బీ! మా అమ్ములు ఇట్టొచ్చింది? మీరేమైనా సూసినారా?...' అడిగింది ఆత్రమాత్రంగా.

'ల్యాక్కా... చూల్లే... ఇట్రాలేదు...' చెప్పి మళ్ళీ తమ ఆటలో పడిపోయారు.

'యాటికి పోయింటాదీబ్బా... ఈయమ్మి...' లక్షుమ్మ అడుగులు త్వరత్వరగా ముందుకు పడ్తున్నాయి. గంగమ్మ గుడి... చింతచెట్టు దగ్గర ఊయల... పిల్లలు... వంతులవారీగా ఊగడానికి తగువులాడుతా వుండారు.

'మ్మే... రంగి... అమ్ములూ యాడుందిమ్మే...' ఊగే ఊయల్లో కూర్చోని వున్న పిల్ల భుజం పట్టుకొని అడిగింది.

'ఏమో... నాకేం తెలుసుక్కా... బడి యిడ్సినాక... ఇంటికాడ్నే బువ్వతిని సదువుకుంటా వున్నింది... మేము ఈడికి ఊగను ఇప్పుడే వచ్చిండేది...' చెప్పింది నాల్గవ తరగతి చదివే రంగి అమాయకంగా.

'మధ్యాహ్నం సారుకు టౌన్లో ఏందో పనుండాదిని జెప్పి బడి ముందే యిడ్సిపెట్టినాడు. అందరం ఇల్లకు యల్లబారి వచ్చేసినాం. అమ్ములు కూడా వచ్చింది. ఇంటికాడ్నే సదువుకుంటా వున్నింది. మల్లా నేను మా ఇంటికి పోతి' చెప్పింది ఐదో తరగతే చదివే శ్యామల తన స్నేహితురాలి గురించి.

'క్కా... పోయింటే ఎగువ కొట్టాలకు... మామ ఇంటికి పోయింటాదేమో క్కా...' ఊయల ఊపుతా చెప్పింది రాణి. లక్షుమ్మ ఎగువ కొట్టాల దిశగా బయలుదేరింది. ఎందుకో మనస్సంతా ఆందోళనగా వుంది.

తన తమ్ముడికి ఇద్దరు పిల్లలు. ముద్దుముద్దుగా వుంటారు. వాళ్ళతో ఆడుకోవడమంటే అమ్ములుకు చాలా ఇష్టం. తాముంటున్నది దిగువకొట్టాల. వాళ్ళుంటున్నది ఎగువకొట్టాల. రెండు వూర్లకు మధ్య యేరు వొకటి అడ్డం అంతే. అదీ పూర్తిగా ఎండిపోయిన యేరు. అమ్ములుకు తాను ఎన్నోసార్లు చెప్పింది ఒక్కదానివి భయపడ్తావు యేరు దాటిపోవాలంటే. ఒంటరిగా మామోలింటికి పోవాకు అని. కానీ పిల్లోల్లతో ఆడుకోవాలనే ఆశతో పోతానే వుండాది. రెండు మూడుసార్లు తాను; తండ్రి నాగులయ్య కూడా అరిచారు కూడా. యేట్లో తాటిచెట్లు వుండాయి. అవి చేసే శబ్దం భయపెడ్తా వుంటుందని.

అడుగులు త్వరత్వరగా ఇసుకలో పడ్తున్నాయి.

రకరకాల ఆలోచనలు...

కోపంగా వుంది. ఒక్కటే కూతురని తాము గోము చేస్తున్న కొద్దీ అమ్ములు చెప్పిన మాట వినకుండా పోతోంది. ఈసారి నాలుగు తగిలించాలని కూడా మనసులోనే లక్షుమ్మ నిర్ణయం తీసుకుంది.

తమ్ముడి ఇంటికి చేరుకుంది.

'రాక్కా... రా... కూర్చో...' అరుగు మీద కూర్చోని సిగరెట్ తాగుతా వుండాడు తమ్ముడు ప్రతాపుడు.

'కాదురా... ఒక్కదానివి రావాకుమని నువ్వు ఒకసారి పెరికితే ఇట్లా చేస్తాది ఆయమ్మి...' కసురుకుంది పోతానే.

'ఓయమ్మో... కోపంగా వచ్చినట్లుండావే... ఏమైందిప్పుడు...?' పొగ రింగులు రింగులుగా గాల్లోకి లేచింది.

'నువ్వు సల్లంగా కూకొని సిగరెట్టు తాక్కుంటా ఏమైందంటే ఏం జెప్పాలా... గుండెలు పదురుతా వుండాయి. యాడని ఆయమ్మిని వెతికేది? వూర్లో...' గదురుకుంది.

ఇంతలో ఇంట్లోంచి బిడ్డను ఆడించుకుంటా తమ్ముడి భార్య అరుణ బయటకొచ్చింది నవ్వుతా.

'సూడమ్మ... నువ్వన్న జెప్పు తల్లి... ఆయమ్మిని ఒక్కదాన్ని రావాకుమని...' మొర పెట్టుకుంది.

'యాడొచ్చింది వదినా... అమ్ములు మా ఇంటికి...' ఆందోళనగా జవాబిచ్చింది అరుణ.

'ఆటపట్టియాకండిమ్మా...' అనింది అరుగు మీద కూర్చుంటా.

'సత్యంగా... నాల్గురోజుల్నుంచి ఆయమ్మి ఎగువ కొట్టాలకే రాలా...' సూటిగా చెప్పింది అరుణ.

'ఔ... ప్రొద్దునాముంచి నేను పనికి కూడా పోకుండా ఇంటికాడ్నే వుండాను. అమ్ములు ఇక్కడికి రాలా...' సిగరెట్ ఇంగా వుండగానే పడేసినాడు... ప్రతాపుడు.

'ఏందిబ్బా... ఆడాలేదు, ఈడాలేదు. ఇంగెట్ట జెయ్యాల దేవుడా...' లక్షుమ్మకు కాళ్ళు చేతులు ఆడడం లేదు. ఏడుపెత్తుకుంది. మొత్తుకుంటా వుండాది.

అందరిలోనూ అదే ఆందోళన...

అరుణ లోపలికెళ్ళి చెంబుతో నీళ్ళు తెచ్చి లక్షుమ్మకు తాపించింది.

'నువ్వు ఊరికే తొందరపడాకు... పిల్లది యాడికి పోతాది... ఆ చింతచెట్టుకాడ ఊయలాట ఆడుకుంటానన్నా వుంటాది; వాళ్ళ నాయన మధ్యాహ్నమప్పుడు పనికాన్నుంచి వచ్చి యాడికైనా పిల్సుకపోయినాడో ఏమో...' మంచం కోడికి తగిలించిన చొక్కా తొడుక్కుంటా అన్నాడు ప్రతాపుడు.

ఆ మాటకు అక్కడి వాతావరణం కొంత కుదుటపడింది.

ఇంటిల్లిపాది బంధువులంతా హుటాహుటిన దిగువకొట్టాలకు కదిలినారు.

అడుగులు ఇసుకలో కూరుకపోతున్నాయి.

ఆకాశం సాయంత్రం ముసుగులోంచి రాత్రిలోకి రంగు మార్చుకుంటోంది. పక్షులు గూళ్ళకు మల్లుకున్నాయి. పశువులు కొండ నుంచి నెమరేసుకుంటా ఇంటి ముఖం పట్టినాయి. యాడికాడికో పనులకు పోయి వస్తాండే కూలోళ్ళందరూ ఎదురైతా వుండారు. కన్పించినోళ్ళనంతా లక్షుమ్మ ఆత్రమాత్రంగా అడుగుతా వుండాది 'మ్మో...! మా అమ్ముల్ని యాడైనా జూసినారు... బ్బీ...! మా అమ్ములు ఇట్టొచ్చింది?' ఈ మాటే ఆమెకు మంత్రమైంది. జపిస్తానే వుంది.

దిగువ కొట్టాల్లోకి వచ్చినారు.

ఇంటికాడ నాగులయ్య అప్పుడే వచ్చి నులకమంచం పైన తలకింద భుజం గుడ్డ పెట్టుకొని ఆకాశానికేసి చూస్తా బీడీ పొగలు యిడుస్తా వుండాడు.

వీళ్ళందర్నీ చూసి ఆశ్చర్యపోయి... పైకి లేస్తా 'ఓర్నీ... అందరూ వచ్చినారు...

రాళ్ళి... రాళ్ళి... నేను యిప్పుడే పనికాడ్నుంచి వస్తాండ...వచ్చి అడిగితే ఇండ్లల్లో వాళ్ళు జెప్పిరి... ఎగువకొట్టాల్లోకి పోయింది అమ్ములిని పిల్సుకరాను అని...” ఆ మాటలు నాగులయ్య నోట్లోంచి పూర్తికాకముందే లక్షుమ్మ కళ్ళుతిరిగి పడిపోయింది.

అర్థం కావడం లేదు ఎవరికి. ఎక్కడికెళ్ళి వుంటుంది?

చీకటి పడ్తా వుండడం... ఆటలు చాలించుకొని గంగమ్మ గుడి... చింతచెట్టు కాన్నుంచి పిల్లోళ్ళు ఇళ్ళకు వచ్చేస్తా వుండారు.

ప్రతాపుడు చెట్టు దగ్గరికి పోయి చూసొచ్చినాడు. మాను తూర్పు కొమ్మలకేసిన ఊయాల నిశ్శబ్దంగా వుండాది. ఇండ్లల్లోని వాళ్ళంతా వచ్చినారు.

ఎవరికి తోచిందేదో వాళ్ళు చెప్తా వుండారు.

మధ్యాహ్నం బడి నుంచి అందరూ పిల్లోళ్ళతో పాటుగా ఇంటికొచ్చిందని, సంగటి ముద్ద తినిన తరువాత సదువుకుంటా వున్నిందని కొందరు చెప్తాండారు. ఆ తర్వాత గుడికాడి చింతచెట్టు ఊయల ఊగుతా వుండగా జూసినామని ఇంకొందరు అంటా వుండారు. ఆ తర్వాత ఏమైందో ఎవరికీ తెలియడం లేదు.

ఎక్కడికైనా పారిపోయి వుంటుందా అంటే ఐదో తరగతి చదివే పిల్ల ఎక్కడికెళ్ళి వుంటుంది? అన్నీ ప్రశ్నలే – అందరిలోనూ విషాదం.

అందరికీ కళ్ళముందు అమ్ములునే కన్పిస్తోంది. నాగులయ్య కళ్ళల్లో కన్నీళ్ళు కురుస్తున్నాయి. అమ్ములు జ్ఞాపకాలే ప్రవహిస్తున్నాయి.

❀❀❀

నల్ల మబ్బులు కమ్ముకున్న ఆకాశాన్ని ఈదుకుంటా ఎర్రకొంగల గుంపొకటి పడమటి దిక్కుకు ఎగురుకుంటూ వెళ్ళిపోయాక వాటి వెనుకే... రంగురంగుల ఇంద్రధనస్సు పువ్వొకటి అంబరం సిగలోకి మొలుచుకొస్తుంది. మోడాలు కరిగి చినుకు మొగ్గల్ని రాల్చుతున్నప్పుడు బడి వుంటుందో, వుండదో తెలియని సందిగ్ధాన్ని మోస్తూ ఆ రెండుజడల నీలికళ్ళ పిల్ల అమ్ములు భుజానికి పుస్తకాల సంచి తగిలించుకొని మట్టిదారెంబడి పూలతోట మీదుగా పాఠశాలకు పయనమౌతుంది. రాత్రి అమ్మ చెప్పిన ఏడు గుర్రాలరాజు కథను తన నేస్తాలకు చెబుతూ అప్పుడప్పుడూ కొన్ని తూచ్‌లతో; అప్పుడప్పుడూ కొన్ని కచ్చీలతో నడక శ్రమ తెలియకుండా బడికి చేరుకుంటుంది.

రాత్రి పలకకు రెండువైపులా రాసిన గుణింతాలు ఎక్కడ చెరిగిపోతాయోనని గుప్తనిధి నుంచి వెలికితీసే ఆభరణంలా ఆ పలకను సంచి నుంచి బయటకు తీస్తుంది.

అయినా అక్కడక్కడా తుడిచిపోయిన అక్షరాలకు మళ్లీ కొత్తపూత పూస్తుంది మహావైద్యురాలిలా! మధ్యాహ్నం కూడా బడికిరాని టీచర్‌కు లోలోపలే కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఇంటికొచ్చేసి పుస్తకాలను చక్కగా గూట్లో సర్దేసి గంగమ్మ గుడి... తూరుపుకొమ్మల చింతచెట్టు ఊయల దగ్గరికి చేరుకొని పిల్లలందరూ వంతులువారిగా ఊగుతారు. కాళ్ళు అందకపోయిన ఉబలాటం కొద్దీ కాసేపు ముల్లోకాలను తిరిగొచ్చిన అనుభూతి పొందుతారు.

సాయంసంధ్య వేళ మార్గమధ్యంలో ఆకాశంకేసి చూసి గూళ్ళకు చేరుకోవడానికి వెళ్తున్న కొంగలగుంపు వెనక 'కొంగా కొంగా పాలుపొయ్!' అంటూ అమ్ములు కొంతదూరం పరిగెడుతుంది. ఆ పక్షుల మందలు కన్పించకుండా కొండదారి పట్టినంత వరకు చూస్తూ కాళ్ళీడ్చుకుంటూ ఇంటిదారి పడుతుంది. దీపాలవేళ గుడ్డిదీపం ముందు కుదురుగా కూర్చొని పదాలను కలిపి చదవడానికి ప్రయత్నించి 'ఛా... ఇంగ్లీష్' అంటూ కాసేపు మౌనంగా దిగులు పడుతుంది. తన చిన్న కడుపులోకి అమ్మ వడ్డించిన ఆహారం ఇంత సర్దుకొని విశ్రమించడానికి ఉపక్రమిస్తుంది. ఆకాశంలోని చందమామను అద్దం పలకలో పట్టుకొని కాసేపు ఆడుకున్న తర్వాత ఎక్కడినుంచో ఎగురుతూ వచ్చి తన గౌనుపై వాలిన మిణుగురు పురుగుతో కొత్త దోస్తీ కడుతుంది. ఆవలింతల నిద్ర కమ్ముకొస్తున్నప్పుడు అమ్మనాన్నల మధ్యన వెచ్చగా నిద్రిస్తూ రెండు కళ్ళలోనూ కోటి కలలను సాగుచేస్తూ తెల్లవారేదాక శ్రమించి అలసటతో నిద్రలేస్తుంది. అప్పుడే విరిసిన నీలం పువ్వులా! అలాంటి అమ్ములు ఇప్పుడు ఎక్కడికెళ్ళింది?

❋❋❋

తెల్లారింది.

రాత్రంతా దుఃఖించి అందరి కళ్ళు ఎరుపురంగులో వున్నాయి. చుట్టుప్రక్క పల్లెల్లోకి పోయి వెతకడానికి ఎవరెవరు ఎటువైపు వెళ్లాలో మాట్లాడుకుంటున్నారు.

లక్షుమ్మకు వళ్ళంతా జ్వరం.

రాత్రి నుంచి చుక్క మంచినీళ్ళు కూడా తాగలేదు.

స్కూటరొస్తున్న శబ్దం...

అవును... అది బడి టీచర్ పరమేశం సార్‌దే.

జనమంతా ఇంటి దగ్గర గుంపులుగా వుండడంతో ఆయన కూడా బండి ఆపి అక్కడికి వచ్చాడు. ఎవరో విషయం చెప్పారు.

'ఏందిబ్బా... చిత్రంగుంది. అమ్ములు నిన్న ఉదయం కూడా బడికొచ్చింది. ఆయమ్మికి ప్రజెంటు కూడా వేశాను. మధ్యాహ్నం నాకు టౌన్లో సర్వశిక్ష అభియాన్ మీటింగ్ వుంటే బెల్ కొట్టించి పిల్లలందర్నీ పంపేశాను. నేను కూడా వెళ్ళిపోయాను' మంచంపైన కూర్చుంటా చెప్పినాడు టీచర్ పరమేశం.

'ఔ... సార్... బంగారమట్ట పిల్ల... ఎంత బాగా సదువుతావుండె. అక్షరాలు ఎట్ల రాస్తాండె. బడి అంటే సాలు... పొద్దునే లేసి పయనమైతాండె...' నాగులయ్య తన ఆవేదన వ్యక్తం చేశాడు.

'యాడికి పోతాదిగానీ... పాండి అందరం తలో పక్కకు పోతే కన్పిస్తాది. ఒకరు నా బండ్లో వెనకెక్కండి పడమటి పక్కనుండే పల్లెలన్నీ తిరిగొద్దాం...' అన్నాడు లేచి బండి స్టార్ట్ చేస్తా పరమేశం.

చిన్నాయన ఆయన వెనక కూర్చున్నాడు. బండి వెళ్ళిపోయింది స్పీడుగా.

'రేయ్ పాపోడా నువ్వూ; లింగన్న; ముత్యాలు, దక్షిణం దిక్కుండే పల్లెలన్నీ తిరిగిరాపోండి' చెప్పినాడు ప్రతాపుడు ఎవరికో.

వాళ్ళు కూడా యల్లబారిపోయినారు.

'నిన్న వూర్లోకి సైకిలు మీద గౌన్లు వేసుకొని సాయిబుపీరా వచ్చిన్యాడు. అమ్మినేమన్న ఎత్తకపోయినాడో... ఏమో' కొండమ్మ చెప్పింది గట్టిగా.

'రేయ్ పాపోడా... తిమ్మన్న...' నువ్వు టౌనుకు పోయి పాత మార్కెట్ కాడ సాయిబుపీరా వుంటాడుగానీ సంగతి ఏందో కనుక్కొని రాపో... వాడు అడ్డం మాట్లాడితే ఈటికే పిల్సుకరా... నీతోపాటూ జయకృష్ణను కూడా పిల్సుకపో...' చెప్పినాడు ప్రతాపుడు.

'ఏం పాడు కాలమొచ్చిందిలేమ్మా... చెప్పనలివికాని కాలం. పిల్లల్ని ఎత్తుకపోయి అమ్ముకునేటోళ్ళు తిరుగుతా వుండారని పేపర్లల్లోనూ, టీవీల్లోనూ చూపిస్తానే వుండారు' – టౌన్లో బతకలేక నెల క్రితమే మళ్ళీ పల్లెకొచ్చిన రామయ్య అన్నాడు.

ఎవరు చూసిన బాధపడ్తానే వుండారు.

యాడ జూసినా జనం 'అమ్ములు' సంగతే మాట్లాడుకుంటా వుండారు.

బడి లేకపోవడంతో పిల్లలందరూ తూరుపు కొమ్మల చింతచెట్టు కిందికి చేరి 'ఊయల' ఊగుతున్నారు. ఇంకొందరు లైన్‌బార్ గోలీలాట ఆడుకుంటున్నారు. కుక్కలు తమకేమీ అర్థం కావడం లేదన్నట్లు ఆగిఆగి మొరుగుతున్నాయి.

'రాన్నా... రామయ్యన్న... మనం ఉత్తరం దిక్కునుండే పల్లెలన్నీ చుట్టుకొని వద్దాం' అని స్కూటర్ తీసి ప్రతాపుడు పిల్సడంతో రామయ్య కూడా బయలుదేరినాడు.

పోతాపోతా చెప్పినాడు... 'బావ! నువ్వు ఆ శీనయ్య కల్సి తూర్పు దిక్కుకు పొయ్యి వెతకండి' అని.

భుజం గుడ్డతో ముఖం తుడ్సుకొని నాగులయ్య; శీనయ్యలిద్దరూ బయలుదేరినారు తూర్పు దిశగా!

❀❀❀

సాయంత్రమైతా వుండాది.

ఏ దిక్కుకుపోయినోళ్ళూ రాలేదు.

కవ్వంగుట్ట మలుపు దగ్గర్నుంచి వస్తాండే కూలోళ్ళు కొందరు ఆ పక్క ఈ పక్క రెట్టలు పట్టుకొని చిన్నగా నడిపించుకుంటా లక్షుమ్మను తెచ్చి ఇంట్లో కూర్చోబెట్టినారు.

'ఈడ్నే వుంటివి కదూ వదినా... యాటికి పోతివి? ఏమైంది?' అడిగింది అరుణ ఆత్రంగా.

లక్షుమ్మ ఏం చెప్పలేదు. నిశ్శబ్దంగా శూన్యంలోకి చూస్తోంది.

గూట్లో నిన్న కొండ నుంచి తెచ్చిన బిక్కిపండ్లు మాగి మంచి వాసనొస్తా వుండాయి.

లక్షుమ్మకు కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి.

'రోంతలో మేలైందిమ్మా... ముందు సూసినాం గాబట్టి సరిపోయింది... లేకుంటే ఏం జరిగిందునో... కవ్వంగుట్ట మలుపుకాడ, రైలుపట్టాల పైన 'అమ్ములు, అమ్ములు' అని పిలుస్తా పరిగెడతా వుండాది. సాయంత్రం పోయే లోకల్ బండి వస్తాండె... ఉరుకుతా పోయి లాక్కొచ్చినాం...' చెప్తాండరు కూలోళ్ళు. అరుణ కళ్ళల్లో కన్నీళ్ళ తడి.

'ఏమోమ్మా! ఆయమ్మి పిల్ల అమ్ములుకు రైలు సూడ్డమంటే ఇంతిష్టమో... అట్నే ఏమన్నా పోయిందేమోనని పిలుస్సుకుంటా పోతిని... బండి వస్తాందేది సూసుకోల్యా...' చెప్పి గోడుగోడుగా ఏడుస్తాంది లక్షుమ్మ.

ఇంతలో పల్లెలు వెతకను పోయినోళ్ళు ఒక్కొక్కరే వస్తా వుండారు.

పరమేశం టీచర్ ఎర్ర దుమ్ము కొట్టుకపోయి ముఖమంతా పీక్కుపోయి నల్లగ వాడిపోయి వచ్చినాడు.

'తిరిగి తిరిగి వస్తా వుండానమ్మా... దాదాపు ముప్పై పల్లెలు విచారించాను. ఎవర్ని అడిగినా తెలియదంటా వుండారు. ఇంగ మనమేం చేసేది?' నిరాశపడ్తా మంచంపైన కూలబడ్డాడు.

టౌనుకు పోయినోళ్ళు కూడా వచ్చినారు.

గౌన్లు అమ్మే సాయిబుపీరా 'నాకెందుకు తల్లీ! పాపం సొమ్ము. నాకూ పిల్లలుండారు. నువ్వు గౌన్లు కొనుక్కొని లెఖ్క ఎప్పుడిచ్చినా ఏమన్నా అంటా వుంటినా?' బాధపడ్తాండడు.

ప్రతాపుడు కూడా తిరిగి తిరిగి అలసిపోయి వచ్చినాడు. సమాచారమే లేదన్నాడు.

ఇంకాసేపటికి లింగన్నగాడు కూడా వచ్చినాడు. ఎవరూ తమకు తెలియదంటున్నారని చెప్పాడు.

'ఔబ్బీ!... ఆ ఎంకటయ్యగాడు ఆ మధ్యన నాగులయ్యతో కొట్లాడినాడు. వాడ్ని పిలిపించి అడిగితే...' చిన్నాయన గుర్తు చేసినాడు. అందరికీ ఒక్కసారిగా ఎంకటయ్యపైనే అనుమానం వచ్చింది. అందరూ పోయి వాడ్ని పిల్సుకొచ్చినారు.

'సామీ... నాకేం తెల్దు... ఆరోజు తాగి కూలీ లెఖ్క యియ్యలేకపోతిని. నన్ను తోటలోనే సావగొట్టినారు. నేనూ పిల్లలుగలవాడ్నే. ఇట్టాటి పని ఏంటికి జెస్తా. బిడ్డ ఎవరికైనా బిడ్డే కదా...' అని మొత్తుకుంటా వుండాడు.

అక్కడికి జయకృష్ణ రెండు దెబ్బలు కూడా వేసినాడు. వాడు చివరికి తనకేం తెల్దు అని కాళ్ళు కూడా పట్టుకుంటా వుండాడు.

ఇంక తూర్పు దిక్కుకు పోయిన నాగులయ్య కోసం అందరూ ఎదురుచూస్తా కూర్చోని వుండారు. ఏం సమాచారం తెస్తాడో అని ఉత్కంఠగా!

చీకటైంది.

ఆకాశంలో నల్లమబ్బులు కమ్ముకుంటా వుండాయి. గాలి లేసింది. వాన కురుస్తాదేమోనని అందరూ అనుకుంటా వుండారు.

లక్షుమ్మ కొట్టం దిక్కు పైకి చూసింది. తూర్పు వాసం ఒకటి విరిగిపోయిన సంగతి గమనమైంది. చెట్లు అన్నీ గాలికి ఊగతా వుండాయి.

నడిరాత్రిపూట వాన కురిసేటప్పుడు వచ్చినాడు నాగులయ్య. 'పల్లెలన్నీ తిరిగి కాళ్ళు పెరుకుతా వుండాయి. అమ్మి ఆనవాలు కానరాలేదు' అంటూ గుడిసెలోని

గుంజకు కూలబడినాడు. బాధ... దిగులు... దుఃఖం... కొంచెం బయటకు దావ దిక్కుపోతే చింతచెట్టు తూరుపుకొమ్మలకు తాను అమ్ములు కోసం వేసిన ఊయల ఊగుతా కన్పిస్తాది. మనస్సంతా వేదన... తీరని రోదన...

❀❀❀

వారం రోజులు గడిచిపోయాయి.

కొండకు అవతల పెన్నానదికి అడ్డంగా ప్రాజెక్టు ఎడమకాల్వ మంజూరైంది. ముంబాయికి చెందిన 'ధనరాజ్ గుప్తా గ్రూప్'కు టెండర్ దక్కింది. దాంట్లో సబ్–కాంట్రాక్టు ప్రసాదనాయుడు సంపాదించుకున్నాడు. అతను టౌన్లోని నాయుడుకు స్వయాన తమ్ముడు. ఇరవై కోట్ల రూపాయల టెండర్... ఎప్పుడూ ఇంతపెద్ద టెండర్‌పని వాళ్ళు చేయలేదు... పనికి వర్కర్స్ కావాలి. అందుకే చుట్టుపక్క వుండే అన్ని పల్లెల్లోనూ కూలీల కోసం తప్పెట కొట్టించినారు.

చీకట్లోనే పల్లెల్లోకి లారీలు వస్తా వుండాయి.

కూలోళ్ళందర్ని ఎక్కించుకొని ప్రాజెక్టు పనుల దగ్గరికి తీసుకెళ్తున్నాయి.

నాగులయ్యకు పనికి పోవాలని లేదు.

మనస్సంతా ఒకటే దిగులు...

పనికి పోకుంటే కడుపు కాలుతుంది.

ఇప్పుడే లక్షుమ్మ మానసిక పరిస్థితి ఏం బాగోలేదు.

చింతచెట్టు కింద కూర్చోని ఖాళీ ఉయ్యాలనే ఊపుతా తిక్కతిక్కగా మాట్లాడుకుంటా వుంటా వుంది.

శీనయ్య ఇంటికాడికి వచ్చినాడు...

'న్నా... నాగులన్నా... ఇంటికాడ వూరిక కూర్చొని దిగులుజేస్తా వుండేకంటే పనికి పోతే రోంత మనసుకు బాగుంటుంది రా...' అని రెట్టపట్టి పిల్సుకపోయి లారీ ఎక్కించినాడు.

ప్రాజెక్టు పనులు నడుస్తున్నాయి.

వందలమంది కూలోళ్ళు తట్టలు మోస్తా వుండారు. కంకర, ఇసుక, సిమెంటు కలుపుతా ఉండారు. కొండపైన పెద్దలైట్ వేసి రాత్రిళ్ళు కూడా పని చేయిస్తా వుండారు. కూలీ రేట్లు కూడా ఎక్కువ యిస్తా వుండారు. ఇరవై కోట్ల టెండరంటే మాటలా! కానుగ చెట్టు నీడన శిలాఫలకం వేసి వుండారు.

మధ్యాహ్నం అన్నం ప్యాకెట్లు పంచుతున్నారు. పైన ఎండ కింద సెగ కురుస్తా వుండాది. శిలాఫలకంలోని బంగారురంగు అక్షరాలు మెరుస్తాండయి. నాగులయ్య అన్నం ప్యాకెట్ తీసుకొని భూమిపూజ చేసిన చోట కూర్చున్నాడు. కిందుండే రాయి ఎండకు కాలుతోంది. ఏం చేయాలి? కాస్త దూరంలో ఏదో గుడ్డ... లాగాడు బాగానే వుంది... కిందేసుకొని కూర్చున్నాడు. చల్లగా వుంది. ప్రశాంతంగా కానుగ చెట్టు నీడను యిస్తోంది. అన్నం తిని చాలా రోజులు కావడం వల్ల ముద్ద కలుపుకొని త్వరత్వరగా నాల్గు ముద్దలు మింగాడో లేదో పొరపోయింది. ఇంటికాడ లక్షుమ్మ ఒక్కతి గుర్తుకొచ్చింది. అన్నం తినాలనిపించలేదు. నీళ్ళు కడుపు నిండా తాగి అన్నాన్ని అక్కడే అలాగే వదిలేశాడు.

పైకి లేచాడు. ఒక అడుగు వేశాడు. ఇంతసేపు తను కింద వేసుకొని కూర్చున్న పాత గుడ్డ కాలుకు తగులుకొని తన వెంట వస్తోంది. తను తట్టుకుని భూమిపూజ జరిగిన హోమంలో పడబోయాడు. దాన్ని చేత్తో లాగేసి పడేశాడు. అప్పుడనిపించింది... తను ఇది ఎక్కడో చూశాడు... ఎక్కడ... ఆకుపచ్చ గౌనుకు ఎర్రటి పూల వరుసలులాగానే...

అవును... అలాంటిది అచ్చం అమ్ములుకు గౌను వుండేది కదా!

అదేనా... ఇది!

ఇదేనా... అది!! అర్థం కావడం లేదు. సంఘర్షణ.

అది గౌనేనా... లేక పాతగుడ్డ...?

'ఆసామి వస్తున్నాడు...' ఎవరో కేకేశారు.

ఆయన వచ్చినప్పుడు పనిచేయకుండా వుంటే కోపం వస్తుందని, తిట్టడమే కాకుండా కొట్టడానికి కూడా వెనుకాడడని చెప్తారు. ఆలోచనలు వదిలేసి... పనిలోకి కదిలాడు నాగులయ్య.

కోట్ల ప్రాజెక్టుకు కొన్ని వందలమంది కూలీలు శ్రమిస్తున్న దృశ్యం చూసి ఆసామి ఉప్పొంగిపోతున్నాడు. శంకుస్థాపన, శ్రీకారం మంచిగ అనుకున్నట్లే జరగడం అతనికి మరింత సంతోషాన్ని యిస్తోంది. 'పని అయిపోతే మాటలు పెట్టుకొని ఇక్కడుండొద్దు' అని అరుస్తా వుండాడు ఆసామి.

సాయంత్రం వూర్లకు బయలుదేరిన లారీలో ఎక్కిన వాళ్ళంతా ఏదేదో మాట్లాడుకుంటున్నారు. యిచ్చిన కూలీల గురించి చెప్పుకుంటూ వుండారు.

'మంచి ముహూర్తం చూసి శంకుస్థాపనకు ముందురోజు రాత్రి నరబలి యిచ్చి ప్రాజెక్టు ప్రారంభించినారంట... యింగ అడ్డమేముండాది వందల మంది కూలోళ్ళకు కోట్లు యిచ్చి పనులు చేయించుకుంటా వుండారు... డబ్బు, పరపతి వుండే మారాజులు అనుకుంటే ఎంత పనైనా అయిపోతాది లేబ్బా!' అన్నారెవరో.

ఈ మాటలు వింటేనే నాగులయ్య గుండె బద్దలైనంత పనైంది. 'నరబలి... ప్రాజెక్టు ప్రారంభానికి ముందు...' అనే మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తానే వుండాయి.

మధ్యాహ్నం కన్పించిన గౌను... శంకుస్థాపన ఫలకం గుర్తొచ్చినాయి.

'అమ్ములూ...' ఒకే ఒక్క కేక వేశాడు. దిక్కులు పిక్కటిల్లాయి. సాగిపోతున్న లారీ షడన్ బ్రేక్‌తో ఆగింది.

'ఏమైంది? ఏమైంది?' అందరూ అడుగుతున్నారు.

'నేను దిగాలి, నేను దిగాలి. ఆపండి...'

'ఏం మరిచిపోయావు?' – ఎవరో అడుగుతున్నారు.

'నా కూతుర్ని'– కన్నీళ్ళతో లారీ దూకాడు నాగులయ్య.

పరుగు పెడ్తున్నాడు... పరుగు...

ప్రాజెక్టు దిశగా... అరికాళ్ళ కింద దుమ్ము రేగుతోంది.

గస... పరుగు ఆగలేదు... చేరుకున్నాడు... గౌను కోసం పొదల్లో తారాడాడు... ఇక్కడే తాను పడేసింది... ఇక్కడే అరే లేదే... ఏమైంది?

'న్నా... నాగులన్నా యేంది అంతగా వెతుకుతాండవు... ఏం పోయింది...' అడిగింది పనిచేసేకి పల్లె నుంచి వచ్చిన కొండమ్మ.

'అమ్మిది... అమ్ములమ్మది... ఆకుపచ్చ గౌనుకు ఎర్రపూల వరసలు వచ్చిన గౌనుమ్మి... మధ్యాహ్నం ఇడ్నే చూసినా...' వెతుకుతా వుండాడు తీవ్రంగా నాగులయ్య. అది కన్పించలేదు. మోడాలు కమ్ముకున్నాయి. చినుకులు కురుస్తా వుండాయి. నాగులయ్య ఆన్నుంచి రాలేదు. శంకుస్థాపన ఫలకం అమ్ములమ్మకు కట్టిన సమాధిలాగా కన్పిస్తావుంది. వానకు అందరూ వెళ్ళిపోతున్నారు. ఆడ్నే... ఆ శిలాఫలకం దగ్గరే కుప్పకూలిపోయాడు. వెక్కి వెక్కి ఏడుస్తూనే వున్నాడు. చినుకుల్లో చినుకుగా కన్నీటిధారగా భూమి పొరల్లోకి యింకిపోతున్నాడు. 'దేవుడా... ఈ బలహీనమైన జన్మ వద్దురా సామీ... ఈ శక్తిలేనివాడ్ని ఎందుకు పుట్టించినావు తండ్రీ' అని తల బాదుకుంటూ వుండాడు.

పల్లెలో లక్షుమ్మ యిప్పటికీ 'మ్మో...! మా అమ్ముల్ని యాడైనా జూసినారు? బ్బీ..!మా అమ్ములు ఇట్టొచ్చింది?' అని కన్పించినోళ్ళందర్నీ అడుగుతానే వుండాది... కన్నీళ్ళతో!

వీళ్ళిద్దర్ని ఎవరు ఓదార్చుతారు?

చూస్తాండగానే ప్రాజెక్ట్ పనులు ఆగిపోయినాయి. నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వలేదని ఆందోళనకు దిగినారు. మంజూరైన సొమ్ము కూడా ఇంకా మా చేతుల్లోకి రాలేదని ఇంకొందరు వ్యతిరేకించినారు. 'పోతాండేది ఎక్కువ - ఇస్తాండేది తక్కువ' ప్రాజెక్టుకు మేం ఒప్పుకోం అని దిగువ పల్లెల జనం ప్రాజెక్టు పనులకు అడ్డం తగిలినారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయినాయి.

❋❋❋

ప్రతి రాత్రీ కాలిదావకు అవతల గంగమ్మ గుడి దగ్గరి చింతచెట్టు తూర్పుకొమ్మల పైకి పున్నమి వెన్నెల వచ్చి వాలుతుంది. ఆ వెలుగుల వానలో ఊయల తనకు తానుగా ఊగుతుంది... ఎంతో ఇష్టంగా, ఒంటరిగా...! ఊయల్ని మోస్తున్న తూరుపు కొమ్మలు కూడా లయబద్ధంగా ఆటలాడుతూ వుంటాయి.

- జూలై-సెప్టెంబర్ 2007, సాహిత్య నేత్రం.

ఉత్తమ కథా పురస్కార పోటీలు-2007లో

ద్వితీయ బహుమతి పొందిన కథ.

నేల దిగని ఊడ

మర్రిచెట్టు నీడలోకి వచ్చి తన చేతి సంచిని బండపైన పెట్టినాడు పీరా. నుదుటికి పట్టిన చమట తుడుచుకొని కూర్చోడానికి వీలుగా కిందపడి వున్న ఎండుటాకుల్ని, చిన్నకొమ్మల్ని తీసి అవతలికి పారేశాడు. అరికాలితోనే అక్కడున్న మట్టిని సమంగా నెరిపాడు. సంతృప్తిగా చేతి సంచిలోని ఒక్కొక్క పనిముట్టునే బయటకు తీసి కింద పెట్టుకున్నాడు.

"ఏం... పీరా! మనిషివి మా పల్లెకే రాకుండా మానుకున్యావు. మూన్నెళ్లకోసారి అయినా వస్తా వుండు... బ్బా..." ఎద్దుల్ని గుంజకు కట్టేస్తా పలకరించినాడు అంకిరెడ్డి.

"యాడిదిలే... రెడ్డీ! అప్పటి తిన్నా పనులు ఎవరు జేస్తాండరు... భూముల పనంటేనే పారిపోతా వుండారు. ఏ పనైనా జేసుకోను పోతాండారు గానీ వ్యవసాయమంటే ఎవరికి గిడుతా వుండాది..." తన అసంతృప్తిని వెల్లడించినాడు పీరా.

"నిజమేబ్బా... బలవంతంగా ఈ భూముల్ని నమ్ముకొని వుండాం గానీ కొనేటోళ్లు వస్తే అయినకాడికి భూముల్ని అమ్ముకొని టౌనుకు పోవాలనే వుంది..." తన మనసులోని మాటను బయటపెట్టినాడు అంకిరెడ్డి... ఎద్దును పీరా ముందుకు తీసుకొస్తూ.

"రేయ్... మల్లన్న... బిన్నారా... రోంతసేపు పట్టుకుందువు..." దావెంబడి పోయే వాడిని కేకేసి పిలిచినాడు అంకిరెడ్డి. ఏదో పని మీద పోతాండే మల్లన్న లోలోపలే తిట్టుకుంటా తలగోక్కుంటా ఎద్దు కాడికి వచ్చినాడు.

నడుముపై నుంచి తాడేసి ఎడమ రెండు కాళ్లలో ఒకదానికి ఉంగరంలా చుట్టి లాగితే కాలు పైకి లేసి ఎద్దు బరువుతో వెనక్కి వరిగింది. తల దగ్గర మల్లన్న, వెనుకవైపు అంకిరెడ్డి పట్టుకొని వుండగా పడుకున్న ఎద్దు నాలుగు కాళ్లను కలిపి గట్టిగా లాగి కట్టినాడు పీరా.

ఎద్దు పెనుగులాడతాంది.

"యా... యా... తల పట్టుకోరా మల్లన్న..." కేకేసినాడు అంకిరెడ్డి. మల్లన్న ఎద్దు మెడను గట్టిగా అనిచి పట్టుకున్నాడు.

"ఎద్దులు కొని నాలుగేళ్లు దాటిపోయింది ల్యా... రెడ్డీ" అంటూ పంగల కర్రను దగ్గరికి తెచ్చిపెట్టుకున్నాడు పీరా.

“ఔ... ఐదేళ్లు అయితా వుంటాదనుకుంటా... రైల్వే గేటును కట్టకాడ మొదలు జేసినప్పుడే కదూ కొనుక్కొచ్చింది...” గుర్తు చేసుకున్నాడు ఎద్దును పట్టుకుంటా అంకిరెడ్డి.

ఎద్దు కళ్లు నల్ల నేరేడు పళ్లలాగా మిలమిల మెరుస్తూ నిగనిగలాడ్తా... బెదురుచూపులు చూస్తా వుండాయి. ఉన్నట్టుండి మెడను విదిలించింది.

“బ్బా... ఎద్దు బిస మీద వుంది” అన్నాడు శక్తినంత ఉపయోగించి తలపట్టుకొని మల్లన్న గసపెడ్తా.

“రొంతసేపేలే... గట్టిగా పట్టుకో... పని అయిపోతాది...” ఒక మేకు పెదవుల మధ్య పెట్టుకొని, మరొక మేకు ఒక చేతిలోకి, సుత్తి మరో చేతిలోకి తీసుకున్నాడు పీరా.

“బాగుంది పీరా... నాడాలు తీసుకోకుండనే పనిలోకి దిగినావు...” నవ్వినాడు అంకిరెడ్డి.

“ఔ మర్సిపోయిన. అసల్ది ల్యాకుండా సాంగ్యానికి దిగినట్లుంది. నాడాలు సంచిలోనే పెట్టినా... ఏందో ఈ మధ్య మతిమరుపు ఎక్కువైపోతావుంది... అన్నీ కష్టాలే... అన్నీ బాధలే...” గొణుక్కుంటూ సుత్తి తీసినాడు. నాలుగు నాడాలు పక్కన పెట్టి మిగిలినవి మళ్లీ సంచిలోకే వేశాడు.

కొత్త యినుప నాడాలు. కొలిమిలో రగిలి కరిగి తళతళ మెరుస్తా వుండాయి. మర్రిచెట్టు కొమ్మల్లోంచి అప్పుడప్పుడు పడుతున్న సూర్యకాంతిలో వాటి రాజసం వుట్టిపడుతోంది.

జారుతున్న పంచెను ఎగదోపుకుంటా ఎద్దు కాళ్ల దగ్గరికి పోయి కూర్చున్నాడు పీరా. పంగల కర్రను నాలుగు కాళ్లకు మధ్యన పైకి లేపి నిలబెట్టాడు. ఇప్పుడు గిట్టలు నాడాలు కొట్టడానికి వీలుగా వున్నాయి.

నాడాను తీసుకొని గిట్టకు సరిగ్గా కుదిర్చి మధ్య రంధ్రంలో మేకు వుంచి మొదటి దెబ్బ వేశాడు సుత్తితో. ఎద్దు అదిరింది...

మల్లన్న, అంకిరెడ్డి ఇద్దరూ గట్టిగా పట్టుకునే వున్నారు. కాసేపాగి ఎడమ రంధ్రంలో రెండో మేకును వుంచి... రెండో దెబ్బ వేశాడు. ఎద్దు పదిరింది...

పట్టుకున్న ఇద్దరూ ఇంకాస్త పట్టు బిగించారు.

“క్యాదు... పీరా! ఏంది మనిషివంత తగ్గిపోతా వుండావు. ఏం దిగులు పెట్టుకున్నావు? నీకేం బాధుంది...” ప్రశ్నించాడు సరదాగానే అంకిరెడ్డి.

మరో మేకు చేతిలోకి తీసుకుంటా "ఏం జెప్పేది... రెడ్డీ... ముగ్గురు కూతుర్లలో పెద్దమ్మికి మొన్ననే పెండ్లి జేసినా. ఇంగా ఇద్దరు వుండారు... అంతో ఇంతో యిచ్చి వాళ్లను సాగనంపాల. కొడుకును కువైట్‌కు అంపియ్యాలని ఎప్పట్నుంచో అనుకుంటూనే వుండాను... లెఖ్క యాడ కుదుర్తా వుండాది? దీనెమ్మ ఇదే పాడు బతుకైపోయింది..." పళ్లు బిగించి మరో దెబ్బ వేశాడు పీరా...

ఎద్దు బుసపెడ్తా అరుపేసింది... విదిలించుకుంటా.

"కొడుకు ఏం జేస్తా వుండాడు...." మళ్లీ ఇంకో ప్రశ్న వదిలాడు అంకిరెడ్డి.

"వాడేం జేస్తాడు... పదో తరగతి తప్పినాక నాకాడనే కొలిమి పనిలో పెట్టుకొని వుండా... పని కాడికి పర్వాల్యా... బాగనే నేర్సుకున్యాడు... నా ఆశలు, వాళ్లమ్మ కలలన్నీ వాడి మీదనే వుండాయి... ఈసారి పులిందల సంత జరిగినాక అయినా వాడ్ని కువైట్‌కు అంపాలని వుండాను..." కొడుకు గురించి చెప్తున్నప్పుడు అతడి కళ్లలో కొత్త వెలుగు కన్పించింది.

నాడాలు కొట్టడం వెనుక కాళ్లకు పూర్తయ్యింది. ముందు కాళ్ల వైపుకు జరిగినాడు. ఎద్దు గుంజుకుంటా వుంది. వాళ్లు పట్టుకునే వుండారు.

"మాంఛి... పదునైన వేట కొడవళ్లు నాలుగు జేసీ పీరా!... ఎలక్షన్లు వస్తాండేటట్లుండాయి... చేయించి పెట్టుకొని వుంటే ఎట్టైనా అయితాది..." మీసాలు దువ్వుకుంటా జెప్పినాడు అంకిరెడ్డి.

"అట్నేలే రెడ్డీ... కొలిమి కాడ పని నడుస్తానే వుందిలే... ఇప్పుడాదాయం పని అదే వుండాది. అంతో ఇంతో సంపాదించుకుంటా వుండేది ఆ వేట కొడవళ్లు చేసుకునే...!"

"పీరన్న... నాకూ ఒక మచ్చుకత్తి గావాలి..." అడిగినాడు మల్లన్న పనిలో పనిగా.

"అట్నేలే మల్ల కొలిమికాడికి రా" సమాధానమిచ్చినాడు గిట్టకు మేకు కొడ్తానే.

పని పూర్తయ్యింది. ఎద్దు కాళ్లకు తాడు విప్పగానే అది లేచి కూర్చుని... వెంటనే పైకి లేచి నిలబడింది. అది కొత్తగా అడుగుల శబ్దం చేసుకుంటా వయ్యారంగా నడుచుకుంటూ గుంజ దగ్గరకి చేరుకుంది.

అంకిరెడ్డి రెండవ ఎద్దును కూడా తెచ్చాడు. వచ్చిన ఎద్దు కుదురుగా కూర్చుంది... ఆ తర్వాత మళ్లీ మామూలే... కాళ్లకు కట్టిన తాడు, నాడాలు, మేకులు, దెబ్బలు...

అంకిరెడ్డి ఎద్దుల పని కాగానే లెఖ్క సంగతి ప్రస్తావనకు వచ్చింది. మల్లన్న వెళ్లిపోయాడు.

"ఎంతిమ్మంటావు... పీరా..." బనీను లోపలికి చెయ్యి పెడ్తా అడిగాడు అంకిరెడ్డి.

"ఏముంది... రెడ్డీ... టౌన్లో యాడైనా నాడా కొడితే ఇరవై అయిదు తీసుకుంటా వుండారు. ఇంగ నీకు బుద్ధి పుట్టినంత ఇయ్యి" మంచినీళ్ల చెంబు పైకెత్తినాడు.

"ఇరవై అయిదు యాడిస్తా వుండార్లే పీరా... పల్లెల్లో అయితే పదైదు... టౌన్లలో అయితే ఇరవై... నువ్వు నాకే జెప్పితే ఎట్టా..." కళ్లు ఎగరేసినాడు అంకిరెడ్డి.

"అందుకే సామీ అనింది... ఊర్లో పెద్దరెడ్లు... మీతో పెట్టుకొని మేం యాడ బతికేది. మళ్లా ఎప్పుడైనా ఊర్లోకి రావాల్నా... లేదా..." ఎంతో కొంత ఇయ్యి ముందు అనే ధోరణిలో...

"ఇదో నూరు పెట్టుకో... ఇంగో యాభై వేటకొడవళ్లకు వచ్చినప్పుడిస్తా..." చేతిలో పెట్టి ఎద్దుల్ని తోలుకొని రోడ్డు దిక్కు కదిల్నాడు.

"నీ అట్టా పనికిమాలినోళ్లు వుండబట్టే కదా వానలు కూడా పడంది..." అని మనసులోనే తిట్టుకున్నాడు పీరా.

ఒక ఎద్దుకు నాడా కొడితే అరవై రూపాయలిచ్చినా, రెండు ఎద్దులకు నూటా ఇరవై రావాలి. కానీ నూరు చేతిలో పెట్టి వెనక్కి చూడకుండా వెళ్తున్న అంకిరెడ్డిపైన కోపం పొంగుకొచ్చింది. మాటలు బయటకు రాలేదు కానీ ఏవో తిట్లు అయితే నిశ్శబ్దంగానే తిట్టాడు. ఇంకా నేలను తాకని మర్రి ఊడలు మధ్యలోనే గాలికి ఊగతా వుండాయి... పైన చెట్టుకు.

తర్వాత కొంతసేపటికి నాలుగు జతల ఎద్దులు వచ్చినాయి వీరాపురం కాణ్ణుంచి. సాయంత్రం వరకు వాటికి నాడాలు కొట్టి వచ్చిన లెఖ్క ఎంచుకొని నిక్కరు జేబులోనూ, సామాన్లన్నీ చేతిసంచిలోనూ పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు పీరా. దూరంగా రైలు వెళ్తున్న శబ్దం....

❀❀❀

పీరాకు నాడాలు కొట్టే పని తాత మాబూ నేర్పించాడు. నగరం నుంచి పండక్కి వూరికొచ్చినప్పుడు తనని కూర్చోబెట్టుకొని అదే పనిగా చెవిలో పోరు పెట్టేవాడు.

"పెద్ద పనేం లేదు జూడు... కాళ్లు కలిపి తాడుతో గట్టిగా కట్టాలి. రోంత బిగువు తగ్గినా అది కాళ్లు విదిలిస్తే నీ మూతి పళ్లు ఒక్కటుండవు. మట్టసంగా వళ్లు దగ్గర పెట్టుకొని చేయాలి. నాడా గిట్టలకు సరిపోయేలా అమర్చుకోవాలి. కొంత వెనక్కిగానీ, కొంత ముందుకుగానీ పెట్టకూడదు. సరిగ్గా మధ్యలోకి సరిపోవాల. లేకుంటే కాళ్లు ఒకదానికొకటి తట్టుకొని అవి పడిపోతాయి. నాడాలోకి మేకులు సున్నితంగా కొట్టాలి. గట్టిగా తగిలితే అది కట్టు తెంచుకుంటుంది. జాగ్రత్తగా వుండాల... ఏం జెప్పేది అర్థమైతా వుండాదా..." అని నశం పొడి తీసుకొని ముక్కుపుటాల్లోకి గట్టిగా పీల్చుకొని అంతే గట్టిగా తుమ్మేవాడు.

తుమ్మడం మొదలైందంటే అది ఆగేది కాదు. ఆ శబ్దమే తుఫానులా వుండేది. తుమ్ముతూనే మధ్యమధ్యలోనే అడిగేవాడు... "నేను జెప్పింది అర్థమైందా..." అని!

పీరా తలాడించేవాడు.

"నేను నిజాం గుర్రపుశాలలో పనిజేస్తా వుండాను. వందల్లో వుండాయి అక్కడ గుర్రాలు. అరేబియా నుంచి కూడా తెప్పించుండారు. ఒక్కొక్కటి ఎంత ఎత్తు వుంటాదనుకుంటా వుండావు. తరిఫీదు ఇవ్వడం కూడా వాటికి చాలా కష్టం. నాడాలు కొట్టాలంటే సాధ్యమయ్యే సంగతి కాదు.

అవి మన మాటవిని సావవు. పొరపాటున అవి తంతే మనిషి బతికేది కూడా అసాధ్యం. ఎంత నేర్పుతో, ఓర్పుతో నాడాలు కొట్టేపని చేయాలో తెలుసా... ఏం నేను జెప్పేది అర్థమైందా...?" అంటూ మళ్లీ నశం ఎక్కించేవాడు. మామూలుగానే తుమ్ములు... ఆగకుండా.

"ఒక్కో గుర్రానికి రెండు నెలలకొకసారి నాడాలు మార్చాలి. అంత త్వరగా అవి అరిగిపోతా వుంటాయి. చేతినిండా పని. నువ్వు ఇక్కడ ముందు పని ఎంతో కొంత నేర్చుకుంటే నేను మా పటేల్‌తో మాట్లాడి కొలువు ఇప్పిస్తా. పని బాగుంటుంది. పనికి తగిన జీతం. ఇక్కడుంటే అదో... ఆ కొలిమి పని జేసుకొని బతకాల్సిందే. సెగ. బండ చాకిరీ... ఏం నేను జెప్పేది అర్థమైందా...?" అని గదమాయించేవాడు.

పీరాకు ఆయన మాటలంటే ఒక్కొక్కసారి సరదానే అయినా మరోసారి భయమేసేది. పండక్కి రెండ్రోజుల ముందొచ్చి పనిముట్లన్నీ సంచికేసుకొని పల్లెలకు పీరాను పిల్చుకొని పోయేవాడు. ఎద్దులకు నాడాలు కొడ్తా మెలకువలన్నీ నేర్పేవాడు. ఎంతో శ్రద్ధగా, నేర్పుతో, ఓర్పుతో, విసుగు లేకుండా మాబూ పని చేస్తుంటే ఆశ్చర్యమేసేది పీరాకు. సాయంత్రానికంతా పండగ ఖర్చు సంపాదించేవాడు. అందరికీ కొత్తబట్టలు కొని పెట్టేవాడు. పెన్నేట్లోకి తీసుకెళ్లి ఇసుకలో బలిగూడు ఆడించేవాడు.

రెడ్డోరి వనంలో తేనె పెట్టెలు లేపి తేనె తీసి అందరికి అరచేతుల నిండా పోసేవాడు. చెరుకు తోటల కాపదారులతో స్నేహం చేసి పెద్ద పెద్ద గెడలు విరిచి అందరికీ పంచేవాడు. పిల్ల సైన్యమంతా ఎప్పుడూ మాబూ వెనకే తిరుగుతా వుండేది. రకరకాల కథలు చెప్పించుకునే వాళ్లు. ఒక్కొక్క కథ చెప్పాక...

"ఏం నేను జెప్పేది అర్థమైందా?" అని ఎదురు ప్రశ్నించేవాడు. మళ్లీ తనే అనేవాడు... "మనం మనిషిలా పుట్టినంక మన తల్లిదండ్రులకు పేరు తేవాల. మన ఊరికి పేరు తేవాల. పదిమందికి సహాయపడాల. చేసే పని మీద శ్రద్ధ వుండాల. ఓర్పు వుండాల, నేర్పు కావాల. మొగోడు మంచి పని జేసి సంసారాన్ని సాకాల..."

ఆయన మాటల్ని పీరా ఎప్పుడూ మరిచిపోలేదు. తిరిగాడు... మాబూ వెనక పల్లెలన్నీ తిరిగాడు... నాడాల పనిలోని సందేహాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. పనివంతుడైనాడు... కానీ ఒక్కదాంన్లో మాత్రం...

తల్లిదండ్రుల్ని, భార్యని, వూరిని విడిచి మాబూతో పాటు నగరానికి వెళ్లడానికి అతనికి మనసొప్పలేదు. ఇక్కడే వుండిపోయాడు. తప్పలేదు కొలిమి పని. బతుకాట. నాడాలు కొట్టుకుంటూ పల్లెల్లో తిరగడం. ఇదే జీవితంగా మారింది...

కొడుకు మస్తానుకు కూడా మాబూ చెప్పిన కథలను చాలాసార్లు కూర్చోబెట్టుకొని చెప్పాడు పీరా. కానీ వాడిలో ఏ చలనమూ లేదు. నాడాలు కొట్టే పనంటే వాడికిష్టం లేదు. కువైట్ వెళ్లడమే వాడి లక్ష్యం. కొలిమి పని ద్వారా డబ్బు సంపాదించుకొని కువైట్ పోవాలని కష్టపడతా వుండాడు.

కొలిమి పని పుంజుకుంది.

రైతులకు కావాలసిన సామాన్లు అన్నీ చెప్పిన సమయానికే అందజేస్తా మస్తాను మంచి పేరు తెచ్చుకుంటా వుండాడు... ఊర్లో ఇంకో కొలిమి పోటీకి లేకపోవడంతో సంపాదన బాగానే వుంటోంది. కొడుకు ఎదగడం పీరాకు సంతోషంగా వుంది. వాడు కువైట్ వెళ్లిపోతే ఇద్దరు కూతుర్లకు కూడా మంచి మంచి సంబంధాలు చూసి పెళ్లి చేయాలని వుంది. అయితే కువైట్‌కు పోను వాడికి చార్జీలు సమకూర్చి పెట్టాల్సి వుంది. అంతా వేల రూపాయలతో పని. వడ్డీకి తీసుకునే పరిస్థితి కూడా లేదు. పెద్దకూతురి పెండ్లికి చేసిన అప్పు తీరనే లేదు. మళ్లీ అప్పు చేయాలంటే కష్టం.

ఆలోచనలు... అనంతంగా...! పల్లె నుంచి కాలిదావన బయలుదేరిన పీరా ఇంటికి చేరుకున్నాడు.

❀❀❀

రెండ్రోజుల్నుంచి కొలిమి ఆరింది లేదు. ఇద్దరు కూలోళ్లు... మస్తాను కలిసి పని చేస్తానే వుండారు. నల్లరాకాసి బొగ్గు రగులుకుంటానే వుంది. ఎన్నికల కాలం దగ్గర పడుతుండడంతో కొండాపురం వీరారెడ్డి ఇరవై వేట కొడవళ్లు, ముద్దనూరు నర్సింహారెడ్డి పది వేట కొడవళ్లు, యర్రగుంట్ల పాపిరెడ్డి, సిద్ధినాయుడు చెరో పన్నెండు వేట కొడవళ్లు కావాలని ముందుగానే చెప్పడంతో పని వేగం పుంజుకుంది.

కొలిమిలో వెలుగు కన్పిస్తున్న కొద్దీ వీరా కళ్లలో కాంతులు విరజిమ్ముతుండాయి. కలలు... కూతుళ్లకు ఘనంగా పెండ్లి చేసినట్లు, కొడుకు రెక్కల విమానం ఎక్కి కువైట్ దేశం పోయి దీనార్ల వర్షం కురిపిస్తావున్నట్లు... వూర్లో తామూ ఒకమాదిరిగా బతకడానికి మిద్దె వేసుకొని, సొంత బోరు వేసుకొని... బీబీకి చెవుల్లోకి, మెడలోకి నాల్గు నగలు చేయించుకొని గౌరవంగా జీవిస్తున్నట్లు... కలలు... కలలు... నడిరాత్రి ఉలిక్కిపడి నిద్ర మేల్కొన్నాడు వీరా. ఔ... తాను పులిందలకి బయలుదేరాల్సింది ఈరోజే. సంత... ఎద్దుల సంత... మూడు జిల్లాల నుండి వందల ఎద్దులు అక్కడికి అమ్మకానికి వస్తాయి. ఇప్పుడు బయలుదేరితే కాని... అందుకోలేడు. మస్తాను కొలిమి పనిలో వుండాడు కాబట్టి తన తమ్ముడు కొడుకు కరీంగాడ్ని వెంటబెట్టుకొని బయలుదేరినాడు... చీకట్లోనే... చేతి సంచి తీసుకొని!

❋❋❋

జనం... జనం... ఎక్కడ చూసినా జనం... పల్లెల్నుంచి బండ్లు కట్టుకొని వచ్చినారు. పులిందల ఎద్దుల సంతంటే ఆషామాషీ కాదు. రాయలసీమలోనే పెద్ద సంత.... అదృష్టం కొద్దీ మర్రిచెట్టు కిందే చోటు లభించింది. నేల దిగని ఊడలు గాలికి అటూ ఇటూ ఊగుతా వుండాయి.

చెట్టు కింద శుభ్రం చేసుకొని కూర్చున్నాడు. పనిముట్లను చక్కగా ముందేసుకొని చూస్తున్నాడు. వచ్చినాయి... ఎవరివో ఎద్దులు...

ఎదురుగా వచ్చి కుదురుగా కూర్చుంటున్నాయి... కాళ్లు తాడుతో కట్టడం... పంగల కర్రను ఆసరాగా చేసుకొని ఎత్తడం... నాడాలు కొట్టడం... డబ్బులు... ఒక్కో నాడా కొడితే ఇరవై అయిదు రూపాయలు. మొదలయ్యింది...

ఎద్దులు వస్తానే వుండాయి. నాడాలు దిగుతానే వుండాయి గిట్టల్లోకి. దుమ్ము... బేరం ఆడుతున్న వారి కేకలు... ఎండ... నాడాలు కొడుతుంటే పుడుతున్న శబ్దం చెవుల్లో మార్మోగుతూనే వుంది.

చమటలు శరీరాన్ని తడిపేస్తున్నాయి. డబ్బులు జేబులోకి చేరుతున్న కొద్దీ పనిపైన వ్యామోహం... కసి...

కొలిమి నేర్పిన రహస్యం... వేడిలోనే వంచుకోవాలి! పని చిక్కినప్పుడే సంపాదించుకోవాలి. ఆకలి చచ్చిపోయింది. నాడాలు టకటక శబ్దం చేసుకుంటూ దిగిపోతున్నాయి. ఎద్దులు కదిలిపోతున్నాయి.

మధ్యాహ్నమైంది.

కరీంకు ఓ పది నోటిచ్చి 'ఏమైనా తిని రమ్మని' పంపించాడు... నాడాలు తగ్గిపోతున్నాయి. 'ఇంకొన్ని తెచ్చివుంటే బాగుండేది... ఇక్కడెవ్వరూ బదులివ్వరు' మనసులోనే అనుకున్నాడు.

తానైతే మాత్రం వ్యాపారం జరిగే చోట ఎందుకిస్తాడు... అందరూ అంతే... చాలు... దేవుడు ఇచ్చినకాడికి... ఏవేవో ఆలోచనలు!

చేతులు నిరంతరంగా నాడాలు కొడుతూనే వున్నాయి. మధ్యమధ్యలో మంచినీళ్లే ఆహారం. కరీం ఏదో తినివచ్చి నిమ్మళంగా కాసేపు చెట్టు నీడలో కూర్చుండిపోయాడు. పని నడుస్తానే వుంది. చేతివేళ్లు పట్టుకపోతూ వుండడంతో సుత్తి క్రింద పెట్టి కాసేపు పిడికిలి బిగించి నేలకేసి చిన్నగా కొట్టాడు. కొంత తిమ్మిరి తగ్గింది. నిమ్మళంగా వుంది. సాయంత్రం కావస్తోంది. ఇంకో అరగంట కష్టపడితే సరిపోతుంది. సంచి విదిలించి చూశాడు. నాడాలు కొన్నే వున్నాయి. ఇంకో జత ఎద్దులకంటే సరిపోవు.

వేకువనే ఆహారం వేటకెళ్లిన పక్షుల గుంపులు వింతవింత అరుపులతో మర్రిచెట్టు కొమ్మలపైకి చేరుకుంటున్నాయి. ఎద్దుల్ని కొనుక్కున్న రైతులు ఇళ్లదారి పట్టారు. చివరినాడా... చిట్టచివరి నాడా...

ఇది ఒక్కటి కొడితే యిక ఈ రోజుకు తన పని పూర్తవుతుంది. కాసేపు ప్రశాంతంగా కూర్చోని డబ్బు లెక్కపెట్టుకోవాలని పీరాకు ఆరాటంగా వుంది.

చివరి నాడాలోకి మేకులు దిగుతుంటే ఇద్దరు వ్యక్తులు మోటర్‌బైక్ పైన అక్కడికొచ్చారు. వాళ్లను చూస్తే చాలాసేపటి నుంచి పీరా గురించి వెతుకుతున్న వాళ్లలాగా ఎర్రటి దుమ్ము కొట్టుకొనిపోయి కన్పిస్తున్నారు...

"నువ్వేనా... పీరా!" ప్రశ్నించారు వాళ్లు.

"ఔ... నేనే..." గిట్టలోకి మేకు దిగింది.

"మస్తాను... నీ కొడుకేనా?" మళ్లీ ప్రశ్న.

"ఔ... నా బిడ్డే..." ఇంకో మేకు అందుకున్నాడు.

“క్యాదు... పెద్దాయన! పిల్లల్ని సాకను రాదా నీకు... కొలిమి పని వాడికి నేర్పినావు. బాగానే వుంది. వేటకొడవళ్లు తయారు చేస్తా వుంటే కేసు అయితాదని వానికి చెప్పాల్నా... లేదా? ముచ్చుమర్రి కాడ మొన్న జరిగిన ఫ్యాక్షన్ హత్యలో దొరికిన ఆయుధాలన్నీ మీవాడే తయారుచేసి ఇచ్చినాడని తేలింది. రైలుపట్టాలకేసే ఇనుప పలకలు దొంగతనంగా తీసుకపోయి కొలిమిలో సామాన్లు చేసుకుంటా వుంటే తిట్టి దార్లో పెట్టాలని తెలీదా? ఇంటి దగ్గరికి పోతే వాడు పరారీలో వుండాడని తెల్సింది. పా... స్టేషన్‌కు పోదాం...” అరిచినాడు ఎత్తుటి మనిషి.

చివరి మేకు కొట్టినాడు పీరా.

కానీ అది ఎద్దు గిట్టలో దిగలేదు. మేకును అదిమి పట్టుకున్న ఎడమ చేతి బొటనవేలు మధ్యలో తగిలింది. నెత్తురు చిమ్మింది. కేక... చావుకేక... ఆకాశానికి ఎగిసింది. ఇన్నేళ్ల తన వృత్తిలో ఏ రోజూ వేటు తప్పింది లేదు. పైకి చూశాడు... మర్రిచెట్టు ఊడ... నేలకు దిగి చెట్టుకు ఆసరాగా నిలవాల్సిన ఊడ... మధ్యలోనే ఎండిపోతా కనిపించింది.

– 15 ఏప్రిల్, 2007 ఆదివారం ఆంధ్రజ్యోతి

నెత్తుటి మాన్యం

"భారతదేశం నా మాతృభూమి.

భారతీయులందరూ నా సహోదరులు.

సహోదరా... నీ కులమేమిటి?

నేను నా దేశాన్ని ప్రేమించగలను.

నిన్ను కూడా ప్రేమించగలను. యింతకీ ముందు నీ కులమేమిటో చెప్పనే లేదు!

నీ పట్ల నా ప్రేమను ప్రకటించుటకు నిన్ను ఆలింగనం చేసుకొని ఆప్యాయంగా నాలోని ఆత్మీయతను చాటి చెప్పడానికి చేతులు రావడం లేదెందుకు... గురూ!

ఓ భారత భాగ్యవిధాత...

పంజాబు, సింధు, గుజరాత, మరాఠా, ద్రావిడ, ఉత్కల, వంగ... ఎక్కడికైనా వెళ్ళు ఈ కులం వెంటాడుతూనే వుంటుంది... మహానుభావుడా!

వింధ్య, హిమాచల, యమునా, గంగలు ఎంతో పవిత్రంగా ప్రవహించే ఈ పుణ్యభూమిలో కాశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా కులం సజీవంగా, సవ్యంగా ప్రవహిస్తూనే వుంది సోదరా..."

– పద్మాకర్ ప్రసంగం ప్రజ్వరిల్లుతూ జనాన్ని రెచ్చగొడుతూ మొదలైంది.

అది ఒక కులసభ.

నగరం నడిబొడ్డున స్టేడియం అదే వర్గకులం జనంతో నిండి వుంది. పద్మాకర్ కుల సంఘం పోరాట సమితి నాయకుడు. జనంలో అతడికి మంచి పేరుంది. నిదురించిన చైతన్యాన్ని రగిలించే జ్వాలతో ఉత్తేజితుల్ని చేస్తూ మొదలైన ఆ ప్రసంగం తమ హక్కులను, తమకు రాజకీయంగా, ఆర్థికంగా దక్కాల్సిన వాటాలను గణాంక వివరాలతో సహా ప్రస్తావిస్తూ ఘాటుగా సాగిపోతోంది. మధ్యమధ్యలో చప్పట్లు ఉత్తేజభరితంగా మార్మోగుతున్నాయి.

అదే స్టేడియంలో కుడివైపున ప్రవేశద్వారం దగ్గర ఏర్పాటు చేసిన చెత్తకుండీ దగ్గర ఇరుకిరుకుగా జనం మధ్యలో కూర్చొని చప్పట్లు కొడుతున్నాడే అతడి పేరు శరభయ్య. ఐదొందల కిలోమీటర్ల దూరంలో వుండే మీదిపెంట్ల గ్రామం పరిధిలోని వీరాపురంపల్లె నుంచి వచ్చాడు. మాసిపోయి ఎర్రమట్టి దుమ్ము కొట్టుకపోయి నలిగినలిగి అతడి చేతిలో చిక్కుకొని వుంది ఓ అర్జీ. ఆ కాగితాన్ని పద్మాకర్‌కు అందజేయాలనే

ఆశ అతడి కళ్ళల్లో కన్పిస్తా వుండాది. ఇంత జనాన్ని దాటుకొని వెళ్ళడమే కష్టంగా వుంది. సగం తాగి చెవిపై సందులో దాచుకున్న ఎర్రదారం బీడీని అపురూపంగా బయటకు తీసి మరోసారి వెలిగించాడు శరభయ్య. దమ్ము గట్టిగా పీల్చి పొగను రింగులు రింగులుగా గాల్లోకి విడిచాడు. పల్లె నుంచి బయలుదేరి వచ్చి ఇవాళ్టికి మూడోరోజు. అక్కడ్నుంచి లారీలో పిల్చుకొచ్చారు. వచ్చేటప్పుడు ఇలాంటి కుల బహిరంగ సభలకు అనుమతించమని చెప్పి కర్నూలు దగ్గర పోలీసులు అడ్డగించి అరెస్టులు చేశారు. అక్కడే పోలీస్‌స్టేషన్ దగ్గరే ఒకరాత్రి గడిచిపోయింది. భోజనం లేదు. కంటినిండా నిద్రలేదు. తెల్లారింతర్వాత ఆరోజు పేపర్లో సభకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెల్లడించడంతో పోలీసులు విడిచిపెట్టారు. అదీ మనిషికి యాభై రూపాయల లెఖ్కన దండుకొని!

మార్గమధ్యలో రెండుసార్లు ప్రమాదాలు తప్పాయి. లేకుంటే లారీ బోల్తా పడేదే. ఏది ఏమైతేనేం రాజధాని శివారు ప్రాంతంలోకి వచ్చి లారీ ఆగింది.

'హమ్మయ్య' అని అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొంతసేపు గడిచిన తర్వాత కొందరు చోటా, మోటా కుల నాయకులు అక్కడికొచ్చారు. వచ్చిన జనాన్ని పలకరించారు. బ్యానర్లు అందించారు. నినాదాలు పలికించడం ప్రాక్టీసు చేయించారు. 'జై', 'డౌన్ డౌన్' మాటలు ఎప్పుడు చెప్పాలో చేతి వేళ్ళ కదలికలను బట్టి గమనించాలని సూచనలు కూడా ఇచ్చారు. మధ్యాహ్నంకు భోజన ప్యాకెట్లు ఇచ్చారు. ఆకలి మీదుండడంతో అవి పాడైపోయి వున్నా, పురుగులు అక్కడక్కడా కన్పించినా పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఆ తర్వాత ఒకవిధమైన వాసనొస్తున్న మంచినీళ్ళ ప్యాకెట్లతో కడుపు నింపుకొని అక్కడక్కడ వున్న చెట్ల కింద జనం సేదతీరారు. అటువైపున్న దారి వెంబడి రెండు జీపులు రావడం చూసి పోలీసులు వస్తున్నారనుకొని పారిపోవడానికి కొందరు సిద్ధపడ్డారు. ఇంకొందరు ఎందుకొచ్చిన సమస్య అని తమకు టౌన్లో తెల్సినోళ్ళు వుండారని జెప్పి ఎటో వెళ్ళిపోయారు. మరికొందరు పేకాట ఆడుకుంటూ వచ్చినవాళ్ళ జేబులను కొల్లగొట్టే పని మొదలుపెట్టారు. శరభయ్య మాత్రం లారీ దిగలేదు. తన చేతి సంచికి కాపలాగా అక్కడే వుండిపోయాడు. మరోసారి సంచిలోని అర్జీని తడిమి చూసుకున్నాడు. ప్రాణానికి ప్రశాంతంగా వుంది. నిమ్మళంగా కుదుటపడ్డాడు.

ఎలాగైనా తమ కుల సంఘపోరాట నాయకుడు పద్మాకర్‌ను కలవాలి. తన గోడు వెల్లబోసుకోవాలి. తన కష్టాలు చెప్పుకోవాలి. తమకు న్యాయం జరిగే వరకూ ప్రభుత్వంతో పోరాటం చేయాలని వేడుకోవాలి... తన లక్ష్యం అదే!

ఎక్కడెక్కడినుంచో తండోపతండాలుగా బ్యానర్లు కట్టుకొని, నినాదాలు చేసుకుంటూ తరలివస్తున్న జనాన్ని చూసి ప్రాణం ఉస్సూరుమంది. ఉత్సాహమంతా నీరుకారుతోంది. కలవడం కుదురుతుందా... లేదా... అనే దిగులు పట్టుకుంది. ఆలోచిస్తూ ఆలోచిస్తూనే ఆ దిగులుతోనే మదనపడుతూ మీటింగ్ జరిగే స్టేడియానికి చేరుకున్నాడు.

అప్పటికే జనం... జనం... సభాస్థలి నిండిపోయి వుంది. తనకు చోటెక్కడ? చోటు... చోటు... చోటు కావాలి! అదిగో ఆ మూల, చివరాకర్న... చెత్తకుండీలు పెట్టిన చోట కాస్త చోటుంది... త్వరత్వరగా వెళ్ళాలి... లేకుంటే అక్కడ కూడా కబ్జా జరిగిపోతుంది... తోసుకుంటా, పడ్తా లేస్తా యిప్పుడు కూర్చున్న చోటుకు చేరుకున్నాడు.

శరభయ్య నోట్లో ఎఱ్ఱదారం బీడీ పొగలు విరజిమ్ముతా వుండాది. వేదిక పైన పద్మాకర్ ప్రసంగం కూడా అలాగే...

–శరభయ్య కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. తనకు తన ఊరు గుర్తుకొస్తోంది. తన మనుషులు గుర్తుకొస్తున్నారు. బండ సేద్యాన్ని మొండికిలాగే కోడెలు గుర్తుకొస్తున్నాయి. రావిచెట్టు గుర్తుకొస్తోంది...

❋❋❋

రావిచెట్టు కొమ్మలు గలగలా ఊగుతా వుండాయి. తొలిపొద్దు ఎండపడి ఆకులన్నీ తళతళా మెరుస్తా వుండాయి. మానుకొమ్మలు ఊగుతా ఊగతా అప్పుడప్పుడూ నేలపైకి వాలి భూమి తల్లిని ప్రేమగా ముద్దాడతా వుండాయి.

ఒక కంట్లో సూర్య భగవానుడ్ని మరో నేత్రంలో చంద్రబింబాన్ని చెక్కిన వీరగల్లు వొకటి ఆ చెట్టు నీడలోని అరుగుకు ఆనుకొని నింపాదిగా వుండాది.

పన్నెండెకరాల పొలం రైతు శరభయ్య. ఎప్పటినుంచో వ్యవసాయాన్నే నమ్ముకొని బతికే కుటుంబం. అబ్బల కాలంలో కాలుమీద కాలేసుకొని మీసాలు దువ్వుకుంటా బతికినోళ్ళు. ఇప్పుడు శరభయ్య హయాంకు వచ్చేకాడికి నేల పండడం ఆగిపోయి ఎండడం మొదలెట్టింది. ఎండిపోతా వుంది... పంట... పచ్చని పంట... మంట... కడుపు మంట... అనుకుంటే గుండెలో శూలం దిగినట్లు వుంటాది. పంట బాగా పండడం అంటే ఏడాదికి సరిపడ గింజలు గాదెలోకి చేరడం. అమ్మకానికి పంట పండక యేండ్లు అవుతా వుండాది. దీనికి తోడు యిప్పుడు మరో శరాఘాతం...

చెట్టును నమ్ముకొని గూడు కట్టుకుంటున్న పక్షి వైపే కళ్ళార్పకుండా చూస్తున్నాడు శరభయ్య. మరి తను నమ్ముకున్న నేల... దానిపై అపురూపంగా

నిర్మించుకున్న నాలుగు గోడల గూడు... ఏమౌతోంది... తనిల్లు సంగతి గుర్తుకురాగానే మనసంతా దిగులు మబ్బులు కమ్ముకున్నాయి.

ఇప్పుడు నడుస్తా వుండేది కలవరకాలం. కాని కాలం. కల్లోల కాలం. కాకుంటే ఏంది? తాను కూడా ఎంత నమ్మకంగా నేలను నమ్ముకున్నాడు. ఎన్ని తరాలుగా ఈ నేల తల్లి ఒడిలోనే జీవనం సాగిస్తా వుండాడు... ఈ గాలి, ఈ నేల, ఈ ఊరు... యిప్పటికిప్పుడు ఖాళీ చేసి పొమ్మంటే ఎలా వుంటుంది?

అందుకే ఊరిప్పుడు ఊరులాగా లేదు. ఊర్లో మూడో తుఫాను హెచ్చరిక ఎగురేసినట్లు నిన్న కలెక్టర్ దొరవారు వేయించిన దండోర అందరి గుండెల్లో పిడుగుపాటైంది...

'ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా వేముల మండలంలోని వేల్పుల, మీదిపెంట్ల రెవిన్యూ గ్రామాల పరిధిలో యురేనియం ఖనిజం పడింది కావున ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈ జాగాలోని వాళ్ళందరూ ఖాళీ చేసి వెళ్ళిపోవాలని కలెక్టర్‌గారు ఆదేశించారహో... భూములు పోయినోళ్ళందరికి ఉద్యోగాలు గూడా ఇస్తారహో...' దండోర సాంబయ్య చేతిలోని తప్పెట దడదడలాడతా మోగింది.

దండోరా వేసి రెండు రోజులు దాటిపోయినా ఆ శబ్దం మాత్రం యింకా ఊరి జనం గుండెల్లో ప్రతిధ్వనిస్తానే వుంది. అందరిలోనూ ఒకే కలవరం... కలకలం... కల్లోలం... నమ్ముకున్న నేలను వదిలి వెళ్ళాలా?

మరి ఈ మట్టిబంధం...

❋❋❋

మట్టి...

మట్టిని నమ్ముకున్న బతుకులు... మట్టిమనుషులు...

యిప్పుడు తెగిపోతోంది ఈ మట్టిబంధం...

రావిచెట్టు రాతికట్ట దగ్గర పాడుబడ్డ బసవేశ్వరుడి దేవళానికి ముందు పాతిన రాయలకాలం నాటి వీరగల్లు... యుద్ధవీరుడు అశ్వారూఢుడై ఈటే, ఖడ్గాలను ధరించిన బొమ్మ... క్రింది భాగంలో అతని చేతిలో మరణించిన వారి శవాల బొమ్మలు... వీటన్నిటికి పైన వీరుడు స్వర్గానికి వెళ్తున్నట్లు మూడు అంతస్తులుగా చెక్కబడిన వీరగల్లు... ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ శిథిలం కాకుండా మిగిలిన ఆధారం, దాని పక్కనే మరో పత్ర సంబంధ శాసనమొకటి...

రాయల కాలంలో గంజికుంట సీమలో జరిగిన పోరాటంలో పాల్గొన్న సగిలేటి నరసింహుడు వీరోచితమైన నైపుణ్యం చూపి పరాక్రమంతో రాయుడికి గెలుపు అందజేసి ప్రాణాలు విడిచినాడు. ఈ ఊరి నేలంతా నెత్తుటి పట్టుమాన్యంగా వంశపారంపర్యంగా అనుభవించే హక్కును సగిలేటి వంశస్థులకే అందజేస్తూ పత్ర సంబంధ శాసనం ఇది...

వీరుడి స్మృతికి విరాళంగా వచ్చిన నెత్తుటిపట్టు మాన్యం... నెత్తుటిమాన్యం... యిప్పుడు యురేనియం పోటు తగిలి విలవిలలాడ్తా వుండాది. ఒకవైపు సగిలేరు నది మరోవైపు పెన్నానది. రెండువైపులా పచ్చగా కనిపించే పెనుశిల, లంకమల అభయారణ్యాల మధ్యలో బంగారు పంటలు పండే నేల... పంటల్ని నమ్ముకొని బతికే రైతులు... గలగలా పారే కాలవలు... ఆకాశాన్ని అందుకునే కొమ్మలతో విస్తరించిన మహావృక్షాలు... మానుకొమ్మల్లో అల్లుకున్న పక్షుల గూళ్ళు... వెరిసి ఇదొక ఆకుపచ్చని ఆత్మీయలోకం. ప్రకృతితో మమేకమైన అనుబంధ ప్రపంచం. కానీ... యిక్కడికి యురేనియం దెయ్యం అడుగుపెట్టడంతో అందరి జీవితాలు అతలాకుతలమై అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రావిచెట్టు కట్టపైన పంచాయితీ జరుగుతోంది.

'ఇప్పుడేం జెయ్యాల?' అందరి దిక్కుజూస్తా ప్రశ్నించాడు గ్రామపెద్ద గురవయ్య.

'ఏందో ఒకటి జేసి మన స్థలాల్ని, మన వూరిని కాపాడుకోవాల...' జనంలోంచి ఎవరో అన్నారు.

'అదే ఏం జెయ్యాలో చెప్పండి...' మళ్ళీ రెట్టించాడు గురవయ్య.

కొంతసేపు మౌనం... నిశ్శబ్దం...

'మన ఎమ్మెల్యేని కలిసి ఈ సంగతి జెప్పి జూసిన ఆయప్పకు ఏమీ పట్టినట్లు లేదు. మాట్లాడితే ఖాళీ చేస్తే మీకు ఉపాధి దొరుకుతుంది కదా! అని గవర్నమెంటోళ్ళ మాటే మాట్లాడతా వుండాడు. ఆన్నుంచి అటేపోయి ఎం.పీ.ని గూడా కల్సినాను. ఆయన్ది అదే మాటే. నేనే టెండర్ వేస్తా వుండాను. లాభం వస్తే మనకే కదా! వ్యతిరేకంగా మాట్లాడగాకండి. ఆదాయం పోతాది అని మందలించినాడు. యింగ కలెక్టర్ ఏం జేస్తాడు? అధికార పార్టీ ప్రతినిధులతో పెట్టుకుంటే ఎక్కడికి బదిలీ చేస్తారనో భయపడ్తా వుండాడు. అందుకే 'ఖాళీ చేయాల్సిందేనని' ఒత్తిడి చేస్తా వుండాడు. 'యిప్పుడేం చేద్దాం!' యింతవరకు జరిగిన పరిణామాలను సమావేశంలో పెట్టాడు కార్యదర్శి అంకన్న.

'అయితే ఇప్పుడు మనమేం జెయ్యాల. ధర్నాలు చెయ్యాల, ర్యాలీలు చెయ్యాల, మన నిరసన ఎట్లా తెలియజెయ్యాల...' మాజీ గ్రామాధికారి ఓబన్న ఆవేశపడ్డాడు.

'ఈ సమస్య మీద జిల్లా స్థాయిలో పోరాడితే లాభం లేదు. రాష్ట్ర స్థాయిలో జరగాల్సిందే ఎక్కువుంది. మనల్ని యిప్పుడు మన కులనాయకులే రక్షించాల' ఆలోచించి చెప్పాడు గురవయ్య.

'మంచి మాట చెప్పినావు. మన కుల నాయకుడు పద్మాకర్‌కు రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు అందరితో పరిచయాలుండాయి. దిన్నం పేపర్లలో ఫొటోలు చూస్తానే వుండాం కదా! ఆయప్పను పట్టుకుంటేనే మనకు న్యాయం జరిగేది...' అన్ని విషయాలు తనకే తెల్సినట్లు చెప్పినాడు గోపాలుమామ.

'సరే మనలో అంతో ఇంతో బాగా సదువుకున్న ఆ శరభయ్యతో పాటూ ఇంగో నలుగురైదుగురు రేపు వారంలో హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు పోయి కాయితం యిచ్చి రాపోండి...' చెప్పినాడు గురవయ్య.

అట్లా ముగిసింది పంచాయితీ.

ఆ తర్వాత అన్నీ చకచక జరిగిపోయినాయి.

ఇదిగో ఇప్పుడిట్లా నోట్లో ఎర్రదారం బీడీ వెలిగించి పొగలు వదులుకుంటా కూర్చోవాల్సి వచ్చింది శరభయ్య.

ఏం జెయ్యాలో అర్థం కాలేదు.

జనం తోసుకుంటా వుండారు. అటువైపున కాగితాలు రాసుకుంటా వుండే కార్యకర్త దెగ్గరికి పోయి పద్మాకర్ ఇంటి అడ్రస్ రాయించుకొని గొప్ప విజయం సాధించినోడిలా మీసం దువ్వుకున్నాడు.

మరుసటిరోజు మిట్టమధ్యాహ్నంకు బంజారాహిల్స్‌లో వున్న పద్మాకర్ ఇంటిని గుర్తుపట్టి చేరుకోగలిగాడు శరభయ్య.

అంత పెద్ద ఖరీదైన అందమైన భవంతి, దాని కారిడార్లో రెండుమూడు కార్లు, స్విమ్మింగ్‌పూల్ ఇవన్నీ గోడ కివతలనుండే చూసి తమ కులంలోని ఒక వ్యక్తి ఇంత ఎత్తుకు ఎదిగినందుకు మనసులో లోలోపలే మురిసిపోయాడు.

కానీ లోపలికి వెళ్ళబోతున్న శరభయ్యను వాచ్‌మెన్ ఆపాడు.

తను ఎక్కడి నుంచి వచ్చింది, ఎందుకోసం వచ్చింది, అర్జీతో సహా చూపించి వివరించినప్పటికి ప్రయోజనం లేకపోయింది.

'మీ పరిస్థితి అర్థమైంది. మీరొక విషయం గమనించాలి. అయ్యగారు ఇంటి దగ్గర ఎవర్నీ కలవరు. ఎవరి సమస్యలు వినరు. ఇది అమ్మగారి ఆదేశం. మీరిక్కడినుంచి వెళ్ళిపోతే మంచిది. లేదంటే అలగాజనాన్ని గేటు దగ్గర ఎందుకు నిలబెట్టావంటూ అమ్మగారు మాపైన మండిపడతారు' అని తన సంగతి వాచ్‌మెన్ వివరించాడు.

'అలగాజనం' అనే మాట వినగానే శరభయ్య నెత్తిన పిడుగు పడ్డట్టు అయ్యింది.

తమ కులంలోని ఒక వ్యక్తి యింత ఉన్నత స్థాయికి ఎదిగినందుకు సంతోషించాలో, అంత స్థితిలో వుండి కూడా సాటి మనుషులపై యింత దారుణంగా వివక్ష చూపుతున్నందుకు బాధపడాలో శరభయ్యకు అర్థం కాలేదు.

గొంతు తడారిపోయింది.

'నీళ్ళు' కావాలన్నట్లు విన్నవించుకున్నాడు.

సరే గోడకు అటువైపు చివర్న నిలబడు తెస్తానని చెప్పి లోపలికెళ్ళిన వాచ్‌మెన్ చిన్న సత్తు చెంబుతో నీళ్ళు తీసుకొచ్చాడు. చేయి చాపితే – చెంబు ఇవ్వడం కుదరదని చెప్పాడు. అలా ఇస్తే అమ్మగారు తిడుతారని రెండు చేతులు జతచేసి దోసిలి పడితే చెంబు పై నుంచి ఎత్తి నీళ్ళు పోశాడు. నిజంగా అయితే శరభయ్య నీళ్ళు అలా తాగడానికి ఒప్పుకునేవాడు కాదు. కానీ గొంతు ఎండిపోతోంది. తప్పని పరిస్థితి. తప్పని స్థితి. 'పోనీ సాయంత్రం వరకు ఎదురుచూస్తే అయినా అయ్యగారిని కలువనిస్తారా!' మళ్ళీ ఏదో ఆశతో అడిగాడు.

'ఇంటి దగ్గర కుదరదని చెప్తే నీక్కాదు... మీ సమస్యలు ఏవైనా వుంటే ఆ సభల దగ్గరే చూస్కోవాల, ఇంటి దగ్గరకు రావద్దు...' కొంచెం కోపంగానే చెప్పాడు వాచ్‌మెన్.

మధ్యలో రెండు కార్లు వస్తే లోపలికి గేట్ తెరిచి సెల్యూట్ చేసి వినమ్రంగా పంపించాడు.

నిర్ఘాంతపోయి అలాగే చూస్తుండిపోయాడు శరభయ్య.

'ఇక్కడ వుండొద్దు... అదిగో అటువైపు దారి ప్రక్కన ఒంటేపమానుంది చూడు. అక్కడుండండి ఒకవేళ అయ్యగారు బయటకెళ్ళేటప్పుడు మీరు కన్పిస్తే పలుకరించవచ్చు' – తనకు తోచిన సలహా ఒకటి ఇచ్చాడు వాచ్‌మెన్.

చిన్నగా కాళ్ళీడ్చుకుంటూ ఆ ఒంటేపమాను నీడలోకి చేరుకున్నాడు.

అక్కడ తనలాగే మరో నలుగురు మాసిపోయిన శరీరాలతో కూలబడి వుండారు. వాళ్ళు కూడా వివిధ ప్రాంతాల నుంచి పద్మాకర్‌ను కలవడం కోసం వచ్చిన వాళ్లని తెలియగానే గుండెనెవరో పిండేసినట్లు అన్పించింది.

తనని కలవడం కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చిన మనుషులను కనీసం ఇంట్లోకి కూడా రానీయకుండా ఇంటికి దూరంగా చెట్లకింద నిరీక్షింప చేస్తున్న కులనాయకులు... తమ అవసరం కోసం అయితే వూరి వాడల్లోకి రావడం, పేపరోళ్ళకు ఫొటోలు ఇవ్వడం కోసం సహపంక్తి భోజనాలకు కూర్చోవడం, చీమిడి ముక్కుతో వున్న పిల్లల్ని ఎత్తుకొని ముద్దాడడం అన్నీ ఒక్కొక్కటిగా శరభయ్యకు గుర్తురాసాగాయి... ఇట్లాటి కులనాయకులనా తాము అభిమానిస్తుంది? అని ప్రశ్నించుకున్నాడు. లోలోపలే తిట్టుకున్నాడు. అదే చెట్టు కింద నీడలో వున్నవాళ్ళతో మాటల్లోకి దిగాడు.

తంగెడుపల్లె నుంచి వచ్చిన లక్షుమమ్మ తన కూతుర్ని మాధవరెడ్డిగారి తోటలో అత్యాచారం చేసిన వాళ్ళను అరెస్ట్ చేయించాలని కోరుతూ రాసుకొచ్చిన అర్జీ చూపించింది. ఆ పిల్లను కూడా తన వెంటే పిల్చుకొచ్చింది. ఆ పాప లేతప్రాయం చూస్తే ఆ కొడుకుల్ని నిలువుకు నరకాలనిపించింది శరభయ్యకు. కొండాపురం కాన్నుంచి వచ్చిన కొమరయ్య తన భూమిని పెద్దిరెడ్డి రాత్రికి రాత్రి నెంబర్ల రాళ్ళు మార్చి ఎట్లా ఆక్రమించుకుంటా వస్తున్నాడో విన్నవించుకుంటూ అర్జీ రాసుకొచ్చాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటా వుండగానే సాయంత్రం పూట పద్మాకర్ ఇంటిగేట్ తెరుచుకొని తెల్లటి పడవ కారొకటి చెట్టు దగ్గరికొచ్చి ఆగింది. కారు విండో తెరుచుకుంది. అందరూ పరుగుపెట్టా దాని చుట్టూ మూగారు.

చెదిరిన జుట్టు, పెరిగిన గెడ్డం, చిరిగిన ప్యాంటు, తెగిపోయిన చెప్పుకు పిన్నీసుతో కూర్పు, ఆగకుండా, అక్షరదోషాలు లేకుండా అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడుతూ తన చేతిలోని సర్టిఫికెట్స్ చూపిస్తున్న ఇరవై నాలుగేళ్ళ కుర్రాడి వైపు జాలిగా చూస్తూ అడిగాడు పద్మాకర్ '... సరేబాబూ... నీ కులమేది?'.

ఆ కుర్రాడు ఏదో చెప్పాడు. పద్మాకర్ ముఖంలో రంగులు మారాయి.

'మా కులమోళ్ళకే న్యాయం చేయలేకపోతున్నాం. యిక వేరే కులమోళ్ళకు ఎక్కడ హెల్ప్ చేయగలం? సారీ...' జవాబిచ్చాడు.

మావైపు చూసి 'ఈ రోడ్డు ప్రక్కనే వున్న గ్రౌండ్‌లో మన కులసభ యింకోటి జరుగుతోంది. అక్కడికి రండి...' అని చెప్పి కారు స్పీడుగా వెళ్ళిపోయింది.

కాళ్ళీడ్చుకుంటూ గ్రౌండ్ వైపు మిగతా వాళ్ళతో పాటూ శరభయ్య కదిలాడు.

పద్మాకర్ ప్రసంగం జోరుగా సాగిపోతోంది...

"రాజుల వీపులకు పుట్టాల్సిన రాచపుండ్లు రాజులు పోయాక, రాజ్యాలు పోయాక రాజకీయంగా తయారయ్యాయి. ఏ లేపనాలకు తగ్గని దశలో ఏ ఔషధాలకు తలొంచని దశలో పెరగడమే గానీ తరగని ఒకే దశలో ఎన్నిసార్లు తలనరికినా పుట్టుకొస్తున్న ఒంటికొమ్ము రాక్షసుడిలా ఎన్నెన్నో రూపాల్లో రాచపుండ్లు మొల్చుకొస్తూనే వున్నాయి" పద్మాకర్ ప్రసంగం ఆవేశభరితంగానూ, ఉద్రేకంగానూ మాటలే తూటాలుగా పేలుతూనే వుంది.

శరభయ్యకు పరిస్థితి అర్థమైంది. బయలుదేరాడు. ఊర్లో యురేనియం... నెత్తుటిమాన్యం... నాయకుల టెండర్లు... కులనాయకుని వివక్ష... ఒక మొండికత్తి... ఒక కుంటిగుర్రంతో పోరాటం.. ఒంటికొమ్ము రాక్షసుడు... వెనక్కి తిరిగి చూశాడు. ప్రసంగిస్తున్న పద్మాకర్ సరిగ్గా రాక్షసుడిగానే కన్పించాడు.

"మీరందరూ అండగా వుండండి... ప్రభుత్వాన్ని కదిలిస్తాను... మనకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తాను. నిన్న రాత్రే అధికార పార్టీ ప్రతినిధి మనతో చర్చలకు వచ్చాడు. రాజ్యసభ సీటు మన కులానికి ఇస్తున్నారు. యిక నుంచి మన సమస్యలను పార్లమెంట్‌లో లేవదీస్తాను. జాతీయ స్థాయిలో చర్చకు పెడతాను. నేను మీ వాడిని. మీకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి అయినా సరే నా ఇంటి గేటు తెరిచే వుంటుంది. రండి... నేను మీవాడిని..." పద్మాకర్ ప్రసంగం సముద్ర కెరటంలా పోటెత్తుతోంది.

శరభయ్యకు బంజారాహిల్స్‌లో పద్మాకర్ ఇంటికి 'కుక్కలున్నాయి జాగ్రత్త' అనే బోర్డు తగిలించి వుండడం గుర్తుకొచ్చింది.

వెనక్కి తిరిగి చూశాడు.

పద్మాకర్ కుక్కలా 'భౌ భౌ'మంటూ కన్పించాడు. ప్రసంగానికి జనం చప్పట్లు మ్రోగుతూనే వున్నాయి.

పిచ్చి జనం... నిజాలు తెలియని జనం... ఎక్కడో లేదు వివక్ష... కుల నిర్మూలన పోరాటం చేసే నాయకుల మధ్యే వుంది వివక్ష... వీళ్ళెందుకు పోరాటం చేస్తున్నారు? రాజకీయ పదవుల కోసం!

వెనక్కి తిరిగి చూడ్డానికి కూడా శరభయ్యకు మనసొప్పలేదు.

చేతిలోని అర్జీ ముక్కలు ముక్కలుగా చింపి గాల్లోకి విసిరేశాడు. యింకెప్పుడూ బుద్ధి వుంటే కులసంఘం నాయకులను నమ్మకూడదని నిర్ణయానికి వచ్చాడు.

మరో రెండడుగులు ముందుకు వేశాడో లేదో చెప్పు తెగిపోయింది. 'దీన్నేం చేయాలి?' – ఒక ప్రశ్న.

'పద్మాకర్ ప్రసంగానికి నిరసనగా విసిరేయాలి'– మనసు యిచ్చిన తీర్పు.

ఆలస్యం జరగలేదు. గ్రౌండ్ చివరి గోడ ప్రక్కకు వెళ్ళగానే చేతిలోకి బలాన్ని అంతా గుంజుకొని వేదిక వైపుకి విసిరేశాడు.

కొంత సంతృప్తి. కొంత చల్లారిన కసి. యింకో చెప్పు తనని కూడా ఉపయోగించుకోమన్నట్లు తనవైపే చూస్తోంది.

మరోసారి ఇంకో క్షిపణి లేచింది వేదిక దిశగా.

'ఇది వేరే కులం వారి కుట్ర. మనం ఎదగడం వారికిష్టం లేదు. అందుకే గోడ వెనుక నుంచి ఇంతటి దారుణాలు చేస్తున్నారు' – పద్మాకర్ ఆగ్రహం వెల్లగక్కుతున్నాడు మైక్‌లో.

శరభయ్య రెండు చెప్పులు మాత్రమే విసిరాడు. కానీ ఆడవాళ్ళు కూర్చున్న వైపు నుంచి మరో రెండు క్షిపణులు పైకి లేచాయి.

అవును... అవి అచ్చం తంగెడుపల్లి నుంచి వచ్చిన లక్ష్మమ్మవిలాగానే వున్నాయి.

మరో రెండు క్షిపణులు...

అవును... అవి మాధవరెడ్డిగారి తోటలో అత్యాచారానికి గురైన అమ్మాయివి లాగానే వున్నాయి...

మరో రెండు క్షిపణులు...

తెగిపోయిన చెప్పుకు పిన్నీసు కూడా కన్పిస్తుందే అయితే అది తనకు ఉద్యోగం చూపించమని కారు దగ్గర ప్రాధేయపడిన అబ్బాయి జతలాగానే వున్నాయి...

మరో రెండు పాశుపతాస్త్రాలు...

అవును... అవి కొండాపురం దగ్గర రాత్రికి రాత్రి నెంబర్ రాళ్ళను మార్చి తన భూమి ఆక్రమించుకుంటా వుండారని చెప్పుకోవడానికి వచ్చిన కొమరయ్య జతలాగానే వున్నాయి...

ఆ తర్వాత సభ జరిగిందో లేదో తెలియదు.

ఇంకా అలా క్షిపణి ప్రయోగాలు ఎంతసేపు జరిగాయో తెలియదు.

శరభయ్య అక్కడ్నుంచి సంతృప్తిగా బయలుదేరి వెళ్ళిపోయాడు.

❁❁❁

“ఏం జెప్పి సచ్చేది దేవరా! మోసపోతా ఉండాము. మళ్ళీ మళ్ళీ మోసపోతా ఉండాము. దానెమ్మ... అదేందో యురేనియం. అది మా నేలలోనే ఎందుకు పడిందో... మాకు శాపమైంది. నమ్ముకున్న మా నేలతల్లిని గుంజుకోగాకండి. మీరు ‘యురేనియం’ అంటే మాకు ‘ఉరేనియం’ అనిపిస్తా ఉండాది. మీరు మాకు ఏ మేలు చేయవద్దు. మా నేల జోలికి, మా బతుకుల జోలికి రాకుండా ఉంటే అదే చాలు! కాదంటే ఇలా రోజుకొకరం చొప్పున ఈ చెట్టుకే ఉరి పోసుకొని చస్తాం.

ఇట్లు

తమ విధేయుడు

శరభయ్య

రావిచెట్టు కొమ్మల మధ్య శరభయ్య మృతదేహం హెచ్చరికగా వెలువడుతోంది. అందరి ముఖాల్లోనూ విషాదం. కట్టమీద శరభయ్య రాసిన చివరి లేఖ గాలికి విజయకేతనంగా రెపరెపలాడుతోంది.

చెట్టు కింద పంచాయతీ మొదలైంది.

కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, ఎంపీ ఇంకొందరు చోటా మోటా రాజకీయ నాయకులంతా వచ్చారు.

మౌనం... నిశ్శబ్దం...

సర్వత్రా నిరసన... విముఖత... వ్యతిరేకత...

అంతే!

‘స్థానిక ప్రజల నిరసన’ పేరుతో కలెక్టర్ నూట యాభై రెండు పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపాడు.

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తాము యురేనియం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నట్లు రాజకీయ పార్టీలు ప్రకటించాయి.

ఆ తర్వాత ఎప్పుడూ ప్రభుత్వం అక్కడ యురేనియం మాట ఎత్తలేదు.

❀❀❀

రావిచెట్టు కొమ్మలు గలగలా ఊగుతా వుండాయి. తొలి పొద్దు ఎండపడి ఆకులన్నీ తళతళా మెరుస్తా వుండాయి. మానుకొమ్మలు ఊగుతా ఊగుతా అప్పుడప్పుడూ నేల తల్లిని ప్రేమగా ముద్దాడతా వుండాయి. కట్టకు ఆనుకొని వుండే వీరగల్లు నెత్తుటి మాన్యానికి కాపలా కాస్తున్నట్లు ఉండాది.

– మార్చి, 2007 విపుల కథా పురస్కారంలో బహుమతి పొందిన కథ

వానరాయుడి పాట

"ఉత్తరాన ఒక వాన ఉరిమి కురవాల
దక్షిణాన ఒక వాన దాగి కురవాల
పడమరా ఒక వాన పట్టి కురవాల
తూర్పున ఒక వాన తుళ్ళి కురవాల..."

పాట సాగిపోతా వుండాది. పాట ప్రవహిస్తా వుండాది. పాట పరవళ్లు తొక్కుతా వుండాది. పాట పరవశిస్తా ఆడతా వుండాది.

తెల్లటి ఆకాశం మీద నల్లటి మోడాలు కమ్ముకుంటా వుండాయి. మోడాలు మోడాలు పెనవేసుకొని అల్లుకపోతా వుండాయి. ఒకదానికొకటి చేతులు పట్టుకొని కదలి వస్తా వుండాయి. కదలి... కదలి... పాట ప్రవాహానికి కదలి వస్తా వుండాయి. పాటకు తలాడిస్తా పచ్చని వరిపైరు వయ్యారాలు పోతా వుంది. కర్రి మోడాలు కదలి వస్తా కరిగి పోవడానికి సిద్ధపడ్తా వుండాయి.

ఉరుము ఉరిమింది. మెరుపు మెరిసింది. కురిసింది ఒక వాన... ఈదురు గాలికి కట్ట మీద కానుగ చెట్ల కొమ్మలల్లాడతా వుండాయి. ఆగని పాట సాగుతూనే వుంది. యాన్నుంచి వస్తా వుంది ఆ పాట? ఎవరు పాడ్తా వుండారబ్బా!

చినుకులు కురుస్తాండయి. మేఘాలు హృదయాల్ని తెరిచి చినుకు ధారల్ని కురిపిస్తా వుండాయి. నేలంతా నోరు తెరచుకొని దాహం తీర్చుకుంటా వుంది. గాలికి వూగుతా వుండే వరికంకులు తడుస్తా వుండాయి. మురుస్తా వుండాయి. స్నానమాడతా వుండాయి. తమకంతో తడిసి ముద్దయిపోతా వుండాయి. మోడాల నీడల కింద నిబ్బరంగా శ్వాసను స్వప్నిస్తూ పచ్చని విశ్వరూపాన్ని చూపిస్తా ఎదిగిన పైరు శిరస్సు వంచి నమస్కరిస్తోంది... చినుకుల రాకకు!

పాట... వాన పాట... వానరాయుడి పాట... వానను కురిపిస్తా వుండాది. కమ్ముకొచ్చిన మేఘాలు పంటకు ప్రాణం పోస్తా వుండాయి.

ఊరికి ఉత్తరాన దారికి దక్షిణాన ఏనుగు కొండ బండపై నుంచి ఆకాశానికేసి చూస్తా పాట పాడ్తా వుండాడే అతని పేరే కాటమ రాయుడు. అందరూ అసలు పేరు వదిలేసి వానరాయుడని పిలుస్తారు ఆత్మీయంగా. దిగడాల నల్లరేగడి భూమిలో తలెత్తుకొని గర్వంగా ఎదిగి నవ్వుతా వుండే వరి కంకుల పంట అతడిదే.

నాలుగు కాండ్ల ఎడ్లతో దుక్కిదున్ని నేలను సాగు చేస్తాడు. నాట్లు ఏస్తాడు. కలుపు తీస్తాడు. ఒక్కడిదే శ్రమ. వరి కంకులు గుత్తులు గుత్తులుగా మొల్చుకొస్తాయి. నీళ్లు పెట్టాల్సిన ఘడియ రాగానే రాగమెత్తుకుంటాడు. పాట అందుకుంటాడు. గాలికి ఊపిరిపోసి గానం చేస్తాడు.

కదుల్తా మేఘాలు తన్మయత్వంగా కదిలి వస్తాయి. వరి కంకులపైన మోడాలు నీడలు పడ్తాయి. ఘడియ ఘడియకు స్పందిస్తాయి. వానరాయుడి వరికంకులకు గువ్వలు కాపలా కాస్తాయి. ఆ పాటలోని పరవశమది. అతడి అంతరాత్మలోని భావానికి పల్లవది.

❁❁❁

పడమటి దేశం రాజు హిరణ్యుడు. బంగారు రంగు గుర్రమెక్కి, వెండి కళ్లెం చేతబట్టి దేశాటనం బయలుదేరినాడు. రాజ్యాలన్నీ తిరుగుతా విశేషాలన్నీ తెలుసుకుంటా పోతా వుండాడు. ఈ యాత్ర మొదలయ్యి ఏడాది దాటిపోయింది. ఎంతో భూమి తిరిగాడు. ఎక్కడ చూసినా కరువు. ఎండిపోయిన భూములు, చెరువులు, కాల్వలు, బావులు, పంటలు, కరువు మంటలు, గుండె కోతలు. బోరుబోరున విలపిస్తున్న రైతులు. తినడానికి తిండిలేక నకనకలాడుతాండే ప్రజలు, పశువులు.

చినుకు లేదు, వాన లేదు, తడి లేదు. రాజ్యాలన్నీ కరువుతో అల్లాడిపోతా వుండాయి. ఎకరాలు ఎకరాలు తమ గుప్పిట్లో పెట్టుకొని మీసం మెలేసి బతికే భూస్వాములు కూడా కరువు దెబ్బకు విలవిలలాడ్తా వుండారు. రాజ్యమంతా కంపచెట్లు పుట్టుకొస్తా వుండాయి. ఒకప్పుడు వజ్ర వైఢూర్యాలు రత్నాలు రాశులు పోసి అమ్మిన పురవీధులు నిర్మానుష్యంగా జీవం కోల్పోయి కన్పిస్తా వుండాయి. హిరణ్యుడి చివరి యాత్ర ముగిసింది. ఇంటి దారి పట్టినాడు.

తిరిగీ పడమటి రాజ్యంలోకి ప్రవేశిస్తా వుండేటప్పుడు... అప్పుడు కన్పించింది ఆకాశంలో అద్భుతం. తెల్లటి ఆకాశంలో నల్లటి మోడం ఒకటి కదలిపోతా... పోతా వుండాది.

ఎక్కడికి?

తెలుసుకోవాలనే... ఆసక్తి.

యాత్ర దారి మారింది. మోడం వెనుక వెంబడిస్తా వెంట పడినాడు. కదలిపోతా వుండే మోడం వెనుక సాగిపోవడం సాధ్యం కావడం లేదు.

వూరంటే వూరు లేదు. పల్లెంటే పల్లె లేదు. పైన పోతాండే మోడం అడవి దాటుకుంది. లోయ దాటుకుంది. కొండ దాటుకుంది. పోతానే వుండాది. కింద

పోతాండే మొండిరాజు హిరణ్యుడు అడవిని, లోయను, కొండను అష్టకష్టాలు పడ్తా దాటుకుంటా పోతానే వుండాడు. గస, చమటలు, అలసి సొలసి ముందుకు సాగుతూనే వుండాడు... వెంట సైన్యంతో పాటుగా!

కాకులు దూరని కారడవి; చీమలు దూరని చిట్టడవి ఇంకొంత దూరంలో వస్తాయనగా ఆ మార్గమధ్యంలో ఊరికి ఉత్తరాన, దారికి దక్షిణాన ఎత్తైన ఏనుగు కొండ కన్పిస్తా వుండాది. చూడ్డానికి రెండు కళ్లు చాలడం లేదు. ఎత్తైన కొండ. దానిమీద బండ. బండ మీద మనిషి. మనిషి నుంచి దూసుకొస్తున్న పాట. వానరాయుడి పాట విన్పిస్తా వుండాది.

"చిత్త చిత్త వాన కురిసె
చిత్తారి వాన కురిసె
బంగారు వానలొచ్చె
పచ్చని పంటలొచ్చె
కురిసెర ఒక వాన..."

కదుల్తా వచ్చిన కర్రిమోడం ఆగింది. గాలికి ఊగుతా వుండే కొండ క్రింది వరికంకులను తడపను మోడం సిద్ధపడింది. చూస్తాండగానే చినుకులు ఎత్తుకున్నాయి. తడుస్తాంది నేల. మురుస్తాండాయి వరికంకులు. పాట... వానరాయుడి పాట... కమ్ముకున్న మోడం వానను పై నుంచి కురిపిస్తానే వుండాది.

హిరణ్యుడి చేతిలోని వెండికళ్లెం బిగుసుకుంది. బంగారు రంగు గుర్రం ఆగింది. చూస్తా వుండాడు. కల కాదు నిజం! కలవరం... కలకలం... ఎక్కడ్నుంచో మేఘమొకటి బయలుదేరి ఇక్కడికొచ్చి కురుస్తా వుండాది. ఎంత విశేషం. ఏ రాజ్యంలోనూ ఈ వింత చూసింది లేదు. ఎక్కడా వినింది లేదు. కొండ బండపై నుంచి లీలగా వానరాయుడి పాట విన్పిస్తానే వుండాది.

విన్నాడు. ఆ కంఠంలో, ఆ స్వరంలో ఎంతో మాధుర్యం. వినమ్రత. మైమరిపించే పరవశం. కట్టమీది కానుగ చెట్ల నీడలో సేద తీరాడు హిరణ్యుడు. వింతగా ఆకాశానికేసి చూస్తూనే వుండాడు. చినుకులు... చినుకులు... కురుస్తూనే వున్నాయి. కొంతసేపటి తర్వాత పాట ఆగింది. వాన నిలిచింది.

నిశ్శబ్దం... నిశ్శబ్దం...

హిరణ్యుడు ఒకే ఒక్క కేక వేశాడు.

నలుదిక్కులు ప్రతిధ్వనించేలా...

'నేను కరువును జయించాను!' అని.

❀❀❀

'ఎక్కండి... పైకి... పైపైకి... ఏనుగు కొండ శిఖరానికి... బండపైకి అక్కడే వుండాడు మనకు కావలసిన మనిషి. వాడ్ని రెక్కలిరిచి గొలుసులతో బంధించి కిందకు ఈడ్చుకరండి. మన రాజ్యమంతా కురవాల్సిన వానని వీడొక్కడే ఇక్కడ కురిపించుకుంటా వుండాడు. వీడి పాటతో మనం మన రాజ్యమంతా వర్షాలు కురిపించుకోవాలి... ఎక్కండి... పైకి... పైపైకి' ఆజ్ఞాపించాడు సైన్యాన్ని హిరణ్యుడు.

రాజు ఆజ్ఞ. దండు కదిలింది ముందుకు. నునుపైన కొండను ఎక్కడంలో అనుభవంలేని వాళ్ళంతా జారి కిందకొచ్చి పడ్తా వుండారు. ఇంకొందరు తాళ్ళ సాయంతో ఎక్కుతా వుండారు. కిందనుంచి ఈ విన్యాసాలన్నీ హిరణ్యుడు చూస్తానే వుండాడు కన్నార్పకుండా. రెండు పగల్లూ, ఒక రాత్రి గడిచిన తర్వాత సైన్యం కిందికి దిగింది. ఒక నడివయసు వ్యక్తిని గొలుసులతో కట్టి తీసుకొచ్చి హిరణ్యుడి ముందు వుంచారు.

అతడు శిరస్సు వంచి నమస్కరించాడు.

నమస్కారానికి ప్రతి నమస్కారం సంస్కారం. కానీ హిరణ్యుడు నమస్కరించలేదు. ఆ వ్యక్తిని పరీక్షగా చూశాడు.

అతడు సాదాసీదాగా వున్నాడు. ఎక్కడా పిడికెడు కండ లేదు శరీరంలో. పెద్దగాలి వస్తే ఎగిరిపోయేలా వున్నాడు. ధరించి వున్న దుస్తులు కూడా చాలా పాతవి. మనిషి నిర్మలంగా వున్నాడు. ముఖంలో ఏదో జీవకళ తొణికిసలాడతాంది.

హిరణ్యుడు ఇంకా ఏదో ఊహించాడు వున్నతంగా. అతడి ఊహలన్నీ చెదిరిపోయాయి. నవ్వు... నవ్వు వస్తోంది... ఆ వ్యక్తిని చూడగానే.

'కొండపై నుంచి పాట పాడింది నువ్వేనా?' మొదటి ప్రశ్న వేశాడు హిరణ్యుడు.

'అవును... దేవరా!'

'నీ పేరు?'

'నా పేరు కాటమరాయుడు. కానీ అందరూ వానరాయుడనే పిలుస్తారు'.

'ఏ రాజ్యం మీది?'

'తెలియదు దేవరా... ఈ ఏనుగు కొండకు అవతల ఊరికి ఉత్తరాన, దారికి దక్షిణాన వున్నామని తెలుసు అంతే!' – జవాబిస్తున్నప్పుడు అతడి కళ్ళల్లో కొత్త కాంతి. చెక్కు చెదరని ఆత్మవిశ్వాసం, వినమ్రతతో కూడిన వ్యక్తిత్వం, ఆత్మీయ వదనం.

'నీ తల్లిదండ్రులు ఎవరు?'

'నా తండ్రి ఆకాశన్న, నా తల్లి భూమమ్మ'

'ఎక్కడుంటారు వాళ్లు?'

'నా తండ్రి నన్ను దీవిస్తా పైనుంటే, నా తల్లి నన్ను కాపాడ్తా కిందుంటుంది'.

'నీ కులమేది?'

'నాది మానవకులం'

'నీ మతమేది?'

'నాది మానవమతం.'

వానరాయుడు ఇస్తున్న సమాధానాలు హిరణ్యుడికి ఏమాత్రం నచ్చడం లేదు. అసహనంగా వుంది.

'నా రాజ్యంలోకి వచ్చి నాతోనే వితండం వాదిస్తా వుండావా... నీ అంత మూర్ఖుడే యింకొకడు వుండడు. రాజసభలో నిన్ను ప్రవేశపెట్టి విచారించి ఉరితీయిస్తా. అప్పటికిగాని నీకు జ్ఞానోదయం కల్గదు...' రాజు కన్నెర్ర చేశాడు.

వానరాయుడ్ని బంధించి చీకటి చెరసాల్లో వేశారు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్లు పూర్తయ్యిన తర్వాత బయటకు తీసుకొచ్చారు. ఆ వ్యక్తి ముఖంలో ఎక్కడా దిగులు లేదు. బాధలేదు. ఎప్పటిలాగానే వుండాడు. ముఖంలో అదే జీవకళ.. అదే చిరునవ్వు. అందరికీ ఆశ్చర్యంగా వుంది.

వానరాయుడ్ని రాజసభలో ప్రవేశపెట్టారు. సభంతా ఉత్కంఠంగా చూస్తోంది.

'యిప్పటికైనా నేను అడిగిన ప్రశ్నలకు అడిగినట్లుగా సమాధానం చెప్పు... వదిలేస్తాను. లేదంటే నీకు ఉరి తప్పదు...' హెచ్చరించాడు హిరణ్యుడు.

వానరాయుడు ఏం మాట్లాడలేదు. తలొంచుకొని నిలబడి వున్నాడు.

'నీకు ఈ పాటలు ఎవరు నేర్పించారు?'

'మా తాత'

'ఆయన ఎక్కడున్నాడు'

'చనిపోయి చాలా కాలమైంది'

'నువ్వు ఎక్కడుంటావు?'

'దిగువ కొండలో'

‘దిగువకొండలో ఎవరుంటారు?’

‘పేదవారు’

‘నువ్వు రహస్యంగా శిస్తు చెల్లించకుండా పంట పండిస్తున్నదెవరి కోసం...’

‘వారి కోసమే...’

‘సామంత పాలక... వెంటనే మన సైన్యంతో వెళ్లి దిగువ కొండలోని పేదవారినందర్నీ తీసుకొచ్చి చెరసాలలో బంధించండి...’ హిరణ్యుడు కర్కశంగా ఆజ్ఞాపించాడు.

‘వద్దు... వద్దు... దేవరా! వారికే పాపం తెలియదు. పాపం పేదవాళ్లు... వారి జోలికెళ్ళవద్దు...’ వానరాయుడు ఆవేదన పడ్తా వేడుకున్నాడు.

‘వారి విషయం తర్వాత మాట్లాడదాం; నా ప్రశ్నలకు ఇలాగే సమాధానమివ్వు’ మీసాన్ని పైకి దువ్వాడు హిరణ్యుడు.

మళ్లీ ప్రశ్న...

‘రాజ్యమంతా కరువుతో అల్లాడిపోతా వుంది. రైతులంతా దుఃఖిస్తా వుండారు. వానచుక్క జాడలేదు. రాజ్యమంతా కురవాల్సిన వానల్ని నువ్వు బలవంతంగా మోడాల్ని నీ పాటతో తరలించుకొని నీ పంటపైనే కురిపించుకోవడం ఎంతవరకు న్యాయం?’– తీక్షణమైన చూపుల్తో ప్రశ్న...

‘తెలియదు దేవరా... నాకు మా తాత నేర్పిన న్యాయం ఒక్కటే. మనిషిలో మానవత్వాన్ని కాపాడుకోవాలని చెప్పేవాడు. మనిషిలో మానవీయత లోపించిన రోజున ప్రకృతి కూడా మనిషికి కనికరించదని చెప్పేవాడు. నేనూ ఆ మాటలు నమ్మలేదు. ఆయన ఆచరించి చూపాడు. నేను కేవలం దాన్ని అనుసరిస్తున్నానంతే...’ వానరాయుడి ప్రతిమాటా నమ్మకంతో విశాల ఆకాంక్షతో చెప్తున్నట్లు వుంది.

సభంతా ఆసక్తిగా వింటున్నారు. ఏం జరగబోతుందా అని చూస్తున్నారు.

‘ఆయనేం చేశాడు?’ ఆసక్తిగా ప్రశ్నించాడు హిరణ్యుడు.

‘ఏనుగు కొండ బండ చుట్టూ వున్న భూమిని సాగు చేశాడు. విత్తనం వేశాడు. బండ పైకెక్కి గొంతెత్తి వానపాటలు పాడేవాడు. అంతేగానీ ఏ క్షుద్రపూజలు చేసేవాడు కాదు. ఏ జంతుబలులు ఇచ్చేవాడు కాదు. ఏ కడవ సాంగ్యాలు లేవు. ఏ కప్పల పెళ్ళిళ్ళు చేసేవాడు కాదు. మొదట్లో పాడిపాడి అలసి కళ్లు తిరిగి పడిపోయేవాడు. కానీ తన కృషి ఆపేవాడు కాదు.

పంటను బిడ్డలా సాకేవాడు. అప్పుడప్పుడు తుంపర చినుకులు కురిసేవి. చివరాఖరికి కొంత పంట పండింది. దాన్ని నాలుగు భాగాలు చేశాడు.

ఒక భాగాన్ని వికలాంగులకు, అనారోగులకు, అనాథలకు ముఖ్యంగా గుడ్డివారికి, కుంటివారికి, వ్యాధులు-రోగాల బారిన పడినవారికి, మానసికంగా బాగోలేక పిచ్చివారిగా జీవిస్తున్న వారికోసం కేటాయించి ఉచితంగా పంచేవాడు. రెండవ భాగాన్ని ఆకలితో అలమటించే పేదవారికి, బిడ్డలచేత వెలి వేయబడిన వృద్ధులకు, వితంతువులకు, ఇల్లు విడిచి బయటకొచ్చిన పిల్లలకు, యాత్రికులకు ఉచితంగా పంచేవాడు. మూడో భాగాన్ని తన పొలానికి కాపలాగా వుండే పక్షులకు, గువ్వలకు, జీవరాశులకు, జంతువులకు, వన్య ప్రాణులకు కేటాయించేవాడు. చివరగా నాలుగో భాగాన్ని తన ఆహారం కోసం, మళ్ళీ పంట వేసుకోవడం కోసం తీసి పెట్టుకునేవాడు.

ఈ నాలుగు కేటాయింపులు ఎప్పుడూ సవ్యంగా జరిగేవి. ఈ లెఖ్ఖ ఎప్పుడూ తప్పేవాడు కాదు. దీన్ని ప్రకృతి గుర్తించింది. అప్పటి నుంచి ఎప్పుడు ఆయన పాట ఎత్తుకున్నా వాన అదే వచ్చి కురిసేది. పంట పచ్చని విశ్వరూపం చూపేది. ఇదే పద్ధతి నాకు ఆయన నేర్పాడు. ఆయన కాలంలో కలిసిపోయిన తర్వాత నేను ఆయన మార్గంలో నడుస్తున్నాను అంతే!' స్థితప్రజ్ఞంగా, స్థిమితంగా వివరంగా జవాబిచ్చాడు వానరాయుడు.

సభంతా నిశ్శబ్దంగా, నివ్వెరపోయి చూస్తూ, వింటూ వుంది.

'మరి మాకిక్కడ వర్షాలెందుకు కురవడం లేదు?' మరో ప్రశ్నను హిరణ్యుడు సంధించాడు.

'ఏం చెప్పమంటారు దేవరా! మనిషితనం యిక్కడ ఎక్కడుంది? మానవీయత ఎక్కడుంది? ప్రతివాడూ ఎదుటివాడ్ని దోచుకోవాలనుకునే వాడే. పాపాలు, మోసాలు, అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, అధర్మం, దగా, కుట్ర, కుతంత్రం వెరిసి వీటి కింద మనిషి ఎప్పుడో చచ్చిపోయాడు. వీళ్ళకు... యిలాంటి వారికి ప్రకృతి ఎందుకు సహకరిస్తుంది? అందుకే ఇక్కడ వర్షాలు కురవవు. పంటలు పండవు. ఎప్పుడూ కరువులు, కాటకాలు, విద్వేషాలు, విధ్వంసాలు, యుద్ధాలు. మనిషి వీటి మధ్యనే అంతరించి పోతున్నాడు. ఇది నిజం!'

'నేనిప్పటికి ఇరవై రెండు యుద్ధాలు చేసి తూర్పున దుర్గ కోట నుంచి పశ్చిమాన రేనాటి గడ్డ వరకు రాజ్యాలు జయించిన వాడ్ని నేను. నాకే నీవు ధర్మ అధర్మాలు, న్యాయ అన్యాయాలు నేర్పిస్తున్నావా?' హిరణ్యుడు మరోసారి మండిపడ్డాడు.

వానరాయుడు మౌనంగా నిల్చున్నాడు.

'నాకు నువ్వేం చేస్తావో తెలియదు. తెల్లారేపాటికి నా రాజ్యమంతా వాన కురవాలి. చెరువులు నిండాలి. బావులు పొర్లాలి. కాల్వలు పారాలి. నువ్వు ఏ పాట పాడ్తావో నాకు తెలీదు. నా రాజ్యమంతా వర్షాలు కురవాలి... ఇదే నా ఆజ్ఞ' హెచ్చరించాడు కోపంగా హిరణ్యుడు.

'మా తాత చెప్పిన లెఖ్క ప్రకారం మీ రాజ్యంలో పండిన పంటనంతటిని నాలుగు భాగాలుగా వాటాలేసి ఆ సిద్ధాంతాన్ని అనుసరించి చూడండి. పాపాలు, మోసాలు, అన్యాయాలు, అక్రమాలు, యుద్ధాలు వదిలేసి మనిషిని సాటి మనిషి ప్రేమించే తత్వాన్ని ఏకీకరించండి. అప్పుడు ఏమైనా ప్రకృతి మీ మాట వింటుందేమో ఎదురు చూద్దాం!' తన దగ్గర ఇంతకంటే ఇంకేం సమాధానం లేదన్నట్లు స్థిరంగా చెప్పాడు వానరాయుడు.

హిరణ్యుడులో ఆవేశం... ఆక్రోశం...

'నువ్వు చెప్తున్నదేమిటి?'

'సత్యం'

'నువ్వు చేస్తున్నదేమిటి?'

'సేవ'

'రాజ్యమంతా నీ పాటతో వాన కురిస్తే అది సేవ కాదా!'

'ఆ విషయం నా చేతుల్లో లేనిది'

'ఇప్పుడేం చేయమంటావు?'

'నన్ను నా ప్రదేశానికి పంపండి. నా బతుకు నేను బతుక్కుంటాను. నాకు సంతృప్తి నిచ్చేలా జీవిస్తాను'.

'అది కుదరదు. నిన్ను విడిచిపెట్టను.'

'అయితే మీ ఇష్టం'

హిరణ్యుడి కళ్లు ఎర్రబడ్డాయి. రాజాజ్ఞను ధిక్కరిస్తావా అనే కసి కన్పిస్తా వుండాది. గట్టిగా చప్పట్లు కొట్టాడు. సైనికుడు 'చిత్తం ప్రభు' అన్నట్లు వచ్చి నిల్చున్నాడు. కర్కశమైన శిక్షనేదో అమలు చేయమన్నట్లు మూర్ఖంగా తీర్పునిచ్చాడు.

రాజసభంతా విషాదంతో ఆలోచనలో పడింది.

❀❀❀

విశాల నీలాకాశం కప్పుకొని వెన్నెల జడివాన కింద ఏకాంతంగా చీకటితో సంభాషిస్తూ తనకు నచ్చిన పాట పాడుకుంటూ స్వచ్ఛంగా పరవశిస్తూ పరిమళిస్తున్నప్పుడు కాలం గోడల నుంచి వికటాట్టహాసం చేసుకుంటూ దూసుకొస్తున్న రాక్షస మృగ ఆకారం... వేయి కన్నులు, వేయి చేతులు, వేయి తలల వికృతరూపం. ఉక్కు సంకెళ్ళతో వెంటాడుతూ, వేటాడుతూ... అవును అది అచ్చం పడమటి దేశం రాజు హిరణ్యడిలానే వుంది. ఆగిపోయింది. వానరాయుడి పాట ఆగిపోయింది. మూగబోయింది.

సంధ్య మేఘం ఏడుస్తాంది.

హిరణ్యడ్ని శాపనార్థాలు పెడ్తా బోరుబోరున కన్నీళ్లు చిందిస్తాంది.

'నీ రాజ్యంలో తొండలు గుడ్లు పెట్టి, కంప చెట్ల వనాలు లెయ్యాలి. ఎక్కడేగానీ చుక్క నీళ్లు లేకుండా నాలికలు పెరుక్కొని చావాలి. ఏడేడు తరాలు నీ రాజ్యంలో కరువు కమ్ముకోవాల...' అంటా మేఘం హిరణ్యడ్ని తిట్టిపోస్తాంది.

వానరాయుడా ఎక్కడుండావు?

నీ పాట వినాలని వస్తిని.

నీవు ఏమైపోతివి?

కట్టమీద కానుగచెట్లు వానల్లేక, గాలుల్లేక కొమ్మలన్నీ అల్లాడిపోతా వుండాయి. మేఘం దుఃఖిస్తా వుండాది. వానరాయుడి పాట కోసం నిరీక్షిస్తా వుంది.

– ఈవారం వారపత్రిక నిర్వహించిన గురజాడ అప్పారావు స్మారక కథల పోటీ–2008లో బహుమతి పొందిన కథ.

కొయ్యబొమ్మలు

'**చూ**డు... మునిస్వామి! నిన్ను రెండ్రోజులు లాకప్‌లో పెట్టినందుకు నాక్కూడా బాధగానే వుంది. ఏం చేయ్యమంటావో నువ్వే చెప్పు... ఈ మధ్యనే పి.డి. యాక్ట్ అనేది వొకటొచ్చింది. దీని క్రింద అరెస్ట్ అయినోళ్ళకు బైల్ రావాలంటే కూడా ఆరు నెలలు పడుతుంది... ఇంకైనా జాగ్రత్తగా వుండండి... ఈ సంగతి మీ పల్లెలో వాళ్లకందరికి చెప్పు...' పోలీస్‌స్టేషన్‌లో కాలుమీద కాలేసుకొని బూట్లు ఆడిస్తా, కళ్లు ఎగరేస్తా చెప్పినాడు ఎస్సై.

చేతులు కట్టుకొని, మాసిన బట్టల్తో, విచారం నిండిన ముఖంతో నిలబడి వున్నాడు మునిస్వామి... ఎదురుగా.

'మరీ బతకలేకపోతే ఒక పని చెయ్యండయ్యా... ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రక్క రెండు గుంజలు పాతి మధ్యలో తాడుకట్టి నీ కూతుర్నో; కొడుకునో పైకెక్కించి దొమ్మరి ఆటనే ఆడుకోండి. డబ్బులు వస్తుంది. ఈ కొయ్య బొమ్మల పని చేసి జైళ్లల్లో పడేదానికంటే అదే మేలు కదా... ఏమంటావ్...' ఎడమ చేత్తో మీసాన్ని దువ్వుకున్నాడు ఎస్సై... రెచ్చగొడతా.

తనని కులం పేరుతో దూషిస్తున్న ఎస్సై పట్ల పట్టరాని ఆగ్రహం వస్తోంది... కానీ ఏం చేయగలడు?

తిరగబడలేని బలహీన బతుకులు...

మౌనంగా నిలబడిపోయాడు... బొమ్మలా...

కొయ్యబొమ్మలా... మునిస్వామి!

నరాల్లో నెత్తురు రగులుతాంది. కానీ చేతకానితనం. కళ్లు మూసుకున్నాడు.

కన్నీళ్లు పొంగుకొచ్చాయి.

కళ్ల ముందు రకరకాల బొమ్మలు కన్పిస్తా వుండాయి.

దేవుళ్లు... దేవతలు... వేంకటేశ్వరుడు; వినాయకుడు, కృష్ణుడు, మహావిష్ణువు, హనుమంతుడు, శివపార్వతులు, దశావతారాలు, లక్ష్మీసరస్వతులు... ప్రత్యక్షమౌతున్నారు.

వీళ్లనందర్నీ తాను ఎందుకు తయారు చేయాలి?

ఎందుకు జైల్లో పడాలి?

రెండ్రోజులు లాకప్ జీవితం గుర్తుకొచ్చింది.

కడుపులో తిప్పినట్లు అయ్యింది. తానెప్పుడు స్టేషన్ ముఖం కూడా చూసింది లేదు. అలాంటిది కటకటాల వెనుక రెండ్రోజులు గడపాల్సి వచ్చింది.

తన పట్ల; తను నమ్ముకున్న కళ పట్ల అసహ్యమేస్తోంది.

తనని ఏ దేవుడూ కనికరించలేదెందుకు?

రకరకాల ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి.

❀❀❀

'మాంచి బేరం తగిలింది... మద్రాస్‌న్నుంచి వ్యాపారి వచ్చాడు... చూడు... ఆర్డర్ తీసుకో... నువ్వు బాగా బొమ్మలు చేస్తావు కాబట్టి నీ దగ్గరికే పిలుచుకొచ్చినా...' మునిస్వామిని పక్కకు తీసుకొచ్చి చిన్నగా చెవిలో చెప్పాడు వైకుంఠం.

'ఎంతిస్తాడంటా?' – ప్రశ్నించాడు మునికృష్ణ.

'ముప్పై వేల రూపాయలు... వినాయకుడి బొమ్మ కావాలట' చెప్పాడు వైకుంఠం.

కళ్ళ ముందు కాసుల వర్షం కదలాడింది.

కానీ... కొయ్య ఎక్కడ్నుంచి వస్తుంది? ఆ ప్రశ్న ఆలోచనల్లోకి రాగానే నిరాశ ఆవహించింది.

'సరిపోదంటే చెప్పు... ఇంకో మూడువేలు ఖర్చుల కోసం మాట్లాడి ఇప్పిస్తాలే...' బేరం పోగొట్టుకోవద్దు; నా కమీషన్ మరచిపోవద్దు అనే ధోరణిలో చెప్పాడు వైకుంఠం.

ఇంటి బయట... వేపచెట్టు నీడలో... తెల్లటి కారులో... వ్యాపారి ఉన్నాడు.

బేరం ఏదో ఒక విధంగా కుదిరితే అడ్వాన్సు కూడా అందుతుంది.

'సరే... నేను బొమ్మ చేసి ఇస్తాను' అని చెప్పడానికి ధైర్యం చాలడం లేదు మునిస్వామికి.

ఫారెస్టోళ్ళ జీపు శబ్దమే చెవుల్లో ప్రతిధ్వనిస్తా వుంది. ఎప్పుడొచ్చి ఇళ్ళ మీదపడి సోదాలు చేస్తారోనని పల్లెలోని పనోళ్ళందరూ ఆందోళనపడ్తా వుండారు. ఇట్లాటి పరిస్థితుల్లో కొత్త పనులు ఎవరు ఎంతిస్తే మాత్రం ఒప్పుకుంటారు? కానీ తనకు తప్పదు...

'ముందే చెప్తా వుండాను మునిస్వామి... సిసలైన ఎర్రచందనం బొమ్మే కావాల... తేడా వస్తే బాగుండదు... కష్టమర్ల దగ్గర నమ్మకం పోతే ఇద్దరి బిజినెస్‌లకూ ఇబ్బందే...' హెచ్చరిస్తా చెప్పినాడు వైకుంఠం.

తలాడించినాడు మునిస్వామి.

ఆ తర్వాత అడ్వాన్సు కొంత చేతికందింది.

మూడు నెలల గడువు కోరాడు మునిస్వామి. ఒప్పుకున్నాడు వైకుంఠం. కారు కదిలింది మట్టిదారెంబడి ఎర్రదుమ్ము రేపుకుంటా.

అంతా బాగానే వుంది... మరి కొయ్య ఎలా?

'రేయ్... నాగులు; మంచి ఎర్రచందనం కొయ్య కావాల, మామూలుగా ఇచ్చేదానికంటే రెండువేలు ఎక్కువే తీసుకో, తెచ్చిస్తావా?' – పల్లెకు దిగదాల గొల్లపల్లెకు ఆనుకొని వుండే కొట్టాల దగ్గర నాగులును కలిసి తన ప్రతిపాదనను పెట్టాడు మునిస్వామి... రహస్యంగా!

వాడు వెంటనే చొక్కా విప్పాడు.

వెనక్కి తిరిగి వీపు చూపించినాడు. వాతలు... మాయని మచ్చలలాగా... కన్పిస్తా వుండాయి.

'రెండు నెళ్ల క్రితం లోపలేసి కొట్టినారు... సామీ... జూడు ఎట్టా పెరక్కచ్చినాయో వాతలు... ముందే టౌనుకు కొత్త ఫారెస్టాఫీసరొచ్చినాడని అందరూ అనుకుంటా వుండారు. నా చేత కాదు. నన్ను విడ్సిపెట్టి మీ పని మీరు జూసుకోండి...' అని నాగులు రెండు చేతులెత్తి దండం పెట్టినాడు.

వాడలా దండం పెట్టిన తర్వాత ఎప్పటిలాగానే మిలట్రీ మందు వాడి చేతుల్లో పెట్టడం మునిస్వామికి అలవాటే.

వాడు కూడా ఎప్పటిలాగానే 'వద్దు... వద్దు... మందు మానేసినానంటూనే' చేతులు రుద్దుకుంటా తీసుకున్నాడు పెదవులు తడి చేసుకుంటా.

మునిస్వామి ఊపిరి పీల్చుకున్నాడు.

నాగులు మందు బిగించి గొడ్డలి చేతబట్టి తూరుపు శేషాచలం కొండలకేసి బయలుదేరినాడంటే రెండ్రోజుల్లో కొయ్య వచ్చి కోత మిషను కాడికి చేరినట్లే లెఖ్క.

వాని లెఖ్క తప్పదు. వానికిచ్చే లెఖ్క తగ్గితే వాడు తగ్గడు. అంతా గొడ్డలి పదును వ్యవహారం! అందుకే వానితో ఎంతవరకో అంతవరకే. అంతకు మించి పెట్టుకోరు. కొండలో ఎర్రచందనం చెట్లను కొట్టడంలో వాడు మహాఘనుడు. ఎమ్మెల్యే తమ్ముడు ఎర్రచందనం వ్యాపారం చేసేటప్పుడు రాత్రిపగలూ అడవిలోనే వుండి మాన్లు కొట్టుకొని వాసాలను భుజంపైన పెట్టుకొని కిందకు మోసుకొని వచ్చేవాడు. అట్లా ఎర్రబంగారు చందనాన్ని స్మగ్లింగ్ చేయడంలో నాగులుకు ఎంతో అనుభవం వుంది.

మద్రాసులో పోలీసోళ్ళు ఎన్నోసార్లు పట్టుకొని లోపలేస్తే ఎమ్మెల్యే తమ్ముడే విడిపించేవాడు. లారీలకు లారీల లోడును కూలోళ్ళను పెట్టి అడవిలో కొట్టిస్తా వుండేటోళ్ళు. సగం చెట్లు ఎమ్మెల్యే ఖాతాలో చేరితే మరో సగం ఎంపీ బామర్ది ఖాతాలో చేరినాయి. ఫలితంగా అడవి ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది...

ఎర్రచందనం స్మగ్లింగ్ లాభసాటి వ్యాపారం అయ్యింది. కానీ బొమ్మల్ని తయారు చేసుకోవడానికి శెట్టిపల్లె కళాకారులు తనకలాడతా వుండారు... కొయ్య దొరకక!

అడవికానుకొని వుంటారు. అక్కడే పుట్టారు. అక్కడే పెరిగారు. అక్కడే జీవిస్తా వుండారు. అడవి తల్లిని నమ్ముకొనే బతకుతా వుండారు. మరి అడవి నుంచి వారిని వేరు చేస్తున్నదెవరు? వారి వనరులు వారికెందుకందడం లేదు?

❋❋❋

శేషాచలం ఎగువ కొండలు... తూర్పుదిశగా... ఆకాశం కింద పచ్చటి పందిర్లు వేసినట్లు విస్తరించి వున్నాయి. తొలిజాము ఎండపడి అడవంతా తళతళా మెరుస్తా వుంది. నునుపుతేలి ఆకాశాన్ని చుంబించే కొమ్మలతో ఎత్తుగా ఎదిగి పసుపురంగు పూలతో నిండుగా విప్పారి ధీటుగా నిలబడిన ఎర్రచందనం చెట్లు పడమటి గాలికి ఆగి ఆగి ఊగుతున్నాయి. సన్నని మద్దిచెట్లు, ఆకురాలిపోతున్న తపసి చెట్లూ గుసగుసలాడుకుంటున్నాయి. గడ్డి పొదల మధ్య నుంచి ఏదో జంతువు కదలి వెళ్ళిపోయింది. చెట్లపైన కొండముచ్చులు అటు ఇటు ఎగురుతున్నాయి. కొండరాళ్ళ మధ్య పుట్టిన జల ఊట సవ్వడి చేసుకుంటా అటు ప్రక్కన్నుంచి జాలు వారుతోంది. ప్రశాంతమైన అడవి ప్రపంచంలోకి అడుగు పెట్టాడు నాగులు... గొడ్డలితో. తిరుగుతున్నాడు... తనకు మునిస్వామి చెప్పిన కొలతలుగల చెట్టు కోసం వెతుకుతున్నాడు... అలసిపోయిన నల్లటి ముఖమంతా అశాంతిగా వుంది.

కాసేపటి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఒక చెట్టు దగ్గర ఆగాడు... పైకి చూస్తూ.

అరచేత్తో చెట్టు మొదలును కొట్టి చూశాడు నేర్పుగా... నీళ్లలోకి దిగేముందు ఈతగాడు నీళ్ళను పరీక్షించినట్లు. సంతృప్తిపడ్డాడు.

వేటు... మొదటి వేటు పడింది... అడవంతా అదిరింది.

చెట్లమీది పక్షులు బెదిరి ఎగిరాయి.

కొమ్మల్లో అల్లుకున్న గూళ్ళు కొన్ని కిందపడ్డాయి. పూలు రాలిపోతున్నాయి... కొమ్మలు రివ్వున ఊగుతూ పెనుగులాడుతున్నాయి...

వేటు... వేటు తర్వాత వేటు... శక్తి కొద్దీ పడుతూనే వున్నాయి. ముక్కలు ముక్కలుగా చెట్టు విచ్ఛిన్నం... కాసేపు కొట్టిన తర్వాత ప్లాస్టిక్ బాటిల్‌లోని నీళ్ళు తాగాడు నాగులు... విరామంగా.

బండరాయికేసి గొడ్డలి పదును చేసుకొని మళ్ళీ కొట్టడం మొదలెట్టాడు.

ఆ పని అలా కొనసాగుతూనే వుంది.

అప్పుడప్పుడు పని ఆపి ఫారెస్టోళ్ళు ఎవరైనా వస్తున్నారేమోనని బెదురుచూపులు చూస్తా వుండాడు.

కొండలో పులి వుందని ఎవరో చెప్పిన మాట గుర్తుకొచ్చినప్పుడు సన్నటి అలజడి... అరికాళ్ళ కింద.

ఏదైన అలికిడి అయితే భయపెట్టే అలజడి... ఆందోళన... అలాగే గొడ్డలి... వేటును దించుతోంది. చెట్టులోకి దిగుతోంది.

వాడు తాగిన మందు వాసన గుప్పుమంటోంది.

చమటతో నల్లటి శరీరం మెరిసిపోతోంది.

గస... గస... నుదుటి చమట తుడుచుకుంటూనే వాడు శ్రమిస్తున్నాడు. భయంకరంగా తలపడుతున్నాడు.

'చెట్టు కూల్చడం' వాడి లక్ష్యం.

ఒక సుదీర్ఘ పోరాటం తర్వాత వాడి ఆరాటం తీరింది.

అడవంతా ఉలిక్కిపడేలా... పెద్ద శబ్దం చేస్తూ...

వీడ్కోలు పలుకుతూ... తన లోకం నుంచి వేరవుతూ చెట్టు నేలకూలింది.

నాగులు ముఖంలో కొత్త ఆనందపు వెలుగు.

❋❋❋

వారం రోజులు తర్వాత కొయ్య, కోత మిషను దగ్గరికి చేరింది. మునిస్వామి అక్కడికే వచ్చినాడు.

'సామీ... దేవుని సాచ్చిగా చెప్తా వుండాను. దీన్ని కొట్టడం ఒకపనైతే... కిందకు తీసుకరాను రెండురోజులు పట్టింది. ఫారెస్టోళ్ళ కళ్లలో యాడ పడ్తాదోనని చెప్పి ఎంత సావు సచ్చినానో... కలీ పొదళ్ళ దాచిపెట్టి నేను మా తమ్ముడు గంగులన్న ఇద్దరం రాత్రిళ్ళు మోసుకొని వచ్చినాం. దిగదాల కొచ్చేటప్పుడు మావాడ్ని నాగుపాము గూడా కాటువేస్తా వుండ్యా... ఇదే ఆఖరి సామీ. ఇంగెప్పుడూ ఎఱ్ఱకొయ్య కోసం

కొండకు పోను... ఇంగో వెయ్యి ఎక్కువీయాల్సిందే...' తన కష్టాలన్నీ చెప్పుకొచ్చినాడు నాగులు.

కొయ్యను చూసినాడు మునిస్వామి... దగ్గరికెళ్ళి... 'మొదటిరకం కొయ్యనే...' సంతృప్తిపడినాడు. జేబులోంచి డబ్బు తీసి లెక్క చూసి యిచ్చినాడు.

'యింగో ఐదునూర్లు... ఇయ్యిసామీ...' బతిమలాడుతూ అడిగినాడు నాగులు.

'రేపు ఇంటికాడికి రా... తీసుకపోదువు...' తప్పించుకోవడానికి వీలుకాక చెప్పినాడు మునిస్వామి.

వాడు తలాడించి వెళ్ళిపోయాడు.

కోత మిషనులో పని మొదలయ్యింది... పొట్టు రేగుతా వుంది. శబ్దం... ముళ్ళ చక్రం గిర్రున తిరుగుతా వుంది. కొయ్య ఒక రూపాన్ని సంతరించుకుంటా వుంది. నల్లటి చర్మం రాలిపోతూ వుంటే ఎర్రటి కొయ్య బయటికొస్తా వుంది... కుబుసం విడుస్తున్న పాములా. కోత మిషను నుంచి కొయ్య ఇంటి వసారాలోకి చేరింది. యిక అసలు పని మొదలయ్యేది ఇక్కడే. మునిస్వామి భార్య బంగారమ్మ శుక్రవారం నాడు కొయ్యకు పసుపు కుంకాలతో పూజ చేసింది. వర్జ్యం పోయినాక చేతిలోకి ఉలి తీసుకున్నాడు. మనసులోనే దేవుడికి దండం పెట్టుకుంటా. తనకిష్టమైన పని... తను నమ్ముకున్న వృత్తి... తండ్రి బాధ్యతగా నేర్పించిన విద్య... బతుకుతెరువును చూపిస్తున్న బొమ్మల కళ... కొయ్యలో రూపం కన్పిస్తా వుంది. దేవుడు... వినాయకుడి రూపం కొయ్యలోపల జీవం పోసుకుంటా వుంది. అవసరమైన భాగాలు మిగిలిపోతూ వుంటే అనవసరమైన భాగాలు కొయ్య నుంచి రాలిపోతున్నాయి. తల్లి గర్భం లోపల బిడ్డ రూపొందుతున్నట్లు కొయ్య లోపల బొమ్మ ఆకారం నిర్మితమౌతా వుంది.

మునిస్వామి ఒక వైద్యుడిలా కష్టపడతా వుంటే కొయ్య 'తల్లి'లా ప్రసవ వేదన పడ్తా వుంది ఉలి దెబ్బలతో. ఇది కూడా ఒక పెనుగులాట.

కొయ్య లోపల్నుంచి బొమ్మని వెలికి తీయడం ఒక సాహసకళ.

'ఏం... మునిస్వామి... దీనెమ్మ... వూర్లో ఎవనికి పనిలేకపోయినా... నీకు మాత్రం పని దొరుకుతాది. అదీ చిన్నా చితకా పని గూడా కాదు. పాతికవేలు దాటితేనే బొమ్మ ఒప్పుకుంటావు. ఈ శెట్టిగుంటకి నువ్వే మొగోడివి...' బీడీ ముట్టించి నోటికొచ్చిందేదో బయట్నుంచే వాగుతా లోపలికి వచ్చినాడు సూరయ్య.

సూరయ్యను పల్లెలో అందరూ పెద్దయ్య అని కూడా పిల్చుకుంటారు. ఒకప్పుడు బొమ్మలు పని చేస్తా బాగా సంపాదించే బతికినోడు. కాలం చెడింది.

కొడుకు నాగరాజు చేతికందినట్లే అంది కాలంలో కలిసిపోయినాడు. యూనివర్శిటీలో ఎవరో కులం కాని పిల్లను ప్రేమించినాడు. వాళ్ళింట్లో అమ్మాయి తండ్రి వీళ్ళ పెళ్ళి చేయడానికి ఒప్పుకోలేదు. ఇంగేం చేస్తాడు? హాస్టల్లోనే తెల్లారుజామున ఫ్యానుకు ఉరిపోసుకొని చనిపోయినాడు. నాగరాజుకు కూడా కొయ్యబొమ్మల పని బాగా నేర్పినాడు సూరయ్య. ఒక్కగానొక్క కొడుకు అర్థాంతరంగా రాలిపోవడంతో సూరయ్య మానసిక పరిస్థితి విషమించింది.

నోటికొచ్చింది మాట్లాడుకుంటూ, కన్పించిన వారి దగ్గర బీడీలు, చిల్లర యిప్పించుకుంటూ జీవితం గడిపేస్తున్నాడు. భూమి, ఇల్లు అమ్మి భార్య లక్షుమ్మ ఇద్దరి కూతుళ్ళకు పెళ్ళి చేసింది. సాధ్యమైనంత వరకు సూరయ్యను ఇంట్లోంచి బయటకు పంపదు. వారానికో, రెండు వారాలకో వస్తాడు... వెనుకనే లక్షుమ్మ వచ్చి తీసుకెళ్తుంది.

'... ఏముందిలే... పెద్దయ్యా!

వూర్లో నీకంటే మొగోడు ఎవడుండాడు?

మీసం దువ్వుకొని బతకాలని మాకు నేర్పింది నువ్వే కదూ... రా... రా... కూర్చో...' నవ్వుతా పలకరించినాడు మునిస్వామి... ఉలి ఆడిస్తానే.

'సర్లే... సర్లే... రెండ్రూపాయలు చిల్లరియ్యి... గుట్కా కొనుక్కోవాల...' వసారాలో గోడకు ఆనుకున్నాడు సూరయ్య.

'ఇస్తాలేగానీ... ఒక మంచి పాట ఎత్తుకో...' అడిగినాడు మునిస్వామి, సూరయ్య కంఠం వినాలనే కోరికతో.

'కూసి గోపురం మింద కురిసె వరసములూ

కురిసేనూ తిరుపతిలో కుంభ వరసములూ

కుంటాలు కుంటాలు రెండు కుంటాలు

ఓటుకుంటా ఒకటి వైకుంఠమొకటి

బాటాలు బాటాలు రెండు బాటాలు

కాశీకి ఒక బాట – తిరుమలకొక బాట

కారములు కారములు రెండు కారములు

ఉప్పుకారమొకటి ఉపకారమొకటి...'

ఎత్తుకున్నాడు సూరయ్య పాట వొకటి... వెంటనే. ఊయల్లో పాపను ఊపుతున్న బంగారమ్మ కూడా పడిపడి నవ్వుతా వుంది.

జేబులోంచి పది నోటు తీసి 'ఇదో... పెద్దయ్య' అని అందించినాడు మునిస్వామి.

బంగారమ్మ నవ్వుతానే వుంది. ఆ తర్వాత పాట గుర్తు రాకపోయినా సూరయ్య కీలు గొంతు విన్పిస్తానే వుంది... ఏదో రాగంతో ఇంతలో లక్షుమ్మ వచ్చింది. సూరయ్య భుజం పట్టుకొని తీసుకెళ్ళబోయింది.

'రోంతసేపు వుండనీలేమ్మా... ఏమైతాది?' అన్నాడు మునిస్వామి.

'వద్దులే నాయనా... బాగుండేంతసేపు బాగుంటాడు. తటిక్కిన ఏది చేతిలో వుంటే దాంతో విసిరేస్తాడు. ఆరోగ్యం బాలేదుగానీ...' బాధగా చెప్పి పిలుచుకొని పోయింది లక్షుమ్మ. కొయ్యబొమ్మలా సూరయ్య వెళ్ళిపోయాడు.

మునిస్వామి చేతిలోని ఉలి శిల్పాన్ని చెక్కుకుంటాపోతా వుంది... అవిశ్రాంతంగా.

వూర్లోకి జీపొచ్చింది.

ఉలి చప్పుళ్లు ఆగిపోయాయి.

ఎక్కడి బొమ్మల పని అక్కడే నిలిచిపోయింది.

క్షణాల్లో ఆ బొమ్మలకు సంచులు కప్పి దాచేశారు.

భయం... భయంగా... చూస్తున్నారు... బిక్కుబిక్కుమంటూ. కానీ వచ్చింది ఫారెస్టోళ్ళ జీపు కాదు.

'హస్తకళల ఉత్పత్తుల సంస్థ' అనేది తిరుపతిలో ఒకటుంది. దాని తాలూకు జీపు అది.

'హమ్మయ్య...' అని వూపిరి పీల్చుకున్నారు అందరూ.

గ్రామ సచివాలయంలో మీటింగ్ పెట్టారు.

'ముఖ్యమంత్రి కార్యాలయంన్నుంచి ఫోన్ వచ్చింది. మంచి బొమ్మ కావాలి. అమెరికా అధ్యక్షుడి పర్యటన వచ్చేవారంలో హైద్రాబాదులో వుంది. మన రాష్ట్ర గౌరవాన్ని ప్రతిబింబించేలా మంచి కానుక ఇవ్వాలని నిర్ణయించారట. అందుకు మీరందరూ సహకరించి చక్కటి బొమ్మను చేయించి ఇవ్వాలి...' పొట్టపైకొచ్చిన బెల్ట్‌ను సరిచేసుకుంటూ చెప్పాడు అధికారి.

కళాకారులు ఎవ్వరూ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. గతం గుర్తుకొస్తొంది... మంత్రులొస్తున్నారని చెప్పి, కలెక్టర్ అడిగాడని, ఎస్పీ చూడాలని అన్నాడని తాము నెలలు నెలలు కష్టపడి చెక్కిన బొమ్మల్ని తీసుకెళ్ళే అధికారులు... డబ్బుల విషయానికి వచ్చేసరికి కన్పించరని కళాకారులందరికి తెల్సిపోయింది.

అధికారులను కాదంటే ఏమైనా హాని తలపెడతారేమోనని భయం కూడా వారి కళ్ళల్లో కన్పిస్తొ వుంది.

'సరే... సరే... మీ బాధ అర్థమైంది. కొయ్య బొమ్మకు కావలసిన డబ్బు ఏర్పాట్లు మేం చేస్తాం. మీరు మంచి బొమ్మ సిద్ధం చేయండి. సిఎం దగ్గరకి... మీ కళాకారుల తరపున ఇద్దరిని కలవడానికి కూడా అవకాశం ఇప్పిస్తున్నాం...' అని కళ్ళద్దాలు సరిచేసుకుంటూ ఆ అధికారి చెప్పాడు.

కొంత సంతృప్తిగానే తోచింది... కళాకారులందరికీ!

ఇప్పటికిప్పుడు కొయ్యబొమ్మ కావాలంటే ఎలా?

'దశావతారాల బొమ్మ కృష్ణయ్య దగ్గరుంది...' ఎవరో అన్నారు. దాన్ని అక్కడికి తెప్పించారు. చూడముచ్చటగా తీర్చిదిద్దబడి వుంది. అధికారులు అందరూ ప్రశంసించారు. అడ్వాన్సుగా మూడువేలు ఇచ్చారు.

ఇరవై వేలు విలువ చేసే కొయ్యబొమ్మ అది. 'మిగిలింది... పర్యటనలోనే ఇస్తామని' స్పష్టమైన హామీ ఇచ్చారు.

మునిస్వామి; కృష్ణయ్యలిద్దరికీ ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం కల్పిస్తామని కూడా చెప్పారు.

ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లోనే ఏర్పాట్లు అన్నీ చకచక జరిగిపోయాయి.

హైద్రాబాదు పర్యటన ఖరారైనప్పటి నుంచి కళాకారులందరూ కూర్చొని ఏవేవో ఆలోచనలు చేస్తూనే వున్నారు.

'ఎర్రచందనాన్ని ప్రభుత్వం కొని పేద కళాకారులకు అప్పు రూపంలో కొయ్యను అందజేస్తే బాగుంటుందని' తీర్మానించారు. ఈ మాటే అర్జీ కూడా రాసుకున్నారు ముఖ్యమంత్రిని కలిసినప్పుడు ఇవ్వడానికి వీలుగా. దశావతారాల బొమ్మతో ప్రభుత్వ వాహనంలో హైద్రాబాదుకు బయలుదేరారు.

అమెరికా అధ్యక్షుడు పాల్గొనే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాయంత్రం జరిగిన ఒక సమావేశంలో ఆయన్ను సన్మానించి శెట్టిగుంట శిల్ప

కళాకారులు రూపొందించిన దశావతారాల శిల్పాన్ని ముఖ్యమంత్రి వారికి అందజేశాడు. ఆయన దాన్ని స్వీకరించి వెనక వున్న సెక్యూరిటీకి నిముషాల్లోనే అందజేశాడు. అంతే... వారి కళ గురించి ఎవరూ రెండు ముక్కలైన మాట్లాడుకున్నదిగానీ, ప్రశంసించిందిగానీ ఏమీ లేదు. సభ ముగిసింది. మునిస్వామిని, కృష్ణయ్యని ఆ రాత్రి పట్టించుకున్న వాళ్ళు ఎవ్వరూ లేరు. ఎవరి పని వారికి. జేబులోని డబ్బు ఖర్చు పెట్టుకొని తిరుగు ప్రయాణంతో శెట్టిపల్లె చేరుకున్నారు...

'బుద్ధి వచ్చింది... ఇంకెప్పుడూ ఆ సభలకు వెళ్ళకూడదు... మనల్ని ఎవడు పట్టించుకుంటారు?' అంటూ మునిస్వామి నిరాశ పడ్డాడు.

కృష్ణయ్య అయితే తిరుపతికి... రావలసిన మిగిలిన సొమ్ము కోసం ఏ ఇరవైసార్లు తిరిగాడో... ఇంకో ఐదువేలు చేతిలోపెట్టి ఈసారి బడ్జెట్ మంజూరైన తర్వాత డిపార్ట్‌మెంట్ నుంచే చెక్ పంపిస్తామని చెప్పారు. కానీ వాళ్ళు పంపుతారనే నమ్మకం లేక కృష్ణయ్య లబోదిబోమని తల్లడిల్లాడు.

'నేను మూడు నెలలు కష్టపడి ఆ దశావతారాల బొమ్మ తయారు చేస్తిని; ఈ కొడుకులు నన్ను నాశనం జేసినారు...' అనుకొంటా కొయ్య పనికి కావలసిన కొరముట్లు అన్ని అటకపైకి మూటగట్టి వేసినాడు. టౌన్లోని బట్టలషాపులో పనికి జేరినాడు.

❋❋❋

రోజులు గడుస్తా వుండాయి.

ఓ నడిరాత్రి పూట శ్వాస ఆడక ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు మునిస్వామి.

భార్య బంగారమ్మ ఆందోళనపడ్తా త్వరత్వరగా మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

ఆరుబయట వేపచెట్టు అరుగు మీదికి తీసుకొచ్చి కూర్చోబెట్టింది. చల్లటిగాలి వీస్తోంది. పరిస్థితి కొంత ఊరటగా వుంది.

తెల్లారిం తర్వాత టౌన్లోని డాక్టర్‌ను కలిశాడు మునిస్వామి.

'... పెద్ద ప్రమాదం ఏమీ లేదు. కాకపోతే ముక్కు లోపల వాహిక దగ్గర కండ కొంత పెరిగింది. ఆపరేషన్ చేసి తీసేస్తే సరిపోతుంది...' చెప్పాడు డాక్టర్ పరీక్షించి.

'ఆపరేషన్' అనే మాట వినగానే చమటలు పట్టాయి.

'ఇబ్బందేం లేదు. ఈ మాత్రలు వాడు. నిదానంగానే ఆపరేషన్ చేద్దాం...' అన్నాడు డాక్టర్ పరిస్థితిని గమనించి.

అక్కడ్నుంచి వచ్చాడేగానీ మనసు మనసులో లేదు. ఈ విషయం భార్య బంగారమ్మకు కూడా చెప్పలేదు. ఆపరేషన్ అంటే డబ్బుతో పని. ఇప్పటికిప్పుడు డబ్బు అంటే తన స్థితికి కష్టం. ఒప్పుకున్న కొయ్యబొమ్మ పూర్తయితే మద్రాసు వ్యాపారి డబ్బులిస్తాడు. అన్నీ పరిష్కారమౌతాయని అనుకున్నాడు మునిస్వామి.

ఆ రోజు నుంచి పని వేగం మరింత పెంచాడు. మొండిది... ఎర్రచందనం కొయ్య... అందుకేదాన్ని ఉక్కుకొయ్య అని కూడా పిలుస్తారు. శిల్పరీతికి దాన్ని మల్చుకోవాలంటే ఓర్పు, నేర్పు కావాలి.

ఇట్నే త్వరత్వరగా బొమ్మ పూర్తి చేయాలనుకొని సిద్ధపడి గోడుగోడున కన్నీళ్ళు పెట్టుకున్న రమణయ్య గుర్తొచ్చినాడు.

పెద్ద సైజులో శిల్పం... తిరుమల వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేస్తానని బెంగుళూరుకు చెందిన వ్యాపారులతో రమణయ్య ఒప్పందం చేసుకున్నాడు. ఇరవై అయిదు వేలకు మాట్లాడుకున్నారు. పని మొదలైంది.

వాళ్ళక్కడ ఏదో పూజా కార్యక్రమం పెట్టుకున్నారట. త్వరత్వరగా పూర్తి చేసి ఇవ్వాలని ఒకటే గొడవ. ఫోన్ల మీద ఫోన్లు కొట్టడం, మనుషుల మీద మనుషుల్ని పంపడం. రమణయ్యకు కాళ్ళు చేతులు ఆడలేదు. రాత్రి పగలూ కష్టపడి శిల్పాన్ని తయారు చేశాడు. వాళ్ళు బొమ్మను తీసుకెళ్ళడానికి వాహనాన్ని కూడా తెచ్చి ఇంటి ముందు పెట్టారు.

బొమ్మకు పాలిషింగ్ జరుగుతోంది. వాళ్ళు ఒకవైపు తొందరపెడ్తా వుండారు. తెల్లారితే వాళ్ళ పూజాకార్యక్రమమని చెప్తున్నారు. రాత్రి ముగ్గురు మనుషుల్ని పెట్టి పాలిషింగ్ చేయిస్తున్నాడు రమణయ్య...

చివరికి...

జరగకూడనిదే జరిగింది.

వెంకటేశ్వరస్వామి ముక్కుకు పాలిషింగ్ చేస్తున్నప్పుడు ఉలిమోటు తగిలింది. అంతే... ముక్కులేని వెంకటేశ్వరుడి ప్రతిమ మిగిలింది!

ఇంక ఆ బొమ్మ ఎందుకు పనికొస్తుంది?

వాళ్ళు తిట్టుకుంటా వెళ్ళిపోయారు. డబ్బులు వెనక్కి తీసుకొని. రమణయ్య కుప్పకూలిపోయాడు. కన్నీళ్ళతో. ఈ సంఘటన శెట్టిగుంటలోని కళాకారులందరికీ ఒక గుణపాఠంగా గుర్తుండిపోయింది. గతం గుర్తొచ్చి మునిస్వామి పనివేగం కొంత

తగ్గింది. ఉలి చీల్చుకపోతోంది. కొయ్య కొత్తరూపాన్ని ధరిస్తోంది. శ్రద్ధగా... తీక్షణంగా... వినాయకుడి విగ్రహం నిర్మితమౌతా వుంది.

తన చుట్టూ ఏం జరుగుతుందో కూడా పట్టించుకునే స్థితిలో లేదు మునిస్వామి.

ఎవరో కొత్త మనుషులు నలుగురు లోపలికి వచ్చారు. కొయ్య బొమ్మ తయారవుతూ వుంది.

తలపైకెత్తి చూశాడు మునిస్వామి. వాళ్ళనెప్పుడూ, ఎక్కడా చూసింది లేదు.

'బొమ్మలు కావాలా...' అడిగాడు ఉలి ఆడిస్తానే.

'కాదు... నువ్వే....' చెప్పాడు ఎత్తుటి మనిషి.

ఆ తర్వాత తెలిసింది... ఫారెస్టోళ్ళు ఊరి బయట జీపు ఉంచి పొలాల మీదుగా నడుచుకుంటూ వచ్చారని... వూర్లోకి.

ఆ సమయంలో కొయ్యబొమ్మ చేస్తూ పట్టుబడింది మునిస్వామి మాత్రమే. సగం పూర్తయిన బొమ్మతో పాటుగా జీపు ఎక్కాడు.

'ఎర్రచందనం కొయ్య' ఎలా వచ్చిందో చెప్పమని అడిగారు.

మౌనం...

'బొమ్మకు అడ్వాన్సు ఎంత తీసుకున్నావు?'–

మౌనం...

'ఇప్పటివరకు ఎంత సంపాదించి వుంటావు?'

మౌనం...

మట్టిరోడ్లో దుమ్ము రేపుతా వుంది... జీపు.

దుమ్ము... ఎర్రటి దుమ్ము... కమ్ముకుంటా వుంది...

మునిస్వామికి ఊపిరాడ్డం లేదు...

సన్నటి దగ్గు కూడా మొదలైంది.

టౌనుకెళ్ళాక తెల్సింది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు కొత్త ఎస్సై వచ్చాడని.

వార్నింగ్ ఇవ్వడం కోసం ఇలా తమ వూర్లోకి వచ్చారని...

మునిస్వామికి రెండ్రోజుల లాకప్ జీవితం తప్పలేదు. తనతో పాటూ సగం పూర్తయిన గణపతి విగ్రహం కూడా జైల్లోనే శిక్షను అనుభవించింది.

ఆ తర్వాత... ఎస్సై అన్న మాటలు... దొమ్మరి ఆట ఆడుకొమ్మని ఇచ్చిన సలహా...

స్టేషన్ నుంచి మునిస్వామి బయటికొచ్చాడు.

కసి... బాధ... ఏం చెయ్యాలి?

వూరికి బయలుదేరాడు... టౌన్నుంచి!

'ఏమైంది?' ఆత్రమాత్రంగా అడిగింది భార్య బంగారమ్మ.

'కొయ్య బొమ్మ యాడుంది?' మళ్ళీ ఆమే...

వేటికి సమాధానమివ్వలేదు మునిస్వామి. మౌనంగా కూర్చుండిపోయాడు.

ఎదురుగా కొరముట్లు. ఉలి; రంపం; బాడిశ... ఏం చేయాలి?

భయంభయంగా ఈ కొయ్యబొమ్మల పని చెయ్యడమా? మానడమా?

ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా పైకి లేచాడు. సంచికి సామాన్లు సర్దుతున్నాడు.

'ఎక్కడికి? ఎందుకు సామాన్లు సర్దుతున్నారు?' ఆమె కలవరపడ్తా ప్రశ్నిస్తోంది.

'... వద్దు! మనం ఈ కొయ్యబొమ్మల పనిని నమ్ముకొని బతకలేం. టౌనుకు పోదాం. వెతికితే ఇంతకంటే మంచిపని ఏదో ఒకటి దొరుకుతుంది... సామాన్లు సర్దు...' నిశ్చలమైన స్వరం.

కొయ్యబొమ్మలు... ప్రాణమున్న కొయ్యబొమ్మలు... బతకడానికి నమ్ముకున్న కళను విడిచిపెట్టి కడుపు చేత పట్టుకొని టౌనుకు తరలిపోతున్న కొయ్యబొమ్మలు...

– 15 మే, 2008 ఆంధ్రభూమి వారపత్రిక.

ఉగాది కథల పోటీలో బహుమతి పొందిన కథ

అంజన సిద్ధుడు

'... మూదేపమాన్ల సత్రం కాన్నుంచి కాలిదావన పడమటి దిక్కుకు బసవేశ్వరుడి దేవళం వైపుకు రాళ్ళగుట్ట దాటుకున్యాక అట్నే అట్నే కవ్వంకోన కాడుండే పెన్నేరు దాటుకోవాలి. ఆన్నుంచి తూర్పుకు దిగితే ఎగువ బండకు అవతల నాలుగు యాప చెట్లు పది తుమ్మచెట్లు వస్తాయి. ఆ వనంలో నెమరేసుకుంటూ జోగుతా వుండాయి మీ ఆవుల మంద. పోయి ఇంటికి తోలుకచ్చుకోపోళ్ళి...' ఎర్రటి కళ్ళను నులుపుకుంటా తల విదిలించుకొని సూసి జెప్పినాడు అంజనంలోంచి తిరుమలయ్య.

సంతృప్తిగా తల వూపినాడు ఎదురుగా యాపాకు కొమ్మలు తిప్పుతా మంత్రాలు చదువుతా వుండే అంజనసిద్ధులయ్య.

నాల్గురోజుల్నుంచి చుట్టుప్రక్క పదారు పల్లెల్ని జల్లెడ పట్టి విసిరివేశారి కాళ్ళీడ్చుకుంటా సిద్ధులయ్యను కలిసి తన ఆవుల మంద దారితప్పిన సంగతిని గోడుగోడుగా చెప్పి దుఃఖించినాడు కొండారెడ్డి.

అమావాస్యనాడు నీలికళ్ళ తిరుమలయ్యను నట్టింట్లో వేసిన స్త్రీ చక్రం ముగ్గులో కూర్చోబెట్టి తప్పిపోయిన ఆవుల మంద యాడుందో గుర్తించినాడు సిద్ధులయ్య ఇలా! పల్లెంలో ఆకు, వక్క, జత కొత్తగుడ్డలు, నూటాపదార్ల లెఖ్ఖ పెట్టి సిద్ధులయ్య కాళ్ళకు నమస్కారం చేసుకున్నాడు కొండారెడ్డి. ఆన్నుంచి అట్నే కవ్వంకోన దిక్కుకు తన ఆవుల మందను తోలకచ్చుకోను బిరబిరా అడుగులేసుకుంటా వెళ్ళిపోయాడు.

❋❋❋

అంజనంపల్లె వూరు కాదు. ఇళ్ళు గూడా ఏమీ లేవు. రావిచెట్లు, యాప చెట్టు పెనవేసుకొని వుండే స్థలంలో రాయలకాలం నాటి కావలిసత్రం వొకటి వుండేది. ఎప్పుడో పాతకాలమప్పుడు అంజనమేసే వాళ్ళంతా ఆ సత్రం కాడ వుండేటోళ్ళంటారు. హిరణ్య రాజ్యంలో ఎక్కడ ఏం జరిగినా జనమంతా ఇక్కడికి వచ్చి తమకు కావాల్సిన సమాచారం తెల్సుకొనిపోతా వుండేటోళ్ళని పెద్దోళ్ళు చెప్తా వుంటారు. ఆ సత్రం వుండే ప్రాంతాన్ని అంజనం పల్లెని పిలుస్తా వుండారిప్పుడు.

నలబై ఏళ్ళ క్రితమైతే పక్కీరయ్య అనే అంజనమేసే పెద్దాయన ఆ సత్రం కాడ్నే వుండేటోడు. మనిషి ముసిలోడు. గెడ్డం, మీసాలు పెంచుకొని ఎర్రటి గుడ్డలు కట్టుకొని శరీరమంతా బూడిద పూసుకొని ఎప్పుడూ సత్రం అరుగు మీద మంత్రాలు సదువుకుంటా కళ్ళు మూసుకొని మనోనేత్రంతో సకలం తెలుసుకుంటా వుండేటోడు.

ఆ పెద్దాయనంటే అందరికీ గౌరవం, భక్తిభావం. చుట్టుప్రక్కనుండే పల్లెల్నుంచి జనం ఎప్పుడూ అంజనంపల్లెకు వస్తా వుండేటోళ్ళు... వాళ్ళవాళ్ళ కష్టాల్ని మూటగట్టుకొని! పెద్దాయన ఓపిగ్గా విని ఎట్టోగొట్టా వాళ్ళ కష్టం తప్పించి వచ్చినోళ్ళను ఆనందంగా వెనక్కి పంపేటోడు. 'పక్కీరయ్య మంత్రం కడితే ఎట్టాట్టి పీడ దోషమైన ఎగిరిపోతాదని' జనం అనుకుంటా వుండిరి.

శింగనమల నుంచి పాపిరెడ్డి పెద్దకోడలు లక్షుమ్మను ఓ దినం అంజనం పల్లెకు పిల్సుకొచ్చినారు. 'కోళ్ళికి దెయ్యమేదో పట్టిందని, సగర ప్రొద్దున లేసి నట్టింట్లో జెగ్గినక తొక్కుతాందని, మనిషి పట్టుకోబోతే మింగుతానని కండ్లు ఎర్రగా జేసుకొని తలాడిస్తా భయపడిస్తా వుండాదని, తలను బండకేసి బాదుకుంటా ఏడుస్తా వుండాదని...' ఆయమ్మి చేస్తాండే చేష్టలన్ని ఒక్కొక్కటిగా పక్కీరయ్యకు చెప్పుకొచ్చినారు.

అంతా ఓపిగ్గా వినిన తర్వాత ఆదివారం అమావాస్యనాడు వూరి పొలిమేరలోని స్మశానంలో ముగ్గు వేసినారు. పక్కీరయ్యకు ఎదురుగా లక్షుమ్మ కూర్చోని ఎంట్రుకలు విరబోసుకొని తల గిరగిరా తిప్పుతా వుండాది.

'రా... రా... నా కొడుకా... నిన్ను అరికాలి కిందవేసి నలుస్తా... రా' అని ఆయమ్మి పళ్ళు పటపటా కొరుకుతా తిడతా వుండాది.

ఆయమ్మిని ఒకప్రక్క సిద్ధులయ్య, మరోప్రక్క తిరుమలయ్య పట్టుకొని వుండారు. వీళ్ళిద్దరూ పక్కీరయ్యకు ఇష్టమైన శిష్యులు. అందుకే పక్కీరయ్య తనకు తెల్సిన విద్యలన్నీ వీళ్ళిద్దరికే నేర్పించాడు.

పక్కీరయ్య చేతిలో యాపాకు మండలు తిరుగుతా వుండాయి. నోటి నుంచి మంత్రాలు అనర్గళంగా వస్తానే వుండాయి. దూరం నుంచి ఆయమ్మి అత్త, మామ, మొగుడు చూస్తా వుండారు భయంభయంగా!

విభూది, ఎర్రకుంకం తీసుకొని ఆయమ్మికి నుదుటికి బొట్టు పెట్టినాడు పక్కీరయ్య. 'పెట్టాకు...రా... ఆ మంత్రం బొట్టు పెట్టాకు... నేను తురక దెయ్యాన్ని... పడితే విడిసిపోను... పెట్టాకు... ఆ బొట్టు పెట్టాకు...' అని గట్టిగా తల విదిలిచ్చుకుంటా మట్టిలో పడి దొర్లుతాంది. పక్కీరయ్య చేతిలోని యాపాకు మండలు పెరుక్కొని ఆకుల్ని నోటితో నమల్తా వుండాది. చేతులు విదిలించుకుంటా పెనుగులాడతా వుంది. పక్కీరయ్య మాత్రం ఆపకుండా మంత్రాలు చదువుతానే వుండాడు.

ఆయమ్మి ఎగుర్తాంది. కాళ్ళను విదిలిస్తాంది. చేతులు పెరుక్కొని మట్టి తీస్కొని విసిరేస్తాంది. 'ఏందిరా నా బట్టల్లారా... నమిలి మింగుతా మిమ్మల్ని...' అంటా రుద్రరూపం జూపిస్తా వుండాది.

'ఓ తురక దెయ్యమా! ఏంటికి పట్టినావు నువ్వు...' బూడిద ఎగజల్లుతా అడిగినాడు పక్కీరయ్య.

'నీకేంటికి జెప్పాలా... నేను జెప్పను నీకు చేతనైంది చేసుకోపో...' తలాడిస్తా చెప్పింది ఆయమ్మి.

పక్కీరయ్య ఆలస్యం చేయకుండా ముగ్గులోనే పెట్టిన పూజ చేసిన పెద్ద ఇనుపమేకు తీసుకున్యాడు.

'నీ తల మీద దీన్ని దిగ్గొడతా జూడు' – అందుకున్నాడు.

'సామీ... నీ కాళ్ళకు ముక్కుతా... నన్ను యిడిసిపెట్టు...' ఆయమ్మి ప్రాధేయపడతాంది.

'నువ్వెంటికి మా పిల్లకు పట్టినావో మానంగా జెప్పు' – గదురుకున్యాడు పక్కీరయ్య.

'ఏం జెప్పేది సామీ... నేను తురకదాన్ని... వూర్లోనే దిగదాల మాలిండ్ల కానుకొని వుండే కొట్టాల్లో వుండేదాన్ని. మొగుడు కువైట్ దేశం పోయినాడు. అత్త నేను ఇద్దరమే వుంటాం. ఇదిగో ఈయమ్మి మొగుడు పాపిరెడ్డి కొడుకు ఎంకట్రెడ్డి మా ఇండ్లకాడికి వచ్చేటోడు. వాళ్ళ తోటలోకే నేను పనికి కూడా పోతా వుంటి. ఓ రోజు మధ్యాహ్నమప్పుడు కానుగచెట్టు కింద పండుకొని వుంటే వచ్చి పట్టుకున్యాడు. 'వద్దు రెడ్డీ... వద్దు రెడ్డీ' అని పెనుగులాడినాను. అయినా విడ్సిపెట్టలేదు. అనుభవించి ఆ రోజు కూలీ లెఖ్ఖకు ఇంగో ఇరవై రూపాయలు ఎక్కువిచ్చి పోయినాడు. అది మొదలు నేను ఎప్పుడు వాళ్ళకు పనికిపోయినా నన్ను వాడుకునేటోడు. పెద్ద రెడ్లతో పెట్టుకొని మేం యాడ బతికేది? అందుకే భరిస్తా వుంటి. వాని కామానికి నేను తల్లినైనాను. ఆ సంగతి వాడికి జెప్పితే ఏం కాదని చెప్పి నాల్గునెళ్ళ క్రితం పొలంకాడ్నే మోటారు కరెంటు తీగలు కాళ్ళకు చుట్టి చంపి బావిలోకేసి సంపినాడు. వూరి జనాన్ని 'నేను అత్తతో కొట్లాడి బావిలో దూకి చచ్చినట్లు' నమ్మించినాడు. అందుకే నేను దెయ్యమై వాడి పెండ్లానికే పట్టుకున్యాను' చెప్పింది ఆయమ్మి వలవలా ఏడుస్తా!

కొంచెంసేపు నిశ్శబ్దం. చెట్టుచాటు నుంచి చూస్తున్న కొడుకును అసహ్యించుకుంటూ పాపిరెడ్డి దంపతులు తిడుతున్నారు.

'సరే... సరే... తురకదెయ్యమా! అయ్యిందేదో అయిపోయింది. దిగు... దిగు... దిగి యిట్నే జడ యంబిడి చివరికి రా... రా... రా... కొసకు... చివరాఖరికి... రా...' అంటూ ఆయమ్మి జడ చివరికి దెయ్యాన్ని తీసుకొచ్చి చివర్లో రొంత వెంట్రుకలు కత్తెరతో తెంచినాడు పక్కీరయ్య.

ఆయమ్మి సోదీనం తప్పి కుప్పకూలిపోయింది.

జడ చివర్లో తెంచిన వెంట్రుకల్ని సీసాలో బేసి గట్టిగా చెక్కమూత బిగించినాడు పక్కీరయ్య. ఆ తర్వాత మూడేపమాన్ల సత్రం దాటుకున్యాక వచ్చే నాలుగు దావల మధ్యలో బారెడు గుంత తీసి బూడ్సినాడు.

'యింగ దెయ్యం రాదుగానీ... ఇదిగో ఆ యాపమాను నడిమి కొమ్మకు ఈ ఇనుప మేకు దిగ్గొట్టి ఆయమ్మిని పిల్సుకపోండి. చూడు... పాపిరెడ్డి... యింగనన్న 'మనిషి'తిన్న బతకమని నీ కొడుక్కు జెప్పు...' అని హెచ్చరించినాడు పక్కీరయ్య.

సిద్ధులయ్య, తిరుమలయ్యలు కూడా పక్కీరయ్య వెనుక సత్రం దిశగా అనుసరించినారు.

❋❋❋

పక్కీరయ్యకు వయస్సు పెరిగే కొద్దీ శరీరం సహకరించడం లేదు. అక్కడికీ ఆకుపసరు వైద్యం చేసుకుంటూనే వుండేటోడు. నడిరాత్రి శూన్య ఘడియల్లో శిష్యులిద్దరికీ పొలిమేరలోని స్మశానంలో మంత్ర, తంత్ర విద్యలన్నీ నేర్పించేటోడు. కానీ చివరిగా ఎప్పుడూ ఒక మాట చెప్పేటోడు.

'మీరు విద్యలన్నీ నేర్చుకోండి. నేను పోయినాక ఈ విద్యలే మీకు కూడు పెడతాయి. అయితే మనమూ, మన విద్యలన్నీ మేలు చేసేకే వాడుకోవాలిగానీ కీడు కోసం కాదు. చేతిలో విద్య వుందని, నోట్లో మంత్రముందని మీరు వినాశనానికి పూనుకుంటే మీరు మిగలరు. మన విద్యవల్ల లోకం పచ్చగుండాల! ఈ మాటలు నాకు మా గురువు జెప్పినాడు. నేను ఆచరించినా. మీరు పాటించండి. ఇదే నేను మీకు చివరిగా జెప్పేది' అని పక్కీరయ్య సత్రం అరుగు మీద పండుకొని అంటానే కన్నుమూసినాడు.

శిష్యులిద్దరూ గుండెల్ని బాదుకుంటా దుఃఖించినారు.

ఆ తర్వాత నుంచి అంజన సిద్ధులయ్యనే మంత్రాలు చదివేటోడు, తిరుమలయ్య అంజనంలోకి చూసేవాడు.

ఇట్లాగే కాలం గడుస్తా వుండాది.

❋❋❋

మిట్ట మధ్యాహ్నమపుడు భుజాన్న సంగటిమూట మోసుకొని కాళ్ళీడ్చుకుంటా కొండారెడ్డి సిద్ధులయ్య సత్రం కాడికి వచ్చినాడు.

రావడం రావడంతోనే సిద్ధులయ్య పాదాల ముందు సాగిలబడ్డాడు. ఆశీస్సులందుకున్నాడు.

'సంగతేంది కొండారెడ్డి. మళ్ళా నీ ఆవుల మంద దారి తప్పిందా ఏంది? ఇట్టా వచ్చినావు?' నవ్వుతా ప్రశ్నించినాడు సిద్ధులయ్య.

'శానా రోజులైంది కదా సామీ మిమ్మల్ని జూసి. చూసి పోదామని వస్తి...' నసుగుతానే చెప్పినాడు కొండారెడ్డి.

ఆమాటా ఈమాటా మాట్లాడుకుంటానే ప్రొద్దువాలింది. వూరికి యల్లబారేటప్పుడు అసలు సంగతి చెప్పినాడు కొండారెడ్డి.

'తన భార్య లక్షుమ్మ ఆవులను తోలుకొని అక్క దేవతల కొండకు పోయినప్పుడు బంగారు ముక్కుపుడక దొరికిందని' చేతి సంచిలోంచి దాన్ని తీసి చూపించినాడు.

కళ్ళు జిగేల్మని మెరిసినాయి – ఇద్దరికి!

'చూస్తాంటే ఇది దేవతాభరణం అన్పిస్తా వుండాది' అన్నాడు దాన్ని అటుఇటు తిప్పిజూసి సిద్ధులయ్య.

'అందుకే సామి నేను వచ్చింది... మా పెద్దోళ్ళ కాలం నుంచి అంటా వుండారు అక్కదేవతల కొండలో నిధి వుండాదని మీరు రొంత నిమ్మళంగా కూకొని అంజనం వేస్తే మన బతుకు బంగారమవుతుంది...' ప్రాధేయపూర్వకంగా అడిగినాడు కొండారెడ్డి.

'లోక కళ్యాణార్థం అంజన విద్య వుపయోగించాలిగానీ ఇట్టాటివాటికి కాదు...' చెట్టు కింద కూర్చుంటా చెప్పినాడు సిద్ధులయ్య.

అప్పుడే చెట్టు మీద ఏదో పక్షి కూత గూడ కూసింది.

'మీ బోటి యోగులే మాపై దయ పెట్టకుంటే మా జీవితాలు ఎప్పుడు బాగుపడతాయి సామీ...' మొర పెట్టుకున్నాడు కొండారెడ్డి.

'నాకు నా గురువు పక్కీరయ్య సామీ విద్య బోధించేటప్పుడే సెలవిచ్చినాడు కొండారెడ్డి... నీకు నేర్పిస్తాండే అంజనం విద్య పదిమందికి మేలు చేసేదిగానే వుండాలి గానీ విపరీతాలకు తావిచ్చేది వుంటే ప్రమాదమని. అందుకే నేనెప్పుడు యిట్టాటి ఆలోచనలను కూడా నా తలకాయలోకి రానియ్యను...' వివరంగా చెప్పినాడు సిద్ధులయ్య.

'వుండే భూమంతా వానలు పడక ఎండిపాయె. వూర్లో పచ్చగడ్డి గూడా లేకుండాపాయె. ఆవుల డొక్కలెండిపాయె. ఇంట్లో పెండ్లి చేయాల్సిన ఆడపిల్లోళ్ళు నల్గురుండారు. ఇల్లూ... వాకిలి గూడా సరిగ్గా లేవు... యింగ దేశాలు పట్టుకొని పోవాల్సిందే నేనూ, నా కుటుంబం, మీరు రోంత దయతలిస్తే ఆ అంజనం వేసి సూద్దాం... సొమ్ము వుంటే వుండని... కనీసం వుందో లేదోనన్న తెలుస్తాది... యింగ మీరే నాకు దిక్కు...' కాళ్ళ మీద పడినాడు కొండారెడ్డి. తిరుమలయ్య నిశ్శబ్దంగా వుండాడు.

చెట్టు కింద పక్షి వింతగా కూస్తానే వుండాది.

'సరే... సరే... నీ కోసం చూస్తాను... అక్కదేవతల కొండ పైన నిధిలో రాళ్ళుండాయో... రత్నాలుండాయో...' అంటా పైకి లేసి సత్రంలోకి పోయినాడు. వెనుకే కొండారెడ్డి గూడా. నడిరాత్రికంతా ముగ్గు తయారైంది.

'అక్కదేవతల కొండలో పెద్దవీరమల్లమ్మ, సూర్యకన్య, చంద్రకన్య, అగ్నికన్య, మంత్రాల మహాదేవి, నాగమునెమ్మ, చిన్నవీరమల్లమ్మ అక్క దేవతలందరూ కాపలాగా వుండే పోలేరమ్మ బండ కింద గుప్తనిధి వుండాది. ఎవరైనా దాన్ని బయటకు తీయాలనుకుంటే నెత్తురు కక్కుకొని తలపగిలి చావాల్సిందే...' కళ్ళ నుంచి నీళ్ళు కార్చుకుంటా అంజనం దిక్కు కళ్ళు ఆర్పకుండా చూస్తా చెప్పినాడు పిల్లికళ్ళ తిరుమలయ్య.

'యింగెట్టా ఆ నిధి బయటకొస్తాది తల్లీ...' గట్టిగా బూడిద ఎగజల్లుతా అడిగినాడు సిద్ధులయ్య.

'అమావాస్యనాడు అక్కదేవతలకు శాంతి చేసి...' అని నోట్లోనే ఏదో గొణుక్కుంటా తల తిప్పుతా తిప్పుతా గొణిగి మూర్చిల్లినాడు తిరుమలయ్య.

ఇంతకాలం నుంచి అంజనం వేస్తూనే వున్నారు. తిరుమలయ్య చూసి చెప్తానే వుండాడు కానీ మూర్ఛిల్లి పడిపోవడం ఇదే మొదటిసారి. సిద్ధులయ్య పక్కన రాగి చెంబులో ముంచుకొని పెట్టుకొని వుండే నీళ్ళు తిరుమలయ్య ముఖంపైన చిలకరించినాడు.

కొద్దిసేపటికి తిరుమలయ్య కళ్ళు తెరిచినాడు.

'ఏమైంది' అన్నట్లు కళ్ళు ఎగురేశాడు సిద్ధులయ్య.

'వయసు వస్తా వుండాది కదా... కళ్ళు ఆర్పకుండా చూస్తానే వుండడం కష్టంగా వుండాది'– చెప్పి కుండలో నీళ్ళు ముంచుకొని తాగి కట్టమీద పడుకున్నాడు.

చల్లగా గాలిపెడ్తా వున్నా తిరుమలయ్య వళ్ళంతా చమటలు పడ్తా వుండాయి.

సిద్ధులయ్యకు కూడా శరీరమంతా నొప్పిగా వుండడంతో నిద్రకు ఉపక్రమించాడు.

కొండారెడ్డి మాత్రం ఆలోచనలోనే వుండాడు.

❁❁❁

ఉదయాన్నే సగిలేటిపల్లె కాన్నుంచి గొల్లోళ్ళు కొందరు వచ్చినారు. వూర్లో కొత్తగా కడతా వుండే రాముని గుడిలోని విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ విషయం మాట్లాడిపోయినారు. యింగ రోంతసేపటికి లావనూరు కాన్నుంచి చిన్నారెడ్డి వాళ్ళు వచ్చినారు. వూర్లోని దేవళంలో రాత్రికి రాత్రి దొంగలు పడి ఏడువారాల నగలు తీసుకపోయినారని లబోదిబోమని ఏకరువు పెట్టినారు. ఆలస్యమైతే దొంగలు దూరంగా పారిపోతారని వెంటనే అంజనం వేసి చెప్పాలని తొందర చేస్తా వుండారు. చేసేదేం లేక ముగ్గులోకి తిరుమలయ్యను కూర్చోబెట్టినాడు. సిద్ధులయ్య మంత్రాలు చదువడం మొదలెట్టినాడు. చేతిలోని యాపాకు మండలు తిరుగుతానే వుండాయి.

'చెప్పు తల్లీ... చెప్పు... దేవళంలో జరిగిన దొంగతనం... దొంగలు యాడుండారు... చెప్పు తల్లి... చెప్పు...' అడుగుతా వుండాడు సిద్ధులయ్య.

సమాధానం లేదు.

కొద్దిసేపు తర్వాత మళ్ళీ అడిగాడు సిద్దులయ్య.

తిరుమలయ్య కళ్ళ నుంచి నీళ్ళు కారిపోతా వుండాయి.

సమాధానం లేదు.

ఇప్పుడేం చేయాలి?

తిరుమలయ్యకు కళ్ళు మూసుకుంటే చాలు కొండారెడ్డి ముఖమే కన్పిస్తా వుండాది.

అర్థం కావడం లేదు. ఎందుకిలా జరుగుతోంది?

ముగ్గులోంచి పైకి లేచాడు తిరుమలయ్య తన వల్ల కావడం లేదంటూ!

రేపు ఆదివారం అమావాస్యరోజు అంజనం వేస్తే ఖచ్చితంగా తెలుస్తుందని చెప్పి వాళ్ళను పంపించి వేశాడు సిద్ధులయ్య. కళ్ళు మంటగా వుండాయని చెప్పి తిరుమలయ్య అరుగుపైన పండుకున్నాడు.

కొండారెడ్డి అక్కడక్కడే తచ్చాడుతూ వుండాడు.

మధ్యాహ్నమప్పుడు మండపంపల్లె నుంచి కరువు కటకటలాడిస్తా వుండాది. వానలు ఎప్పుడొస్తాయి. మబ్బులు ఎప్పుడు కనికరించి కురుస్తాయని అడగనొచ్చినారు. వాళ్ళని ఆదివారం నాడు రమ్మని సిద్ధులయ్య చెప్పంపినాడు.

నిద్రలో కలవరించుకుంటా ఉలిక్కిపడ్తా వుందని ఈతచెట్టు పల్లె కాన్నుంచి ఓ తల్లి బిడ్డను చంకకెత్తుకొని వచ్చింది. ఆ బిడ్డకు యాపాకుతో మంత్రించి తాయత్తు కట్టి పంపించినాడు సిద్ధులయ్య.

తిరుమలయ్య అసహనంగానే వుండాడు.

'సామీ... తెల్లారితే ఆదివారం అమావాస్య... ఈ సాయంత్రానికి బయలుదేరుతేనే కదా... మనం రేపు రాత్రికంతా అక్కదేవతల కొండకు జేరుకొనేది... బయలుదేరుదాం...' తొందరపెడ్తా వుండాడు కొండారెడ్డి.

ఏం జెయ్యాలో అర్థం కావడం లేదు సిద్ధులయ్యకు.

చీకటైతా వుండాది. కొండారెడ్డి పోరు పడలేక బయలుదేరారు. అక్కదేవతల కొండంటే ఆషామాషీ కాదు. శేషాచలం కొండల్లో నడిమధ్యన వుండాది. పులులూ; సింహాలూ వుండాయంటారు. అందుకే కొండారెడ్డి పెద్ద వేటకొడవలి తీసుకొని నడుస్తా వుండాడు ముందుగా. ఎట్టైతే ఏంది... అమావాస్య రాత్రికంతా అక్కదేవతల కొండ చేరినారు. నడిరాత్రి... వంకలో ముగ్గురూ స్నానాలు చేసి వచ్చినారు. పోలేరమ్మ బండపైకి చేరినారు. ముగ్గు తయారైంది. పసుపు, కుంకాలు, యాపాకు మండలు, బూడిద సిద్ధం. తిరుమలయ్య ముగ్గులో కూర్చోని అరచేతిలో అంజనం చుక్క పెట్టుకొని తదేకంగా చూస్తున్నాడు. సిద్ధులయ్య మంత్రాలు జపిస్తూనే వుండాడు. కొండారెడ్డి వేటకొడవలి భుజాన పెట్టుకొని చుట్టూ కాపలా కాస్తా వుండాడు.

తిరుమలయ్య కళ్ళల్లోంచి నీళ్ళు కారతానే వుండాయి.

'చెప్పు తల్లీ... చెప్పు...' అదిరిపడేటట్లు అడిగినాడు అంజనయ్య.

జవాబు లేదు. యాపాకు మండలు తిప్పుతానే వుండాడు. కుంకాలు జల్లుతానే వుండాడు. మంత్రాలు చదువుతానే వుండాడు. 'చెప్పు తల్లీ... చెప్పు...' అని అడుగుతానే వుండాడు.

'రేయ్...' అర్సినాడు తిరుమలయ్య. 'నిధి ఎట్లా బయటకొస్తాది తల్లీ'– అడిగినాడు అంజనయ్య.

'ఎట్లొస్తాది... రేయ్! నరబలి... నరబలి... కావాలిరా... నేనే బయటకొస్తా' తల ఎగురేస్తా రోషంగా జవాబిచ్చినాడు తిరుమలయ్య.

కొండారెడ్డి ఆలస్యం చేయలేదు. చేతిలోని వేటకొడవలి తిరుమలయ్య తలను ఒక్క వేటుకే నరికింది. అంతే!

❀❀❀

మూడేపమాన్ల సత్రం కాన్నుంచి కాలిదావన పడమటి దిక్కుకు బసవేశ్వరుడి దేవళం వైపుకు రాళ్ళగుట్ట దాటుకున్యాక అట్నే అట్నే కవ్వంకోన కాడుంటే పెన్నేరు దాటుకున్న తర్వాత తూర్పుకు దిగితే ఎగువబండకు అవతల నాలుగు యాపచెట్లు పది తుమ్మ చెట్లుంటే వనంలో... అప్పుడెప్పుడో దారితప్పి కొండారెడ్డి ఆవులు జేరుకున్న ఆ వనంలోనే... నిలువెత్తు చింత మాను కొమ్మల్లో శవం వూగుతా వుండాది...

అవును... అవును... అది... అంజన సిద్ధులయ్యదే!

ఏం జరిగిందో బయటి జనానికి ఏమీ తెలియలేదు.

మంత్రాలేవో వికటించినాయని కొందరు...

అక్కదేవతలు ఆగ్రహించి వుంటారని మరికొందరు...

కొండారెడ్డే చంపించి వుంటాడని ఇంకొందరు...

అంజన విద్యకు ద్రోహం చేశాననుకుని ఆత్మహత్య చేసుకొని వుంటాడని పలువురు...

ఏదేదో అనుకుంటా వుండారు...

నిజమేదో ఎవరికి తెలియదు...

కొండారెడ్డి మాత్రం ఎదిగిపోయాడు. రూపాన్ని, స్వరూపాన్ని మార్చుకున్నాడు. మూడు మేడల ఇల్లొకటి లేపినాడు. పెళ్ళాం మెడలో ఎనిమిది పేటల హారం వేసినాడు. కూతుళ్ళకు కోరింది ఇచ్చి కట్టబెట్టినాడు. పొలం పని, ఆవుల మంద అన్నీ వదిలేసి మీసాలు దువ్వుకుంటా జీతగాళ్ళతో వెట్టిచాకిరి చేయించుకుంటా బతుకుతా వుండాడు.

వూర్లో లెఖ్ఖన్న మొగోడు కొండారెడ్డే.

అందుకే ఆయప్పకు వూరు దాసోహమైంది.

❀❀❀

అంజనంపల్లెకాడి రాయలకాలం నాటి సత్రం బోసిపోయి బోరుబోరున మొత్తుకుంటా వుండాది. చుట్టుపక్క యాడేగానీ అంజనమేసి చూసి చెప్పేటోళ్లే లేకుండా పోయినారు. వూర్లల్లో దెయ్యాలు పడితే ఎవరు యిడిపిస్తారు? తప్పిపోయిన వాటి ఆనవాళ్ళు ఎవరు చెప్పగలరు?

కడుపాత్రంతో బతకడానికి చేతిలో అంజనం వేసి మాకు తెల్సిందేదో చెప్పే మా గురించి భవిష్యత్ తరాలవారికి ఎవరు చెప్తారు? మా ఉనికిని గురించి ఎవరు రాస్తారు? మా కతను గురించి ఎవరు మాట్లాడుకుంటారు?

రావిచెట్టు, యాపచెట్టు పెనవేసుకొని వుండే కొమ్మల్లోని పక్షి వొకటి విషాదంగా కూత పెడతానే వుంది... చీకటి పాటలాగా!

– 15 జూన్, 2008 ఆదివారం ఆంధ్రప్రభ.



ముడుపుకొయ్య

ఎండ పెడ్తాంది. సన్నటి వాన కురుస్తాంది. ఎండా వాన. మిట్టమధ్యాహ్నమప్పుడు ఈ సిత్రమెందో! గంగమ్మ గుడి మోట్లో గన్నేరు చెట్టు కింద పండుకొని వుండాది నల్ల కుక్క. దాని కడుపు కర్సుకొని తెల్లపిల్లి నిద్రపోతా వుండాది. భక్తులొది లేసిపోయిన కొబ్బరి చిప్పల్ని కుక్కకు రోంత అవతల ఎర్రమూతి కోతులు నిమ్మళంగా మెట్ల మీద కూర్చుని ఆడుకుంటా తింటా వుండాయి. కళ్యాణకట్ట దగ్గర మిగిలిపోయిన ప్రసాదాన్ని ఎలుకలు సప్పరిస్తా వుండాయి. కోనేరుకు ఆనుకొని వుండె మెట్ల మీద కప్పలు ఎగుర్తా వుంటే దడి రాళ్ళ కాడ పాము ముడుక్కొని వుండాది. సిత్రసిత్రంగా జాతివైరమనే మాటే దాన్లకు తెలీనట్లు కలిసిమెలిసి జీవిస్తా వుండాయి... ఆయమ్మ... ఆ మహాతల్లి... గంగమ్మతల్లి సన్నిధిలో.

ఆడ్నే బయట ఎదురుగా ఆ తల్లిచూపులు చల్లగా పడేలా పాతిన ఎండిన పొడువైన గుంజ ముడుపు కొయ్యకు పసుపు కుంకాలు పూసిండారు. పూజలు చేసిండారు. ముడుపులు కట్టిండారు.

❀❀❀

బయట దండెం మీద ఆరేసిన చీరెను ఇంట్లోకి తెచ్చుకుంది మంజులమ్మ. మడతేసి అల్మారాలో పెట్టడానికి పూనుకుంది. కానీ ఎందుకో మనసొప్పలేదు. తెరిస్తె దాంట్లో పై అరలో పెట్టివుండె 'వాడి' గుడ్డలు చూడాల. అందుకే నులకమంచంకు ఆనుకొని కూలబడింది. గుర్తుకొచ్చాడు. కన్నీళ్ళు పొంగుకొచ్చాయి.

యాడుండాడు? వదిలిపోయినాడు!

ఏవేవో ప్రశ్నలు...

'ఆనా బట్ట... వొక మొగోడేనా? మనిషి జన్మం ఎత్తినాక రోంతన్నా మంచీ మానవత్వం వుండొద్దు!' మనసులో అలజడి, ఆక్రోశం.

కన్నీళ్ళతో పాటూ కసి కూడా.

'సిగ్గూ... శరం లేని మోసకారి నాయాలు. నమ్ముకున్నందుకు నట్టింట ముంచిపోయినాడు'.

గుండెంతా రగుల్తా వుండాది మంజులమ్మకు. వాడ్ని తల్సుకుంటేనే అసహ్యమేస్తా వుండాది. గడ్సిపోయిన కాలమంతా కళ్ళముందు మెదుల్తా వుండాది. బతికిన బతుకంతా కదుల్తా వుండాది. ఔ... ఆ దినాలు...

పల్లెలో బావికాడికి నీళ్ళ కోసం వచ్చింది మంజులమ్మ కడవెత్తుకుని.

ఆడ్నే నీళ్ళకొచ్చిన సిద్ధమ్మ, సావిత్రిలు ఇద్దరూ రోంత దూరంలో వుండే మాచిరెడ్డిగారి చీని తోటకు పోతా వుండామని చెప్పినారు చీనీ కాయలు కోసుకరావడానికి.

చీనీ కాయలంటానే మంజులమ్మకు కూడా నోట్లో నీళ్ళు వూరాయి. నేనూ వస్తా పాండి... అనింది.

ముగ్గురూ కలిసి చీనీ తోటకాడికి పోయినారు. కంప కంచెను దాటుకున్యారు. లోపలికి పోతాండేటప్పుడు చూసినాడు మాచిరెడ్డి చిన్నకొడుకు బాలిరెడ్డి.

'య్యాటికిమ్మే! యిట్టొచ్చినారు... రాళ్ళి... రాళ్ళి మాంఛి ఊపులో వచ్చినారు' – తినొచ్చి నులకమంచం మీద కూర్చుంటా, మీసాలు దువ్వుకుంటా కళ్ళు ఎగరేసినాడు బాలిరెడ్డి.

'రోన్ని చీనికాయలు లేయ్యా... వూరి కాన్నుంచి మా యన్నపిల్లోళ్ళు వచ్చినారు... అడుగుతాండరు...' చెప్పింది సావిత్రి.

'కాయలు కావలమ్మి... బాగుండాదే కత. ఏమిస్తారు?...' యింగోసారి కళ్ళు ఎగురేసినాడు.

'మా అయ్యకు మేమేంది యిచ్చేది...' అనింది సిద్ధమ్మ మూతితిప్పుతా.

'ఓయమ్మ... పైనుండారే... అదో ఆ యాపసెట్టు నీడలో కాయలు పెరికి పెట్టుండారు గానీ తలా యిన్ని తీసుకొని పోళ్ళి...' నవ్వుతా చెప్పినాడు.

'మా అయ్య దేవుడు... మహానుభావుడు' అనింది సావిత్రి.

'కాయలిస్తె దేవుడితిన్నా కన్పిస్తా. ల్యాకుంటే దెయ్యమైతానే బాగుందిమ్మి నువ్వు జెప్పేది...' సిగరెట్ రగిలించినాడు. వెనుక వెళ్తున్న మంజులమ్మ మీద కళ్ళు పడినాయి. 'మ్మే! నువ్వు ఎవరి కూతుర్వి...' పిల్సి అడిగినాడు. మంజులమ్మ ఏం మాట్లాడలేదు. తలొంచుకొని కాయలు ఏరుకుంటా వుండాది.

'ఆయమ్మి... మంజులమ్మ. మన వెంకట్రెడ్డి మామ కూతురు' జవాబిచ్చింది సావిత్రి. ఏరుకున్న కాయలు చీరె కొంగుల్లో కట్టుకొని ఆన్నుంచి బిరబిరా బయటకు వచ్చేసినారు ముగ్గురు.

బాలిరెడ్డి మాత్రం మంజులమ్మ వైపుకే కన్నార్పకుండా చూస్తా వుండాడు.

❁❁❁

వెంకట్రెడ్డి మామకు ఒక్కగానొక్క బిడ్డ. ఆడబిడ్డ... ఈ మంజులమ్మ.

పురిటిలోనే తల్లిని కోల్పోయింది మంజులమ్మ. అన్నుంచి మొదలైనాయి ఆ కుటుంబానికి కష్టాలు. వెంకట్రెడ్డి మామ దుఃఖం అంతా ఇంతా కాదు. బిడ్డ పుట్టిన ఆనందం ఒక పక్క. భార్య పోయిన బాధ ఇంగోపక్క.

సగం వాన. సగం ఎండ. ఎండా వాన జీవితమైంది. ఆరెకరాల శనక్కాయ వేసినోడు ఆకాశం దిక్కు జూస్తా కాలం గడిపినాడు. వాన యాడిది? చినుకు రాలింది ఏది? చూస్తాండగానే కళ్ళముందు పంట ఎండిపోతా వుండాది. దిగదాల బోరు వేసినాడు. దుమ్ము రేగింది. తడిలేదు. ఎగదాల ఇంగో బోరు వేసినాడు. బండ తగిలింది. గుండెలో రాయి పడింది. చేను నట్టనడమన ఆఖరిసారి బోరు వేయించినాడు. నేలతల్లి వట్టి నోరు చూపించింది.

నీటి సడి లేదు. తడి లేదు. కరువు ముంచింది. చివరాఖరికి లక్ష రూపాయలు అప్పు తేలింది. చేతికి రాని పంటను చూస్కొని వెంకట్రెడ్డి దిగులు పడ్డాడు. మంజులమ్మను తన చెల్లెలు లక్షుమ్మ దగ్గరుంచి పెంచమన్నాడు. ఖర్చులకు యింత తీసిపెట్టి అప్పగించి. అప్పుకు వడ్డీ... వడ్డీలకు అప్పులు... తప్పని తిప్పలు...

రెండెకరాల భూమి అమ్ముడైంది. కొంత వడ్డీ తగ్గింది. అసలు కట్టాల్సి వుంది. పొద్దుతిరుగుడు పూలు వేస్తా వుండారు అందరు రైతులు. అయితే అయితాది... పోతే పోతాది... మళ్ళా నేలను నమ్ముకొని రంగంలోకి దిగినాడు వెంకట్రెడ్డి. నమ్మకం కాస్తా అపనమ్మకమైంది.

రైతును ఎప్పుడైతే మాత్రం ఈ కరువు పచ్చగా బతకనిచ్చింది? ఎత్తుగా ఎదగనిచ్చింది? చాళ్ళు... చాళ్ళు... బీళ్ళు... బీళ్ళు... తన్నింది... మళ్ళీ తన్నింది.. ఎగిచ్చి ఎడమకాల్తో డొక్కలో తన్నింది... కరువు! గుదిబండ బరువు! మళమళమని మాడి మసైపోతాండయి సెట్లు. దుఖ్ఖం. రైతు గుండె దుఖ్ఖం. ఇంకో రెండెకరాల భూమి అమ్మకమైంది. కూతురు మంజులమ్మకు వయసొస్తా వుండాది.

అప్పులోళ్ల రావిడి ఎక్కువైంది. కోర్టు కేస్తామని భయపడిస్తా వుండారు. రాత్రి పండుకున్నాడేగానీ వెంకట్రెడ్డికి ఇదే దిగులైంది. ఆలోచించినాడు. ఆలోచించిస్తానే నిద్రపోయినాడు. నిద్రలోనే పోయినాడు. కరువు నేలను నమ్ముకుంటే అప్పులు మెడకు బిగిసుకున్నాయి.

నడిరాత్రి ప్రాణాలు విడ్సినాడు. ఊరంతా వెంకట్రెడ్డి గురించే చెప్పుకొనింది. మంజులమ్మ కన్నీళ్ళతో పొంగిపోయిన ఉప్పెనైంది. ఓదార్చను ఎవరి చేత కాలేదు.

తల్లిలేని పిల్ల యిప్పుడు తండ్రిలేని పిల్ల కూడా అయ్యింది. వుండే భూమంతా అమ్మి అప్పులు కట్టినారు చెల్లెలు లక్షుమ్మ, ఆమె భర్త శివారెడ్డి. మంజులమ్మ పూర్తి బాధ్యత ఆ కుటుంబం మీదే పడింది. పైగా వారికి ఇద్దరూ ఆడపిల్లలే. వాళ్ళను పోషిస్తా మళ్ళీ మంజులమ్మసంగతి అనుకుంటే గుండెల్లో దడ పుడతా వుండాది వాళ్ళకు.

బలపనూరు నాగిరెడ్డి కొడుకును సంబంధం చేసుకోను మాట్లాడితే లక్షల కట్నం అడిగినాడు. నిజానికి వాళ్ళకు ఆయన మామ వరస దగ్గరి బంధువు. వెంకట్రెడ్డి మామ బతికి వుండేటప్పుడు వారానికి ఒకసారి వచ్చి చేతి ఖర్చులకు లెఖ్క తీసుకొని పోతా వుండేటోడు... కానీ ఇప్పుడు అవసరానికి బేరం పెడతా వుండాడు.

ఇంగో రెండు సంబంధాలు చూసినారు. రెడ్ల ఇండ్లల్లో పెళ్ళి కుదరాలంటే కట్నాలు మండిపోతా వుండాయి. యాడ కుదర్తా వుండాది. మంజులమ్మ పేరు మీద వెంకట్రెడ్డి మామ ఇచ్చిపోయిన సొమ్ము మిగలకుండా అయిపోయింది. ఆ ఖర్చు అని ఈ ఖర్చు అని!

మంజులమ్మ పెళ్ళి విషయం ఎక్కడా ఖరారు కాకుండా పోతా వుండాది. అదే దిగులు. అదే బాధ. మేనత్త, మేనమామలు తన పెండ్లి విషయంలో పడ్తాండే శ్రమనంతా మంజులమ్మ నిశ్శబ్దంగా చూస్తానే వుండాది. తనకు అందం వుంది. ఆస్తి లేదు – తన చేతుల్లో ఏముండాది? వచ్చిన సంబంధాలన్ని కట్నంకాడ ఎగిరిపోతా వుండాయి. ఇంగ ఈ పిల్లకు పెళ్ళి అయ్యితాదా లేదా? అని వూర్లో అందరూ అనుకుంటా వుండిరి. కాలం యిట్టా నడుస్తా వున్నింది.

❋❋❋

మాచిరెడ్డి చిన్నకొడుకు బాలిరెడ్డి వయసులోనే వుండాడు. ఇంగా పెండ్లి కాలేదు. మంజులమ్మను చూసిన కాన్నుంచి మనసంతా గుంజుతా వున్నింది. వలేసే వేటగాడికి అలసట ఏముండాది? బావికాడికి మంజులమ్మ నీళ్ళకొచ్చిందంటే బాలిరెడ్డి ఆడికి చేరుకునేటోడు.

తోడిపోయమని అరచేతుల దోసిలి పట్టేటోడు. ఆయమ్మి దిక్కు తెలియక అల్లాడేది. ఏం జెప్పాలో తెల్సి వచ్చేది కాదు. బాయి కాన్నుంచి వచ్చేసేది. ఒకట్రొండు సార్లు అట్టే చేసింది. అయినా బాలిరెడ్డి ఆయమ్మిని విడ్సిపెట్టలేదు.

'అయ్యా! మీరు మాకంటే పెద్దరెడ్లు. మేం మీకు తూగం. సరిపోము. నన్ను విడ్సిపెట్టండి' అంటూ మంజులమ్మ ఓసారి బాలిరెడ్డికి చెప్పింది కూడా! బాలిరెడ్డి ఆ మాటలు వినలేదు 'ప్రేమకు విలువ వుందని' నోటికొచ్చిందేదో చెప్పాడు.

మంజులమ్మ కాదంది. 'అంత భయమైతే... గుట్టుగా ప్రేమించుకుందామని కొన్ని రోజుల తర్వాత తన ఇంట్లో ఒప్పించి పెళ్ళి చేసుకుంటానని' మాయమాటలు నమ్మబలికాడు. మంజులమ్మ ఏం మాట్లాడలేదు. గాలానికి చేప చిక్కినట్లు అయ్యింది.

ఆరోజు నుంచి మంజులమ్మతో మాటమాట కలిసింది. మనసు మనసు జత అయ్యింది. ప్రొద్దున్నుంచి సాయంత్రం వరకు తోటంతా మల్లెపందిరి అయ్యింది. బాలిరెడ్డి, మంజులమ్మల ప్రేమాయణం వూరువూరంతా గుప్పుమంది. మేనత్త, మేనమామలు ఈ సంగతి తెల్సి మంజులమ్మను నిలదీశారు.

కానీ అప్పటికే ప్రయోజనం లేకపోయింది. 'ఏవేవి జరగకూడదో అవన్నీ జరిగిపోయాయని బాలిరెడ్డితో కల్సి బతకడం తప్ప ఇంకేం చేయలేనని' చెప్పింది కళ్ళల్లో కన్నీళ్ళు నింపుకొని.

మేనమామ శివారెడ్డి, బాలిరెడ్డిని కల్సి పెండ్లి సంగతి ఎత్తిడిస్సినాడు.

టౌన్లో నాయన మాచిరెడ్డి వుంటాడని మీరు వస్తే మాట్లాడవచ్చు అన్నాడు.

ఒక మంచి రోజు చూసుకొని పోయినాడు మాట్లాడను మాచిరెడ్డి దగ్గరికి. సంగతంతా చెప్పినాడు. నెత్తిన పిడుగు పడినట్లు అయ్యింది.

'ఎమ్మెల్యే చిన్న కూతుర్నిచ్చి బాలిరెడ్డికి సంబంధం మాట్లాడినట్లు' చెప్పినాడు మాచిరెడ్డి. గట్టిగానే వాదించినాడు శివారెడ్డి.

'ఆయమ్మికి పెండ్లి కావడం లేదని, తన కొడుకు పైకి ఉసిగొల్పి నాటకమాడ్తా వుండారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయమ్మితో పెండ్లి కుదర్దని' పుల్ల విరిచి చేతిలో పెట్టినట్లు చెప్పినాడు మాచిరెడ్డి. మాటామాటా పెరిగింది. కలబడే కాడికి పోయింది. చివరికి పోలీస్ స్టేషన్ కెక్కింది పరిస్థితి. కేసులు పెట్టుకున్నారిద్దరూ.

❋❋❋

ఆ తర్వాత బాలిరెడ్డి పల్లెకు రాలేదు. విచారిస్తే తెల్సింది తోట అమ్మేసి టౌన్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటా వుండాడని. మంజులమ్మ దుఖ్ఖం అంతా ఇంతా కాదు. బోరు బోరున ఏడ్సింది. నెత్తీ నోరూ మొత్తుకుంటా కుప్పకూలింది.

'నేను ముందు కాన్నుంచే చెప్తానే వుండాను. తల్లిదండ్రిలేని బిడ్డవు, జాగ్రత్తగా వుండమని. నా మాట ఎప్పుడింటివి. చే చేతులారా నీ జీవితం నువ్వే నాశనం చేసుకున్నావు...' అంటా మేనత్త లక్ష్మమ్మ తిట్టిపోసింది.

'తనకింకా పెళ్ళి కావల్సిన ఇద్దరు కూతుర్లు వుండారని వాళ్ళ మీద ఇట్టాటి నీడలు పడితే తాను సహించలేనని' కూడా చెప్పడం మంజులమ్మను మరింత బాధించింది.

రోజులు గడుస్తా వుండాయి చేదుగా. రాత్రి బయట మంచమేసుకొని పండుకొని ఆలోచిస్తానే వుండాది. యింత జరిగాక తనకింక పెళ్ళి కాదు! ఎవరూ చేసుకోవడానికి ముందుకు రారు! కళ్ళ ముందు శూన్యం. తన బతుకును నాశనం చేసిన బాలిరెడ్డిని తల్చుకుంటే గుండె మండిపోతా వుండాది.

తనకేం కావాలి ఇప్పుడు?

ఏం వద్దు... తన రెక్కల్లో సత్తువుండాది. పని చేస్కొని బతుక్కోగలదు.

మరి... మరి...?

ఒక తోడు కావాలి. కాస్త నీడ కావాలి.

ఒక బిడ్డ కావాలి. తను తల్లి కావాలి... ఎవరిస్తారు?

దూరంగా గుళ్ళో గంట మ్రోగింది.

కంఠం... గంభీరమైన భక్తితత్వం నిండిన స్వరం.. పల్లెనంత అల్లుకపోతున్న రాగం...

'అమ్మలగన్న అమ్మ మంగళమే

జగదంబ జయ మంగళమే

మంగళమే జగదాంబ మంగళం

మంగళమే కనకాంబ జయ మంగళం...' హారతి పాట.

గంగమ్మ దేవళంలో పూజ జరుగుతాంది. రంగసముద్రం కాన్నుంచి భజన చేయడానికి బృందం వచ్చింది. వూర్లోని జనమంతా చూడడానికి పోతా వుండారు. హారతి తర్వాత భజన మొదలైతాది. చుట్టుపక్క అరవై నాలుగు పల్లెల్నుంచి జనం వచ్చి వుండారు బండ్లు కట్టుకొని.

మంజులమ్మ కూడా ఆడికిపోయి కూర్చుంటే మనసు రోంత కుదుట పడుతుందని అనుకుంది. లేచి బయలుదేరింది. ఎక్కడ జూసినా జనం... జనం... గురువులయ్య ఎవరో... యువకుడు. దిగువపల్లెకు చెందిన సంజీవుడు. సాధన చేసి భారత, రామాయణాలను నేర్చుకొని వుండాడని తక్కువ జాతివాడైనా శాస్త్రాలన్నీ చదివినోడని జనమంతా చెప్పుకుంటా వుండారు.

ఆ స్వరం... కంఠం... రాగం ఎంత మధురంగా వుండాది!

మనిషిలో ఎంత వినయం... వినమ్రత... మంచి వ్యక్తి అని అందరూ అనుకుంటా వుండారు. మంజులమ్మ లేచి ముందుకెళ్ళి మండపానికి దగ్గరగా

కూర్చుంది. అతడ్నే కన్నార్పకుండా చూస్తోంది. ఒక నిర్ణయానికి వచ్చినదానిలా పైకి లేచింది.

దేవళంలో ఎదురుగా పాతిన ఎండిన పొడవైన గుంజకు ముడుపు కట్టింది... మూడుసార్లు ప్రదక్షిణ చేసి! ప్రాణానికి నిమ్మళంగా వుంది. బరువేదో దిగిపోతున్న అనుభూతి.

ఒంటరి ఆకాశంలోకి చేతులు చాపి ముఖాన్ని కడుక్కోవాలనుంది మంజులమ్మకు. కొత్తగా విప్పారి ఒక చంద్రుడ్ని పుట్టించాలని కళ్ళనిండా కమ్మని కల... కలవరం... వరం... సంజీవుడు కళ్ళముందు ఆడతాపాడతా వుంటే చూడ్డానికి రెండు కళ్ళు చాలడం లేదు. చూస్తానే వుంది. నడిరాత్రికి ఒక కథ పూర్తయ్యింది.

రంగసముద్రం కాన్నుంచి భజన చేయడానికి వచ్చిన బృందం వేదిక పైకెక్కింది.

సంజీవుడు దిగి కళ్యాణకట్టకు అవతల వుండే మెట్ల వైపుకి పోయినాడు. తలకు తగిలించిన తలపాగా తీసి కిందపెట్టాడు. కోనేరులోని చల్లని నీటిని దోసిట్లోకి తీసుకొని ముఖాన్ని కడుక్కుంటా వుండాడు. చీకట్లో చిన్నగా కాలుజారింది. లోపలికి పడబోతు నిలదొక్కుకున్నాడు. వెనుక నుంచి ఎవరో నవ్విన శబ్దం...

ఔను... ఆయమ్మి... మంజులమ్మ... సంజీవుడ్ని చూసి నవ్వింది... 'నువ్వు గురువులయ్యావా... ఈ భజన పాటలు, దేవత కథలు నాకూ నేర్పిస్తావు?' వెళ్ళి కట్టమెట్ల మీద కూర్చుంటా అడిగింది మంజులమ్మ.

సంజీవుడు మాట్లాడలేదు. సన్నగా నవ్వాడు.

"చెప్పు... నేర్పిస్తావు?..." మళ్ళీ ప్రశ్న.

'ఆకలి అయితా వుండది... ఏం నేర్పించాల... నీళ్ళు తాగి కడుపు నింపుకుంటా వుండాను...' ఏదో తనలో తాను గొణుక్కున్నాడు సంజీవుడు.

'కొత్త గురువులయ్య... పా... మా ఇంటికి పోదాం... వేడివేడిగా చేసి పెడ్తా...' పిల్సింది ప్రేమగా.

సాయంత్రం నుంచి గొంతు ఎత్తి పాడిపాడి అలిసిపోయిన సంజీవుడు 'వేడివేడి'గా అనే మాట వినగానే 'నిజంగానా?' అన్నాడు.

'పా... పోదాం... వూర్లోకి...' కదిల్నారు ఇద్దరూ.

దూరంగా కీచురాళ్ళ రొద.

'వూరి జనమంతా గుడికాడ వుంటే మనం వూర్లోకి పోతా వుండాము...' అన్యాడు సంజీవుడు.

'ఏం భయంగా వుందా?'

'కొత్త వూరు కాబట్టి'

'నా చేయి పట్టుకొని నడ్సు నేను నిన్ను తీసుకపోత...' వేలు అందించింది.

'వద్దు... నువ్వు ముందు నడుస్తా వుంటే నేను నీ వెనకలే వస్తా... దారి తెలుస్తాది...' జవాబిచ్చాడు సంజీవుడు.

వెన్నెల వెలుగు కురుస్తాంది.

మంజులమ్మ ముందు నడుస్తాంది... వెనుక సంజీవుడు.

'ఆడదాని వెనుక నడసాలంటే ఎంత నిబ్బరం వుండాలో' సంజీవుడికి రోంత రోంత తెలుస్తా వుండాది.

నిగ్రహించుకొని నడుస్తా వుండాడు.

రెడ్డిండ్ల దావ ఎక్కగానే కుక్కలు 'భౌ'మని మొరుగుతా వుండాయి.

'కుక్కలంటే నాకు భయం' అంటా మంజులమ్మ చేయిని పట్టుకున్యాడు సంజీవుడు.

'నీకు పెళ్ళైంది?'

'కాలేదు'

'మరి నీకు?'

'నాకూ కానట్లే'

'ఈ వూరి కుక్కలకు నోరెక్కువ. భయపడాకు నేను తీసుకపోతారా...' అని దార్లోకి తెచ్చింది – చిటికెన వేలు పట్టుకుని.

ఇంటి కాడికి పోయినారు. పెద్ద వసారా... తాళం తీసింది...

'నేను తక్కువ జాతోడిని ఇంట్లోకి రావచ్చో... లేదో...' చిన్నగా అన్నాడు సంజీవుడు.

'మాట్లాడకుండా నోర్మూసుకొని లోపలికి రా...' చిటికెనవేలు వదలకుండా గుంజుకపోయింది.

ఆకాశంలో మెరుపు మెర్సినట్లు అయ్యింది. చల్లటిగాలి రాగాలు పాడ్తా వుండాది గుడిలోని పాటలు మోసుకొస్తా.

బిందెడు నీళ్ళు ఇచ్చి స్నానం చేసి రమ్మనింది. పొయ్యి రగిలించింది. అన్నం ఉడుకుతా వుండాది. మనసు కాగుతా వుండాది. ఊరిబిండి నూరింది. వేడివేడి

అన్నం కారం వడ్డించింది. కడుపు నిండా తిన్నాడు సంజీవుడు. 'అన్నదాత సుఖీభవ...' అని అన్నాడు.

మంజులమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు...

సంజీవుడికి ఆమె ఎందుకేడుస్తోందో అర్థం కాలేదు. ఓదార్చాలని ప్రయత్నించాడు. కానీ కుదరడం లేదు. కాసేపు భయపడ్డాడు. మరికాసేపు దిగులుపడ్డాడు.

'నాకొక సాయం చేస్తావా...' చాలాసేపటి తర్వాత నోరువిప్పింది మంజులమ్మ.

'నాకు చేతనైందైతే తప్పకుండా చేస్తాను' హామీ ఇస్తున్నట్లే చెప్పాడు.

'ఇంత రాత్రిపూట నీ కడుపు నింపాను కదా... నువ్వు నా కడుపు నింపుతావా?' ప్రశ్న కాదు పాశుపతాస్త్రం. దూసుకొచ్చి గుండెల్లో దిగింది.

'నా జాతి వేరు. మీ జాతి వేరు. నా స్థాయి వేరు. మీ స్థాయి వేరు. నువ్వు అడిగేదేమైనా న్యాయమంటావా...' ప్రశ్నించాడు సంజీవుడు.

'జాతుల గురించి న్యాయాల గురించి నాకు తెలీదు. ఒక మగవాడు నాకు మోసం చేశాడు. దాన్ని ఇంకో మగవాడు సరిదిద్దుతాడ నుకుంటున్నాను. నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా.. నన్ను ఇక్కడ్నుంచి ఎక్కడికైనా దూరంగా తీసుకెళ్తావా...' మంజులమ్మ ఎంతో ఆర్ద్రంగా ప్రాధేయపడ్తు అడుగుతోంది.

'ఇది తప్పుకదా!'

'తప్పదు. కొన్నిసార్లు తప్పనిసరిగా తప్పు ఒప్పుకోవాలి. నీకు దండం పెడ్తాను' ఆమె రెండు చేతులు జోడించి వేడుకుంటోంది.

'నా జాతి వేరు... నీ జాతి...' మాటలు పూర్తి కాకముందే ఆమె పెదాలు అతడి పెదాల్ని మూసేశాయి. బలంగా వీచిన గాలికి ఆమె కురులు అతడి ముఖాన్ని కప్పేశాయి. రెండు శరీరాలు రగులుకున్నాయి. ఒకే శ్వాస. ఒక్కటే ఆశ.

ఎండుగడ్డి మోపుల మీద కట్టుకున్న చీరె విప్పి పరిచింది. ఇంద్రధనస్సు వంగింది. చీకటి ఆకాశం చుక్కల చంద్రుని కాంతికి మత్తుగా పురివిప్పింది. వెన్నెల బరువు మోయలేని కెరటాలు తీరం కేసి తలబాదుకున్నట్లు కోరికలు... ఆకాశంలోకి కొమ్మల్ని ఎక్కించిన మఱ్రిమాను లయబద్ధంగా శబ్దం చేస్తూ వుంది బయట... నీల శోర్ణిత అల దిగంతాల వరకు నిశ్చలంగా ఎగబాకుతోంది. సరుగుడు చెట్ల నుంచి బయలుదేరిన గాలి సముద్ర స్నానంతో పులకిస్తోంది. దీర్ఘమైన ప్రయాసతో రాత్రి ఒక ఇరుకుదారి మధ్య చిక్కుకపోయింది. ఛామన ఛాయతో నవ్వే ఆమె ముఖారవిందం,

నల్లని కనుసోగల పలకరింపు, మట్టిగాజుల సవ్వడి, కుంకుమ భరిణలా ఆమె మెర్సిపోతా వుండాది. కరిగి కరిగి కురుస్తున్న వెన్నెలవాన. కాసేపటి తర్వాత నిశ్శబ్దం...

జాతర ముగిసింది.

దూరంగా గుడి దగ్గర్నుంచి మంగళగీతం విన్పిస్తోంది. ఇద్దరూ పైకి లేచారు. పైట కొంగుతో అతడి నుదుటి చమటను తుడిచింది. కదిలారు దేవళం వైపుకి.

'యిప్పటికే చాలా బాధలు చూశాను. చావాలని కూడా అనుకున్నాను. నిన్ను చూసిన తర్వాత కొత్త జీవితం మీద ఆశ పుట్టింది. నిన్ను నమ్మి కట్టుబట్టల్తో వూరొదిలి వస్తున్నాను. నన్ను జీవితాంతం బాగా చూస్కుంటావు కదూ...' ప్రేమ నిండిన కళ్ళతో అడిగింది.

అతడు ఆత్మీయంగా భుజం తట్టి ఓదార్చాడు ముందుకు సాగుతూ. దూరంగా చీకట్లో వూరి కుక్కలు మొరిగి మొరిగి గోల చేసి నిమ్మళపడ్డాయి. కాలం గడుస్తోంది.

❁❁❁

ఎప్పటిలాగే పొద్దున్నే లేచి ఎద్లను అదిలించుకుంటూ పొలం వెళ్ళే రైతులు దేవళంలోకి దండం పెట్టుకోను పోయినప్పుడు ఒక విచిత్రం చూసినారు. గంగమ్మ తల్లికి ఎదురుగా బయట ఆ తల్లిచూపులు పడేలా పాతిన ఎండిన పొడవైన గుంజ ముడుపుకొయ్య ఇన్నాళ్ళ తర్వాత చిగురేసిందని గమనించినారు. ఈ సంగతి వూర్లకు వూర్లు, పల్లెలకు పల్లెలకు దండోరా కూడా కొట్టించినారు. ముడుపు కొయ్య చుట్టూ పాదు చేసినారు. నిండుబిందె నీళ్ళు పోసినారు. పసుపు కుంకాలు చల్లినారు. పూజలు చేసినారు. ఈ సిత్రం చూడను తండోపతండాలుగా జనం తరలివచ్చినారు. వూర్లో ఏదో బ్రహ్మాండమైన అద్భుతం జరగబోతా వుండాదని అనుకుంటా వుండారు.

❁❁❁

ఎండ పెడ్తాంది. సన్నటి వాన కురస్తాంది. ఎండావాన. గుడిమోట్లోని గన్నేరు చెట్టు కింద పడుకొని వుండాది నల్లకుక్క. దాని కడుపు కర్సుకొని తెల్లపిల్లి నిద్రపోతా వుండాది. సిత్రసిత్రంగా జాతివైరమనే మాట దాన్లకు తెలీనట్లు కలిసిమెలిసి జీవిస్తా వుండాయి. ఎండావాన కురస్తానే వుంది.

❁

కొలిమ్మాను

కేసు కట్టినారు.

ప్రత్యక్షసాక్షుల కింద శివుడు; వాడికాడ పని చేసే అంజిగాడి పేర్లు కూడా నమోదు చేశారు. కొలిమి నిప్పులతో రాజెయ్యక ఇవాళ్టికి మూడోరోజు. చెట్టు నుంచి రాలిపోయిన యాపాకులు, కొమ్మలు షెడ్డు ముందు పేరకపోయి పడుండాయి. తయారు చేస్తా మధ్యలోనే ఆగిపోయిన సామాన్లు అసంపూర్ణంగానే మిగిలిపోయాయి.

షెడ్డు తెరచి కొలిమి రగిలించి ఆ సామాన్లు రోన్ని తయారు చేసుకొని నాలుగు రూకలు వెనకేసుకొని బ్యాంకు లోను తీర్చుకుందామనుకుంటే ఈ పోలీసోళ్ళ తాకిడి వొకటి. ఎస్సై పిలుస్తా వుండాడని; హెడ్ కానిస్టేబుల్ రమ్మంటూ వుండాడని, రైటర్ ఏదో రాసుకోవాలని దిన్నం పిలిపించుకుంటానే వుండారు.

'దొరా... మాకే పాపం తెలీదు! మా పేర్లు కేసులో ఏంటికి పెట్టినారు. సిన్నోళ్ళం. బతకలేనోళ్ళం' అని స్టేషన్‌కు పోయిన ప్రతిసారీ శివుడు ప్రాధేయపడ్తానే వుండాడు. పోలీసోళ్ళకు చిక్కితే వదుల్తారు? 'నూరు యిచ్చి పోయి మళ్ళీ రెండ్రోజుల తర్వాత రా జమ్మలమడుగు కోర్టులో కేసు విచారణ వుండాది...' చెప్పినాడు సిగరెట్ పొగ వదుల్తా పోలీసాయన.

'అట్నేలే సామీ...' అని జెప్పి శివుడు వెనక్కి వచ్చినాడు.

ఇంటికొచ్చినాడే కానీ మనసంతా బాధగా వుండాది. మూడ్రోజుల్నుంచి నిద్రపట్టక కళ్ళు ఎర్రగా మండుతా వుండాయి.

కళ్ళు మూసుకుంటే కల్లోలంగా వుంది... కళ్ళ ముందు... పట్టపగలు... నడిబజార్లో... వెంటపడి వెంటపడి సరిగ్గా కొలిమ్మాను దగ్గర సిద్ధారెడ్డిని నరికినారు. ఎవరో కాదు తిమ్మాపురం అంకిరెడ్డి మనుషులు. జనమంతా పరుగులు పెట్టి పారిపోయారు. పోలీసులొచ్చి తన కొలిమి దెగ్గర హత్య జరిగింది కాబట్టి సాక్షుల కింద తన పేరు చేర్చారు.

ఫ్యాక్షన్ లేదు... ఫ్యాక్షన్ లేదు... అని మనకు మనం భుజాలు తట్టుకొని సంబరపడడం తప్పించి జరుగుతా వుండేది ఏందో అందరికీ తెలుసు!

సిద్ధారెడ్డిని ఎవరైనా ఊరికే ఎందుకు చంపుతారు? ఆయప్ప రెండేళ్ళ క్రితం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అంకిరెడ్డి మనుషుల్ని ముగ్గుర్ని తాడిపత్రి బస్టాండు దగ్గర లేపించినాడు. దాని పగ... పర్యవసానం ఇప్పుడు వాటం చూసుకొని ఆయప్పను

వీళ్ళు లేపినారు. యింగ అంకిరెడ్డి మనుషుల కోసం సిద్ధారెడ్డి అన్న భాస్కరరెడ్డి పొంచుకొని అదును కోసం చూస్తా వుండాడు.

ఈ ఫ్యాక్షన్ యాడ పోతాది?

తన ఖర్మ కాకపోతే తన కొలిమి కాడ్నే ఈ హత్య జరగాలా? శివుడి తలనిండా రకరకాల ఆలోచనలు. కళ్ళముందు బ్యాంకు లోను కన్పిస్తా వుండాది. దాన్ని ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

ఇంటికాడ దగ్గుతా వుండే తండ్రి...

గవర్నమెంటు ఆసుపత్రిలో మందులేం వుండవు. వాళ్ళన్ని మెడికల్ షాపులోల్లకు అమ్ముకొని సొమ్ము జేసుకుంటా వుంటారు. వాళ్ళకు అదో బతుకుతెరువు, అదనపు ఆదాయం. నిన్న ఆసుపత్రికి పోతే డాక్టర్ లేడు. మందులు లేవు. తండ్రి పాపం... తెల్లవార్లూ దగ్గుతానే వుండాడు. పక్కీరప్ప కాడ యాభై అప్పు యిప్పించుకొని రెండు మాత్రల బిళ్ళలు; ఒక దగ్గు మందు కొన్నాడు శివుడు.

తండ్రి... పెద్దన్న! వూర్లో మంచిపేరు పెట్టుకొని పెద్దరికంగా బతికి పదిమంది కాడ గౌరవం, అభిమానం సంపాదించుకున్న మనిషి.

రైల్వేస్టేషన్ కాన్నుంచి వూర్లోకి వచ్చే దావకానుకొని వుండే పెద్దయాప చెట్టు... దాని గురించి చెప్పను అలివి కాదు. కొమ్మలు ఎత్తుకు... ఆకాశం అంచుల్లోకి పోయి మబ్బుల్ని చుట్టుకొని లాక్కొస్తాయనేంత ఎత్తుకు ఎదిగి ఉంటాయి. వూరు నిద్రమత్తులోంచి మేల్కోవాలంటే ఆ యాపచెట్టు మీది కాకులు గలగలమని అరుస్తాంటే తప్ప తెల్లారదనిపిస్తాది. వేకువఝామునే ఊరంతా నిద్రలేవకముందే పక్షుల కిలకిలారావాల కేరింతలతో ఈ చెట్టు నిద్ర మేల్కొంటుంది. రాత్రినంతా తనలోకి గుంజుకొని ఉదయాన్నే పుష్పించే అరుణోదయ వేళ పక్షులన్నీ రెక్కలు విదుల్చుకొని గగనానికి ఎగరడానికి సిద్ధమౌతాయి.

ఇంకా మొలిచి మొలవని రెక్కలతో ఎగరడానికి పసికూనలు పడే తాపత్రయాన్ని చూసి తల్లి పక్షులు ముసిముసిగా నవ్వుకుంటాయి. ఆ తప్పటడుగుల నుంచి ఆకాశాన్ని అందుకోవాలనే ఆరాటం లేతకూనల కనుపాపల లోతుల్లో మెరుస్తుంది నీలవర్ణంలో.

శాఖోపశాఖలుగా విస్తరించిన వేపచెట్టు నీడ కింద పదిలంగా అల్లుకున్న పక్షి గూళ్ళలో వెచ్చగా కదలాడే కూనలు... ఒక ఆకుపచ్చని లోకంలా... కీకారణ్యంలా వుండే వేపచెట్టు తూరుపు కొమ్మల్లో పక్షి వొకటి ఎక్కడెక్కడో తిరిగి పుల్లల్ని, మెత్తటి

ఆకుల్ని, గడ్డి రెమ్మల్ని మోసుకొచ్చి అందంగా, అపురూపంగా తన ఆశల్ని ఆకాంక్షల్ని రంగరించి చక్కటి గూడును నిర్మించుకుంటున్న దృశ్యం... ఆదారెంబడి వెళ్తూ పెద్దన్న పైకి చూశాడు.

తనకు తన బతుకు కళ్ళముందు తెరలుతెరలుగా కన్పించింది. ముద్దనూరు రైల్వేస్టేషన్ కల్పతరువు అన్పించింది. ఉదయం గంపకు జామకాయలు తీసుకొని మెయిల్ ఎక్కితే కమలాపురం వరకు అడిగే వాడుండడు. వ్యాపారం బాగా జరుగుతుంది. మళ్ళీ ఆన్నుంచి దాదర్ పట్టుకుంటే గుత్తి వరకు వ్యాపారం చేసుకోవచ్చు. ఆలోచన వచ్చిందే పనిగా కాంట్రాక్టు వేసుకున్న వాళ్ళతో పాటుగా తానూ గంప అందుకున్నాడు.

సీజన్‌ను బట్టి దొరికే పండ్లు అన్నీ రైల్వే బోగీల్లో అమ్ముకునే ఏర్పాటు తనకు కుదిరిందేగానీ టి.సీలతో, ఆర్‌పిఎఫ్ పోలీసులతో చావచ్చి పడింది. వాళ్లు మాట్లాడకుండానే గదమాయించి పండ్లు లాక్కునేవాళ్ళు. స్క్వాడ్ ఎక్కినప్పుడైతే సంపాదించిన లెఖ్ఖంతా జరిమానా కింద కట్టాల్సి వచ్చేది. ఎట్లైతే ఏంది జీవితం పడ్తా లేస్తానే సాగిపోతా వుండేది. ఇట్లా రైల్లోనే పరిచయమైనాడు చార్లి. చార్లిగాడికి తన కొడుకుకంటే నాలుగేళ్ళ వయస్సెక్కువుంటుంది. బాగానే సంపాదిస్తా వుండాడు. ఎట్లా?

రాత్రిపూట గూడ్స్ బోగీలు పోతా వుంటాయి. దాంట్లో బొగ్గు రవాణా అవుతా వుంటుంది. వీడు ఖాళీ సంచులు తీసుకొని కడపలో దాన్లలోకి ఎక్కుతాడు. సంచుల నిండాకు బొగ్గు కూర్చి మూటల్ని కట్టుకొని కూర్చుంటాడు. ఇంగ ముద్దనూరు వస్తా వుండాది అనగా ఔటర్లోనే ఈ మూటలన్నీ కంపచెట్లల్లోకి విసిరేస్తా వస్తాడు. తర్వాత స్టేషన్లో దిగి తెల్లారినాక ఆ సంచుల్లోని బొగ్గునంతా ఆడ్నే మోరీ కింద పెట్టుకొని సున్నం బట్టీలోల్లకు అమ్ముకుంటా వుంటాడు. మంచి డబ్బు. రైల్వేబొగ్గుకు గిరాకీ కూడా ఎక్కువ. కానీ ఈ సంగతి ఆర్‌పిఎఫ్ పోలీసులకు తెల్సిందంటే మక్కిలిరగదన్ని గుంటకల్ జైలుకు పిల్సుకపోతారు. కానీ చార్లిగాడు అనుమానం రాకుండా ఉదయమంతా జల్సాగా తిరుక్కుంటా రాత్రిపూట ఈ వ్యవహారం నడిపేటోడు. ఒక దశలో పెద్దన్నకు కూడా ఈ బొగ్గు వ్యాపారం చేయాలనే అన్పించింది. ఇంటికాడ భార్య, బిడ్డలు గుర్తుకొచ్చి భయపడినాడు.

రైల్లల్లో పండ్లు అమ్ముకునేటోళ్ళందరూ ఎప్పుడూ స్టేషన్ కాన్నుంచి వూర్లోకి వచ్చే దావకానుకొని వుండే వేపచెట్టు నీడలో మాట్లాడుకుంటా వుండేటోళ్ళు. దత్తాపురం కాన్నుంచి తోటలోళ్ళు కూడా పండ్లు ఆడికే వేసుకొచ్చి హోల్‌సేల్‌గా వీళ్ళకు అమ్మేటోళ్ళు. వేపచెట్టు కింద ఎప్పుడూ సందడి సందడిగా వుంటుంది.

సాయంత్రం చార్లిగాడు పెద్దన్నకు కనపడినాడు. రెండు చేతులకు నాలుగు ఉంగరాలు మెరుస్తా వుండాయి. మెడలో బంగారు గొలుసు కూడా!

'ఓన్నా... పెద్దన్న!

ఇట్లా ఎంతకాలం ఆ రైళ్ళల్లోబడి కాయలమ్ముకుంటావు గానీ... నీ కొడుకును ఆ హైస్కూలు మాన్పించి నా వెనక పంపి... రెండు చేతులా సంపాదిస్తాడు' చెప్పినాడు మెరిసే చేయి తిప్పుతా.

'వద్దులే... పాపోడా! ఈ సంవత్సరం పదో తరగతి అయిపోనీ యాడనన్న ఆఫీసుల్లో కాయితాలు అందించే పనికి, కాఫీలు తెచ్చే పనికి పెడితే సరిపోతాది. వాడు మొరటు పనులు చేయలేడుగానీ...' తన మనసులోని మాట చెప్పినాడు పెద్దన్న.

స్టేషన్లో బెల్ మోగింది...

మరికాసేపట్లో దాదర్ వస్తుంది...

జామకాయల గంప అందుకున్నాడు వేపచెట్టుకాన్నుంచి అందరితో పాటూ పైకిలేస్తూ.

❀❀❀

ఈరోజు ఉదయం నుంచి ఎడమకాలు సహకరించడం లేదు. నరం పట్టుకుంటోంది. అట్నే మొండికి బోగీలు మారతానే వ్యాపారం సాగిస్తా వుండాడు. కమలాపురంలో రైలు ఆగేటప్పుడు ఎవరో అరిచారు... స్క్వాడ్ ఎక్కుతోందని. ప్రొద్దున్నుంచి జరిగిన వ్యాపారం నోట్లు బనీను జేబులో వున్నాయి. తడుముకున్నాడు. చిక్కితే రూపాయి కూడా మిగలదు. ఏం చేయాలి? స్టేషన్ వైపు కాకుండా మరో ప్రక్క దిగడానికి ప్రయత్నించాడు. కాలు రావడం లేదు. నరం పట్టుకున్నట్లుంది. కష్టంగానే దిగాడు... కిందంతా కంకరరాళ్ళు. గుచ్చుకుంటున్నాయి. నెత్తిమీద గంపతో అడుగులో అడుగు వేసుకుంటూ చిన్నగా నడవడానికి ప్రయత్నించాడు. కంకరరాళ్ళలో నడవడం కష్టం. నెత్తిమీద గంప బరువుకు కాలు జారింది. గంప దొర్లింది. రైలు పట్టాలెంబడి జామకాయలు పడిపోయాయి. తనతోపాటు రోజూ కాయలమ్మే వాళ్ళు ఇది చూసి పరుగుపరుగున పెద్దన్న దగ్గరికి వచ్చారు. లేపి పక్క ప్లాట్‌ఫారం పైన కూర్చోబెట్టారు. కిందపడిన కాయలన్నీ గంపకు ఎత్తించి తెచ్చిచ్చారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు తనని కూర్చోబెట్టుకొని ఇంటి దగ్గర వదిలి వెళ్ళిపోయారు. పెద్దన్న రైల్లో కాయలమ్మడం అదే ఆఖరు.

ఇంటికాడ భార్య లక్షుమ్మ, కొడుకు శివుడు గోడుగోడుమని ఏడ్చారు. డాక్టర్‌కు చూపించారు కానీ ప్రయోజనం లేదన్నారు. కాలు వాపు ఎక్కింది. చిన్నగా... చంకలో కర్రను ఊతంగా చేసుకొని మాత్రమే నడవగలిగే స్థితి...

రోజులు గడుస్తానే వుండాయి. కొడుకు శివుడు పదవ తరగతి తప్పాడు. భార్య లక్షుమ్మ పనులకు పోయి సంపాదించుకొని వచ్చి సంసారం జరుపుతా వుండాది. తనకు కొలిమి పని వచ్చు. కొంతకాలం యర్రగుంట్లలో తన చిన్నప్పటి రోజుల్లో కొలిమిలో పని చేసిన రోజులు జ్ఞాపకముండాయి.

కొడుకు శివుడ్ని ఆసరాగా పెట్టుకొని, కొలిమిపని చేసుకుంటే కడుపుకింత తిండి సంపాదించుకోవచ్చు.

ఊతం కర్ర చంకలో పెట్టుకొని పెద్దన్న బయలుదేరాడు... వేపచెట్టు నీడ క్రిందకి! అందర్నీ పలకరించాడు.

ఎవరో బీడీ వెలిగించి ఇచ్చారు.

ఇంకెవరో టీ గ్లాసు తెచ్చిచ్చారు.

ఒకరు లేచి బండపైన చోటిచ్చారు.

వీళ్ళందరూ చూపిస్తున్న అభిమానానికి పెద్దన్నకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పైకి ఏడ్చేశాడు కూడా. అందరూ ఓదార్చుతున్నారు.

ఇంతలో అక్కడికి చార్లి కూడా వచ్చాడు.

'ఓన్నా... పెద్దన్న... ఏందిన్నా... నీకు మేమంతా లేము' భరోసా ఇచ్చాడు – ప్రక్కనే కూర్చుంటా!

ఇంతలో స్టేషన్లో గంట మోగింది.

మరికాసేపట్లో రైలు వస్తుంది.

ఒక్కొక్కరుగా గంపలెత్తుకొని పెద్దన్నకు చెప్పి బయలుదేరుతున్నారు.

పెద్దన్నకు మనస్సంతా బాధగా వుంది.

'పాపోడా... చార్లీ... నువ్వేమనుకోనంటే ఒక మాట అడుగుతాను. 'కొలిమి' పని నాకు వస్తాది. దాన్ని వూర్లోనే యాడైనా పెట్టుకుంటా. బతుక్కుంటా. నువ్వు రోంత లెఖ్ఖ సహాయం చేసినావంటే ఆ సామాన్లు తెప్పించుకుంటాను. చేయి ఆడిందంటే లెఖ్ఖ పడ్తాది. వడ్డీతో నీ లెఖ్ఖ నీకు ఇచ్చేస్తా...' అడిగినాడు అభ్యర్థనగా పెద్దన్న.

చార్లి ఏం మాట్లాడలేదు. ప్యాంటు జేబులోంచి కట్ట లెఖ్క తీసినాడు.

'ఇదోన్నా... పెద్దన్న... ఐదువేలుండాది. తీస్కో. కొలిమి పెట్టుకో... నీకాడ వున్నెప్పుడే యిద్దువులే. వడ్డీకి కాదు ఇస్తాండేది...' చెప్పినాడు పెద్దన్నకు లెఖ్క అందిస్తా. ఆత్మీయంగా చూశాడు పెద్దన్న. ఏం కాదు... పనులు ప్రారంభించమన్నట్లు భుజం తట్టాడు చార్లీ.

ఆ తర్వాత కొలిమి పనికి కావలసిన సామాన్లు అన్నీ ఒక్కొక్కటిగా కొనుక్కున్నాడు. మొదట్లో కొడుకు శివుడు కొంత విముఖత చూపినా, తండ్రికి ఆ పని పట్ల వున్న నమ్మకానికి తాను కూడా చేతులు కలిపాడు – తల్లి మాట కాదన్లేక!

కానీ అసలు సమస్య వచ్చింది.

'కొలిమి' ఎక్కడ పెట్టాలి?

రెండు, మూడు స్థలాలు చూశారు కానీ ఏవీ అంతగా కుదర్లేదు. బాడుగలు కట్టడం ఇప్పట్లో తనకు సాధ్యం కాదు. బడి దగ్గర కంపచెట్లను నరికి పెట్టుకుందాం అంటే ఆ స్థలం ప్రతాపరెడ్డి ఒప్పుకోలేదు. బస్టాండు కాడ మోట్లో పెట్టుకుందామంటే బాడుగ ఎక్కువ జెప్పినారు. ఈ సంగతులన్నీ సాయంత్రం వేపచెట్టు దగ్గరికి పోయినప్పుడు పెద్దన్న అందరికీ చెప్పినాడు.

'ఓన్నా... ప్రొద్దున లేచినాముంచి సాయంకాలం వరకు అందరం ఈడ్నే వుంటాం. నువ్వు పోయి యాడాడో పెట్టుకుంటే ఎట్లా కుదుర్తాది. ఒకసారి పైకి చూడు ఎంత పెద్ద చెట్టో... దీని కింద పెట్టుకొని నువ్వు బతుక్కుంటానంటే ఈ యాపచెట్టు వద్దంటాది? నీ 'కొలిమి' దీని కిందే పెట్టుకోవాల...' చెప్పినాడు రైల్వే గ్యాంగ్‌మెన్ అంకన్న.

'ఔ... ఔ... యాడాడో ఏంటికి? నువ్వు మా మనిషివి. ఇది రైల్వే జాగా. అడిగే నాకొడుకు వుండడు. నీకు ఏ బాధా వుండదు. యాపచెట్టు కిందనే నాలుగు రేకులు కప్పుకొని షెడ్డు వేసుకుంటే సరిపోతాది...' చెప్పినాడు మరో గ్యాంగ్‌మెన్ సామేలు.

అట్లా వేపచెట్టు కిందనే షెడ్డు వేసినారు. కొలిమి పని మొదలైంది. వూర్లోని రైతులందరూ వాళ్ళకు కావలసిన వ్యవసాయ పనిముట్లు చేయించుకుంటా వుండారు.

కొలిమికి కావలసిన బొగ్గును చార్లీ మూటల కొద్దీ తెచ్చి యిస్తా వుండాడు. పని ఊపందుకుంది. పార, గడ్డపార, కొడవలి, కత్తి, నాగలి పట్టీలు... ఒక్కటేమిటి కొలిమి ద్వారా వస్తువులు తయారవుతానే వుండాయి. శివుడు పని బాగా

నేర్చుకున్నాడు. రోజులు గడుస్తా వుండాయి. పెద్దన్నకు దగ్గు ఎక్కువవుతోంది. అందుకే తాను పనికి రావద్దన్నాడు శివుడు. తనకి తోడుగా అంజిగాడ్ని పనిలోకి పెట్టుకున్నాడు. ఈ మధ్యనే బ్యాంకాయన పరిచయమైతే ఇరవై వేలు అప్పు కూడా లోనుగా తీసుకున్నాడు. మూడు కంతులు కూడా కట్టాడు. కానీ... ఇప్పుడు తగిలింది... ఎదురుదెబ్బ! తన కొలిమ్మాను దగ్గరే... అప్పుడే రైలు దిగి వస్తాండే సిద్ధారెడ్డిని అంకిరెడ్డి మనుషులు వెంటపడ్డారు. ఆయప్ప పరిగెడ్తా పరిగెడ్తా సరిగ్గా కొలిమ్మాను దగ్గరికి వస్తానే... వాళ్ళ చేతుల్లోని వేటకొడవళ్ళు పైకి లేచినాయి... అంతే! పరిస్థితి ఇప్పుడిలా తయారైంది. కోర్టుకు హాజరు కావాలి. సాక్ష్యం చెప్పాలి. సాక్ష్యమిచ్చిన తర్వాత అంకిరెడ్డి మనుషులు మళ్ళీ తనని, తన కుటుంబాన్ని వదిలేస్తారా? మరిప్పుడేం చేయాలి... పారిపోవాలి... అంజిగాడ్ని బళ్ళారికి పంపించి, తాను తిరుపతికి పారిపోవాలి... కొంతకాలం అజ్ఞాతంలోకి వెళ్ళిపోవాలి... ఇంట్లో వాళ్ళకు ధైర్యం చెప్పి శివుడు తిరుపతికి రైలెక్కాడు.

❀❀❀

చార్లి యిచ్చిన అడ్రస్ ముక్క ఆధారంగా తాను తిరుపతికి చేరి నాల్గు రోజులైంది.

శివుడు కళ్ళు మూసుకొని పడుకున్నాడేగానీ నిద్రపట్టడం లేదు. బయట రోడ్డులోని కుక్క వొకటి అదే పనిగా మొరుగుతూనే వుంది. తనకు లేవాలంటే బద్ధకంగా వుంది. ఆ కుక్కను ఎవరైనా వెళ్ళి దూరంగా తరిమివస్తే బాగుండుననుకున్నాడు. కానీ ఆ పని ఎవరు చేస్తారు? తమకేమి సంబంధం లేనట్లు ఇంటి గేట్లకు తాళాలు వేసుకొని, తలుపుల్ని గట్టిగా బిగించుకొని, ఏసిలను ఆన్ చేసుకొని డబుల్ కాట్ బెడ్లపైన సుఖంగా సుకుమారంగా నిద్రపోతున్న మనుషులు... బయటి ప్రపంచంతో తమకేమీ సంబంధం లేనట్లు తాము, తమ కుటుంబమూ అనే వలయంలో చిక్కుకొని పెనుగులాడుతూ స్వప్న లోకాల్లో జీవించే మనుషులు...

కుక్క మొరుగుతూనే వుంది. కళ్ళు తెరిచిచూశాడు శివుడు. ఎదురుగా ఎత్తైన బిల్డింగ్. పైన చివరాఖర్లో మూడు నక్షత్రాలు... రంగురంగుల్లో ఆగి ఆగి మెరుస్తున్నాయి. అన్నీ ఒక్కసారిగా ఆగిపోయి మరో స్టైల్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. భలేగా వుంది! ఆ మూడు నక్షత్రాల లైటింగ్ సిస్టం సంబరం. దాని ప్రక్కనే హోటల్ తిరుమల బోర్డు. త్రిస్టార్ హోటల్. రంగురంగుల ఖరీదైన హోటల్. కావలసింది ఏది అయినా క్షణాల్లో దొరికే హోటల్. రాత్రిపూట దానివైపు చూస్తుంటే చుక్కల్లో విహరిస్తున్న అనుభూతి. పేరుగొప్ప – బతుకు దిబ్బ అంటే ఇదేనేమో... ఎవరో తనపైన కాలు వేశారు.

చుట్టూ చూశాడు శివుడు. దాదాపు ఇరవై మంది దాకా వివిధ భంగిమల్లో ప్రశాంతంగా నిద్రపోతున్నారు. ఉదయమంతా శ్రమించి శ్రమించి అలిసిపోయిన దేహాలు... తల్లిదండ్రుల్ని, భార్యాబిడ్డల్ని వదిలేసి సర్వర్ల అవతారమెత్తి జీవితాన్ని నెట్టుకొస్తున్న వాళ్ళు... కలలతోనే బతుకును సాగు చేసుకుంటున్న బలహీనులు...

రోడ్డుపైన ఏదో వాహనం పోవడంతో కుక్క మొరుగుతూ దాని వెనుక వెళ్ళిపోయినట్లుంది. ఇంకో మూడు గంటలు గడిస్తే సమయం అయిదవుతుంది.

నిన్న జరిగిన సంగతి గుర్తుకొస్తా వుండాది. తాను కూడా అందరితో పాటూ లేచి హోటల్‌లోకి వెళ్ళాడు. ఏం జరిగింది? రాత్రి జరిగిన ఫంక్షన్‌లో మిగిలిపోయిన ఐదుకేజీల చికెన్ కూర, నాలుగు కేజీల మటన్ కూర, మూడు కేజీల చేపల వేపుడు, సగం దబరా ఇండా మిగిలిపోయిన బిర్యానీ, ఇంకా రొయ్యలు, కంజులు, పీతలు, పుట్టగొడుగులు, కోడిగ్రుడ్ల వంటకాలన్నీ బయటకు తీసుకొచ్చారు. ఎదురుగా మున్సిపాలిటీ చెత్త ట్రాక్టర్. ట్రాక్టర్ పైకి ఎవరో ఎక్కారు. కింద నుంచి ఒక్కొక్క పాత్రే అందిస్తున్నారు. పైకెక్కిన వ్యక్తి గుమ్మరిచ్చి ఖాళీ పాత్రల్ని క్రింద వాళ్ళకు అందిస్తున్నాడు. దాదాపు అరగంటపాటూ ఈ తంతు కొనసాగింది. ఆ తర్వాత నిండుగా ట్రాక్టరు కదిలి వెళ్ళిపోయింది. హోటల్ యజమాని నీలకంఠం ఉదయాన్నే జాగింగ్ కోసం వచ్చి ఈ పని కూడా దగ్గరుండి పూర్తి చేయించి వెళ్తాడు. ఇది హోటల్ పెట్టినప్పటి నుంచి జరుగుతున్న పనే అని పాత వర్కర్లు ఎప్పుడూ చెప్తానే వుంటారు.

రాత్రి పన్నెండు దాటిన తర్వాత హోటల్ మూసేస్తారు. ఏ వంటకాలైనా మిగిలిపోని వాటిని సర్వర్లు ముట్టుకోడానికి వీలుండదు. చివరికి రుచి చూడ్డానికి కూడా కుదరదు. ప్రతి రాత్రి ఒక్కో వర్కర్‌కి నాలుగు చపాతీలు, పప్పు పెడ్తారు. అంతకు మించి ఏదీ యివ్వరు. ఆదివారం పూట మాత్రం ఒక్కొక్కరికి రెండు ఉడకేసిన కోడిగ్రుడ్లు ఇస్తారు అదనంగా. హోటల్ సమయం దాటిపోయిన తర్వాత యిక మిగిలిపోయిన ఏ వంటకాలైనా తినవచ్చు అని తాను అనుకుంటూ వుండేవాడు. కానీ పరిస్థితి అలా లేదు. మిగిలిన వంటలన్నీ మున్సిపాలిటీ ట్రాక్టర్ కెక్కించాల్సిందే తప్ప తినడానికి ఏమాత్రం వీలుండదు.

ఈ పరిస్థితి ఏమిటో శివునికి అర్థం కావడం లేదు. ఎందుకని? తింటే తప్పేముంది? అన్నన్ని వంటకాలు పారవేయడం కన్నా పదిమందికి సహాయంగా పెట్టి ఆకలి తీర్చితే బాగుంటుంది కదా! శివుడు మదినిండా ఈ ఆలోచనలే పరిభ్రమిస్తున్నాయి.

తాను ఈ హోటల్లో సర్వర్ పనిలో చేరింది నాల్గురోజుల క్రితమే. ఇంకా ఇక్కడి వాతావరణమే అలవాటు కాలేదు. అంతా కొత్తగా వుంది. హోటల్ బంగారు పంజరంలా అన్పిస్తా వుండాది.

రంగురంగుల హోటల్లో తమవి బ్లాక్ అండ్ వైట్ జీవితాలు అని మాత్రం అర్థమైతా వుంది. హోటల్ ఎదురుగా వుండే సందులోని పాతకాలం మిద్దె వర్కర్లందరికి వుండడానికి ఏర్పాటు చేశారు. ఇప్పుడు అందరూ నిద్రపోతున్నది దానిపైనే. చల్లగా గాలి వీస్తోంది. పక్కన పడుకున్నమనిషి మళ్ళీ శివుడు పైకి కాలు వేశాడు. అవును ఆ అబ్బాయి... పన్నెండేళ్ళ ప్రాయం కూడా దాటలేదు. పేరు 'బాల'. నంద్యాల నుంచి ఇల్లు విడిచిపెట్టి వచ్చాడు. నెలకు నాల్గువందల రూపాయలకు పనికి కుదిరాడు. ప్లాస్టిక్ బకెట్ ఒక చేత్తో పట్టుకుని టేబుల్ క్లీన్ చేసే గుడ్డ మరో చేత్తో పట్టుకొని తుడుచుకుంటూ రోజంతా పని చేయాలి. ఇదీ 'బాల' కార్మిక జీవితం. ఇంటి దగ్గరి తల్లి గుర్తొచ్చినప్పుడు ఒక్కడూ వెళ్ళి బాత్రూం దగ్గర ఏడుస్తూ వుంటాడు. మళ్లీ త్రాగుబోతు తండ్రి గుర్తొచ్చి పరుగు పరుగున కన్నీళ్ళు తుడుచుకొని గ్లాసు మంచినీళ్ళు తాగి పనిలోకి వెళ్ళిపోతాడు. వాడ్ని చూస్తే శివునికి మనస్సంతా బాధగా వుంటుంది.

'రేయ్... బాల! నాకు రెండు సిజర్ సిగరెట్లు, వాడికి గుట్కా, వీడికి మందులోకి సోడా, నంజుడుకు మిక్చర్, క్వార్టర్ మందు...' ఇలా ఎదురైన ప్రతివాడూ ఆ అబ్బాయికి ఏదో ఒక పని చెప్పేవాళ్ళే. చేసేవాళ్ళు కన్పిస్తే చెప్పేవాళ్ళు ఎక్కువ.

'ఓరేయ్... బాలా! నువ్వు ఎప్పుడూ బయట తిరుగుతానే వుంటావు గానీ పనిమీద శ్రద్ధ వుండదా? బెల్ట్ విరుగుతుంది బయట కన్పిస్తే...' అని నీలకంఠం తిట్లు వాడికి మామూలు అయిపోయింది.

'అన్నా... శివన్న! నువ్వన్న జూడన్న. వీళ్ళు చెప్పే పనులు చేయకపోతే వీళ్ళు తంతారు. బయటకు పోతే ఆసామి తంతాడు. ఎట్లా జేసి సచ్చేది...' అని వాడు దగ్గరికి వచ్చి గోడు వెల్లబోసుకుంటాడు కన్నీళ్ళతో.

ఈ హోటల్లో శివునికి ఆత్మీయంగా స్నేహితుడయ్యింది ఆ అబ్బాయే. ఇంటి దగ్గర వూర్లో తన తల్లి పడుతున్న నరకయాతన అంతా చెప్పుకొచ్చాడు... నిన్న రాత్రి నిద్రపోయేటప్పుడు!

'దిబ్బలబడి సత్రం కాడ దిన్నం పనిలేని బేకారు నాయాళ్ళతో కలిసి ఇస్పేటాకులు ఆడడం... అట్నే దిగదాలకు వీరన్నగట్టుపల్లె కాడ కాసే నాటుసారా తాగడం... రోజుకూలీ పనికి సంపాదించుకొచ్చిన భార్య లెఖ్క లాక్కొని, సట్టిలో పెట్టిన సంగటి పీకలదాకా తిని మళ్ళీ పోయి ఇస్పేటాకులు కాడ కూర్చోవడం...

రేత్తిరికాడ ఇంటికొచ్చి పెండ్లాన్ని చితకబాదడం ఇదే... తాగుబోతు రాముడు కథ. వూరి బడిలో ఐదో తరగతి వరకు తాను చదివిన తర్వాత ట్రాక్టర్ పనికి పంపి లెఖ్క దెచ్చి తనకు ఇమ్మని కొట్టెటోడని, అడ్డం వచ్చి వారించే తల్లిని మెడపట్టి గెంటితే చెక్క తలుపుమాను తగిలి తలకు గాయమై నెత్తురొచ్చిందని... తాను తట్టుకోలేక పక్కనున్న మచ్చుకత్తి విసిరేసి పారిపోయి వచ్చానని ఆ తర్వాత వూర్లో ఏం జరిగిందో తెలియదని, తన తల్లి ఎంత దుఖ్కిస్తా వుండాదోనని' – ఆ పిల్లోడు తన కథంతా చెప్పుకొచ్చినాడు... బాధగా!

'ఎంత పని చేసినావురా... బాబూ! నాయన్ను ఎవరన్న మచ్చుకత్తితో కొడతారా?' – అని ఆశ్చర్యంగా అడిగాడు శివుడు.

'మచ్చుకత్తితో కొట్టాలా... కొయ్యాలా...' అన్నాడు కసిగా బాల.

వాడిలోని ఆవేశాన్ని చూస్తే ఇంకా వాడికి కోపం తగ్గలేదనిపించింది. తల్లి గురించి, ఆమె యోగక్షేమాల గురించి, ఆరోగ్యం గురించి, తన మీద పెట్టుకునే బెంగ గురించే వాడు ఆలోచన చేస్తాండడు.

'మీ నాయన పరిస్థితి ఎట్టుంటాది అంటావు?'– అడిగినాడు శివుడు.

'విసిరిన విసురుకు సావనన్న సచ్చి వుండాలా, కాలో, చెయ్యి అయినా తెగిపడి వుండాలా...' వాడి కళ్ళల్లో కసి యింకా తడి ఆరలేదు.

యింత బాధను గుండెల్లో ఆవేశాన్ని కళ్ళల్లో దాచుకున్న పిల్లోడు తలవొంచుకొని టేబుళ్ళు తుడుస్తా వుండాడంటేనే ఆశ్చర్యంగా వుంటోంది.

ఆలోచనల్లో వుండగానే మున్సిపాలిటీ ట్రాక్టర్ హారన్ కొడతా వస్తున్న శబ్దం... అందరూ ఒక్కొక్కరుగా త్వరత్వరగా కిందకి దిగారు.

❋❋❋

రాత్రి మిగిలిపోయిన వంటలన్నీ ఒక్కొక్కటిగా బయటకు తెస్తున్నారు. ఇంతలో యజమాని నీలకంఠం కూడా అక్కడికి వచ్చాడు. ప్రక్కన ఎవరో కొత్తమనిషి. బహుశా టౌన్లోకి బదిలీపై వచ్చిన ఎవరైనా ఉన్నతాధికారి అయ్యి వుండవచ్చు. ఎందుకంటే నీలకంఠంకు అధికారులందర్ని పరిచయం చేసుకొని వాళ్ళు కోరినదంతా తన త్రీస్టార్ హోటల్లో ఏర్పాటు చేసి తన మనుషులుగా వాళ్ళను తయారు చేసుకోవడం... వారి ద్వారా తన పనులు నెరవేర్చుకోవడం తన ముఖ్యమైన విధి విధానాల్లో ఒకటి. ఒక్కొక్కటిగా పాత్రలు అందిస్తున్నారు... చికెన్, మటన్, బిర్యానీ, కంజులు, కోడిగ్రుడ్డు కూరలు అన్నీ ట్రాక్టర్‌లోకి ఉలకపోస్తున్నారు.

'నీలకంతగారూ... మీరు ఏమీ అనుకోకపోతే ఒకమాట... యిన్ని వంటలు ఇలా వూరికే మున్సిపాలిటీ ట్రాక్టర్లో పడేసేకంటే ఎవరికైనా దానం చేయవచ్చు కదా!' ఆశ్చర్యంగా ముఖం పెడుతూ అడిగాడు ఆ వచ్చిన కొత్తమనిషి.

నీలకంఠం సున్నితంగా నవ్వి పెదాలు తడుముకున్నాడు.

'పుణ్యం వస్తుంది'– మళ్ళీ అన్నాడు ఆయనే.

నీలకంఠం నుంచి ఏ జవాబు వస్తుందా అని శివుడు కూడా ఎదురు చూస్తున్నాడు.

'పుణ్యం సంగతి ఏమో నాకు తెలియదుగానీ... క్యూలు మాత్రం కడతారు. మొదట్లో హోటల్ పెట్టినప్పుడు నేను ఇలాగే అనుకునేవాడ్ని. రోజూ ఉదయాన్నే గుడిసెల్లోని జనం క్యూలు కట్టేవాళ్ళు. రాత్రి మిగిలిపోయిన వంటలన్నీ పంచేవాళ్ళం. తర్వాత తెలిసింది పుణ్యం, మంచిపేరు సంగతి పక్కనపెట్టి ఈ త్రిస్టార్ హోటల్ అన్నదాన సత్రం అయ్యిందని అందరూ అనుకోవడం, ఉదయాన్నే బిచ్చగాళ్ళతో ఈ గేటు బయట క్యూల మందలు... హోటల్ సరిగా జరగడం లేదని టౌన్లోని మరో హోటల్ ప్రత్యర్థులు నాపై బురద చల్లే కార్యక్రమం... ఇదిగో నేనిప్పుడు ఇలా తయారయ్యాను...' నిట్టూర్పు విడిచి సిగరెట్ వెలిగించాడు నీలకంఠం. తోడుగా ఆ కొత్తవ్యక్తి కూడా జతకలిశాడు.

'పెద్ద కథే వుంది' – అన్నాడు కొత్త వ్యక్తి.

'చాలా!'

'అలాగైతే... ముందుగానే వంట వర్కర్స్‌కి ఎంత అవసరమో అంతే వండమని మీరు సూచనలు ఇవ్వచ్చు కదా!' మరో ప్రశ్న లేవనెత్తాడు... సిగరెట్ పొగ వదుల్తూ.

'మన దగ్గర పనిచేస్తున్న వంట వర్కర్స్ అందరూ చైనావాళ్ళు. చాలా రుచికరంగా, శుభ్రంగా చేస్తారు. ఇక్కడ తయారయ్యే ఐటమ్స్‌కు డిమాండ్ కూడా బాగా వుంటుంది. పెద్ద ఎత్తున చేసే వంటకాల్లో ఇలా కొంత మిగలడం ఏ హోటల్‌లోనైనా జరిగేదే. ఫంక్షన్స్ లాంటివి జరిగినప్పుడు మరి ఎక్కువ మిగుల్తాయి' – చెప్పాడు నీలకంఠం.

'పోనీ మిగిలిపోయినవన్నీ... మీ వర్కర్స్‌కి, సర్వర్స్‌కి అయినా పెడుతుంటారా?'

'లేదు'

'ఎందుకని'

'అలా అలవాటు చేయడం నాకిష్టం వుండదు. మిగిలిందని వాళ్ళకు పెట్టడం అలవాటు చేస్తే మిగుల్చుకోవడానికి కూడా వాళ్ళు తయారవుతారు. ఐటమ్స్ తమ కోసం మిగుల్చుకొని కస్టమర్స్‌కు లేవని చెప్పే పరిస్థితిలోకి వస్తారు. అది నాకు నచ్చదు. ఈ హోటల్లోనే కాదు... ఏ స్టార్ హోటల్లోనూ మిగిలినవి వర్కర్స్ తినడానికి మేనేజ్‌మెంట్లు ఒప్పుకోవు. నేను దాన్ని అనుసరిస్తున్నాను... అంతే!' – తాగడం పూర్తయిన సిగరెట్‌ను ట్రాక్టర్లోకే విసిరేశాడు నీలకంఠం. ట్రాక్టర్ పైకెక్కిన వాళ్ళు కిందికి దిగారు.

'చాలా కొత్త విషయాలు తెలిశాయి నీలకంఠంగారూ...' అభినందన పూర్వకంగా ప్రశంసిస్తూ చెప్పాడు చేతిలోని సిగరెట్‌ను రోడ్డుపైకి విసిరేస్తూ కొత్త వ్యక్తి.

ఒకరకమైన మిశ్రమ వాసన్ని వెదజల్లుతూ ట్రాక్టర్ నిండుగా ముందుకు కదిలిపోయింది.

'ఇంకో విషయం చెప్పనా... తిరుమల కెళ్ళాలంటే తిరుపతికి వచ్చే కదా వెళ్తారు. అప్పట్లో తిరుపతిలో వేళ్ళపైన లెక్కపెట్టే పూటకూళ్ళ ఇళ్ళలో ఇక్కడుండే యానాదమ్మ హోటలే ఫేమస్. మరీ నేను చిన్నప్పటి రోజుల్లోని సంగతి అది! ఆ తర్వాత ఇద్దరు ముగ్గురు ఈ స్థలంలోనే వేర్వేరు వ్యాపారాలు చేసి మానేశారు. ఆ తర్వాత మా అమ్మానాన్నలు కడప నుంచి వచ్చి ఇక్కడే టిఫెన్ సెంటర్ పెట్టుకున్నారు. ఉదయం ఇడ్లీ, దోసె, సాయంత్రం బజ్జీలు, వడలు. అలా అలా ఎదుగుతూ వచ్చాం. ఈ స్థలాన్ని మేమే కొన్నాం. బిల్డింగ్ కట్టించాం. హోటల్ నుంచి స్టార్ హోటల్ వరకు ఎదిగాం... ఇదంతా సక్సెస్ స్టోరీ!' చెప్పాడు నీలకంఠం.

'ఇన్‌స్పిరేషన్‌గా వుంది...' మెచ్చుకోలుగా అన్నాడు కొత్తవ్యక్తి.

డ్రైవర్ కారు తెచ్చాడు ఇంతలో.

అక్కడే బయట పొదల వెనుక చెట్టు కింద కూర్చోని ఒంటరిగా వుండిపోయాడు శివుడు.

❋❋❋

మధ్యాహ్నమప్పుడు ముగ్గురు మనుషులు తనకు హోటల్‌లో కన్పించారు ప్రత్యేకంగా. అవును వాళ్ళను ఇదివరకు ఎక్కడో చూశాడు... ఎక్కడ? ఆ రోజు కొలిమ్మాను దగ్గర సిద్ధారెడ్డిని నరికి పారిపోయింది వీళ్లే. మరికాసేపటికి ఎస్సై కూడా పూర్నుంచి వచ్చి వాళ్ళతో మందుకు ఆర్డరిచ్చాడు. శివుడికి పరిస్థితి అంతా అర్థమవుతోంది.

నీలకంఠం కూడా వచ్చాడు. వాళ్ళతో పాటుగా కల్సి మాట్లాడుతున్నాడు. ఆ తర్వాత కనుక్కుంటే తెల్సింది అంకిరెడ్డికి నీలకంఠం చిన్నాన్న వరస అయితాడని. వీళ్ళందరూ కలిసి కూర్చొని వ్యూహం చేయడానికి ఇలాంటి స్టార్ హోటల్స్‌లో కలుసుకుంటూ వుంటారని అర్థమైంది. ఇలాంటి పెద్దోళ్ళ మధ్యన తనలాంటి చిన్నోళ్ళు, వాళ్ళ కుటుంబాలు ఎలా విచ్ఛిన్నమవుతున్నాయో వీళ్ళకు పట్టదు కదా అనుకున్నాడు శివుడు. తనకు తన వూరు గుర్తుకొస్తోంది... అలాగే తల్లి తండ్రి... తన కొలిమ్మాను షెడ్డు... కానీ ఏం చేయగలడు. కొంతకాలం అజ్ఞాతవాసం తప్పదు... వంటగదిలో గ్యాస్‌మంట చూస్తున్నసేపు తనకు తన కొలిమి గుర్తుకొస్తూనే వుంది.

❀❀❀

నెలరోజులు దాటింది.

వూరి విషయాలేవీ తెలీదు. జీతం తీసుకొని వూరికి బయలుదేరాడు. బ్రిడ్జిపైన రైలు... తనకు గుండెల్లో దడ... స్టేషన్లో దిగాడు. దార్లోనే కొలిమ్మాను చెట్టు. తన షెడ్డు చూస్కున్నాడు. దుమ్ము, ఎండుటాకులు, రాలిపడిన కొమ్మలు, ఎదిరికీ అంజిగాడు వచ్చినాడు.

'శివన్నా... నేను బళ్ళారినుంచి వచ్చి రెండ్రోజులైతాంది. కేసు ఏం లేదంట... వాళ్ళు వాళ్ళు రాజీ అయినారంట. ఎస్సై ఇద్దరికాడ లెఖ్ఖ కొట్టి కేసు రాజీ చేసినాడు. మనం కొలిమిపని రేపట్నుంచే మొదలుపెట్టొచ్చు' చెప్పినాడు సంబరంగా అంజి.

ప్రాణానికి ప్రశాంతంగా వుంది శివుడికి.

ఇంటికెళ్ళాడు. పట్నం నుంచి తెచ్చిన మందులు తండ్రికి అందజేసినాడు. సంగతులన్నీ చెప్పినాడు.

సాయంత్రం నుంచి కొలిమ్మాను కాడ్నే వుండి అన్నీ ఎత్తేసి, చిదుగు కాల్చేసి, శుద్ధంగా చేసుకున్నారు. వేపచెట్టు కొమ్మలు పచ్చగా కళకళలాడ్తా వుండాయి. పూత పూస్తా గుబాళిస్తా వుండాది. రైళ్లలో కాయలమ్ముకునేటోళ్ళు, గ్యాంగ్‌మెన్లు అందరూ వస్తా గలగలమని వుంది కొలిమ్మాను.

దిన్నం ఉదయంపూట టిఫెన్ సెంటర్ కొలిమ్మాను ప్రక్కనే తల్లికి పెట్టించినాడు శివుడు. వూర్లకు పోయేటోళ్ళు, రైల్వే వర్కర్స్ అందరూ ఇక్కడికే వస్తా వుండారు. సాయంత్రంపూట బజ్జీలు, వడలు వేస్తాంది. బీడీలు, సిగరెట్లు కూడా అమ్ముకుంటా వుండారు. బొంకు వొకటి పెట్టుకున్నారు. శివుడి దగ్గర ఇంకా ఇద్దరు పనోళ్ళు జేరినారు. కొలిమి పని బాగా జరుగుతాంది. బ్యాంకు లోనూ తీరిపోతా వుంది. శివుడికి పెళ్ళి సంబంధాలు వస్తా వుండాయి.

చూస్తాండగానే కొలిమ్మాను మంచి బిజినెస్ సెంటర్‌లాగా తయారైంది. రైల్వే క్వార్టర్స్ రావడంతో అక్కడే కిరాణాకొట్టు, ఫ్యాన్సీస్టోర్ కూడా పెట్టుకున్నాడు శివుడు. తండ్రి ఆరోగ్య పరిస్థితి కుదుటపడింది.

కొలిమ్మాను కొమ్మలు ఎత్తుకు... ఆకాశం అంచుల్లోకి పోయి మబ్బుల్ని చుట్టుకొని లాక్కొస్తాయనేంత ఎత్తుకు ఎదుగుతూనే వుండాయి.

- డిసెంబర్ 21-2007, తేజ వారపత్రిక,
ఆర్.ఎస్.కృష్ణమూర్తి మెమోరియల్, వైజాగ్ కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ.

వెనుకటి కాలం కాదు!

మనుషులు... మనుషులు... ఎక్కడ చూసినా మనుషులు... చీమల పుట్ట పగిలి బయటికొస్తున్నట్లు ఎటు చూసినా మనుషులు... వీళ్ళందరూ ఎక్కడ్నుంచి వస్తున్నారు? ఎక్కడికని ఉరుకులు పరుగులు పెడుతున్నారు... రోడ్లపైన, వాహనాలపైన మనుషులు... షాపుల దగ్గర, బస్టాండులో... బస్సులోకి ఎక్కి నిల్చున్నప్పుడు చుట్టూ మనుషులు... కొందరు నిల్చొని, మరికొందరు కూర్చొని! దేవుడా ఎంత జనం... ఎంత జనం... ఎక్కడికెళ్ళినా క్యూ... క్యూ... క్యూ... జనం... జనం... భయంభయంగా వుంది సాంబయ్యకు.

బస్సులో కండక్టర్ టిక్కెట్స్ కొట్టడానికి సర్కస్ చేస్తున్నాడు. కండక్టర్ తన దగ్గరకు రానే వచ్చాడు. కాళ్ళ కింది మూటను చూశాడు.

'ఏమయ్య బుద్ధి వుందా? జనానికే చోటు లేకుండా వుంటే మూట వొకటి పెట్టావు దారికడ్డంగా...' కసురుకున్నాడు.

సాంబయ్య ఏం మాట్లాడలేదు.

'ఇందులో ఏముంది?' ప్రశ్నించాడు.

'సీసాలు' జవాబిచ్చాడు.

'సీసాలా? ఏం సీసాలు?' అనుమానంగా అడిగాడు.

'తేనె సీసాలు...'

'నాటుసారా సీసాలా... కల్తీ కల్లు సీసాలా?' – వెటకారంగా కళ్ళు ఎగరేశాడు కండక్టర్.

'ఏందయ్య సామీ మాట్లాడతాండేది. కల్తీలేని తేనె సీసాలివి' – తనని ఏదైనా అంటే పడ్తాగానీ తన సరుకునంటే పడననే కోపం సాంబయ్య గొంతులో కన్పించింది.

'ఎందుకైనా మంచిది వచ్చే స్టాపులో దిగిపో కొండదొర... నీకూ మంచిది, మాకూ మంచిది' కండక్టర్ ముందుకు కదులుతూ చెప్పాడు.

తర్వాత స్టేజ్ రాగానే సాంబయ్యను దించేశాడు.

సాంబయ్యకు కొత్తగా వుంది. తాను పుట్టినప్పటి నుంచి యింత జనాన్ని చూసింది లేదు. పట్నానికి వచ్చింది లేదు. జనాన్ని చూస్తున్న కొద్దీ సాంబయ్య గుండెలో దడ పుడతా వుండాది.

తన చేతిలోని కాగితాన్ని మడతలు విప్పి చూసుకున్నాడు.

అక్షరాలు చమటకు నలిగిపోయి రంగుమారి కన్పించి, కన్పించని పరిస్థితిలో వున్నాయి. అడ్రస్‌లో వున్న కార్యాలయానికి తనని ఎవరు తీసుకెళ్ళగలరు? కనుక్కోవడం ఈ పట్నంలో అక్షరం ముక్కరాని తనకు సాధ్యమేనా? లేకుంటే తిరిగి బస్సు ఎక్కి మళ్ళీ తన గూడేనికి తాను వెళ్ళిపోతే? నడి సముద్రంలో వున్నట్లు వుంది సాంబయ్య పరిస్థితి! దిక్కు తెలియడం లేదు. ఇప్పుడేం చేయాలి?

'ముందు ఈ సంచి బరువు వదిలించుకోవాలి!' అంతరాత్మ సలహా. యిక ఆలస్యం చేయలేదు.

దిగిన చోటనే, అదే బస్టాపులోనే సంచి మూతి విప్పాడు.

'తేనే... తేనే... కల్తీలేని తేనే...' గట్టిగా కేకలు వేయసాగాడు.

జనం సాంబయ్య ఆకారాన్ని, వస్త్రధారణను చూస్తున్నారు.

ఎవడో కొండలోడులాగా వుండాడు. కల్తీలేని తేనే తెచ్చి వుంటాడు అని ఎవరికి వారే అనుకుంటా వున్నారు లోలోపలే.

ఎవరో ముసలాయన వొకరు ముందుకొచ్చాడు.

'దీన్ని ఆయుర్వేదంలో కూడా వాడుకోవచ్చు కదా!' ప్రశ్నించాడు.

'బంగారంగా పెద్దాయన... ఇదిగో అరచేయి పట్టు రోంత రుచి జూడు' చేతిలోకి వంచాడు.

తేనె మధురంగా గొంతులోకి దిగింది.

'ఒక సీసా ఎంత?' అడిగాడు పెద్దాయన.

'ఐదు రూపాయలు' జవాబిచ్చాడు సాంబయ్య.

అనుమానంగా చూశాడు పెద్దాయన. ఒకవేళ పెద్దాయన బేరం ఆడితే మరో రూపాయి తగ్గించాలనుకున్నాడు సాంబయ్య.

'యేంది? ఈ సీసా మొత్తం ఇస్తావు కదా!' అనుమానంగా అడిగాడు మళ్ళీ పెద్దాయన.

'నీకెన్ని కావాలో చెప్పు సామీ... దుడ్లదేముండాది... తగ్గించే ఇయ్యి...' చెప్పాడు బేరం మళ్ళీ వెనక్కి పోతుందేమోననే అనుమానంతో.

మారుమాట్లాడకుండా పదిరూపాయల నోటు ఇచ్చాడు పెద్దాయన.

'ఎన్ని ఇయ్యాలయ్యా?' ప్రశ్నించాడు పదిరూపాయల నోటు కళ్ళకద్దుకుంటూ.

'మూడు సీసాలు' చెప్పాడు పెద్దాయన బేరం ఆడుతున్నట్లు.

'అట్నేగానీ సామీ... ఎవరన్నా అడిగితే రెండు సీసాలే ఇచ్చినానని జెప్పళ్ళి. లేకుంటే అందరూ అట్నే అడుగుతారని' వేడుకోలుగా చెప్పాడు సాంబయ్య.

తల ఆడించి వెళ్ళిపోయాడు మూడు సీసాలు తన బ్యాగులో సర్దుకొని పెద్దాయన.

ఈ దృశ్యాన్ని అక్కడే వున్న ఆటోవాళ్ళు కొందరు గమనించారు.

'ఏమయ్యా కొండదొర నీ తేనే మంచిదేనా?' ప్రశ్నించారు.

కొంత కాగితానికి పోసి అగ్గిపెట్టి పరీక్షించి చూశారు.

ఇంకొంత అరచేతుల్లోకి పోసుకొని రెండుమూడు సార్లు తాగి తాగి చూశారు.

మరికొందరు 'బెల్లం కలపలేదు కదా!' అని ప్రశ్నించారు.

ఏదైతే ఏముంది? ఆటో డ్రైవర్ల దెబ్బకు రెండు సీసాలు వూరికే పరీక్షకే అయిపోయాయి.

అయినా సాంబయ్య బాధపడ్డం లేదు.

ఎవరికీ ఉచితంగా రుచి కోసం గానీ, పరీక్ష కోసంగానీ ఇవ్వనని చెప్పడం లేదు.

ఎవ్వరిని కసురుకోవడం లేదు. కోపం ముఖంలో ఎక్కడా కన్పించడం లేదు.

అందరూ తాగి తేనే మధురంగా వుందని ప్రశంసిస్తుంటే పులకించి పోతున్నాడు. సంబర పడుతున్నాడు.

'ఇదేందయ్యా... మీరు మా చెంచుగూడేంకు వస్తే అప్పటికప్పుడు లేపి తేనే తీసిస్తా'నని ప్రేమగా చెప్తున్నాడు.

చూస్తుండగానే తేనే సీసాలు అమ్ముడుపోతున్నాయి. 'ధర... ఐదు రూపాయలు...' జనం ఆశ్చర్యపోతున్నారు. కొందరు సాంబయ్య సెల్‌ఫోన్ నెంబర్ అడుగుతున్నారు. ఆ మాటే సాంబయ్యకు కొత్తగా వుంది. అర్థం కావడం లేదు.

ఇంకొందరు గుంపులో మధ్య నుంచి సీసాల్ని దొంగతనంగా పట్టుకపోవడానికి శ్రీకారం చుట్టారు.

మరికొందరు సీసాలు తీసుకొని చిల్లర మార్చుకొస్తామని చెప్పి వెళ్ళిపోతున్నారు.

చూస్తుండగానే దాదాపు సగం సరకు ఖాళీ అయ్యింది.

జనం గుంపులు గుంపులుగా చుట్టుకొని వున్నారు.

ఇంతలో జీపు వొకటి వచ్చి ఆగింది.

'రేయ్... కొండోడా... ఏందిరా నడిరోడ్డు ప్రక్కన బస్టాండు కాడ నీ చిల్లర వ్యాపారం...' గొంతు కర్కశంగా వుంది.

ట్రాఫిక్ పోలీసులు... ట్రాఫిక్ పోలీసులు... జనంలో ఎవరో అన్నారు.

'దండాలయ్యా... దండాలయ్యా...' రెండు చేతులెత్తి మొక్కాడు సాంబయ్య.

'సరే... సరే... నీ ఉత్తుత్తి దండాలు ఎవడికి కావాలిగానీ సరుకు చూపించు...' సంచిలోకే పోలీసాయనే చేయిపెట్టి రెండు చేతుల్లోకి రెండు సీసాలు తీసుకున్నాడు.

'కల్తీ సరుకు కాదు కదా... కల్తీ అని తేలిందో బొక్కలో వేసి నీ మక్కెలు విరగదంతా' చెప్పాడు కోపంగానే.

'అయ్యా... అయ్యా... మంచి సరుకయ్యా...' వేడుకోలుగా చెప్పాడు సాంబయ్య.

'సరే మరో రెండు సీసాలు చంకల్లో పెట్టు' అని ఒకేసారి నాలుగు సీసాలు తీసుకొని వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. వాళ్ళ జీపు అలా వెళ్ళిపోగానే జనం మళ్ళీ గుమిగూడారు.

వ్యాపారం బాగా జరుగుతోంది.

'నువ్వు అబిడ్స్‌లో మా షాపు వుంది. మాకు హోల్‌సేల్‌గా ఎంత తేనే సప్లై చేయగలవు? చెప్పు నీతో లింక్ పెట్టుకుంటాం... మీ గూడేం వస్తాం...' ఎవరో వ్యాపారి గట్టిగా అడుగుతున్నాడు. అతడు వాడిన ఇంగ్లిష్ పదాలు సాంబయ్యకు సరిగ్గా అర్థం కావడం లేదు.

తల గోక్కున్నాడు.

'ఇట్లాగే ఒకసారి అమీర్‌పేట్ దగ్గర ఒక కొండదొర దగ్గర తేనే కొంటే అంతా బెల్లం పాకమని అది తాగినప్పటి నుంచి ఇంటిల్లిపాదికి అనారోగ్యమైందని...' ఎవరో ఒక ఆడమనిషి తనకు గతంలో జరిగిన సంఘటన చెప్పుకొస్తాంది.

ఆమె మాటలు వినగానే సాంబయ్యకు వళ్ళు మండినట్లు అయ్యింది. 'నిన్ను నా తేనే కొనమని కాళ్ళు పట్టుకొని అడిగినానా... ఏందమ్మ ఏం మాట్లాడతా వుండావు... నీకు రోంతన్నా మంచితనం వుండాదా..?' కోపంగానే కసురుకున్నాడు.

వీడితో గొడవ ఎందుకని ఆమె వెళ్ళిపోయింది.

తన తేనే సీసాల్ని ప్రేమగా నిమురుకున్నాడు సాంబయ్య. లో జేబులో భద్రంగా దాచుకున్న చిల్లర డబ్బును తడిమి చూసుకున్నాడు. నిమ్మళంగా వుంది ప్రాణానికి.

ఇంతలో మరో జీపు వొకటి వచ్చి ఆగింది.

'రేయ్... ఎవర్రా నువ్వు... బస్టాపులో సంత పెట్టినావు. మేము ఎవరమో తెలుసా... సేల్స్‌టాక్స్ ఆఫీసర్లం. నీకు పర్మిషన్ వుందా? కాగితాలు చూపించు...' పళ్ళు కొరుకుతూ అడిగాడు అధికారి.

సాంబయ్య కాళ్ళు వణికాయి. వళ్ళంతా చమటలు పట్టాయి.

'దండాలయ్యా... దండాలయ్యా... పొరపాటు అయిపోయినాది. నా దారి కొద్దీ నేను వెళ్ళిపోతాను...' అంటూ కింద ప్రదర్శనకు పెట్టిన సీసాలు తీసి సంచిలో పెట్టుకోసాగాడు.

'అది సరేలేరా... ముందు సేల్స్ టాక్స్ కట్టు' అంటూ రసీదు వొకటి చించి సాంబయ్య చేతిలో పెట్టాడు.

'ఎంత దొరా... ఎంతకట్టాలి...' కళ్ళల్లో ఆవేదన.

'నీ దగ్గర ఎంత వుందో అంతా కట్టాలి. లేకుంటే నిన్ను లోపల పెట్టాలి ఇది న్యాయం' చెప్పాడు అధికారి.

లోపలి బనీను జేబులోంచి కాగితాలన్నీ తీసి లెక్కపెట్టసాగాడు సాంబయ్య.

అధికారికి నవ్వు వచ్చింది.

'మొత్తం కట్టాలి. ఇంకా లోపల మిగిలిపోయిన చిల్లర కూడా తీసి ఇవ్వు'– మరోసారి వికృతంగా పళ్ళు కొరికాడు అధికారి.

సాంబయ్య భయపడి జేబులో వున్న చిల్లరతో సహా తీసి అధికారి చేతుల్లో పోశాడు.

మరో నాలుగు తేనే సీసాలు తీసుకొని అధికారి నవ్వుకుంటా వెళ్ళిపోయాడు.

సాంబయ్యకు దుఃఖం పొంగుకొచ్చింది.

తేనే సీసాలు అమ్మి సంపాదించిన సొమ్ము అంతా పోయింది.

తను తన గూడేంకు వెళ్ళడానికి ఛార్జీలు కూడా లేవు.

దిగులైంది. సరుకు చూసుకున్నాడు.

ఈ పది సీసాలైనా అమ్ముకొని యిక్కడ్నుంచి వెళ్ళిపోవాలి అనే నిర్ణయానికి వచ్చాడు.

జనం మళ్ళీ చుట్టుకున్నారు.

తేనే సీసాల ధర పెరగలేదు. చిరాకు లేదు. రుచి చూడాలనే వారికి యివ్వను అనడం లేదు. చూస్తుండగానే మరో ఐదు సీసాలు అమ్ముడైనాయి. మరో రెండు... మరో వొకటి... జేబులోకి చిల్లర చేరుతోంది. బాధ కొంత తగ్గుతోంది. ఇంతలోనే మరో జీపు వచ్చి ఆగింది.

'రేయ్... గాడిద నా కొడకా... నువ్వు మనిషివి కాదా... నాటు సరుకు తెచ్చి ప్రజల ప్రాణాలు తీయాలని అమ్ముతా వుండావా..? డ్రగ్ ఇన్స్‌పెక్టర్ అంటే భయం లేకుండా పోయింది... సరుకు తెచ్చుకోవడం అమ్ముకొని పోతా వుండడం...' కోపంతో అధికారి కళ్ళు ఎరుపెక్కి వున్నాయి.

సాంబయ్య భయపడ్డాడు. కాళ్ళు వణుకుతున్నాయి. ఈ పట్నమేందో, అధికారులేందో అర్థం కావడం లేదు.

'ఎక్కురా... జీపు... ఎక్కు' గదురుకున్నాడు అధికారి.

మిగిలిపోయిన సరకు సంచిలోకి వేసుకొని జీపులో వెనుకవైపు ఎక్కాడు సాంబయ్య.

ఆఫీసుకెళ్ళాక 'జరిమానా కడితే వదిలేస్తామని' చెప్పాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్.

తన జేబులోని చిల్లర డబ్బంతా తీసి ఆయన టేబుల్ పైన పోసి రెండు చేతులు జోడించి కన్నీళ్ళతో నమస్కారం చేసుకున్నాడు సాంబయ్య.

కన్నీళ్ళతో కర్కశమైన అధికారుల హృదయం కరగదని సాంబయ్యకు తెలీలేదు.

సాంబయ్యపైన కేసు రిజిస్టర్ అయ్యింది.

జైల్లో తోశారు. లాఠీలకు పని చెప్పారు. వళ్ళంతా కుళ్ళబొడిచారు. రక్తం కారుతోంది శరీరం. తన స్థితి చూసి తనకే సిగ్గేస్తోంది. చావాలనిపిస్తోంది.

జైల్లో వాసన... కడుపు తిప్పుతోంది. ముక్కు పగిలిపోతోంది. కాసేపు తర్వాత ఆకలి అవుతోంది.

ఆకలి... ఆకలి... తనకు పిడికెడు మెతుకులు ఎవరు పెడతారు?

ఆకలి... అడవి... అడవి... తన అడవి జ్ఞాపకం వచ్చింది.

తన భార్య, కొడుకు గుర్తుకొచ్చారు. గుండె పిండేసినట్లు తన గూడెం... అడవి... తెరలు తెరలుగా గుర్తుకొస్తా వుండాయి.

❋❋❋

ప్రకృతి పరవళ్ళు తొక్కే నల్లమల అటవీ ప్రాంతం.

సత్యం, శివం, సుందరం అంటూ ప్రతిధ్వనించే శ్రీశైల క్షేత్రంకు ఉత్తరానికి లోపలికి పాతాళగంగ దాటుకొని అట్నే ఎగువకొండ దిగినాక తుమ్మలబైలు దాటుకున్నాక అట్నే పడమరకు రెండు కొండల దావ గుండా కాలిబాట ఎంబడి మద్దిచెట్ల నడుమ నుంచి ఆకుపచ్చ లోయగుండా నడక సాగిస్తా లోలోపలికి సాగిపోతే వస్తాది చెంచుల గూడెం– మేకలబండ.

ఐదు కుటుంబాలు... గూడెం మొత్తం జనాభా ఇరవైకి మించదు. అందరూ బంధువులే – అంకన్న, నాగన్న, గంగన్న, శివన్న... ఒక్కొక్కరుగా కళ్ళముందు కన్పిస్తా వుండారు.

నీళ్ళాకాశం... మబ్బులు గుత్తులు గుత్తులుగా విరబూసి ఆనందంగా చినుకుల సవ్వడి చేస్తున్నాయి. ఆకాశాన్ని అందుకునే కొమ్మలతో ఎత్తైన తపసి, మద్దిచెట్లు వయ్యారాలు పోతున్నాయి. గుబురు పొదల్లోంచి అడవికోళ్ళ అరుపులు, ఒక చెట్టుపై నుంచి మరో చెట్టుపైకి ఎగురుతూ ఆడుకునే పక్షులు, కొండబండల మాటున విప్పారిన అడవి పుష్పంలా తన గూడేం కళ్ళముందు కదులుతోంది. ప్రకృతికి మానవునికి మధ్య అనుబంధానికి నిలువెత్తు నిర్వచనంగా గూడెం పరవశిస్తోంది. ఇప్పపూలు శబ్దం లేకుండా చెట్టు నుంచి వేరవుతూ దారిని పూలమయం చేస్తున్నాయి.

అందమైన దృశ్యం... అపురూపమైన దృశ్యం... ప్రకృతి గీసిన వర్ణచిత్రం... చెంచుగూడెం... చెంచుజాతి... తాము చెంచులం... నిష్కళంక హృదయాలు... కపటం తెలియని మనుషులు... అభిమానించడం ఆప్యాయత కురిపించడం ఆత్మీయంగా కలిసిపోవడం తప్ప మరే విధమైన మోసాలు తెలియనివాళ్ళు... గూడేంలోనే వుంటే సరిపోయేది. పొరపాటున పట్నానికి తాను బయలుదేరాడు.

దీనికి కారణం ఎవరు ఆ మనిషి... ప్యాంటు లోపలికి షర్టు దోపుకొని కాళ్ళకు బూట్లు, మెడకు లావుటి బంగారు గొలుసు, ఐదు వేళ్ళకు ఐదు ఉంగరాలు పెట్టుకొని, నవ్వినప్పుడల్లా ఊగే బాన కడుపుతో వచ్చిన ప్రభుత్వ అధికారి.

కొండ తేనే సరుకు, తపసి చెట్ల నుంచి తీసిన జిగురు రెండు సంచులకు పట్నానికి తీసుకొచ్చి సరుకు నాణ్యమైనదని కాగితం పొందితే మీ జీవితాలు

బాగుపడిపోతాయని అడ్రసుముక్క చేతిలో పెట్టి ఆ మనిషి వెళ్ళిపోయాడు. పట్నం జనాన్ని ఎప్పుడూ నమ్మదు సాంబయ్య. ఇంట్లో ఆడోళ్ళ పోరు పడలేక బయలుదేరాల్సి వచ్చింది. ఇప్పుడిట్లా తన శరీరం రక్తం కారుతున్న స్థితి... రెండ్రోజుల తర్వాత వదిలిపెట్టారు సాంబయ్యను. వాళ్ళని వీళ్ళని ప్రాధేయపడి లారీనెక్కి శ్రీశైలం వరకు కష్టపడి రాగలిగాడు. అడవి దగ్గరవుతున్న కొద్దీ కళ్ళల్లో ఆనందం. శ్రీశైల మల్లికార్జునుడి గుడి నుంచి గంటల శబ్దం... మనసుకు ప్రశాంతంగా వుంది. మళ్ళీ తన లోకంలోకి తాను చేరుకోబోతున్న అనుభూతి...

❋❋❋

కొండదారిలోకి అడుగుపెట్టగానే నరాలన్నీ జివ్వుమన్నాయి. అడవి తల్లి చల్లగా దీవిస్తూ గాలికెరటమై తాకింది. తంగెడుపూలు గూడెం కాలిదావ వెంబడి స్వాగతమిస్తున్నాయి. మద్దిచెట్ల కావలి నుంచే బిగ్గర కేకను తన గుర్తుగా అరిచాడు. కొండబండలు ప్రతిధ్వనించాయి. బదులుగా గూడేం దగ్గర్నుంచి మరో కేక విన్పించింది. అవును అది తన కొడుకు శివన్నదే. నాయన పట్నం నుంచి వస్తాండడనే ఆనందంతో వాడు రాళ్ళురప్పలూ కంపలూ ఏవీ పట్టించుకోకుండా నిముషాల్లో తండ్రి దగ్గరికి వచ్చి చేరుకున్నాడు. వెనుకనే భార్య కూడా!

'ఏమైంది నాయనా... ఏమైంది నాయనా...' కొడుకు సాంబయ్యను చూసి అడుగుతా వుండాడు.

'ఏం జరిగింది సామీ...' భార్య ఆందోళనపడ్తా వుండాది.

'ఏం జెప్పి సచ్చేది... పట్నంలో అందరూ దొంగనాయాళ్ళుండారు. మంచితనం లేదు. దుడ్లు కనపడితే దోచుకుంటా వుండారు. కాలం మారిపోయింది. అడవిలో ఈ పులులూ, సింహాలూ, నక్కలూ, పాములే మేలు రా... వాటి జోలికి పోతేనే ఏమైనా జేస్తాయి. పట్నం వాళ్ళు మనలాంటోళ్ళ జూస్తే చాలు దుడ్ల కోసం జైళ్ళలో కేసి సావకొడ్తా వుండారు... బతికినంత కాలం ఆ మాయదారి పట్నానికి పోగూడదురో... అడవిలో వున్నన్ని రోజులూ మనల్ని అడిగేటోడు వుండడు. మన బతుకేదో మనం బతకచ్చు...' ఆవేదనగా బండపైన కూలబడ్డాడు సాంబయ్య ఏడుస్తా!

కొడుకు, భార్య చెరొక పక్క పట్టుకొని గూడెంకు చేర్చినారు. ఆకు పసరు నూరి శరీరానికి అయిన గాయాలకు పూసినారు. వేడివేడిగా తునకలకూర, సంగటి చేసి తిన్పించినారు.

'మనిషిని పశువు తిన్నా కొట్టినారు ఆ నా కొడుకులకు దూం తగల, సరక తగల, మట్టి కొట్టుకపోనూ...' అంటా భార్య తిడ్తానే వుంది. సాంబయ్యను ఆ పరిస్థితిలో చూసి గూడెమంతా దుఃఖించింది.

'పట్నానికి యింకెవరూ వెళ్ళకూడదని' తీర్మానం చేసుకున్నారు. రోజులు గడుస్తానే వుండాయి. క్రమక్రమంగా సాంబయ్య కోలుకున్నాడు. అప్పుడప్పుడు నిద్రలో పట్నం కల వచ్చినప్పుడు ఉలిక్కిపడ్తా వుండాడు. లేడి నెత్తురు తాగిన పులిముఖం గుర్తుకొస్తా వుండాది.

❋❋❋

నడిరాత్రిపూట నిద్రలో 'పట్నం కల' వచ్చినప్పుడు 'దేవరా... కొట్టాకు... యింగెప్పుడూ ఈ రాజ్యంలోకి రాను. బతికినంత కాలం మా అడవిలోనే వుంటాను. సావైనా బతుకైనా ఆడ్నే. దేవరా.. కొట్టాకు...' అని కలవరింత కేకలు పెడ్తా వుండాడు.

సాంబయ్య పరిస్థితి చూసి భార్య, కొడుకు కన్నీళ్ళు పెట్టుకొని బెరకు బెరకుగా చూపెట్టుకొని వుండారు.

నిద్రలేపి నీళ్ళు తాపి కూర్చోబెడతాందరు.

మళ్ళీ పడుకున్న కాసేపటికే... కల... పట్నం కల...

'ప్యాంటు లోపలికి షర్ట్ దోపుకొని బాన కడుపుతో వున్న ఆకారం. దగ్గరగా... చాలా దగ్గరగా... అతడి మెడలోని బంగారం గొలుసు మెరుస్తోంది. ఆ మనిషి దగ్గరికొస్తున్నాడు... వస్తున్నాడు... వచ్చేస్తున్నాడు... దగ్గరికి... కి...'

'దేవరా... బతికినంత కాలం నీ రాజ్యంలోకి రాను...' ఉలిక్కిపడి సాంబయ్య లేచి కేకలు పెడ్తా వుండాడు.

గూడెంలోని అందరూ వచ్చి ఈ తంతు చూస్తా వుండారు. ఏం జరిగిందని అడిగితే... 'లేడి నెత్తురు తాగిన పులి ముఖం కలలో కనపడతా వుండాదని' చెప్పి సాంబయ్య మళ్ళీ నిద్రపోవడానికి పూనుకున్నాడు.

బయట చుక్కలాకాశంలోని వెన్నెల కరిగికరిగి మద్దిచెట్ల మీద మంచు బిందువుల్లా కురుస్తోంది.

గుబురు పొదల్లోంచి అడవి కోళ్ళు కూస్తున్నాయి. ఇప్పపూలు శబ్దం లేకుండా చెట్టు నుంచి రాలుతున్నాయి. అడవి తల్లి చల్లగా దీవిస్తోంది గాలి కెరటమై!

– నవంబరు, 2007, చినుకు మాసపత్రిక.

నీడలు

'రాత్రి పిల్లలు త్వరగా భోజనాలు ముగించుకొని పడుకొని నిద్రపోవాలి ఇలా రాత్రిపూట కూడా ఆడుకుంటూనే వుంటారా ఎవరైనా... అదీ గోడలపైన పడే నీడల్ని చూస్కుంటూ!' మరోసారి విసుక్కుంది అనూష. వంట గదిలోంచి మెయిన్ హాల్‌లోకి వచ్చి ఎవరూ చూడకపోయినా ఆన్ చేసి వున్న టి.వి. వైపుకి చూడగానే కోపం మరింత హెచ్చింది. 'ఈయనగారొకరు చూసేది లేదు... వినేది లేదు. ఇక్కడ టి.వి. ఆన్‌చేసి ఆ సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ గార్డెన్‌లో తిరుగుతుంటారు' అంటూ దండకం అందుకుంది. పిల్లలిద్దరూ మా ఆటలు మావే అన్నట్లు గోడపైన పడుతున్న నీడల్ని కాళ్ళతో తన్నుకుంటూ ఆనందిస్తున్నారు.

సెల్‌ఫోన్‌లో మాటలు పూర్తికాగానే ఇంట్లోకి వస్తున్న మాన్వి, భార్య కోపంగా వుందన్న విషయాన్ని పసిగట్టి 'రేయ్... పిల్లలు గోడలకేసిన రంగులు పాడైపోతాయిరా... ఇలా రండి టి.వీ.లో మిక్కీమౌస్ చూద్దాం' అంటూ దగ్గరికెళ్ళి వారిని వారించాడు.

'మీ వల్లనే వాళ్ళిలా తయారవుతున్నారు. పిల్లల్ని కొట్టకూడదు, తిట్టకూడదు అంటూ వాళ్ళని ముద్దు చేస్తుండడం కారణంగానే వాళ్ళు మొద్దుల్లా తయారవుతున్నారు. చిన్నప్పుడు మీరు కూడా ఇలాగేనట కదా! రాత్రిపూట నీడల్తో ఆడుకొంటూ వుండేవారని అత్తమ్మ కూడా చెప్పింది...' తానేదో సిద్ధాంతం కనుక్కున్న ఫోజులో చెప్పింది అనూష.

'అవును... నిజమే! మనం ఎలా ఆడితే అలా మనతో పాటుగా ఆడే నీడలతో రాత్రిపూట ఆడుకోవడం నాకు చిన్నప్పటి నుంచి కూడా ఎంతో ఇష్టం' – తన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ జవాబిచ్చాడు మాన్వి.

'అందుకే ఇప్పటికీ రాత్రిపూట అప్పుడప్పుడూ ఏదేదో కలవరించుకుంటూ, మీలో మీరే ఏదో మాట్లాడుకుంటూ... ఉలిక్కిపడ్తుంటారు' – తాను కూడా ప్రక్కనే సోఫాలో కూర్చుంది. టి.వీ. న్యూస్‌లో ఎక్కడో 'జమీందార్ రాజసింహ మరణాంతరం కోర్టుకెక్కిన కొడుకులు' అంశంపై కథనం ఆసక్తికరంగా వుండడంతో పది నిమిషాల పాటూ ఛానల్ మార్చకుండా అలాగే చూశారు. తర్వాత పాతకాలం సినిమా కాసేపు. 'డాడీ... బ్లాక్ అండ్ వైట్ మూవీ బోర్... బోర్' అనడంతో వాళ్ళ కోర్కెను కాదనలేక కాసేపు కార్టూన్ నెట్‌వర్క్ చూశాక ఆవలిస్తున్న పిల్లల తీరును చూసి అనూష టి.వి.ని ఆఫ్ చేసి బెడ్‌రూం వైపుకు నడిచింది పిల్లల్తో పాటుగా.

మెయిన్‌హాల్లో లైట్ ఆఫ్ చేయడానికి చేయి పైకెత్తాడు స్విచ్‌ల దగ్గర... నీడ... తన చేయి నీడ... పైకి లేచింది... అచ్చం ఏనుగు తొండంలా వుంది. చేతి వేళ్ళ నీడలతో వివిధ ఆకారాల్లో బొమ్మల్ని చూస్కోడం మౌన్వికి అలవాటే. ఇంకా ఇంకా కొత్త కొత్త ఆకారాల్ని కనిపెట్టాలనే తపన. బెడ్‌రూంలోకి ఎంతసేపటికి భర్త రాకపోయేసరికి ఏం చేస్తున్నాడో చూడాలని మెల్లగా అనూష తలుపు వారగా వచ్చి తొంగి చూసింది. మాన్వి నీడల్తో ఆడుకుంటున్నాడు. 'టైం చూశారా... మళ్ళీ ఉదయాన్నే క్లినిక్ కెళ్ళాలి కదా... ఆటలేంటి... నీడల్ని దెయ్యాలంటారు. ఇంట్లో నీడల్తో ఆడుకుంటే అరిష్టమని మా బామ్మ కూడా చెప్పింది. పిల్లలు కూడా పడుకున్నారు. త్వరగా రండి... ఉదయాన్నే లేవాలి...' పిల్చింది అనూష అసహనంగా ఆవలిస్తూ.

మాన్వి లైటార్పి వచ్చి పడుకున్నాడు.

పడుకున్నాడే గానీ నిద్రపట్టడం లేదు. లేచి ఏదైనా కాసేపు పుస్తకమైనా చదువుకుందామా అనుకున్నాడు. మళ్ళీ లైటేస్తే... అమ్మో వద్దు వద్దు... అనూష సెకండ్‌షో క్లాస్ తీసుకుంటుంది... ఆ మధ్య నిద్రపట్టడం లేదని మ్యూజిక్ సిస్టం ఆన్ చేసుకున్నందుకు ఇలాంటి క్లాసే ఒకటి తీసుకున్న దృశ్యం గుర్తుకొచ్చి గట్టిగా కళ్ళు మూసుకొని పడుకోవడానికి ప్రయత్నం చేశాడు. అటు ఇటు దొర్లాడు. సమయం గడుస్తూనే వుంది కానీ నిద్రపట్టడం లేదు. బయట రోడ్డుపైన కుక్క వొకటి అదేపనిగా మొరుగుతోంది. ఈ కుక్కలకు రాత్రిపూట ఏం కన్పిస్తుంటాయో ఏమిటో చీకటిని చూసి మొత్తుకుంటూ వుంటాయి అనుకున్నాడు. తనింటికి రెండిండ్ల అవతల వున్న సందులోని వేపచెట్టు పైన గుడ్లగూబ అరుస్తోంది. పక్కింట్లోని గడియారం పన్నెండు కొట్టింది... శూన్య సమయం మొదలవుతుంది. ఛా... నిద్ర పట్టడం లేదు. ఏంటి తాను పిచ్చిపిచ్చిగా ఏవేవో ఆలోచిస్తున్నాడు. గుర్ఖా తన చేతిలోని లాఠీతో గేటుకేసి కొట్టాడు తనొచ్చినట్లు గుర్తుగా. బయట కుక్క మొరుగుతూనే వుంది. 'నీడల్ని దెయ్యాలంటారు... ఇంట్లో నీడల్తో ఆడుకుంటే అరిష్టం' భార్య చెప్పిన మాటలు జ్ఞప్తికొచ్చాయి. అసహనంగా వుంది... అనూష, పిల్లలిద్దరూ ప్రశాంతంగా నిద్రపోతున్నారు. తనకే నిద్ర... నిద్ర... ఆవలింతలొస్తున్నాయి... నిద్ర... వస్తోంది... నిద్ర... వస్తోంది... స్తోంది... ంది.

హమ్మయ్య ఒక విజయం – నిద్ర రావడం!

నిద్రలో కల... కల... కలకలం... కలవరం...

అరే అదేమిటి అచ్చం తనలాగే వుంది... తనలాగే మాట్లాడుతోంది... తనలాగే చేతులాడిస్తోంది... తనలాగే నడుస్తోంది... తనలాగే మాట్లాడేటప్పుడు మధ్య మధ్యలో కళ్ళు ఎగరేస్తోంది... తనలాగే పరిగెడుతోంది... అవును తనలాగే... ఏమిటిది... నీడ!

తన నీడ పరిగెడుతూ వెళ్ళిపోతోంది. పట్టుకోండి... పట్టుకోండి అంటూ వున్నా వినకుండా పరిగెడుతూ వెళ్ళిపోతోంది. ఎక్కడికి? నీడకు ముందు దారి చూపిస్తూ వెళ్తున్నది ఏదో... అవును అది గబ్బిలం. ఎక్కడికి తన నీడను గబ్బిలం వెంట తీసుకపోతున్నది... వూరి వైపుకేనా!

గండ్లూరు నుంచి ఎగువకొండ దిగిన తర్వాత కాలిదావ ద్వారా పల్లెదారి పట్టింతర్వాత తంగేడుపూల తోటలు వస్తాయి. అక్కడే పెద్దయ్య సత్రం వుంది. దానికానుకొనే గబ్బిలాల చెట్టు. వూర్లోకి పోవాలంటే ఆ చెట్టు దాటుకునే పోవాలి. ఆ చెట్టుకొమ్మలు ఆకాశంలోకి ఎగబాకి వుంటాయి. విస్తర్ల ఆకులంతుండే పచ్చనాకులు గాలికి దెయ్యాలలాగా రొదపెడతానే వుంటాయి. పెద్దపెద్ద కొమ్మలు మాను మొత్తం పురి తిరిగివుంటాయి. ఆ కొమ్మలకు కాళ్ళు పైకి పెట్టి తలలు కిందకు వాల్చి రెక్కలాడించుకుంటా వుంటాయి మందలు మందలు గబ్బిలాలు. చెట్టుకొమ్మల్లోకి చూడాలంటే భయమేస్తాది. దీన్నే వూర్లో దెయ్యాల చెట్టు అని కూడా పిలుస్తా వుంటారు.

ఇంటివద్ద అత్త పెట్టే పోరు పడలేక మిట్ట మధ్యాహ్నమప్పుడు సావిత్రమ్మ పైట కొంగుతో ఉరిపోసుకొని చచ్చింది ఈ చెట్టుకే. తిమ్మాపురం నాగిరెడ్డితో సిద్ధారెడ్డి ఫ్యాక్షన్ పెట్టుకొని రాత్రికి ఇంటికొస్తా వుండేటప్పుడు నాగిరెడ్డి మనుషులు కాపుకాసి తలనరికింది ఈ చెట్టు వద్దనే. భార్య మీద అనుమానంతో మాయమాటలు జెప్పి పిల్చుకొచ్చి మచ్చుకత్తితో తునకలు తునకలుగా ఆమెను వెంకట్రాముడు నరికింది ఈ చెట్టు మోట్లోనే. పెళ్ళాం మీద అలిగి ఇల్లు విడిసి ఒంటిగా కడవరకు సత్రంకాడ్నే బతికి కాలంతో పాటూ కలిసిపోయిన పెద్దయ్య వున్నింది ఈ చెట్టు నీడలోనే.

వూర్లోని గబ్బిలాల చెట్టుకు చాలా పెద్ద కథే వుండాది. ఇట్లా ప్రాణాలిడిసి నోళ్ళంతా ఆ చెట్టు కొమ్మలకు గబ్బిలాలై యాలాడతా బతుకు సాగిస్తా వుండారని వూర్లో అందరూ చెప్పుకుంటా వుంటారు. ఇది ఇట్లా నడుస్తా వుండగానే ఆ చెట్టు కట్ట మీదకు వూరి పొలిమేరల్లోంచి నడుచుకుంటా వచ్చి ఒంటరిగా ఒక నీడ కూర్చొంది. ఆ నీడ ఎవరి కోసమో ఎదురు చూస్తోంది. అవును ఆ నీడ మరో నీడ కోసమే నిరీక్షిస్తున్నది. ఎందుకని?

ముందు దారి చూపిస్తూ వచ్చిన గబ్బిలం చెట్టుపైన తలక్రిందులుగా వాలి పుక్కిలిస్తా వుండాది గసతో. మాన్వి నీడ కూడా ఆయాసంగానే వెళ్ళి కట్ట మీద కూర్చొంది. ప్రక్కనున్న నీడ పలకరించింది.

'బాగున్నావా?' ప్రశ్నించింది ఆ నీడ.

నువ్వెవరో గుర్తు రావడం లేదు అన్నట్లు చూస్తూ... బాగానే వున్నానన్నట్లు తలాడించింది మాన్వి నీడ.

'పరుగు పరుగున రావడం ఎందుకు? కొంత కుదురుగానే రావచ్చు కదా!' మళ్ళీ అన్నది ఆ నీడ.

'మీరెవరో తెలుసుకోవచ్చా!' సూటిగానే అడిగేసింది మాన్వి నీడ.

'అవున్లే నల్లటి నీడను కదా... నన్ను గుర్తు పట్టలేకపోతున్నావు. నా గురించి కొంత సమాచారం చెప్తాను. అప్పుడేనా నువ్వు నన్ను సులభంగా గుర్తు పడ్తావనుకుంటాను.'

'నా పేరు రాజసింహ. కార్వేటి నగరానికి చెందిన జమీందార్ని. వందల ఎకరాల భూమి మా తాతల కాలం నుంచి మా జమిందార్ల గుప్పిట్లోనే వుండేది. మేము ఎంత భూమి అని సాగు చేయగలం? చాలా భూమి సాగు చేయకుండా; బీడుగానే పెట్టి వుండేవాళ్ళం. ఓ రోజు నడిరాత్రి నిద్రపోతా వుండేటప్పుడు తలుపు ఎవరో తట్టిన శబ్దం... ధైర్యంగానే వెళ్ళి తీశాను. ఎదురుగా ఎవరో స్త్రీమూర్తి. వృద్ధాప్య ఛాయలు ప్రస్ఫుటంగా ముఖంలో కన్పిస్తా వుండాయి. మనిషిలో సత్తువ కూడా లేకుండా వున్నట్లుంది. ఆమెను ఎక్కడా చూసిన జ్ఞాపకం లేదు. ఇంత రాత్రిపూట తనింటికి వచ్చి తలుపెందుకు తట్టింది... ప్రశ్న? నీవెవరమ్మా... యింత రాత్రి వచ్చావు.... నీకేం కావాలి?' ప్రశ్నించాను గుమ్మం దగ్గరే ఆమెను నిల్చోబెట్టి.

'అయ్యా! నా కష్టాలు నావి. ఒక దుర్మార్గుడి దగ్గర ఇంతకాలం నుంచి బంధనమై వుండాను. నాకు విముక్తి కావాలి. పచ్చగా కలకలలాడ్తా వుండాలని నాకూ వుంది. ఏ వకరి గుప్పిట్లోనో జీవితమంతా నిస్సారంగా గడ్సిపోతా వుంటే బాధే కదా... ఆలోచించు అయ్యా!' వేడుకోలు ఆమె స్వరంలో.

నాకేం అర్థం కాలేదు. ఆమె కష్టాలేమిటో... ఆమె తాత్వికంగా చెప్తున్న సంగతేమిటో నిద్ర మైకంలో వున్న నా తలకెక్కనే లేదు. 'నీ పేరేమిటమ్మా... ఏ వూరు మీది...' ప్రశ్నించాను ఆమెనొక మతి భ్రమించిన దానిలా చూస్తూ.

'నా పేరేమిటో నాకే స్పష్టంగా తెలీదు. యిక నీకేమని చెప్పాలి? కాని అందరూ 'భూమమ్మ' అని ప్రేమగా పిలుస్తా వుంటారు. ఎట్లా పిల్సినా పలుకతానే వుంటా' చెప్పింది వినయంగా.

'మరి మీది ఏ వూరు...' ఆసక్తిగానే ప్రశ్నించాను ఈసారి.

ఆమె చిక్కగా నవ్వింది... 'ఆ వూరు ఈ వూరు అని ఏమీ లేదు. అన్ని వూర్లూ నావే. పేదవాళ్ళందరూ నావాళ్ళే. కానీ నా వాళ్ళకే నన్ను కానీకుండా నన్ను బంధనం చేస్తా వుండారు... నీలాంటోళ్ళు..." చెప్పింది విచారంగా.

ఆమె యిస్తున్న సమాధానాలకు నాలో భయం ఆవహించింది. కాళ్ళు వణికాయి. వళ్ళంతా చమటలు పట్టాయి.

గట్టిగా కేకవేసి కళ్ళు తిరిగి పడిపోయాను.

కాసేపటికి నా వాళ్ళంతా వచ్చారు.

నన్ను తీసుకెళ్ళి మంచంలో పడుకోబెట్టారు. నీళ్ళు తాపారు. నిద్రలో కలవరిస్తా మంచంపై నుంచి దొర్లి కిందపడ్డానని చెప్పారు. కలా... నిజమా... అర్థం కాలేదు.

మళ్ళీ... మళ్ళీ ఆలోచించాను. జరిగిన సంఘటన వల్ల నేనేం గ్రహించాలని... అర్థమైంది!

మా దగ్గర... మా గుప్పిట్లో వున్న భూమంతా పేదలకు పంచాలి... అదే ఆ భూమమ్మ కోరిక. సాధ్యమౌతుందా? భూమి... తరాలుగా... తరతరాలుగా మాకు వంశపారంపర్యంగా వస్తున్న భూమి... ఎకరాలు ఎకరాలుగా విస్తరించిన మహా భూసామ్రాజ్యం పేదలకు పంచాలంటే ఎవరికైతే మనసు అంగీకరిస్తుంది? నా పరిస్థితి కూడా అదే. మా కుటుంబ సభ్యులందర్నీ సమావేశపరచి భూమి విషయం ప్రస్తావించాను. అందరూ నన్ను అసహ్యించుకున్నట్లు... వాళ్ళలోంచి నన్ను వెలివేస్తున్నట్లు చూశారు.

ఆ చూపుల్నే తట్టుకోలేకపోయాను. నిజంగానే వాళ్ళు అలా చేస్తే బతకలేననిపించింది.

'వుండే ఆస్తినంతా భాగాలు చేసి ముందు మాకు పంచు... మా వాటలు మావి...' అని చివరిగా అందరూ ముక్తకంఠంతో అడిగారు.

నేనేం సమాధానం చెప్పకుండానే అక్కడి నుంచి నడుచుకుంటూ బయటికొచ్చాను. అడుగుతీసి అడుగుపెడ్తున్న ప్రతిసారీ భూదేవి నన్ను మింగేస్తుందేమో...ననే భావన. నడవాలంటే భయమేస్తోంది. కాళ్ళు తీసి నేలపైకి

పాదం మోపాలంటే వణుకు వస్తోంది. వైద్యుడ్ని పిల్చి చెప్పాను. 'మీదో మానసికమైన జబ్బు. దీనికి మందులు పనిచేయవు. మనసు చెప్పినట్లు వింటూ నడుచుకోవడమే మందు' అన్నాడు. నిజంగానే చెప్తున్నాను... ఆ భూమంతా మాకెలా వచ్చిందంటే ఎంతమంది దగ్గర దోచుకున్నామో; ఎంతమంది దగ్గర ఖాళీ తెల్లకాగితాలపై వేలిముద్రలు వేయించుకున్నామో; భయపెట్టో, ప్రాణాలు తీసో, కరెన్సీ కాగితాలు ఎగజిమ్మి, ఎలాపడితే అలా సంపాదించుకుంటూ వచ్చి వుండవచ్చు... ఇదే సత్యం కూడా! కానీ ఎందుకో 'భూమిని పేదలకు పంచాలి' అనే అంశమే రవ్వంత కూడా నాకు నచ్చడం లేదు. బహుశా నాకు విశాల హృదయం లేకపోవడమే దీనికి కారణం కావచ్చు...' నిట్టూర్పు విడిచి చెట్టుకానుకుంది రాజసింహగారి నీడ.

ఆ నీడ చెప్తున్నదంతా నిజమా... కాదా అనే అనుమానం కల్గింది మాన్వి నీడకు. ఆ విషయమే బయటకు అనేసింది కూడా. 'నీడలు నిప్పులాంటివి. నిజాలు మాత్రమే చెప్తాయి. వాటికి అబద్ధాలు ఆడడం సాధ్యం కాదు. అందుకే జీవులు చెప్పే సవాలక్ష సంగతుల్లో వాస్తవాలను వున్నది వున్నట్లు బయటకు రాబట్టడానికే దేవుడు నీడను సృష్టించింది. నువ్వింకా చావలేదనుకుంటాను..! ఆత్రం కొద్దీ వచ్చినట్లుండావు. జీవి చచ్చింతర్వాత నీడ దేవుడి దగ్గరికెళ్ళి తాను చేసిన పాపాలన్నిటిని పదిలంగా చెప్తుంది. అది చెప్పిన సమాచారం ఆధారంగానే స్వర్గనరకాలు ప్రాప్తిస్తుంటాయి. సరే అదంతా తర్వాత నా కథ మధ్యలోనే వుంది...

'అవునవును చెప్పండి చెప్పండి...' మాన్వి నీడ కూడా చెట్టుకు ఆనుకుంది.

'పేదలకు భూమిని పంచాలా వద్దా' అనే సందిగ్ధాన్ని మోస్తూనే తీరని మనోవేదనతో మంచం పట్టాను. చాలాకాలం మంచంలోనే గడపాల్సి వచ్చింది. మనిషి మంచంలో పడినప్పుడే అయినవాళ్ళు ఎవరో, కానివాళ్ళు ఎవరో ఖచ్చితంగా తెలిసేది. నాక్కూడా జ్ఞానోదయమైంది ఎవరూ నావాళ్ళు కాదని. ఏదీ నాది కాదని. అంతా స్వార్థం. నాకు నోటి మాట పోయింది. కేవలం లీలగా విన్పిస్తోంది. చూపు కూడా మసక మసకగానే కన్పిస్తోంది. అప్పుడే కుటుంబంలో కలహాలు మొదలైనాయి. నేను బతికుండగానే కొడుకులు; అల్లుళ్ళు; కూతుర్లు; కోడళ్ళు ఆస్తి కోసం వీధులకెక్కి కొట్టుకున్నారు, తిట్టుకున్నారు. బంధువులందరితో కళకళలాడతా వుండే దర్బార్‌లాంటి ఇల్లు ముక్కలై సంసారాలు వేరువేరు కాపురాలైపోయాయి. ఆ దుఃఖంతోనే నిన్న నేను మరణించాను. ఆ తర్వాత వాటాల కోసం కొడుకులు కోర్టులకెక్కారు... రావుబహద్దూర్ రాజసింహ మరణానంతరం కార్వేటి నగరానికి చెందిన సంస్థానం ఆస్తులకై కొడుకులు కోర్టుకెక్కారని టి.వీల్లో కూడా చూపించారు. బహుశా నువ్వు

కూడా చూసే వుంటావు...' రాజసింహగారి నీడ తన కథంతా చెప్పి తృప్తిగా కుదుటపడింది.

రకరకాల ప్రశ్నలు...

'అవును... తాను రాత్రి టి.వి.లో ప్రసారమయ్యే వార్తల్లో దీనికి సంబంధించిన కథనమంతా చూశాడు. గుర్తుకొస్తోంది...' మాన్వి నీడకు. చల్లటి గాలి వీస్తోంది. చెట్టు ఆకులు గలగలా శబ్దం చేస్తున్నాయి. అమావాస్య కావడం వల్ల ఆకాశం చీకటిని మోస్తూ కమ్ముకుంటున్న మబ్బుల మధ్య పెనుగులాడుతోంది.

'మీరు నిన్న మరణించారని అన్నారు. మరి ఇంకా ఇక్కడే ఎందుకున్నారు... ఏదో ఒక లోకానికి అదే స్వర్గమో... నరకమో... ఎక్కడికో ఒకచోటికి వెళ్ళాలి కదా!' ఆశ్చర్యంగా ప్రశ్నించింది మాన్వి నీడ.

'చావగానే దేవుడి దగ్గరికి వెళ్ళిపోయాను. కానీ లోపలికి ఎంట్రీ దొరకలేదు నా నీడకు. అక్కడే రిసెప్షన్‌లో సంగతి ఏమిటని విచారించాను. కాసేపు నా గుండె మరోసారి ఆగిపోయినంత పనైంది. నేను ఒకరోజు ముందే చచ్చాను. కాదు... కాదు చంపబడ్డాను' ఈ మాటలు చెప్తున్నప్పుడు మాటలు కొంత తడబడ్డాయి.

'ఎలా?' – ఆందోళనగా అడిగింది మాన్వి నీడ.

'ఒక చిన్న పొరపాటు కారణంగా...!'

'పొరపాటు కారణంగా చావడం ఏమిటి?'

'అదే ఆశ్చర్యకరమైన విషయం. నేను ఇంట్లో మంచంలో వున్నప్పుడు ట్రీట్‌మెంట్ చేసే నర్సు పొరపాటు చేసింది. పూటకు మూడురకాల మాత్రలు మింగాల్సి వుండగా ఆ నర్సు ఒకేరకమైన మాత్రలు మూడు ఒకపూట నిర్లక్ష్యంగా నాతో మింగించింది. అంత డోస్ నా శరీరం పట్టలేకపోయింది. గుండె ఆగిపోయింది. కారణంగా ఒకరోజు ముందే చనిపోయాను. అందుకే నా నీడను భూమి మీదకు వెనక్కి పంపించారు' దీర్ఘంగా నిట్టూర్పును విడిచింది రాజసింహ నీడ.

'నీడలకు కూడా కష్టాలు; బాధలుంటాయా?' మరో ప్రశ్న.

'చాలా'– సంక్షిప్త సమాధానం.

'అదెలాగో కాస్త అర్థమయ్యేలా చెప్పగలరా...?' తెల్సుకోవాలనే ఆత్రుత.

'నేను చెప్పడం ఎందుకు? మరి కాసేపట్లో నేను ఎదురు చూస్తూ కూర్చున్న నీడ వస్తుంది... ఆ నీడ నీకు మరింత సమాచారమిస్తుంది... అన్నది రాజసింహ నీడ.

కాసేపు అలా మాటల మధ్యలో వుండగానే మరో నీడ మాకు దగ్గరగా వచ్చింది. రాజసింహగారి నీడ లేచి ఆ నీడను కౌగిలించుకొని ఆత్మీయంగా పలకరించింది. తర్వాత మౌన్వి నీడకు పరిచయం చేసింది.

'ఈ నీడ పేరు బాలస్వామి. ఐ.ఏ.ఎస్; ఐ.పి.యస్. అధికారి కాదు ఇతను. అటెండర్. సచివాలయంలో పనిచేస్తాడు. నెలకు మూడువేల ఎనిమిది వందల యాభై రూపాయల జీతం. అక్కడ మంత్రులతో కూడా కాని పనులు మావాడు చేయగలడు. నేను జమీందారుగా ఇంతగా ఎదగడం వెనుక బాలస్వామి కృషి ఎంతో వుంది. నాకంటే వయసులో చాలా చిన్నవాడు. సంపాదించడంలో ఎంతో పెద్దవాడు...' గర్వంగా చెప్పింది రాజసింహ నీడ.

బాలస్వామి నీడ ఉప్పొంగిపోయింది.

'నాదేముండాది సారూ... ఎక్కడో తమిళనాడు ప్రాంతం నుంచి కడుపాత్రం చేత దేశం పట్టుకొని ఇక్కడికిదా వస్తిని. అంతా తమలాంటి పెద్దల దీవెన... బంజారాహిల్స్‌లో రెండిల్లు; జూబ్లీహిల్స్‌లో షాపింగ్ కాంప్లెక్స్; అమీర్‌పేట్‌లో రెస్టారెంటు; రింగురోడ్డు దగ్గర ఇరవై ఎకరాల భూమి; అక్కడక్కడ కొన్ని కాంట్రాక్టులు... ఇదిదా... నా సంపాదన...' కట్ట మీద కూర్చుంటా సెలవిచ్చింది బాలస్వామి నీడ. చూశావా మావాడి సంపాదన అన్నట్లు ఫోజు ఇచ్చింది రాజసింహగారి నీడ.

'నీడలు నిజాలే చెప్తాయి... సారూ! నాదంతా దొంగ సంపాదన. ఎవడో ఒకడి కడుపుకొట్టి సంపాదించిందే. రైతుల ఆత్మహత్యల నివారణ కోసం వచ్చిన పథకంలో బినామీ పేర్ల మీద ఎంతో కాజేశాను. అదిగో ఆ మధ్యన వరదలు వచ్చినప్పుడు వరద బాధితుల సహాయార్థం మంజూరైన నిధులు చాలాభాగం రాజకీయ నాయకులతో పాటూ నేను నా వాటా తీసుకుంటిని. ఏం జేసి సచ్చేది సారూ... బతకడానికి ఎన్నెన్నో పాపాలు జేస్తిని... నా సంగతి సరే... సారూ; నీవేం జేస్తా వుంటావో చెప్పనే లేదు...' మాన్వి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి.

'నేను మీ అంత గొప్పవాడిని కానులెండి. ఏదో 'సైక్రియాటిస్ట్'గా క్లినిక్ పెట్టుకొని బతుకుతున్నవాడ్ని. మానసికంగా మనిషి ప్రవర్తన – ఊహలు లాంటివి అధ్యయనం చేసి వ్యాసాలు రాస్తుంటాను. భార్యా భర్తలకు కౌన్సిలింగ్ ఇవ్వడం లాంటివి చేస్తుంటాను... ఆదాయమంటారా మీకు నేను ఏమాత్రం కూడా సరిపోను...' మాన్వి నీడ తన వివరాలను వెల్లడించింది.

'అమ్మో... అయితే మీతో కొంచెం జాగ్రత్తగా వుండాలి' అంది సరదాగా బాలస్వామి నీడ.

మూడు నీడలు కాసేపు నవ్వుకున్నాయి. ఆ తర్వాత బాలస్వామి నీడ చెప్పడం మొదలుపెట్టింది...

'ఏం జెప్పేది సారూ... నా కడుపున బుట్టిన కొడుకులే ఆస్తి కోసం నన్ను చంపినారు. చిన్నకొడుకు కాళ్ళు చేతులు విరిచి కుర్చీకి కట్టేస్తే... పెద్ద కొడుకు వైరు చుట్టికరెంటు పెట్టినాడు... గిలగిలా కొట్టుకుంటా చచ్చిపోతి. వాళ్ళమ్మ వూర్నుంచి వచ్చేటప్పటికి నన్ను చంపి పండబెట్టినారు. బాత్రూంలో కాలు జారిపడి ప్రాణాలు పోగొట్టుకున్నానని అందర్నీ నమ్మించినారు. పెద్దోడు, చిన్నోడు ఎప్పుడు కల్సివుండేటోళ్ళు కాదు. ఆస్తి కోసం నన్ను చంపను వాళ్ళిద్దరూ ఒక్కటైనారు. నేను పాపాలు జేసి సంపాదించిన సొమ్మంతా ఆ తాగుబోతు జులాయి నా కొడుకులు హారతి కర్పూరం జేస్తా సుఖిస్తా వుండారు. ఇట్టాటి బతుకు ఎవరికైనా వుంటుందా సారూ...' కన్నీళ్ళు కార్చుకుంటూ కుమిలి కుమిలి ఏడుస్తోంది బాలస్వామి నీడ. 'ఏడవద్దు... ఏడవద్దు' అంటూ ఓదార్చింది రాజసింహ నీడ.

'అప్పుడప్పుడూ అన్పిస్తా వుంటాది సారూ... నాకిట్టాటి యాతన జరగాల్సిందే... మా ఆఫీసుకు అర్జీలు తీసుకొచ్చే పేదవాళ్ళని కూడా వదలకుండా దోచుకున్నాను. రైతుల దగ్గర నుంచి, నిరుద్యోగుల దగ్గర నుంచి, వ్యాపారుల దగ్గర్నుంచి... ఒక్కరేమిటి చెబితే నమ్మరు సారూ... వికలాంగుల దగ్గర్నుంచి కూడా లంచం పుచ్చుకున్నాను. సంపాదన యావలో పడి ఎలా సంపాదిస్తున్నానో అనే సంగతే మరిచిపోయాను. అదంతా ఎవరి కోసం? నాకు చివరికి మిగిలిందేమిటి?' దిగులు పడింది బాలస్వామి నీడ. 'ఎట్లా జరగాలని వుంటే అట్ల జరుగుతాదిలే బాలస్వామి. బాధపడగాకు...' సముదాయించింది రాజసింహ నీడ.

చీకటి ఆకాశంలోని మబ్బులు ఉరుముతున్నాయి, కరుగుతున్నాయి. గుండె తెరచి కన్నీటి పాట పాడడానికి సిద్ధమవుతున్నాయి. గాలికి చెట్టు ఆకులు శబ్దం చేస్తున్నాయి. మూడు నీడల మధ్య నిశ్శబ్దం... నిశ్శబ్దం... నిశ్శబ్దం... శబ్దం... శబ్దం... ఎక్కడో పిడుగు పడింది!

'నా గడువు; వీడి గడువు మరో గంటలో ముగుస్తుంది. మేము యింక బయలుదేరుతాము. పై లోకంలో ఇప్పటికే బయటి వరకు పెద్ద పెద్ద నీడల 'క్యూ'లుంటాయి. మా వంతు రావడానికి ఇంకా కొంత సమయం పట్టవచ్చు. మేం చూసిన నిజాలన్నీ చెప్పిం తర్వాత మళ్ళీ మా పాపపుణ్యాలను బేరీజు వేసి ఏ జీవిలోకి పంపాలో డిసైడ్ చేస్తారు. జీవితం కొత్తగా మొదలవుతుంది' – బయలుదేరడానికి సిద్ధపడుతూ చెప్పింది రాజసింహ నీడ.

'నీ ఉత్సాహాన్ని మెచ్చుకుంటానుగానీ ఇంకెప్పుడూ నువ్వు నీకు కేటాయించిన దేహాన్ని ముందుగానే వదిలేసి ఇలా పారిపోయి బయటకు రావద్దు. ఒక్కొక్కసారి నిజంగా వాళ్ళకు దేవుడు కేటాయించిన సమయం కంటే ముందుగానే కావాలనో, ప్రమాదవశాత్తో, అనుకోకుండానో ప్రాణాలు విడిచిన నీడలు ఈ భూమ్మీద తమ గడువు వచ్చే వరకు సంచరిస్తూ వుంటాయి. ఒక్కోసారి ఆయువు వున్న దేహం కన్పిస్తే అవి వాటిలోకి చొరబడి దేహాన్ని వశపర్చుకొని ఆక్రమించుకుంటూ వుంటాయి. కాబట్టి నువ్వు సాధ్యమైనంత త్వరగా నీ దేహంలోకి వెళ్ళిపోతే మంచిది...' రహస్యాన్ని చెప్పింది బాలస్వామి నీడ.

మాన్వి నీడకు ఈ రహస్యం తెలియగానే భయమేత్తుకుంది. ఒకవేళ ఏదైనా అవసరమై అనూష తనను లేపితే లేవడం సాధ్యం కాదు. అప్పుడు తాను ఏమనుకుంటుంది? గుండెలు పగిలేలా రోదించదు. అమ్మో పెద్ద ప్రమాదం జరగనుంది... వెంటనే బయలుదేరి తన శరీరంలోకి తాను చేరుకోవాలి. రెండు నీడల దగ్గర వీడ్కోలు తీసుకొని మళ్ళీ వెనక్కి పరుగు మొదలైంది.

కాస్త పైకి చూసింది మాన్వి నీడ. ఒకటి రెండు నీడలు దేవుడి దగ్గరికి వెళ్తూ కన్పించాయి. తను పరిగెత్తుతోంది తన ఇంటి దిశగా. నీడలు... నీడలు... పైన వెళ్తున్నాయి నీడలు... కొన్ని నీడలు... కొన్ని వందల నీడలు... కొన్ని వేల నీడలు... ఈ భూమ్మీద ప్రాణాలు విడిచిన రకరకాల జీవుల నీడలు... ఎలాగైనా త్వరత్వరగా ఇల్లు చేరుకోవాలి... పరుగు... పరుగు... ఒకసారి కిందకు చూసింది. దృశ్యాల్ని మోసుకెళ్తున్న నీడలు... జీవితాల్ని మోస్తున్న నీడలు... ఎన్నో... ఎన్నెన్నో ఒక్కొక్కటిగా ఆవిష్కారమవుతున్నాయి... దృశ్యాల నీడలు...

నడి వూర్లోని ఖాళీ బావి వాన కోసం తపస్సు చేస్తోంది. గుడిసె బయట కుక్కి మంచంలోని వయసు పండిన ఆకు వొకటి అస్తమించడానికి ఎదురుచూస్తూ వుంది. లోపలికి నెట్టుకొస్తున్న ఈదురుగాలికి గూట్లోని దీపం సందిగ్ధాన్ని మోస్తోంది. పారేసిన పాతగుడ్డని కంపచెట్ల దగ్గరనుంచి కుక్కొకటి నోట కర్చుకొని కాళ్ళతో ముక్కలు చేస్తోంది. ఒకమూల గోడకు ఆనించి వున్న పాతకాలం కుర్చీ బూజు పట్టి దుమ్ముతో నిండి నిద్రపోతోంది. రోగమొచ్చి పెద్దాసుపత్రికి వెళ్ళిన పెద్దయ్య మిలట్రీకెళ్ళిన కొడుకును కలవరిస్తానే పార్థివ దేహమైనాడు. ఇంటి ముందున్న పెద్ద వేపచెట్టును రంపాలతో కోసి, గొడ్డళ్ళతో నరికి టింబర్ డిపోవాళ్ళకు అమ్ముకున్నందుకు మేఘాలు అలిగి కరువును కురిపించడానికి సిద్ధపడుతున్నాయి. మడవగట్టి ఇంటికొస్తున్నప్పుడు కరెంటు తీగ వొకటి రైతు కాళ్ళకు చుట్టుకొని జిల్లా స్పెషల్‌లో బ్యానర్ వార్తగా మారింది.

గుదికట్టె మెడకు తగిలించిన ఎనుము వొకటి వీధుల్లో దుమ్ము రేపుకుంటూ పరిగెడుతోంది. రోడ్డుపైన వెళ్ళే వెర్రిబాగులోడు వొకడు కుక్కల్ని రాళ్ళతో లేపుకుంటూ వెళ్తున్నాడు. ఒక కుంటికుక్క మొరుగుతూ తిరగబడే సాహసం చేయకుండా దిబ్బల వైపుకు వెళ్ళిపోయింది. కుటుంబాన్ని పోషించలేని మరో పత్తిరైతు మళ్ళీ పురుగుల మందు తాగి పొలంలోనే ప్రాణాలు విడిచాడు. నకిలీ విత్తనాలు జల్లుకొని ఇంకొందరు రైతులు తెల్లవార్లూ గోడుగోడుగా విలపిస్తున్నారు. గుడిమెట్ల మీద కూర్చున్న వాడెవడో గరుడ స్తంభం పక్కలో పెట్టుకొని పాటేదో పాడుకుంటున్నాడు. చీకట్లోనే మళ్ళీ వేటగాడు ఒక వల, కాసిన్ని నూకలు తీసుకొని అడవిలోకి ఆకలిగా బయలుదేరుతాడు. మనుషులే లేని అడవిలో నూకలు ఎందుకు చల్లబడి వున్నాయో ఆలోచించకుండానే మళ్ళీ మరో పావురాళ్ళ గుంపు అమాయకంగా వలలో చిక్కుకుంటుంది. దృశ్యాలను మోసుకెళ్తున్న నీడలు... నీడలు... క్షణం కూర్చోని కాలం తుఫాను లేచినట్లుగానే భయపెడుతుంది.

చేరుకోవాలి... త్వరత్వరగా... తన దేహాన్ని! పరుగు పరుగు... ఇంకా ఎంతసేపు పడుతుంది తన ఇల్లు రావడానికి... మాన్వి నీడ వేగాన్ని మరింత పెంచింది. రకరకాలు తనువంతా ఆక్రమించుకుంటున్నాయి.

దూరంగా... మసకమసకగా...

నగరం ఇంకా ఇప్పుడిప్పుడే నిద్రలేస్తోంది.

డిపోలోంచి మొదటి బస్సు బయలుదేరడానికి సిద్ధపడుతోంది.

పాలడబ్బాల వాళ్ళు హడావిడి చేస్తున్నారు. దినపత్రికలు వేసే పిల్లలు సమాయత్తం అవుతున్నారు.

మాన్వి నీడ ఇంటి దగ్గరికి చేరుకుంది... దగ్గరికి... తన శరీరం దగ్గరికి... చేరుకోబోయింది...

ఇంకా తన భార్య మేల్కోలేదు.

పనిమనిషి కూడా రాలేదు... బయట వేయాల్సిన ముగ్గు కూడా లేదు. బయట రోడ్డుపైన ఆటో వెళ్తున్న శబ్దం...

తన దేహాన్ని గాఢంగా కౌగిలించుకొని వుంది అనూష. ఆలస్యం వద్దు... మళ్ళీ తన దేహంలోకి తాను ప్రవేశించాలి ఒన్... టూ... త్రి... జూమ్!

అనూష ఉలిక్కిపడి లేచింది. మాన్విని తట్టిలేపింది.

మాన్వి కదలలేదు పలకలేదు. లైట్ ఆన్ చేసింది.

'ఏమండి! లేవండి... మీకే చెప్పేది... తెల్లవారుతోంది లేవండి...' భుజాన్ని కుదిపింది. మాన్వి లేవలేదు.

'ఏమైంది... మీకు' ఈసారి గిచ్చింది.

'అబ్బా... గిచ్చకే... ముందే నీకు గోళ్ళు పదునెక్కువ... కాసేపు నిద్రపోనీ...' మత్తుగా జవాబిచ్చాడు మాన్వి.

'రాత్రంతా మీ శరీరం చాలా చల్లగా వుంది. తెల్లారేప్పుడు ఎంత వేడిగా తయారైందో...' అనుమానంగా అడిగింది.

'ఏమో... నాకేం తెలుసు!'

'రాత్రంత ఒకటే కలలండి... పిచ్చి పిచ్చి కలలు... నీడలు మాట్లాడు కుంటున్నట్లు... ఎక్కడెక్కడో తిరిగి వస్తున్నట్లు... భయం వేసింది' మాన్వి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది అనూష.

'నాకే కలలు రాలేదు... పైగా నీడలతో ఆడుకొని పడుకున్నా కదా! ప్రశాంతంగా నిద్రపోయాను...' జవాబిచ్చాడు మాన్వి.

'నోర్మూసుకోండి... తెల్లవారుజామున వచ్చిన కలలు, నిజమేనని మా బామ్మ కూడా అంటుంటుంది...' తల తిప్పుతూ అన్నది.

'ఎప్పుడూ వూరుకెళ్ళాలని అంటూ వుంటారు కదా... ఈసారి వేసవి సెలవులకు కొన్నిరోజులు ప్లాన్ చేయండి... పోయి అందర్నీ చూసి వద్దాం...' గుర్తు చేసింది.

'మర్నాడు చిన్నోడి బర్త్‌డే. ఈరోజు షాపింగ్ చేసి కొత్త బట్టలు కొనాలి. వూర్నుంచి చిన్నాన్న వాళ్ళు వస్తాం అన్నారు. మీరు క్లినిక్ కెళ్ళిన తర్వాత బస్టాండ్‌కు కారు పంపండి. శ్రీనిధి పెళ్ళికంతా నాకు డైమండ్ నెక్లెస్ కావల్సిందే... ముందే చెప్తున్నాను! లేదంటే నేను పెళ్ళికి కూడా రాను...' మరోసారి గిచ్చింది.

'నేను ఇలా ఆగకుండా మాట్లాడుతూనే వుంటే కూడా బదులివ్వరేంటి...'

'ప్రపంచంలోని అన్ని సమస్యలు నీకే వున్నట్లు చెప్తున్నావు... ఇంకా తెల్లవారలేదు కదా! కాసేపు పడుకో...' అనూషను పైకి లాక్కున్నాడు మాన్వి.

లైట్ కాంతికి గోడపైన ఆ దృశ్యం నీడలు పడ్తున్నాయి. ఆ నీడలు కదులుతున్నాయి, ఆనందిస్తున్నాయి. ప్రేమను పంచుకుంటున్నాయి.

– జనవరి-మార్చి 2008
సాహిత్యనేత్రం త్రైమాసిక పత్రిక

వూరిని మర్చిపోగాకు రబ్బీ!

ముసురుకమ్మిన సాయంకాలపు అరుగు మీద పక్షుల్లా ఎగురుతా ఆడుకునే పిల్లల నవ్వుల మధ్య నా బాల్యం కన్పిస్తుంది... ఆకాశంలోని నీలి మేఘాల్ని నేలకు దించే పనిలో నిమగ్నమైనట్లు రెండు చేతుల్తో దారాన్ని సరిచేస్తూ గాలివాటాన్ని బట్టి పటాన్ని సరిచేస్తూ ఎదురుగాలికి పైకి లేస్తూ నీలాకాశంలోకి ఆశల కెరటంలా దూసుకుపోవడానికి ప్రయత్నిస్తున్న గాలిపటాన్ని మొండికెగరేస్తున్న పిల్లాడి తాపత్రయంలో నా చిన్ననాటి జ్ఞాపకాలు... ఆకు రాలు కాలం నుంచి ఆమనిలోకి ఋతువొకటి తర్జుమా అయ్యే శబ్దం...

మా వూరు... పల్లెటూరు... ఒంటెద్దు బండిపైకెక్కి కాలువ కట్ట పై నుంచి వూర్లోకి సాగిపోతే... ఒక్కొక్కటిగా ఆవిష్కారమయ్యే స్మృతులు... మట్టి మీద నడవడం మొదలు... మట్టిలో కలవడం వరకు మధ్యలోదే జీవితమా... ఎలా బతికామో తెలియకుండానే ఒక జీవితకాలం దాటేస్తున్నాం. ఎంత దుఃఖించినా నీడ తడవదు కదా!

నీడ...

నన్ను నడిపించిన నీడ... నా చిటికెన వేలు పట్టుకొని జీవితాన్ని గమనించమని లోకంలోకి నడిపించుకొచ్చిన ఆధారం. నేను కాళ్ళ నొప్పులని అంటే భుజాల మీద కెత్తుకొని భారాన్ని కూడా బాధ్యతగా మోసిన మహానుభావుడు... ఆడుకుంటానంటే గుర్రమయ్యే ఆట వస్తువులా, ఏడుస్తుంటే ఆటబొమ్మలా, చీకట్లో నేనుండిపోతే వెలిగే మైనం వత్తిలా... తను కరిగిపోతూ నాకు కాంతిని పంచుతూ... పలక మీద నేను రాసుకునే అక్షరాలకు తను సుద్దముక్కలా అరిగిపోతూ... నా కోసం... నా భవిష్యత్ కోసం తరిగిపోతూ... తోడుగా, నీడగా... భారమైనప్పుడు కాసిన్ని కన్నీళ్ళు తుడవడానికి... చెప్పుకోవడానికి... తల వాల్చడానికి ఒక భుజంలా – నాన్న!

నిన్ను ఎన్నిసార్లు గుర్తు చేసుకున్నా నువ్వు లేవు కదా నాన్న... నేను ఏమైపోతానో అని ఎంతగా దిగులుపడ్డావు... నా భవిష్యత్ కోసం ఎన్నెన్ని కలలు కన్నావు... నీ గురించి, నీ జీవితం గురించి రవ్వంతైనా ఆలోచించకుండా... నా కోసం ఎంతగా పరితపించావు...

❀❀❀

నేలను నమ్ముకున్న రైతు మా నాన్న. సింహాద్రిపురంలో తూరుపు దిక్కున దేవళం బజారులో మా ఇల్లు. ఇంటి ముందు గన్నేరుపూల చెట్టు వుంటుంది. దానికి

కాస్త పక్కనే గిలకబావి. ఆ దారి వెంబడి అలాగే ముందుకు సాగితే కోదండ రామాలయం. మా వూరు అచ్చం ప్రకృతి గీసిన వర్ణచిత్రంలా వుంటుంది. ప్రతిరాత్రి నన్ను నిద్రపుచ్చడానికి ఎన్నెన్నో కతలు చెప్పేవాడు. చందమామ కతల్నుంచి సాహసవీరుడు సింగన్నరాజు కతల వరకు ప్రతిరోజూ ఏదో ఒక కత నన్ను జోకొడుతూ చెప్పేవాడు. మాట్లాడే చెట్టు కత, గుర్రంపైన పోయే మాంత్రికుడి కత, పుట్టలోని పాముకత, చెట్టులోని పక్షి కత... ఎన్నెన్ని సార్లు చెప్పాడో. ఇప్పటికీ నాకు ఆ కతలన్నీ గుర్తుకొస్తూనే వుంటాయి.

ఉదయాన్నే లేచి అన్నం వండి గుడిలోని మండపంలో బడికి నా చిటికెన వేలు పట్టుకొని పిల్చుకపోయేవాడు. 'తప్పు రాస్తే కొట్టగాకు సామీ' అని విన్నవించుకొని ఆప్యాయంగా నన్ను బడిలో కూర్చోబెట్టి పొలం వైపుకు వెళ్ళిపోయేవాడు. ఉరిమి చూసే కళ్ళుగానీ... బెదిరించే బెత్తంగానీ ఆయనకు ఇష్టం వుండేవి కావు. నాన్న యింకేం చేశాడు... ఊరుకున్నాడా... ఊరి బాగు కోసం నడుం కట్టాడు. పెద్దతాత... వీరయ్య తాత ఇంటికెళ్ళాడు...

'ఏరా... అబ్బీ... కూర్చో... ఎట్టుండావు ఏంది... దిగదాల ఇండ్ల దిక్కుకు రాకుండానే మానుకున్నావు...' నులకమంచంలోంచి పైకి లేస్తా అడిగినాడు వీరయ్య తాత.

'లేయ్యాకు తాత... నేను ఈ వసారాలో కట్ట మీద కూర్చుంటాగానీ' జవాబిచ్చాడు నాన్న.

నాన్నను చూసినాక తాత ఎంత సంబరపడ్డాడో...

ఆ మాట ఈమాట మాట్లాడుకున్నాక అసలు సంగతిని చిన్నగా ఎత్తిడిసినాడు నాన్న.

'అనుకున్యారా... అబ్బిగా... నువ్వు నా దగ్గరికి వచ్చినావంటే వూరికే రావు... యాదో వొకటి నెత్తిమీద పెట్టుకునే వచ్చింటావు...' అన్నాడు నవ్వుతా తాత.

'యేం జేసేది పెద్దాయన... ఆ దావ పక్కన వుండేదంతా నీ భూమే. నువ్వు ఒప్పుకుంటేనే కదా వూరికి ఆసుపత్రి వచ్చేది. బస్టాండు కట్టేది. వూరు కోసం నువ్వు స్థలమిస్తే నేను దగ్గరుండి కట్టిస్తా... మనూరు గూడా మొగోడు తిన్నా మీసం దువ్వాల..' అన్నాడు నాన్న గర్వంగా.

'వూరు బాగుపడ్తాదంటే నాకంటే ఆనందించే నాకొడుకు యింగెవడుంటాడు? స్థలానికి అడ్డమేముండాది? తీసుకోపోండి... పనులు చేసుకోపోండి...' తల వూపుతా చెప్పినాడు తాత.

ఇంతలో తాత పెద్దకొడుకు ఇంట్లోకి వచ్చినాడు. 'గవర్నమెంటోళ్ళకు స్థలం వూరికే ఎందుకిస్తాం? సంపాదించుకున్నది దానం చేయడానికా... వూరు సంగతి మాకొద్దు... మా స్థలం జానెడు కూడా యియ్యం...' అని కోపంతో నాన్న మీదికి వచ్చినాడు.

'మనం మంచి స్థలం గవర్నమెంటుకు చూపించకపోతే మంజూరైన ఆసుపత్రి, బస్టాండులు నిర్మాణం కావు. వూరికి ఆసుపత్రి అవసరం ఎంతో వుంది. మొన్న సావిత్రవ్వ మొండి జ్వరంతో ప్రాణాలు విడిసింది. నిన్నటికి నిన్న సాంబశివుడు పాము కరిచి పొలంగట్టు కాడ్నే తెల్లనురగ కక్కుకొని చచ్చిపాయె... ఆసుపత్రి వస్తే అందరికి బాగుంటాది...' అని నాన్న మొత్తుకొని మొత్తుకొని చెప్పినా తాత పెద్ద కొడుకు వినలేదు.

నాన్న యింగేం చేస్తాడు?

యేటి గట్టున వరిపండే పన్నెండు ఎకరాలు అమ్మి ఆ లెఖ్ఖతో వీరయ్య తాత పెద్దకొడుకు దగ్గర్నుంచి స్థలం కొనాల్సి వచ్చింది.

ఆ లెఖ్ఖను తీసుకున్నందుకు కొడుకు మీద వీరయ్య తాతకు భరింపరాని కోపం, అసహ్యం వేశాయి. దగ్గరికి పిలిచి ముఖాన కాండ్రించి 'థూ' అని ఎంగిలి మూసి కసి తీర్చుకున్నాడు.

నాన్న సంపాదించుకున్నదంతా వూరి కోసమే ఖర్చు పెట్టేవాడు. చూస్తుండగానే వూర్లో రోడ్డుపక్కనే ఆసుపత్రికి గోడలు లేచాయి. బస్టాండు నిర్మాణం అయ్యింది. చివరాఖరికి వీరయ్య తాత పెద్ద కొడుకు కూడా ఎడ్లబండిపై నుంచి కిందపడి కాలు విరిగినప్పుడు ఆ ఆసుపత్రిలోనే వైద్యం తీసుకున్నాడు.

నాన్న ఎప్పుడు ఖాళీగా వున్నాడు? ఎప్పుడూ వూరి గురించే... వూరి బాగు గురించే... ఎప్పటి నుంచో పట్టించుకోని వూర్లోని రాయలకాలం నాటి చెరువు పైకి దృష్టి మళ్ళించాడు. చెరువు గట్టు నిర్మాణం, కాల్వల పునఃనిర్మాణం, పూడికతీత పనులన్నీ చేయడానికి నడుం బిగించాడు. ఒక మంచిరోజున తానే పలుగూపార తీసుకొని మొదటి అడుగు వేశాడు. వూరు పచ్చగుండాలంటే చెరువు బాగు చేసుకోవాలని పిలుపునిచ్చాడు.

నాన్న వెనుక ఊరు ఊరంతా కదిలింది. చిన్నా పెద్దా ముసలీ ముతక భేదం లేకుండా చెరువు నిర్మాణం కోసం రాళ్ళు మోశారు. పూడిక తీశారు. అంతవరకు వూర్లో చెరువు వున్నా లేనట్లుగా వుండేది. నాన్న ప్రయత్నంతో చెరువు రూపుదిద్దుకుంది. వర్షాలు పడి చెరువు నిండి రైతుల పంటపొలాలు పచ్చని సంగీతాన్ని ఆలపించాయి.

ఎలా వుండేది మా వూరు... ఆటలు... పాటలు... అరుపులు... నవ్వులు... పువ్వులు... అరకలు... మెరకలు... కాడెద్దుల మెడ గంటలు... గిలకబావి చప్పుళ్ళు... పండగలు... పబ్బాలు... రచ్చబండ మీద సందడి... జక్కీలు, కోలాటాలు, పందరి భజనలు, ఉత్సవాలు... ఉత్సాహాలు ఎన్నో! ఎన్నెన్నో!!

'ఓరే అబ్బీ... నువ్వు కష్టపడి చదువు. గవర్నమెంటు ఉద్యోగం రావాల. మన దగ్గర సంపాదించింది యేం లేదు. నీ మీదే నా ఆశ. బాగా చదువుకో. పేరు తెచ్చుకో. వూరిని మర్సిపోగాకు' అని ఎప్పుడూ చెప్తూండే నాన్న నన్ను గుండెల్లో పెట్టుకొని చదివించాడు.

నేను పెరుగుతున్న కొద్దీ నేల ఎండడం మొదలైంది. పండడం ఆగింది. కరువు కమ్ముకుంటా నాతోపాటూ పెరుగుతా వచ్చింది.

నన్ను పట్నంలోని కాలేజీలో చేర్చాడు. మరో నాలుగు ఎకరాలు ప్రసాదరెడ్డికి అమ్మాడు. నాకు పరీక్ష ఫీజు కట్టాల్సి వచ్చింది. ఎక్కడ్నుంచో నాలుగు వేలు అప్పు తెచ్చాడు. నేను రెండో సంవత్సరం కోర్సులోకి చేరాను. ఇంటి దగ్గరి ఎడ్లు కన్పించలేదు. నేను మూడో సంవత్సర కోర్సులోకి వచ్చాను. ఇల్లు కన్పించలేదు. సంవత్సరం పరీక్షలు అయ్యాక వూరికెళ్ళాను. నాన్న దిగదాల కొట్టంలోకి తీసుకెళ్ళాడు.

'ఏంది నాన్న ఈ కష్టాలు అని' కన్నీళ్లు పెట్టుకున్నాను.

'చాల్లే పాపోడా... వూరు కోసం బతికేటోళ్ళం. మనమంటే అందరికి మంచి మర్యాద వుండాది. మనల్ని చూస్తే చేతులెత్తు మొక్కుతా వుండారు. మనం పదిమందికి మంచి చేయాల. డబ్బుదేముంది మళ్ళానైనా సంపాదించుకోవచ్చు. నువ్వు పట్నంలోనే చదువు...' అని ఓదార్చి ధైర్యం చెప్పాడు.

'నన్ను చూడను నువ్వు పల్లెకు రావాకు... వస్తే బాధపడతా వుంటావు. నేనే వారానికొకసారి పట్నమొస్తానని' నన్ను ఊరడించాడు. అప్పటినుంచి నాన్న కోసం ప్రతి ఆదివారం ఎదురు చూసేవాడ్ని. అరిగిపోయిన చెప్పులు తొడుక్కొని, చేతిలో సంచితో నన్ను చూడ్డం కోసం వచ్చే నాన్న కోసం ఆదివారం నాడు గేటుకేసి చూస్తూ కూర్చునేవాడ్ని. నాన్న వచ్చిన రోజు పండుగొచ్చినట్లుండేది.

నా చేతిలో పచ్చింకి పెన్నుండాలని ఎన్నెన్ని కలలు కన్నాడు. నా పచ్చింకి సంతకంతో ఎందరో తలరాతల్ని మార్చాలని, ఎందరో జీవితాల్ని తీర్చిదిద్దాలని ఎన్నెన్నో కలలుకన్న నాన్న ఓరోజు... బరువైన గుండెపోటుతో... నన్ను వదిలి వెళ్ళిపోతే... ఎలా తట్టుకోగలను?... కళ్ళు కన్నీటి సముద్రాలు కాలేదు!

❀❀❀

నా కోసం కష్టించిన నాన్న... నువ్వు అనుకున్నట్లు నువ్వు కలలు గన్నట్లు ఈ రోజు నేను పచ్చింకి సంతకం పెట్టే ఉద్యోగంలో వున్నాను నాన్న... చూడ్డానికి నువ్వు లేవు నాన్న... పొలాన్ని సాకినట్లు నన్ను... గుండెల్లో పెట్టుకొని చూసుకున్న నాన్న... నా కోసం ఎంత కష్టపడ్డావు... ప్లీజ్ మళ్ళీ ఓసారి రా... నాన్న... ఇప్పుడు అన్నం కోసం మనం ఇబ్బంది పడాల్సిన పనిలేదు. ఖరీదైన కారు యిదిగో నాన్న... బంజారాహిల్స్‌లో ఖరీదైన బంగ్లా కొన్నాను రా.. నాన్న... అరిగిపోయిన చెప్పుల జీవితం... నలిగిపోయిన బట్టలు వద్దు... దేవుడు కరుణించాడు నాన్న! వర్షానికి కారే బోదకొట్టం... వెంటపడి వేధించే అప్పులవాళ్ళు... ఈ కష్టాలన్నీ నీకుండవు. నా దగ్గర నువ్వుంటే చాలు నాన్న!

పల్లెలో ఇప్పుడు...

మనం అమ్ముకొన్న భూములన్నీ మనమే కొనుక్కున్నాం. మన ఇల్లు మనకుంది. మనకున్న మర్యాద మనకుంది. నీ కొడుకునని చెప్పుకోడానికి గర్వపడ్తున్నాను.

చచ్చేవరకు వూరి బాగు కోసం శ్రమించిన నీ ఘనతను వూరంతా చెప్తుంటే విని పులకరిస్తున్నాను. చివరి సాయంకాలపు తొలి చీకటి తెరలోంచి మెల్లిమెల్లిగా నువ్వు అదృశ్యమవడాన్ని నా చిన్ని గుండె ఎలా తట్టుకోగలదు నాన్న... నీ అడుగు జాడల జ్ఞాపకం కెరటాలు కెరటాలుగా గుర్తుకొచ్చి సముద్రంలో రోదిస్తాను. నువ్వు తోడుగా వుంటే ఇద్దరం కలిసి అంబరాన్ని తాకే సంబరాలు చేసుకునేవాళ్ళం... శూన్య ఆకాశం నుంచి కొన్ని చుక్కల్ని రాల్చుకొచ్చి ఇక్కడ కట్టుకున్న ఇసుక గూళ్ళకు కుదురుగా అలంకరించి సంబరపడేవాళ్ళం...

నాన్న... నువ్వెప్పుడు చెప్తుండే మాట 'వూరిని మర్చిపోగాకురబ్బీ...' నాకెప్పటికీ గుర్తుకొస్తూనే వుంటుంది. అందుకే నేను బదిలీపై వస్తున్నాను నాన్న... నీ ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చడానికి పూనుకుంటాను. నీ చిటికెన వేలు పట్టుకొని బడివైపుకు నడుస్తున్నట్లే వుంది యిప్పటికీ... జ్వరమొచ్చినప్పుడు నుదుటిపైన నువ్వేసిన చల్లటి చెయ్యి జ్ఞాపకమొస్తుంది... దిగులుగా వుంది నాన్న... కాసేపు ఓదార్చు... దీవించు... చెయ్యి వదలకు నాన్న ప్రాణం పోతున్నంత బాధగా వుంటుంది.

వస్తున్నాను... వస్తున్నాను... వూరిని మర్చిపోను...

వస్తున్నాను... యిప్పుడే... నీ కోసం!

మన వూరికి!

– 10 ఫిబ్రవరి 2008, ఆదివారం ఆంధ్రభూమి.

పొద్దు పుట్టింది!

వేపచెట్టు అరుగు మీద కూర్చొని పెద్దిరెడ్డి 'మేకాపులి' ఆడుతున్నాడు. తాత భుజాలపై మెడ మీదుగా వెనుక నుంచి చేతులు వేసి ఊయల ఊగుతూ మధ్యమధ్యలో ఏదో నోట్లో వేసుకొని నములుతున్నాడు మూడో తరగతి చదివే మనవడు అనిలు. అట్నే యింగ రోంత కల్లం దాటుకొని దిగదాల మూడేపమాన్ల సత్రం కాన్నుంచి ముందుకు పోతే పొలాల దిశగా బురదగుంట నుంచి గునగున అడుగులేసుకుంటూ వస్తున్న బాతుల గుంపు వెనుక కేరింతలు కొడుతూ పిల్లలు అల్లరి చేస్తున్నారు. రెడ్డిగారి సందుమోట్లో మంచినీళ్ళ కొలాయి దగ్గర చేరిన అమ్మలక్కలు సహజత్వం ఉట్టిపడేలా తిట్టుకొని శత్రుదేశాల్లా ఎవరి ఇళ్ళలోకి వాళ్ళు వెళ్ళిపోతున్నారు. సైకిల్‌పైన గవున్లు తెచ్చిన ఖాదర్ తన చుట్టూ చేరిన పిల్లల తల్లుల బేరాలకు విసిగిపోయి బీడీ ముట్టించినాడు.

మర్రిమాను నీడలో కూర్చొని నులకతాడు పేనుతున్న సీతమ్మవ్వ ఎండేసిన గొడ్డుమాంసంకు కాపలాగా కాకుల్ని తోలుకుంటా వుంది. చంకలో ఏడుస్తున్న పిల్లాడిని పట్టించుకోకుండా కూలిపనికి పోయి వచ్చిన తల్లి ఆకువొక్క కట్ల పొడి వేసుకొని నమలడానికి పూనుకుంటోంది. సాయంత్రం ఎండపడి బడిలోని రావిచెట్టు గలగలమని సంగీతాన్ని సృష్టిస్తోంది.

బెల్ లోపల పెట్టించి, కిటికీలు మూయించి, రిజిస్టర్‌లో సంతకం పెట్టానో లేదో చూసుకొని, వేసిన తాళాన్ని మరోసారి లాగి పరీక్షించి చూసి వూర్లోకి బయలుదేరాను. '...రా ...రా.. నాయుడు... కూకో... ఏమంటా వుండాడు మీ ఎంఇఓ వచ్చొచ్చి నీకు వచ్చిపడింది కష్టం...' అన్నాడు కళ్ళు ఎగరేసి నవ్వుతా పులిజూదంలోకి చూస్తానే పెద్దిరెడ్డి.

'సంగతంతా చెప్పాను పెద్దయ్య... వెళ్ళాడు సమాచారం డిఇఓ ఆఫీసులో కనుక్కొన్ని వస్తానన్నాడు' అరుగు మీద కూర్చుంటా జవాబిచ్చాను.

'... దీనెమ్మ... దీంతో సావచ్చి పడినట్లు అయిపాయ... ఏమంటావు... గవర్నమెంటు ఏందో... రోంతన్నా మంచి; చెడ్డ వుండొద్దు. చిన్నా; పెద్ద లేకుండా ఈ పాలసీలేందో అర్థమై సస్తాంటే కదూ! ఆడ్యాన్నో హైదరాబాదులో కూకొని పనుల్ని ఇట్ట జేసుకోండి అంటే సరిపోతాది? పట్నాలు, పల్లెలు ఒకటేనా..! నిలబడి పనిజేసే నా కొడుకులకు తెలుస్తాది... ఇపిరి నా కొడుకులు... ఇప్పుడు జూడు నీకొచ్చిపడినాయి

కష్టాలు...' మేకపిల్లను సంపినాడు ఆటలో. నేనేం మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఉండిపోతి. వేపచెట్టు గలలమని కాలం చెల్లిన పండుటాకుల్ని వదిలించుకుంటా వుంది.

'ఈ దిన్నం ఎంతమంది పిల్లోళ్ళు బల్లో బువ్వ దినింది...' అడిగినాడు సూటిగా నా కళ్ళలోకి చూస్తూనే పెద్దయ్య.

'ఎంతమంది..! అగ్రారం పిల్లోళ్ళు ఎవరూ తినలేదు. మధ్యాహ్నం నుంచి బడికి వచ్చింది ఏది? ఆ సంగతి మాట్లాడాలనే మీ దగ్గరికి ఇప్పుడొచ్చింది...' ఏదో ఒకటి పంచాయతీ కానీయండి మాతో ఎందుకు ఆడుకుంటారనే కసి నా మాటల్లో...

'నాయ్డు... నువ్వు భలేవాడివి! అన్నీ తెలిసే అడుగుతావు. వూర్లో నేను జెప్పిందే జరుగుతాంటే... ఎట్టోగొట్ట అందరికీ సర్దిజెప్పిండు... అయినా సర్పంచ్‌గాడికి లేంది... నాకెందుకు చెప్పు.. వాడు ఆ పనుందని; ఈ పనుందనీ హైద్రాబాదుకు తిరగనే సరిపోతాంది. కూకొని పంచాయితీ పెడితే తెగిపోతాది కదా!' ఆడే ఆటలో నిండా మునిగి వుండాడు పెద్దయ్య.

మేకలతో ఆడే రామిరెడ్డి, పెద్దయ్య పులికి చిక్కి విలవిలలాడ్తా కన్పించాడు చేతులు రుద్దుకుంటా; తల గోక్కుంటూ! ఒకరకంగా ఇప్పుడు నా పరిస్థితి కూడా అలాగే వుంది. నేనేం మాట్లాడలేదు. ఆట వైపు చూస్తూ కూర్చున్నాను.

నేను అరుగు దగ్గరికి వెళ్ళగానే నన్ను చూసి పరుగు పరుగున కట్టదిగి సందులోంచి ఇంట్లోకి పరిగెత్తిన అనిలుగాడు వాళ్ళమ్మకు నేనొచ్చిన విషయం చేరవేసినట్లుండాడు ఆమె వేడివేడిగా కాఫీ తీసుకొచ్చింది... ముగ్గురికీ!

'... నాయ్డు... పైకి కనపడ్డంలేదు గానీ, ఊరంతా అట్టుడికినట్లు ఉడుకుతా వుంది. పరిస్థితి ఇంగోసారి ఆ ఎంఇఓకు చెప్పు. మధ్యాహ్న భోజన పథకం ఈ వూర్లో మట్టసనంగా నడసాలంటే పాలసీ గీలసీ అనకుండా రోంత సూసుకొని పొమ్మని చెప్పు... ఇదో మన రామిరెడ్డి పెద్ద కోడలే వుండాది. బువ్వ ఎంత బాగా జేస్తాదనుకున్యావ్... మల్లెపూల తిన్నా వుంటాది... మెతుకు. రేపు వచ్చి ఒకపూట తిని జూడు... ఏమంటావ్ రాంరెడ్డి?' కళ్ళు ఎగరేస్తా ప్రశ్నించాడు ఎదురీకి కూర్చొని ఆడతాండే రామిరెడ్డిని.

'... ఏమోబ్బా... మాకిస్తే బాగానే జేస్తాం. మళ్ళా ఆ బతకలేని పేదోళ్ళ కడుపుగొట్టినాం. సిన్నొళ్ళ నోటికాడి కూడు పెరుక్కున్యాం... అంటే బాగుండదు!' తనను ఎవరైనా ఏమన్నా అనుకుంటారనే భావం ఆయన మాటల్లో ధ్వనించింది.

కాఫీ తాగిన గ్లాసు అరుగు మీద పెట్టాను. పెద్దయ్య పులి అన్ని మేకల్ని తినేసి నెగ్గింది. వేపచెట్టు పడమటి కొమ్మల్లో వాలిన కాకి ఆగి ఆగి అరుస్తూనే

వుంది. దావలో తిరిగే పిల్లలు నన్ను జూసి అటూ ఇటూ పరుగెడుతున్నారు... దాక్కుంటూ!

'... బయల్దేరు నాయ్డు... రేపు నేనే బడికాడికి వస్తాలే... నువ్వు టౌనుకు పోయేసరికే చీకటైతాది...' పైకి లేచినాడు ఇంటి దిశగా నడుస్తూ పెద్దయ్య. అనుసరించాడు రాంరెడ్డి. 'వెళ్ళొస్తానని' చెప్పి నేను కూడా కదిలాను.

❋❋❋

రాత్రి భోంచేసి పడుకున్నానేగానీ నిద్రపట్టడం లేదు. బడి విషయాలే గుర్తుకొస్తున్నాయి. రెండేళ్ళ క్రితం జరిగిన కౌన్సిలింగ్‌లో నేను అగ్రారం బడి తీసుకున్నాను. టౌనుకు ఇరవై కిలోమీటర్ల దూరంలో వుండే బడి అదొక్కటే వుండడంతో తప్పనిసరిగా అదే తీసుకోవలసి వచ్చింది. అంతకుముందు ఆ వూరి పేరు కూడా నేను ఎప్పుడూ వినింది లేదు. కౌన్సిలింగ్‌లో మిత్రులు ఇద్దరు ముగ్గురు ఈ వూరే టౌనుకు దగ్గరని సూచించడంతో అగ్రారం కోరుకున్నాను. ఈ వూరు మరీ రోడ్డుకు దగ్గరగా ఏమీ లేదు. కొండాపురం వెళ్ళే రూట్లో మధ్యలో కట్ట దగ్గర దిగి లోపలికి మూడు కిలోమీటర్లు వెళ్ళాల్సి వుంటుంది. అప్పుడప్పుడు ఒక ఆటో తిరుగుతూ వుంటుంది. లేదంటే అదీ వుండదు. నడక తప్పదు. మరీ పెద్ద వూరేం కాదు. ఐదొందలకు మించి గడపలు కూడా వుండవు. తాటిచెట్ల మధ్యన విసిరేసినట్లు అక్కడ కొన్ని అక్కడ కొన్ని మిద్దెలు అట్నే దిగదాలకు కొట్టాలపల్లె దిక్కుపోతే మాల, మాదిగల గుడిసెలు.

అగ్రారానికి; కొట్టాలపల్లెకు మధ్యన వుంది మా బడి. ఎలిమెంటరీ పాఠశాల. ఐదో తరగతి వరకు ఇక్కడ విద్యను బోధిస్తాను. మొత్తం ముప్పై మంది పిల్లలుంటారు రిజిస్టర్లో. కానీ రెగ్యులర్‌గా వచ్చేది మాత్రం ఇరవైకి మించరు. పదిమంది ఎప్పుడూ పొలాల్లోనో; ఇండ్లల్లోనో పనులకు పోతా బాలకార్మికులుగా వుంటారని నాకూ తెలుసు. కానీ వాళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమేనని తెలుసుకొని బడికి వచ్చేలా ప్రత్యేకించి వాళ్ళకు పుస్తకాలు; భోజనం ఏర్పాటు చేసినా ఇంకొంతమంది పిల్లలు తప్పించుకొని రాకుండా పోతున్నారు. ఇండ్ల దగ్గరికెళ్ళి వారిలో అవగాహన కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాను. ఇది సింగల్ టీచర్ బడి. నేను ఈ పనులపైన బయటికి వెళ్తె బడిని మూయాల్సి వస్తుంది. అది మరో సమస్య!

దిగువకొట్టాలపల్లె నుంచి వచ్చే కొంతమంది పిల్లల్ని చూస్తే చాలా బాధగా వుంటుంది. వారానికి ఒకసారి కూడా ఆ పిల్లలకు స్నానాలు చేయించరు. బట్టలు మార్చరు. తల దువ్వరు. పళ్ళు తోమరు. రెండ్రోజులు సరిగ్గా బడికి పంపిస్తే

మూ(డోజులు పంపరు. దుమ్ములో ధూళిలో ఆడుకుంటూనే వాళ్ళు బాల్యదశను మురికికూపంలోనే దాటేస్తున్నారు. ఐదో తరగతి కూడా పూర్తికాక ముందే వాడు లైన్‌బార్ గోళీలాటలో రూపాయి పందెంతో మొదలుపెట్టి పది రూపాయల పేకాటలోకి వెళ్ళిపోతున్నాడు. ఉదయం పూట మరుగుదొడ్లకు వెళ్ళని పిల్లలు తరగతి గదిలోనే కానిచ్చేస్తారు. వాళ్ళను తీసుకెళ్ళి శుభ్రం చేయడానికి; గదిని కడగడానికి రోజూ కొంతసమయం వృధా అవుతూనే వుంటుంది. కొందరి పిల్లల ముక్కుల నుంచి చీమిడి ప్రవాహంలా కారుతూనే వుంటుంది. మరి కొందరు ఏడుపు ఎత్తుకొని ఇంటికెళ్తామని అల్లరి చేస్తారు. బడి ఒక పద్మవ్యూహం. యిన్ని సమస్యల మధ్యనే వీళ్ళకు విద్యను బోధించాలి. సింగిల్ టీచర్ ఉద్యోగం చేయడం కష్టం. మరీ ముఖ్యంగా అగ్రారంలాంటి వూర్లో పనిచేయడం మరీ మరీ కష్టం. వూర్లో పనిలేని వారందరికీ వేదిక స్థలం బడి. వాళ్ళు వాళ్ళ మాటలేవో గట్టిగా గొడవ పడుతూ రావిచెట్టు క్రింద కూర్చొని చర్చించుకుంటూనే వుంటారు. బడికి ఇబ్బందని ఒక్కరూ అనుకోరు. ఆ రోజు దినపత్రిక తెచ్చుకొని ఎవరో చదవొచ్చినోడు వార్తలు చదువుతుంటే మిగిలిన వాళ్ళు వింటూ వుంటారు. ఆ చదివే మనిషి రాకపోతే '... నాయుడు సార్... రోంతొచ్చి ఈ చిరంజీవి ఫొటో ఏసిన వార్తొక్కటి చదివిపోండి...' అని పిలుస్తూనే వుంటారు... కేకలేస్తూ. ఇదీ అగ్రారంలో బడి వాతావరణం.

'అయ్యా... అబ్బిని బల్లో చేర్చుకోయ్యా... లెఖ్క కట్టలేను... ఇదో ఈ నాటుకోడి వుండాది. తీసుకోయ్యా! కోసి బాగాలేసి యిమ్మంటే గూడా ఇద్నే కట్టపైన కూకొని తునకలు చేసిస్తా సామీ...' అని విద్యా సంవత్సరం ప్రారంభంలో బల్లో పిల్లోళ్ళను చేర్చను వచ్చిన కొట్టాల మనుషుల మాటలు వింటుంటే నాకు నవ్వొచ్చేది.

'సామీ... నీ కాళ్ళకు దండం పెట్టుకుంటాం. మా సన్నోడ్ని బల్లో చేర్చుకోయ్యా... కొండకట్టెలు నాలుగు మోపులు తెచ్చి పొయ్యిలోకి చీల్చిస్తా... మళ్ళ నువ్వు ఇంటికి తీసుకపోవచ్చు...' అని ఇంకొందరు.

'మా దెగ్గర ఏముంది సామీ... కూలీకి పోయి బతికేటోళ్ళం. నులకతాడు పేని పెట్టుకొని వుండాము. కొయ్యలతో మంచం చేసుకుంటే చిక్కంగా అల్లిస్తామని' మరి కొందరు ప్రాధేయపడేవాళ్ళు. వీళ్ళంతా ఇంత అమాయకంగా వుండారు ఎలా బతుకుతారో అన్పించేది. ఇలాంటి పరిస్థితుల్లోనే ఒకరోజు ఉదయం ఒక పిల్లోడిని వెంటబెట్టుకొని పొట్టిగా నల్లగా కాస్త లావుగా ప్రేమగా నవ్వుతూ గౌరవంగా మాట్లాడుతూ వినయంగా నా దగ్గరికి ఒకతను వచ్చాడు...

'సారూ... నమస్కారాలు. నా పేరు ఆంజనేయులు. కొట్టాల్లో వుండే సాంబయ్య

కొడుకుని. పట్నంలో ఆచారి పని చేస్తా వుంటి. అయ్య ముసిలోడు అయితా వుంటే ఇంటికాడ చూపెట్టుకొని వుండాలని ఇక్కడికే వచ్చేసినాను. నేను పదివరకు చదివినాను. ఫెయిల్ అయినాంక ఆచారి పనిలోకి ఎక్కినాను. నా కొడుకు కొండయ్యను మీ బల్లో చేర్చుకోండి...' అని వచ్చాడు ఇంతకుముందెప్పుడూ కొట్టాలపల్లె నుంచి ఇంత శుభ్రంగా బట్టలు కట్టుకొని వచ్చినోళ్ళను నేను చూడలేదు.

'... దాన్దేముంది... గవర్నమెంటు బడి పెట్టిందే పిల్లల్ని చేర్చుకోవడానికే కదా! కనీసం నువ్వేయినా పిల్లోన్ని శుభ్రంగా రోజూ బడికి పంపితే అంతకంటే ఏం కావాలి...' అంటూ ఆ కొండయ్యగాన్ని బల్లో చేర్చుకున్నాను.

పల్లెంలో ఆకు, వొక్క, యాభై రూపాయలు లెఖ్క పెట్టి కొడుకు కొండయ్య చేత నా కాళ్ళు మొక్కిస్తూ నా చేతిలోకి అందించినాడు వెనుక నుంచి ఆంజనేయులు. కొట్టాలపల్లె వాళ్ళకు యింతటి మర్యాద కూడా వుంటుందా అన్పించింది.

ఆంజనేయులు పట్ల అతడి కొడుకు కొండయ్య పట్ల నాకు అప్పటి నుంచి ప్రత్యేక దృష్టి ఏర్పడింది.

ఆర్నెళ్ళ పరీక్షల తర్వాత కొండయ్యగాడు చదువులో పుంజుకున్నాడు. చక్కటి చేతిరాత... చెప్పగానే గ్రహించే తత్వం... నేర్చుకునే నైపుణ్యం నన్ను ఆకట్టుకున్నాయి. ఇంటి దగ్గర ఎప్పుడూ వాడు చదువుతానే వుంటాడని వాళ్ళమ్మ లక్ష్మి దగ్గర కూర్చోబెట్టుకొని ఓపిగ్గా చదివిస్తా వుంటుందని తెల్సింది. ఆంజనేయులు తన కులవృత్తి కాకుండా చెక్కపని ఆకర్షణీయంగా చేస్తుండడంతో అగ్రారంలోని రెడ్లందరూ అతని చేత కొయ్యపని చేయించుకుంటా వుండేటోళ్లు. తలుపులు, మంచాలు చేయడంలో తన ప్రత్యేకమైన శైలని ఆంజనేయులు నిరూపించుకున్నాడు.

'... నాయ్డు సారూ... మీరేం చేయవద్దు... మంచి కొయ్య కొని నా చేతిలో పెట్టండి. చక్కటి పట్టె మంచం చేయిస్తా... నా పేరు ఎప్పటికీ మీకు గుర్తుండిపోవాల...' అంటూ ఉగాది పండగ తర్వాత అత్తరాసులు, కర్జికాయలు చేసుకొని స్టీల్ క్యారీలో పెట్టుకొని వచ్చినాడు ఆంజనేయులు.

'సరే కూర్చో ఇద్దరం తిందాం' అని ఇంటర్వెల్ బెల్ కొట్టిస్తూ అన్నాను.

'నాకింటికాడ వుండాయి సారూ... మీరు తినండి...' అంటూ అత్తరాసుల క్యారీ మూత తీశాడు. సువాసన గుప్పుమంది. నెయ్యి కూడా వేసినట్లుండారు. ఎంతో నైపుణ్యంగా; శుభ్రంగా అచ్చం ఆంజనేయులు కొయ్యపని చేసినంత ప్రతిభతోనే అవి చేసినట్లుండాయి. చూడగానే తినాలనిపిస్తున్నాయి.

ఒకటి తీసుకొని తిన్నాను... మరొకటి... ఇంకొకటి... 'కొనుక్కొచ్చావా...' అడిగాను నీళ్ళు తాగుతూ.

'ఏం సారూ... అట్టంటివి. కొంటే అంగళ్ళల్లో వాళ్ళు ఇట్లా జేస్తారా... ఇంత కమ్మగా చేయను వాళ్ళకు యాడైతాది... నా భార్య లక్ష్మి చేసింది...' నవ్వుతా బదులిచ్చినాడు ఆంజనేయులు.

మా ఇంట్లో కూడా పిండివంటలు ఇంత రుచిగా చేసినట్లు నాకు గుర్తులేదు. కొందరి హస్తవాసి ఇలా కాబోలు అనుకున్నాను.

'మా ఇంట్లో వాళ్లకు కూడా వీటిని రుచి చూపించి... చేయాల్సింది ఇలా...' అని వాళ్ళలో చైతన్యం తీసుక రావాలనుకున్నాను. ప్లాస్టిక్ కవర్లో కొన్ని కట్టుకున్నాను.

లింగారెడ్డింట్లో తలుపుల పని చేస్తా వుండానని చెప్పి నాకొక 'గాజుల స్టాండు' అందించి వెళ్ళిపోయాడు. అది చాలా చక్కగా వుంది. దానికి డబ్బులివ్వబోతే తీసుకోలేదు.

'... సారూ... మీకాడ లెఖ్ఖ దీస్కొంటే పురుగులు పట్టిపోతా...' అని చెప్పి బడిగేటు వేసి వెళ్ళిపోయాడు... వినమ్రంగా!

సాయంత్రం బడి వదలడానికి పది నిముషాల ముందు అగ్రారం నుంచి సర్పంచ్ మునిరెడ్డి వచ్చినాడు.

'... ఎమ్మార్వో సారూ... నాయ్డు! నిన్న రేత్తిరి కాడ నాటుకోడి కావాలని జెప్పినాడు. అందుకే మంచి కోడి కోసం సామేలుకు చెప్పంపినాను. వాడింకా రాల్య...గానీ వాడి కొడుకు ఇద్నే ఐదో క్లాసు చదివే అబ్రహాంగాడు వుండాడు... ఇంటికాడికి పంపించు... సామెలును పిల్సకరమ్మని...' పురమాయించినాడు అరుగు మీద కూర్చుంటూ సర్పంచ్ మునిరెడ్డి.

అబ్రహాంగాడ్ని 'మీ నాయన్ను పిల్సుకరాపోరా... సర్పంచయ్య బడి దగ్గరికి వచ్చినాడని చెప్పి' అని పంపించాను. వాడు చంకకు బ్యాగు తగిలించుకొని జారిపోతాండే చడ్డీని పైకి లాక్కుంటా పరిగెత్తుకుంటా పోయినాడు.

ప్లాస్టిక్ కవర్లోని అత్తరాసు ఒకటి తీసి మునిరెడ్డికి అందించాను. ఒకటి తినిన తర్వాత '... నాయ్డు! బాగుంది గానీ ఇంగొకటి ఇయ్యి...' అని అడిగి యిప్పించుకొని మరొకటి తిన్నాడు. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటా వున్నప్పుడే ముదిరిన ఎండల ప్రస్తావన వచ్చింది.

'ఔ... నాయ్డు... ఎండలు సావగొడ్తా వుండాయి. నీళ్ళు యాడేగానీ ల్యాకుండా

పోతా వుండాయి. తాగునీళ్ళు లేవు. సాగునీళ్లు లేవు. ఏమన్నా అంటే సర్పంచుండాడు గానీ మాకేం చేస్తా వుండాడని నా మీదబడతారు... చెబితే నమ్మవుగానీ మా ఇంటికి ఆ పక్క పాతగుడికి ఆనుకొని వుండే బావి కూడా ఎండిపోయింది. నేను పుట్టినప్పటి నుంచి కూడా ఆ బావిలో నీళ్లు లేకుండా వుండడం చూల్లేదు. ఇప్పుడు జూడు ఎట్టాటి కాలం వచ్చిందో...' సిగరెట్ ముట్టించినాడు జేబులోంచి తీసి.

'ఏం చెప్పాలి లే... స్కూలు బోరింగు కూడా, అర్ధగంట కొడితే బిందెనీళ్ళు ఇస్తా వుంది...' నా బాధ వెల్లడించాను.

'మనమిట్టా నీళ్ళ కోసం తనకలాడి చస్తా వుండామా... కొట్టాలపల్లె వాళ్ళు పెన్నానదికి ఆనుకొని వుండారు కాబట్టి నీళ్ళు ఎంత బాగా వుండాయో... దేవుడు రాసిపెట్టి వుంటాడేమో... కదా!' పొగ నోట్లోంచి పైకి లేచింది. కొంతసేపు ఆలోచించి మళ్ళీ మునిరెడ్డే అన్నాడు... 'నాయుడ్డు... ఏం ల్యా... పైపులైన్ వేయిస్తా. కొట్టాలపల్లె వాళ్ళు నీళ్ళ తొట్టిలోంచి మన అగ్రారంకు నీళ్ళు తెప్పించుకోవాలి...' నిశ్చయంగా చెప్పాడు. రావిచెట్టు పైన వాలిన పక్షి ఏదో కూత కూస్తోంది... నేర్పుగా. సామేలుగాడు వచ్చినాడు నాటుకోడి తీసుకొని. 'అయ్యా... నేను కోడి తీసుకొని మీ ఇంటికాడికి పోయి వస్తాండ. అమ్మ జెప్పింది బడి దిక్కుపోయినావని...' కోడి అందిస్తా చెప్పినాడు సామేలు.

'నాకేంటికి రా నాయనా... ఎమ్మార్వో అయ్యకు పంపాల... కోడి కోడి అంపితే ఆయనేం జేసుకుంటాడు. నువ్వుబోయి మీ ఇంటికాడ్నే కాల్చుకొని ముక్కలు చేసుకొని టౌన్లోకి పోయి ఆయన ఇంటికాడ నేను అంపించినానని జెప్పి ఇచ్చిరా...' అని జేబులోంచి నూరు కాయితం తీసి ఇచ్చినాడు మునిరెడ్డి.

'కోడి నాదిగాదు సామీ... ఆ గురప్పగాని కాడ వుంటే ఇప్పించుకొని వచ్చినా...' ఇచ్చిన లెఖ్క సరిపోదనే భావం వాడి మాటల్లో.

'సరేలేరాబ్బ... తక్కువైతే ఇరవై, ముప్పై మళ్ళా ఇస్తాగానీ... నువ్వు ముందు మీ ఇంటికాడ్నే బాగా చిన్నచిన్న తునకలు జేసుకొని త్వరగా పోయి ఇచ్చిరా...' సిగరేట్ పూర్తయ్యింది. సామేలు వెళ్ళిపోయాడు. ఉదయాన్నే పొలం పనులకు పోయి తిరిగి వస్తాండే ఆడోళ్ళు ఆ దావెంబడి పోతా కన్పించినారు.

'మ్మొ...' ఏంది జూసి చూడనట్టు తల తిప్పుకొని పోతా వుండారు. వడ్లు రైస్ మిల్లుకాన్నుంచి ఆడించుకొని వచ్చినాం. పాత రూములకాడ బేసినాం గానీ అట్ట మధ్యాహ్నం పూట వచ్చి జల్లెడేసి పోండి... నూకలు గావాలంటే తీసుకపోదురు...' కళ్ళు ఎగరేస్తా చెప్పినాడు మునిరెడ్డి.

'అట్నేలేయ్యా... రేపు మధ్యాహ్నం కాడ వస్తాంలే...' చెప్పింది లక్షుమ్మ.

'ఆయమ్మి... అదే యల్లమ్మ కూతురు సావిత్రిని గూడా పిల్సుకరండి...' పెదాలు తడుపుకొని మీసాలు సరిజేసుకుంటా చెప్పినాడు.

వాళ్ళు ముసిముసిగా నవ్వుకుంటా దిగదాలకొట్టాల వైపుకు యల్లబారిపోయినారు.

'కాదు నాయ్డు... ఆ రిజిస్టర్లో పిల్లోళ్ళ పేర్లు రాసేటప్పుడు ఆ మాదిగోళ్ళ పిల్లోడి కింద మన వీరారెడ్డి మనవడు అనిల్‌గాడి పేరు రాసినావంటనే రోంత చూసుకొని పో... వూరి రాజకీయం నీకు తెలుసు కదా!' ఏదో విషయం గుర్తొచ్చినట్లు మతికి జేసుకొని చెప్పినాడు మునిరెడ్డి.

కాల్లో ముల్లు దిగినట్లు అయింది ఆ మాట వినగానే. నేనేదో జెప్పబోయే లోపల... మళ్ళీ ఆయనే... 'ఇట్లెందుకుగానీ నాయ్డు... ఆ కొట్టాలపల్లె పిల్లోళ్ళకు ఒక రిజిస్టరు మన అగ్రారం పిల్లోళ్ళకు ఇంగో రిజిస్టరు పెట్టి పారేయ్... ఇట్టాటి గొడవలుండవు కదా...' సలహా ఇస్తా చెప్పినాడు మునిరెడ్డి.

'భలే చెప్పినావు లేన్నా... కులాల వారిగా పిల్లల రిజిస్టర్లు పెట్టాలంటే ఎక్కడవుతుంది? అడ్మిషన్ల ప్రకారం రాసి వుంటాం పేర్లు. బల్లో చేరేటప్పుడు ఎవరు ముందు; ఎవరు వెనుక అని అడ్మిషన్ల నెంబర్లుంటాయి కదా... దాని ప్రకారం...' క్కొంచెం ఆయనకు అర్థం అయ్యేలా చెప్పాను.

'అదే... అదే... నేను గూడా ఆ మాటే చెప్పినాలే... కులాలవారిగా పిల్లోళ్ళ రిజిస్టర్లు పెట్టాలంటే కట్టలు కట్టలు కావాల రికార్డులు. ఆ పెద్దిరెడ్డి పాతకాలం మనిషి... చెబితే వినేరకం కాదు. మాట పోకూడదని నిన్ను అడిగినా అంతే... నువ్వు పట్టించుకోగాకు...' తానే సర్దిచెబుతూ అన్నాడు.

నాకు కాస్త ఊపిరాడింది.

కొండకు పశువులు తోలకపోయినోళ్ళంతా ఇండ్లకు వస్తా వుండారు. గుదికట్టె కట్టిన కొన్ని పశువులు ఎర్రమట్టి దుమ్మును రేపుతా వుండాయి. రావిచెట్టు కొమ్మలు చల్లగా సాయంత్రంపూట ఆడుకుంటా వుండాయి... మేఘాలతో. ఇండ్లకు ఆన్నుంచి కదిలినాం... ఇద్దరం!

❋❋❋

రెండ్రోజుల తర్వాత బడికాడికి ఎమ్మార్వో వచ్చినాడు. అగ్రారం వాళ్ళు; కొట్టాలపల్లె వాళ్ళు సమావేశానికి వచ్చినారు. సంగతి ఏందంటే... నీళ్ళు ఎక్కడుంటే

అన్నుంచి మిగిలిన ప్రాంతాలోళ్ళకు యిప్పించాలని ప్రభుత్వం ఆర్డరేసిందంట. ఇప్పుడు అగ్రారం వాళ్ళకు నీళ్ళు లేవు కాబట్టి కొట్టాలపల్లె కాన్నుంచి వూర్లోకి పైప్‌లైన్ వేయించడానికి పూనుకుంటా వుండామని ఆ కాంట్రాక్టు సర్పంచ్ తమ్ముడు నాగిరెడ్డికి ఇస్తా వుండేటట్టు చెప్పినాడు. దీనికి కొట్టాలపల్లె వాళ్ళు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.

ఉపాధి హామీ పథకం కింద వందరోజుల పని వూర్లోని కల్పించడానికి వీలుగా సర్వే నంబరు 81 నుంచి వుండే భూమంతా సాగులోకి తీసుకొచ్చే విషయం చర్చకు పెట్టినాడు. ఆ చుట్టుపక్క భూమి అంతా వీరారెడ్డి గుప్పిట్లో వుండడం వల్ల దానికి అభ్యంతరం చెప్పడానికి ఎవరికీ ధైర్యం చాలలేదు.

పేదలకు యిచ్చే పక్కా గృహాలు ఈసారి దిగువ కొట్టాలపల్లెలోని వాళ్ళందరికీ మంజూరైనాయని కొంత డబ్బు ముందుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి వుంటుందని చెప్పినప్పుడు... తమ చినిగిపోయిన బట్టల్ని చూస్కొని నోర్లు మూసుకొని కూర్చుండిపోయినారు చాలామంది కూలోళ్ళు. ఆ ఇల్లే తమకు అవసరం లేదు అన్నట్లు!

తర్వాత అసలు విషయం చర్చలోకి వచ్చింది. బడిలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నట్లు ప్రకటించడంతో అందరి ముఖాల్లో వెలుగు కన్పించింది. కొందరు చప్పట్లు కూడా కొట్టారు.

ఒక్కొక్క పిల్లోడికి రెండు రూపాయల వంతున ప్రభుత్వం చెల్లిస్తుందని; నెలవారీ బియ్యం మండల కేంద్రంలో ఎండిఓ కార్యాలయంలో ఇస్తారని, వారానికి రెండ్రోజులు పిల్లలకు కోడిగుడ్లు పెట్టాలని... డ్వాక్రా గ్రూప్ మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మార్వో ప్రకటించినాడు. అందరిలోనూ ఆసక్తి... ఉత్కంఠ...

ఎవరికిస్తారు?

గ్రూప్ సభ్యుల నంబర్లు అన్నీ రాసి ఒక డబ్బాలో మడతేసి డ్రా తీయాలని తీర్మానించారు.

అనుకున్నదే తడవుగా నంబర్లు అన్నీ కాగితం ముక్కల్లో రాసి సన్నగా చుట్టి డబ్బాలో వేశారు. డబ్బాను అల్లాడించారు. మాధవరెడ్డి కొడుకు భరత్‌తో డ్రా తీయించారు. కాగితం తీసి ఎమ్మార్వోకి యిచ్చినారు.

'... చూడండి! దాంట్లో ఏ నంబరైనా రావచ్చు. ఎవరికొచ్చినా పిల్లోల్ల ఆహారం విషయం కాబట్టి రాజకీయాలకు అతీతంగా కలిసి మెలిసి పనిచేసి మంచిపేరు తెచ్చుకోండి. పిల్లోళ్ళ విషయంలో కీడు చేస్తే ఆ దేవుడు కూడా మిమ్మల్ని క్షమించడు.

నేను ముందే చెప్తా వుండాను. ఈ విషయంలో మాత్రం మీరు మీకు నచ్చినట్లు చేసేదానికి వుండదు' ఎమ్మార్వోతో పాటుగా వచ్చిన ఎమ్మిడివో తన అభిప్రాయాన్ని ప్రకటించాడు.

ఎమ్మార్వో చీటి మడత విప్పి చూపించాడు.

'నంబర్ 10'– ఎవరు? ఎవరు?

ఆయమ్మి... ఆంజనేయులు పెండ్లాం లక్ష్మి.

'వార్ని... ఇదిగూడా ఆ కొట్టాల వాళ్ళకే పోవాల' ఎవరో ఆవేదన చెందుతున్నారు అగ్రారం వాళ్ళు.

ఆంజనేయులు నా దగ్గరకొచ్చి షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆనందాన్ని పంచుకున్నాడు.

లక్ష్మిని వేదికపైకి పిలిచాడు ఎమ్మార్వో.

తనకున్నంతలో మంచిచీర కట్టుకొని శుభ్రంగా ముఖంలో వినమ్రతతో కళకళలాడతా వుంది ఆమె.

'...జాగ్రత్తమ్మా! మధ్యాహ్న భోజన పథకం మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి వుంది. నువ్వు పిల్లలకు చక్కగా వండిపెట్టి మంచిపేరు తెచ్చుకోవాల...' మరోసారి చెప్పాడు ఎమ్మిడివో.

'అలాగే సార్...' అంది లక్ష్మి వినయంగా. కొంతసేపటి తర్వాత సమావేశం ముగిసింది.

❀❀❀

బడికి ఆనుకొని వుండే కానుగ చెట్టు పక్కలోని సత్రం శుద్ధి చేసుకొని; సున్నం కొట్టుకొని అక్కడుండే కంపచెట్లు కొట్టేసి; ఎండుకొమ్మలు; ఆకులకు నిప్పు పెట్టి కాల్చేసి శుభ్రంగా చేసుకున్నారు భార్యాభర్తలు.

టౌనుకు పోయి వంటపాత్రలు కొత్తవి కొనుక్కొచ్చుకున్నారు. బండి కట్టెలు కొన్నారు. సంత నుంచి కూరగాయలు తెచ్చుకున్నారు.

రాత్రంతా మేల్కొని దిగదాల కొలాయి కాన్నుంచి డ్రమ్ముకు నీళ్ళు మోసుకున్నారు.

సత్రానికి మామిడి తోరణాలు కట్టినారు.

మూడు రాళ్ళు పెట్టి; పసుపు కుంకాలతో పూజ చేసి నిప్పు వెలిగించినారు.

శుభ్రంగా కడిగిన పాత్రల్లో వంట మొదలుపెట్టినారు. కొత్త పథకం... బడిలోనే భోజనం...

పిల్లలందరిలో ఆతృత... వంట వుడుకుతున్న కమ్మని వాసన... అన్నం సువాసన... చల్లగాలి మోసుకొస్తోంది.

టైయానికంటే ముందే ఆకలి అవుతోంది... ఈ ఆకలి మధురంగా వుంది. అంతా కొత్తగా వుంది. బెల్ మోగగానే పిల్లలందరూ ప్లేట్స్ కడుక్కొని వచ్చి లైను ప్రకారం కూర్చున్నారు... ఆశగా.

నేను ఇంటి నుంచి తెచ్చుకున్న క్యారియర్ పక్కన పెట్టేసి అరిటాకు తెప్పించుకొని వేడివేడిగా తినడానికి పూనుకున్నాను. అన్నం మెతుకులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. పప్పు... నెయ్యి... ఊరగాయి... అప్పలం... పెండ్లి భోజనంలా వడ్డించారు.

ఎంత అద్భుతంగా వుందో రుచి... కమ్మగా..! పూర్తయిన తర్వాత '...అన్నదాత సుఖీభవ...' అనే మాటలను చేతులు కడుక్కుంటూ అన్నాను.

'మాకు ఈ పనిరావడం మీ పుణ్యమే కదు సార్! పనిదాత సుఖీభవ!' అని అన్నారు ఆంజనేయులు. లక్ష్మి చిలకలా నవ్వింది.

'నువ్వు ఇట్నే ఇన్నిన్ని వంటలు చేస్తే... నీకు ఏం మిగల్దు. అప్పులైతాయి. రేపట్నుంచి చూస్కొని చేయండి. ఈ రోజంటే మొదటిరోజు అనుకుందాం...' అని ఆత్మీయంగా సూచన చేశాను.

'వున్నిలే సారూ... పిల్లోళ్ళు దైవంతో సమానమంటారు. మనకు మిగిలి మేడలు కట్టేది ఏముంది... బతికినంత కాలం మంచిపేరుంటే చాలు...' ఆంజనేయులు భోజనానికి కూర్చుంటు అన్నాడు.

లక్ష్మి వడ్డించింది అతను తిన్నాడు.

లక్ష్మి భోజనానికి కూర్చుంది అతను వడ్డించాడు.

ఆ తర్వాత పాత్రలన్నీ సత్రంలోకి చేర్చుకున్నారు.

'పిల్లలందరూ తనివితీరా తిన్నారు' అనుకుంటూనే మనసుకు ప్రశాంతంగా వుంది.

ఇలా మూడురోజులు గడిచిన తర్వాత సమస్య పుట్టుకొచ్చింది. మధ్యాహ్నం భోజనానికి బెల్ కొట్టగానే అగ్రారం పిల్లోళ్ళు అందరూ ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. అదేమిటని నిలబెట్టి ప్రశ్నిస్తే... 'మా నాయన జెప్పినాడు బల్లో కూడు తినాకండి...

బెల్ కొట్టగానే ఇండ్లకు రండి... తిని మళ్ళీ బడికి పోదురు...' అని పుస్తకాలను సంచిలోకి సర్దుకుంటూ భయపడతా జవాబిచ్చినాడు... నాల్గవ తరగతి చదివే ప్రవీణ్‌రాజు.

'...ఔ... సార్... మా వీరాడ్డి తాత గూడా చెప్పినాడు... బల్లో 'అంటుకూడు' తినొద్దు... ఇంటికొచ్చి తినిపొమ్మని...' బ్యాగు తగిలించుకొని సిద్ధపడిన అనిలు చెప్పినాడు.

'... నిజమే సార్... నిన్న రేత్తిరి కాడ అగ్రారం పిల్లోళ్ళు ఎవరూ బల్లో బువ్వ తినొద్దని చెప్పినారంట...' అందుకే ఇంటికి పోతా వుండాను చెప్పింది సౌజన్య.

నేనేం మాట్లాడలేదు. 'మీ ఇష్టం' అని అన్నానంతే! అగ్రారం పిల్లలందరూ ఒక్కొక్కరిగా వెళ్ళిపోయారు. కేవలం కొట్టాలపల్లెకు చెందిన పిల్లలు మాత్రం వరసగా కూర్చున్నారు. ఎప్పుడూ నవ్వుతూ ఆనందంగా వడ్డించే లక్ష్మి ముభావంగా గోడకు ఆనుకొని కూర్చుండిపోయింది. ఆంజనేయులు ముఖంలో కూడా విచారం... తానొక్కడే కూర్చున్న పిల్లలందరికీ భోజనం వడ్డించాడు.

నేను ప్లేట్ సిద్ధం చేసుకున్నాను.

'... వద్దులే సార్... మీరు మీ క్యారీనే తినండి...' తడబడుతు చెప్పాడు ఆంజనేయులు.

'భలేవాడివయ్య నువ్వు... ఎవరో ఏదో అన్నారని... అవన్నీ పట్టించుకోవద్దు... అగ్రారం పోయి నేను వాళ్ళందరితో మాట్లాడి వస్తా కదా...!' భుజం తడుతూ భరోసాగా చెప్పాను.

వడ్డించిన కమ్మని భోజనం కడుపునిండా తిన్నాను.

లక్ష్మి ఏడుస్తూ ఇంటికెళ్ళిపోయింది.

ఆంజనేయులు కూడా పాత్రలు అలాగే సత్రంలోకి చేర్చుకొని వెళ్ళిపోయాడు. నేను బయటకు వచ్చి అంకిరెడ్డి ఇంటి ముందున్న రూపాయి కాయిన్ బాక్సు నుంచి ఎంఇఓకు ఫోన్ చేశాను.

మధ్యాహ్నం జరిగిన సంఘటనకు సంబందించిన విషయమంతా చెప్పాను.

ఆయన కూడా కాసేపు ఏం మాట్లాడలేదు.

'... సరేలే... నాయ్డు... నేను డిఇఓ ఆఫీస్‌కు పోతున్నాను. అక్కడే ఈ విషయం కూడా మాట్లాడి వస్తాను...' అని అసంతృప్తిగా పెట్టేశాడు.

నేను అన్నుంచి చిన్నగా అగ్రారంలోకి బయలుదేరాను. వేపచెట్టు అరుగు మీద పెద్దిరెడ్డి 'మేకాపులి' ఆడుతుండగా... విషయం ప్రస్తావించాను... హైద్రాబాద్ నుంచి సర్పంచ్ వస్తే పంచాయితీ పెట్టిస్తానన్నాడు... ఇలా దృశ్యాలన్నీ కళ్ళముందు ఒక్కొక్కటిగా ఆవిష్కృతం అయ్యాయి. కలలతో నిద్ర పూర్తయ్యింది.

❀❀❀

తెల్లారింది.

బడికి బయలుదేరాను.

దార్లో కన్పించిన ఇద్దరు ముగ్గురు మండలంలోని టీచర్లు ఈ సంఘటనను గురించి ప్రస్తావించారు. నేను నవ్వుతూ... 'అలాంటిదేం లేదు... అంతా ఎవరో పుకార్లు పుట్టిస్తున్నారంటూ' విసుక్కున్నాను. వాళ్ళు ఇంకో ప్రశ్న వేయకుండా వెళ్ళిపోయారు.

పూర్లోకి వెళ్ళగానే తెలిసింది హైద్రాబాదు బస్సుకు రాత్రి సర్పంచ్ వచ్చినాడని. త్వరత్వరగా బళ్లో ప్రార్థన ముగించి ఆంజనేయుల్ని చూస్తా వుండమని చెప్పి బయలుదేరాను. రచ్చబండ కాడ్నే సర్పంచ్ తనని కలవను వచ్చినోళ్ళకు ఏవో కాయితాలపైన సంతకాలు పెడ్తా వుండాడు. ఆడ్నే పెద్దిరెడ్డి కూడా ఏదో నవ్వుకుంటా మాట్లాడతా వుండారు... అందరూ! నన్ను చూస్తానే...

'రా... నాయ్డు... రా... ఏం సంగతులు?' కళ్ళు ఎగరేసినాడు సర్పంచ్.

'అదేలే... ప్రొద్దున నీకు జెప్పల్యా... ఆ 'అంటు కూడు' గురించే మాట్లాడను వచ్చినట్లుండాడు...' అంతా ముందే చెప్పేశాను అనే ధోరణిలో ఎత్తిడిసినాడు పెద్దిరెడ్డి.

'ఏం జేయమంటావో..., ఎట్ట జేయమంటావో... చెప్పున్న... నువ్వు...' అంటి గట్టిగానే నేను.

'ఔ... నాయ్డు.. ఆ రోజు డ్వాక్రా మహిళలకు ఈ పని ఇచ్చేటప్పుడు మనం కొట్టాలపల్లె వాళ్ళను తీసేసి చేసుంటే బాగుండె. సమస్య రాకుండా! ఇప్పటికైనా మించిపోయింది ఏముందిలే... అగ్రారం వాళ్ళకే ఎవరికో ఒకరికి ఇద్దాం... బాగుంటుంది...' మాట్లాడతానే సంతకాలు పెడ్తా వుండాడు సర్పంచ్.

'వాళ్ళు వండితే వీళ్ళు తిననప్పుడు వీళ్ళు వండితే వాళ్ళు ఎందుకు తింటారు? అసలు ఈ సమస్య ఎందుకొస్తుందో అర్థం కావడం లేదు... అధికారుల దగ్గర పరువుపోతోంది...' అసహనంగానే చెప్పాను. నేనలా ఎప్పుడూ మాట్లాడింది లేదు.

రచ్చబండ చెట్టుపైన పక్షులు గిరికీలు కొడుతూ అరుస్తున్నాయి.

నన్ను ఆన్నుంచి రోంత దూరం చేయి పట్టి పిల్సకొచ్చినాడు సర్పంచ్ మునిరెడ్డి.

'... నాయ్డు... మనూరి రాజకీయం నీకు తెల్సిందే గదా! ఆ... వీరారెడ్డి... మొండోడు. నేనేం జెప్పమంటావో జూడు...' నన్ను సర్దుకొని పొమ్మనేటట్లు చెప్తాండడు సర్పంచ్.

'...క్కాదులేన్నా. మూడు నెలల్లో మళ్ళీ సర్పంచ్ ఎన్నికలున్నాయి. ఇలాంటప్పుడు కొట్టాలపల్లె వాళ్ళందర్నీ ఈ విషయం దగ్గర దూరం చేసుకొని చెడ్డపేరు తెచ్చుకొని నువ్వు పోటి చేస్తే ఓట్లు ఎవరేస్తారు?' సమస్యను రాజకీయానికి ముడిపెట్టి కొట్టాను గురి చూసి.

'ఔ... నాయ్డు... మంచి మాట చెప్పినావు... నీకు అసలు సంగతి తెలుసా... అదే ఆ వంటమనిషి లక్ష్మి పెద్దిరెడ్డి ఇంట్లోనే పని చేస్తా వుండేదట. బడిపని దొరికిన తర్వాత వాళ్ళింట్లో మానేసింది. తనింటికాడ ఆయమ్మి పనిచేసి వండిపెడ్తా వుంటే బాగుందనేవోడు బల్లో పిల్లోళ్ళకు జేసి పెడ్తావుంటే 'అంటుకూడు' అని అంటా వుండాడు ఆ పెద్దిరెడ్డి...! సరే... ఆయప్పకు నేను సర్ది చెప్తాగానీ పో... నువ్వు బడికి... మళ్ళీ సాయంత్రం నేనే ఆడికి వస్తాగానీ...' చెప్పి త్వరత్వరగా నడుచుకుంటా రచ్చబండ వైపుకు వెళ్ళిపోయాడు.

నేను బడికి వచ్చాను. లక్ష్మి సత్రం దగ్గర పాత్రలు కడుగుతాంది. ఆంజనేయుల్ని వెళ్ళి భోజనానికి సిద్ధం చేయమని సూచించాను.

దూరంగా... శబ్దం... జీపు వస్తున్న శబ్దం...

వచ్చింది... దగ్గరగా... బడికి దగ్గరగా... బడి ముందు ఆగింది.

ఎమ్మార్వో, ఎండిఓ, ఎంఇఓ ముగ్గురూ దిగినారు.

పిల్లలందరూ నిశ్శబ్దంగా పుస్తకాలు తెరచి భయంభయంగా చూస్తా వుండారు.

నేను పరుగు పరుగున బయటికొచ్చాను. లోపలికి ముగ్గుర్నీ ఆహ్వానించి కూర్చోబెట్టాను.

జరిగిన సంఘటన వివరించాను. సర్పంచ్‌ను, పెద్దిరెడ్డిని పిల్సుకరమ్మని పిల్లోన్ని ఒక్కడ్ని అగ్రారంలోకి పంపించాను.

ఆంజనేయుల్ని పిలిచి 'అందరం ఇక్కడే భోంచేస్తాం' వంట చేయమని చెప్పాడు ఎమ్మార్వో.

కాసేపటికి సర్పంచ్, పెద్దిరెడ్డి ఇద్దరూ బడి దగ్గరికి వచ్చినారు. అందరం పిల్లలకు దూరంగా రావిచెట్టు అరుగు మీదకు చేరుకున్నాం.

'... ఏం మునిరెడ్డి ఉపాధి హామీ పథకం ఎట్లా జరుగుతాంది... బిల్లులు పంపించినారా?' ప్రశ్నించాడు ఎమ్మార్వో.

'ల్యా... సార్. నేను రాతిరే హైద్రాబాదు నుంచి వచ్చింది. తయారుచేసి రేపు ఆఫీసుకాడికి తెచ్చిస్తా...' చెప్పినాడు చిన్నగా సర్పంచ్.

'బల్లో ఏంది గొడవ... 'అంటుకూడ'ని పిల్లోల్లను తినకుండా ఇండ్లకు రమ్మంటా వుండారని..! ఇట్లైతే మీ వూరికి గవర్నమెంట్ ఏం చెయ్యదు. బ్లాక్ లిస్టులో పెడ్తారు. కరెంట్ కూడా ఇవ్వరు... కొంచెం మీ రాజకీయాలు బడి విషయంలో చూపించొద్దు... నష్టపోతారు...' హెచ్చరికగానే చెప్పినాడు ఎమ్మార్వో.

'క్యాదు... ఏంది 'అంటుకూడు'?

మీ బీడు భూముల్ని సాగు చేసేది వాళ్ళు.

విత్తనమేసేది వాళ్ళు. నీళ్ళు పారబెట్టేది వాళ్ళు.

ఎరువు జల్లేది వాళ్ళు. కలుపు తీసేది వాళ్ళు.

కోత కోసేది... తూర్పార బట్టేది... ఎండబెట్టేది...

మూటలు మోసేది... గాదెలు నింపేది... ఎవరు?

మీ కడుపుల్లోకి మెతుకులు పోవాలంటే...

ఆ అంటుగాళ్లే కదా కష్టపడతా వుండేది... మీరు గొడుగేసుకొని గట్టుపైన కూకొని వాళ్ళని కూలోళ్ళుగా జేస్తా వుండారు కదా..! అక్కడంతా లేని శూద్రం... వండి పెట్టేటప్పుడు ఎందుకొస్తాంది? కొంతైనా విచక్షణ వుండాలి...' ఆవేశంగా తిట్టినట్టే చెప్పినాడు ఎండిఓ.

'చూడండి... మీరు ఇప్పుడు తాగుతా వుండే నీళ్ళు వాళ్ళ కాన్నుంచే వస్తా వుండాయి. ఆ 'అంటునీళ్ళు' ఎందుకు తాగతా వుండారు?...' ప్రశ్నించినాడు ఎమ్మార్వో సూటిగానే.

'టెండర్లు మీకే... కాంట్రాక్టులు మీకే... పదవులు మీకే... భూములు మీకే... ఇంగ వాళ్ళకేంది మిగిలేది మన్నా... ఇట్టాటియి చిన్న చిన్న పనులైనా వాళ్ళని చేసుకోనియ్యండి. వూరికే రాజకీయం ఎందుకు చేస్తారు...' అసహనంగానే చెప్పినాడు ఎంఇఓ.

కొంతమంది పిల్లలు అరుగుమీద మేం ఏం మాట్లాడుకుంటున్నామో వినాలని ప్రయత్నిస్తున్నారు.

వెనక్కి తిరిగి చూస్తున్నారు.

పెద్దిరెడ్డి తలొంచుకున్నాడు... అరుగు మీద చూపుడు వేలుతో ఏదో గీస్తూ!

'క్కాదులే సార్... నేను వూర్లో లేనప్పుడు ఇట్టాటి సమస్య వచ్చింది. అందరం ఒకటే. మాకేం పనులు పడినా వాళ్ళు జెయ్యాల్సిందే కదా! ఎవరో సరిపోనోళ్ళు ఇదంతా చేసినారు. ఇంకెప్పుడు ఇట్టాటి సమస్య రాదు...' సంజాయిషీగా చెప్తాండడు సర్పంచ్. పెద్దిరెడ్డిని కూడా మాట్లాడమన్నంటూ గిల్లినాడు.

'అయ్యిందేదో అయిపోయింది. ఇప్పుడట్టాటి సమస్యలేం లేవులే సార్... మాకేం వుండాది. అసలు వంటమనిషి లక్ష్మి మా ఇంట్లో వండుతా వుంటే ఇంటిల్లిపాదిమి తింటా వుంటిమి. ఇప్పుడంటే ఆయమ్మి బడిపని తీసుకొని మానుకుంది. ఇక్కడ అట్టాటివి ఏం లేవులే... కాలంతో పాటి అందరం కల్సిపోతా వుండాం...' సర్పంచ్‌కు మద్దతుగా తాను కూడా సమాధానమిచ్చుకున్నాడు పెద్దిరెడ్డి.

'ఏమో...బ్బా... నేను చెప్పేది ఇదే ఆఖరు. బ్లాక్‌లిస్ట్‌లోకి మీ వూరు ఎక్కకుండా చూస్కోండి...' కోపంగానే చెప్పినాడు ఎమ్మార్వో.

టైం చూసుకున్నాను. బెల్ కొట్టించాను.

అగ్రారం పిల్లోళ్ళు బ్యాగులు తగిలించుకొని ఇండ్లకు పోవడానికి గేటు దగ్గరికి చేరుకునేలోపే...

'రేయ్... రేయ్... యాడికి... ఆమంతన ఉరుకుతా పోతాండరు... బల్లోనే బువ్వతినాల. ఇండ్లకు పోతే తంతారు. కూకోండి' కేక వేసినాడు సర్పంచ్.

'కూర్చోండివాయ్... తినండి... బల్లోనే...' అరిచినాడు పెద్దిరెడ్డి కూడా.

పిల్లల ముఖాల్లో వెలుగు... ఆనందం...

'పాండి... మనం కూడా ఇడ్నే భోంచేద్దాం... ఏం సర్పంచూ ఏమంటావ్?' అన్నాడు పైకి లేస్తా ఎమ్మార్వో.

'మా వూర్లో మా బల్లో మాకు అడ్డమేముండాది? తిందాం పాండి సార్...' అన్నాడు పెద్దిరెడ్డిని కూడా పైకి లేప్తా సర్పంచ్.

పిల్లలందరూ అడిగి మరీ పెట్టించుకుంటూ తృప్తిగా భోం చేస్తున్నారు. లక్ష్మి వడ్డిస్తోంది. ఆ దృశ్యం చూస్తుంటే హృదయం పరవశిస్తోంది.

లక్ష్మి చేసిన వంటల్ని మెచ్చుకుంటూ తాంబూలం నముల్తూ అందరం బయటికొచ్చాం.

జీపు కదలి వెళ్ళిపోయింది... దుమ్ము రేపుకుంటూ!

ఈ మార్పు ఎంతకాలం వుంటుంది? వీళ్లు నిజంగానే మారారా? మారినట్లు నటించారా? గవర్నమెంటు కాంట్రాక్టు పనులు వీళ్లకిస్తున్నంత కాలం యిక అడ్డం రారు కదా! రకరకాల ప్రశ్నలు, ఆలోచనలు. వ్యాధికి చికిత్స అయితే మొదలయ్యింది. జబ్బు నయం కావడానికి, తీగకు పట్టిన తెగులు చావడానికి సమయం తప్పకుండా పడుతుంది అని మనసులోనే అనుకున్నాడు నాయుడు.

❀❀❀

పిల్లలు ఎక్కాలు పలుకుతున్నారు.

వాళ్ళ లెక్కలు ఎక్కడా తప్పడం లేదు.

బడి గోడ దగ్గరి పూలచెట్టుపై రకరకాల సీతాకోక చిలుకలు నిర్మలంగా స్వచ్ఛంగా స్వేచ్ఛగా విహరిస్తున్నాయి

ఆకాశంలో కొత్త పొద్దు పుట్టినట్టు వుంది.

– జూన్ 6, 2008 తేజ వారపత్రిక

ఉగాది కథల పోటీలో 10,000 ప్రథమ బహుమతి పొందిన కథ.

❀

శరణాగతుడు

అప్పుడప్పుడే తెల్లార్తా వుండాది. ఎండాకాలం. ఒంటెద్దు బండి ఎఱ్రమట్టి దావ నుంచి తాఱ్రోడ్డు పైకెక్కింది. ఇరుసుకు కందెన పూయకపోవడంతో కిఱ్రుకిఱ్రుమనే శబ్దం వస్తాంది. చెక్కర ఫ్యాక్టరీకి పోను బండికి చెరకెత్తుకొని పల్లెకాన్నుంచి కోళ్లు కూస్తాండేటప్పుడు బయలుదేరినాడు మునెయ్య.

రోంతసేపటి తర్వాత బండి ఎగువ వీరాపురం వంక దాటుకుంది. సన్నటి ఎండ మొదలైంది. అట్నే అట్నే ఎండ సెగైంది... అగ్గి కురుస్తాంది. సెగగాలి కొడ్తా వుండాది. ప్లాస్టిక్ బాటిల్లోని నీళ్లు తృప్తిగా తాగినాడు. గిట్టల చప్పుడుతో బండి భారంగా ముందుకు సాగుతానే వుండాది. మునెయ్యకు దిగాలుగా వుంది. బండిలోని చెరకు గుర్తుకొచ్చినప్పుడు బాధ తగుల్తా వుంది. అట్నే బండి తోలుకుంటా మధ్యాహ్నానికి చెక్కర ఫ్యాక్టరీకి చేరుకున్యాడు.

యాడన్నా రోంతసేపు నిమ్మళంగా కూలబడదామన్యా పచ్చని మాను యాడుంది? దానికి నీడ యాడుంది? 'ఛూ... మనిషి జన్మం' తిట్టుకున్యాడు మునెయ్య. ఎండ కురిసిపెడ్తాంది. చమటకు లోపలి బనీను కూడా తడిసి ముద్దైపోయింది. ఒంటెద్దు బండిలో వూరికాన్నుంచి తీసుకొచ్చిన చెరకు ఎండిపోతా వుండాది. దాన్ని జూస్తే మునెయ్య గుండె మండిపోతా వుండాది. తన బండికి ముందర నాలుగు ట్రాక్టర్లలో చెరకు తెచ్చిన రైతులు దాన్లను అన్నే యిడ్సిపారేసి పట్టించుకోకుండా దూరంగా గోడవారగా రోంతరోంత నీడనిస్తాండే యాపసెట్టు కింద కూకొని దిగాలుపడ్తా వుండారు. తుండు గుడ్డలతో చెమట తుడ్సుకుంటా చెక్కర ఫ్యాక్టరీ వాళ్లని తిట్టిపోస్తాండరు.

తీరా ఫ్యాక్టరీ కాడికి వచ్చినాంక అసలు సంగతి తెల్సింది. ఫ్యాక్టరీలో క్రషింగ్ ఆపినారని! ఏమైందో తెల్సుకుందామంటే అక్కడ జవాబిచ్చేటోళ్లు ఎవరుండారు? మిషన్లలో ఏవో సమస్యలొచ్చినాయని కొందరు, బకాయిలు రైతులకు చెల్లించలేదని ఇంకొందరు, డైరక్టర్ బదిలీ అయినాడని ఏవేవో తొక్కతిక్క జవాబులు చెప్పుకుంటా వుండారు.

పుండు మీద కారం చల్లినట్లు నాలుగేళ్లన్నుంచి నష్టాలతో నడుస్తాండే చెక్కర ఫ్యాక్టరీ. ఇంగ ఎవరైనా సేసేదేముండాది? ఫ్యాక్టరీవోళ్లు ఎప్పుడు పిలిస్తే అప్పుడు లోపలికి పోయేందుకు తనకలాడ్తా ఫ్యాక్టరీ గేటు బయటే పంటను తీసుకొచ్చిన రైతులంతా పడిగాపులు కాస్తాండరు. ఒంటెద్దు బండిలో ఎండసెగకు వాడిపోతాండే

చెరకును చూస్తే ప్రాణం నలిగిపోతాంది. చెరకుకు ఎండ తగిలితే నీరు ఆవిరైతాది. బరువుండదు. దంటులాగా తయారైతాది. బరువుల్యాకుంటే పంట ధర పలకదు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా రాకుంటే ఆ పంటను యింతకాలం బిడ్డను సాకినట్లు సాకి ఏం లాభం? ఎండకు బరువు తగ్గిన చెరకు నష్టాన్ని చెరకు ఫ్యాక్టరీ వాళ్లు భరించరు. ఆ నష్టం రైతు మీదే పడుతుంది. వుండే కష్టాలు చాలవనేట్లు మళ్లీ ఈ కొత్త నష్టాలు. మునెయ్య తనను తానే తిట్టుకున్యాడు నిస్సహాయంగా. భార్య లక్షుమ్మ అప్పుడే జెప్పింది. తానే ఆమె మాట పట్టించుకోలేదు. అందుకే యిప్పుడీ కష్టాలన్నీ.

'సామీ... చెరకు పంటను నమ్ముకొని మనం బాగుపడలేం. సుట్టుపక్క పొలాల్లోని పెద్ద రెడ్లు ఆకుతోటలు సేసుకుంటాండరు. మనం కూడా ఆ చెక్కర ఫ్యాక్టరీని నమ్ముకోకుండా ఆకు తోటలు వేసుకుంటే నాలుగు రూకలొస్తాయి. ఇంట్లో ఎదిగిన కూతురుండాది. అన్నీ కుదిరితే ఈసారన్నా ఆయమ్మికి పెండ్లి పెట్టుకుందాం' అని రోజుకు నాల్గుసార్లు జోరీగలాగా భార్య లక్షుమ్మ పోరుపెట్టినా మునెయ్య వినలేదు. లక్షుమ్మ ఆ తర్వాత మునెయ్యకు జెప్పడం మానుకుంది.

నాయన వెంకటయ్య సచ్చిపోయినాంక ముగ్గురు బిడ్డలకు భూమి వాటా జేసి పంచించినాడు. నడిపి కొడుకు మునెయ్యకు నాలుగు ఎకరాల భూమి వచ్చింది. పెద్దోడు, చిన్నోడు ఇద్దరూ వూర్లోని పెద్ద రెడ్లకు తమ వాటా భూమిని తాకట్టు పెట్టుకొని టౌన్లోకు జేరుకున్యారు. గడువు తీరిన భూమిని రెడ్లకే తక్కువ ధరకు అమ్ముకున్యారు. రోడ్డుకు వారగా తన వాటాను కష్టమో, నష్టమో మునెయ్య పంటలేసుకుంటా వూర్లోనే వుండిపోయినాడు. రేత్రి, పగలు తోటకు కాపలా కాస్తాడు. నీళ్లు పారపెట్టుకుంటాడు. పంట వేసినాంక ఓతూరి చెక్కర ఫ్యాక్టరీ కాన్నుంచి ఫీల్డ్ ఆఫీసర్లొచ్చారు. చెరకు పంట సంరక్షణ గురించి సూచనలు, సలహాలిచ్చారు. తమ ఫ్యాక్టరీకే మొత్తం చెరకు అమ్మాలని ఒప్పందం సేసుకున్యారు. తాము నమ్మకంగా దేన్కైనా వెనుక వుంటామని భద్రమైన భరోసా ఇచ్చినారు మునెయ్య భుజం తడ్తా.

మునెయ్యకు సంబరం అంతా ఇంతా కాలేదు. వాళ్లు అలా తన పంటను పొగడ్తాంటే ఉప్పొంగిపోయినాడు. వాళ్లందర్నీ తోటలోని మోటార్‌షెడ్డు కాడ కానుకసెట్టు నీడలో నులకమంచం వంచి కూర్చోబెట్టి తను సైకిలెక్కినాడు. వూర్లోకి గసపెడ్తా తొక్కుతా వచ్చి కూల్‌డ్రింక్స్ మోసుకొని పోయినాడు. వాళ్లు 'వద్దు వద్దంటానే' నిమ్మళంగా తాగి ఖాళీ బాటిల్స్ అక్కడేసి వెళ్లొస్తామంటూ బయలుదేరినారు. వాళ్లు వచ్చిన దారినే వెళ్లిపోగానే పచ్చగా ఎదిగి, గాలికి ఒయ్యారాలు పోతాండే పంటను నిండుగా సూసుకున్యాడు మునెయ్య. ప్రాణానికి హాయిగా వుండాది.

చెక్కర ఫ్యాక్టరీ వాళ్లు యింత భరోసా యిస్తారని తాను కలలో కూడా అనుకోలేదు. చెరకు పండించే రైతులంటే వాళ్లకెంత ఆత్మీయత, అభిమానం... కాకుంటే తనలాంటి మధ్యతరగతి రైతును ఆదరించాల్సిన అవసరం ఏముందాది? చెరకు కోత సమయానికి ఫ్యాక్టరీ వాళ్లకు కాకితో కబురంపితే చాలు... వాళ్లే బయటి కూలోళ్లను తీసుకొచ్చి కోతలు కోయిస్తారు. ఆ తర్వాత కోసిన పంటను ఫ్యాక్టరీకి మోసుకెళ్లడానికి వాహనాలు కూడా సమకూర్చుతారు. అంతా ఉచితం. చెరకు రైతు నమ్మకంగా చెరకు పంట వేసుకుంటే చాలు. ఆ తర్వాత అన్ని ఖర్చులు ఫ్యాక్టరీ వాళ్లే చెల్లించి దగ్గరుండి మరీ సూసుకుంటారు. తన పెండ్లాం లక్షుమ్మ తిక్కది కాబట్టే పంట వేసేటప్పుడు 'వద్దేవద్దని' గోడుగోడున మొత్తుకుంది. అయినా దాని బాధ దాన్ది. కూతురుకు పెండ్లి సేయ్యాలని తనకలాడ్తా వుండాది.

కరెంటొచ్చింది. 'హమ్మయ్య!' అని వూపిరి పీల్చుకున్యాడు మునెయ్య. ఇది ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెల్సి సావడం లేదు. ఒక వారం ఉదయం షిఫ్ట్ అని తెల్లారుజామున నాల్గింటికి కరెంటు ఇడుస్తాడు. అట్టనే మొన్న మొబ్బులో కరెంటు తీగలు సూస్కోక అంకన్నగాడు రామిరెడ్డి తోటకాన్నుంచి వస్తాండేటప్పుడు కరెంటు తగులుకొని గిలగిలలాడ్తా ప్రాణాలిడ్సినాడు. చెక్కర ఫ్యాక్టరీ వాళ్లు యింత బాగా రైతులకు సహకరిస్తాంటే, ఈ కరెంటోళ్లకు సరిగ్గా యిడ్సను ఏం పోయేకాలమో మునెయ్యకు అర్థం కావడం లేదు.

టార్చిలైటేసి మోటరేసినాడు. నీళ్లుపారబెట్టినాడు తోటకు. మట్టి తడుస్తాండే వాసన. తన కష్టాలన్నీ ఈసారి గట్టెక్కుతాయనే నమ్మకం కల్గింది. తన దగ్గరి చుట్టం, వూర్లో బంకు పెట్టుకొని వ్యాపారం చేస్కునే ఈశ్వరయ్య కాడ తీసుకున్య ఇరవై వేలు కూడా తీర్చిపారేయవచ్చు. రెండ్రూపాయల ధర్మవడ్డీకే వాడప్పిచ్చింది. రోంత సేతిలో లెఖ్ఖపడి నిలదొక్కుంటే అప్పు తీర్సాలని వుండాది. ఈసారి పంట సేతికి రాగానే వచ్చే డబ్బుతో ఈశ్వరయ్య అప్పు తీర్చేయాలి.

టౌన్లో ఎరువుల వ్యాపారి పరమేశం దగ్గర కొనుక్కొచ్చిన ఎరువులకు డబ్బు ఇవ్వాల్సి వుంది. వూర్లోని తిమ్మారెడ్డి మాట సాయం చేయడంతో ఎరువులు అప్పు పుట్టినాయి. ల్యాకుంటే పెద్ద సావచ్చి పడేది. తన పొలానికి కుడివైపు, ఎడమవైపులా వుండే భూమిని తన అన్నతమ్ముల కాన్నుంచి కొనింది తిమ్మారెడ్డే. మునెయ్యంటే ఆయనకు ఎంతిష్టమో... నీకెప్పుడు లెఖ్ఖదుడ్లు కావాలన్యా నా కాడికిరా తీసకపో... అని ప్రేమ కురిపిస్తా వుంటాడు. మునెయ్యకూ తెలుసు ఎప్పుడో ఓసారి ఈ భూమిని తిమ్మారెడ్డికి అమ్ముకోక తప్పదని! తిమ్మారెడ్డిని చూస్తే పంజా ఎత్తుకొని దెబ్బకొట్టడానికి

పూనుకొని వుండే పెద్దపులి ఆకారమే గుర్తుకొస్తాది. యింగ ఆయప్ప నవ్వు చూస్తే ఎలుగుబంటి వెంటపడినట్లుంటాది.

ఇట్టే రోజులు గడ్సిపోతా వుండాయి. ఓరోజు టెలిగ్రాం కాయితం వొకటి వచ్చింది. మునెయ్యకు గుండెలదిరినాయి. తీరా జూస్తే అది తనని 'ఆదర్శ చెరకురైతు'గా ఎంపికజేసినట్లు హైద్రాబాదు కాన్నుంచి వచ్చింది. పేపరోళ్లు వచ్చి ఫొటోలు తీసకపోయి వేసినారు. వూర్లో వాళ్లందరూ మెచ్చుకుండిరి. ఆఖరికి శాలవా కప్పినారు. చెక్క ముక్కకు రంగులేసి చేతిలో పెట్టినారు. 'ఏందిదని?' అడిగితే, 'నువ్వే ఆదర్శ రైతువి... తిప్పు మీసం!' అని అన్యారు. మీసం తిప్పుకుంటే ఏమొస్తుంది? అనే ప్రశ్నకు మునెయ్యకు జవాబు తెలియలేదు. ఎవరూ చెప్పలేదు.

చెరకు పంట పెరిగే కొద్దీ అప్పులు కూడా పెరుగుతా వస్తాండాయి. యూరియా అప్పు తెచ్చుకున్యాడు. నత్రజని అప్పు తెచ్చుకున్యాడు. తెగులు అల్లుకుంటే రసాయనాలు అప్పు తెచ్చుకొని వదిలిచ్చినాడు. పంట కోసమే తాను పుట్టినట్టు కుటుంబాన్ని, వాళ్ల తిండి తిప్పల్ని గాలికొదిలేసినాడు. పంటను మంచి ధరకు అమ్ముకోవాల, కష్టాల నుంచి గట్టెక్కాల. ఇదే ఆరాటం. బతుకు పోరాటం. పంటను కోసే కాలం వచ్చింది. కటింగ్ పర్మిట్ కావాల. ఎవరిస్తారు? ఫ్యాక్టరీ వాళ్లు ఎవరు పలుకుతా వుండారు? యంత్రాలు సిద్ధం కాలేదని వద్దన్నారు. పాత బకాయిలే చెల్లించలేని స్థితిలో వుండామని మరొకరు సెలవిచ్చారు. మునెయ్యకు కోపం కట్టలు తెంచుకోవడంతో ఫ్యాక్టరీ ఫీల్డ్ ఆఫీసర్లను నోటికొచ్చినట్లు బూతులు తిట్టాడు. వాళ్లు తలొంచుకొని ఒకరి ముఖాలు ఒకరు చూస్కున్యారు. 'నీ ఇష్టం' అని చేతులెత్తేసినారు. మునెయ్య వూర్లోని కూలోళ్లకు తానే కూలి డబ్బులు చెల్లించి పంట కోత కోయించాడు. ఫ్యాక్టరీకి తరలించడానికి తిమ్మారెడ్డి దగ్గరి ఒంటెద్దు బండిని బాడుగకు తీసుకున్యాడు. కోసిన పంటను బండికెత్తుకొని చెక్కర ఫ్యాక్టరీ దగ్గరకు కాలబడినాడు... తిట్టుకుంటా!

ఆ రోజు ఎంత నమ్మకంగా మాయమాటలు చెప్పినారు. నమ్మించి గొంతు కోసినట్టు వుండాది పరిస్థితి. చెక్కర ఫ్యాక్టరీ ఆఫీసర్ల మాట అనుకుంటానే వళ్లంతా కంపరమెత్తినట్టు అయిపోతావుండాది. కోతలు ఉచితం, రవాణా ఉచితం అని ఎన్నెన్ని దొంగ మాటలు చెప్పినారు. పాపర్నా కొడుకులు... గుండె మండిపోతా వుండాది. తీరా పంట పండినాంక కటింగ్ పర్మిషన్ గూడా యియ్యకుండా వేధిస్తా వుండారంటే వీళ్లనేమనాల? చెరకు నరికే మచ్చుకత్తి దీస్కొని ఒక్కొక్కడ్ని వెంటపడి నరకాలనిపిస్తా వుండాది. కోపం రగిలినప్పుడల్లా బాధ తగుల్తాంది. అట్నే బండికి చెరకు పంట ఎత్తుకొని తిట్టుకుంటానే ఫ్యాక్టరీ కాడికి వచ్చినాడు. తీరా వచ్చినాంక అసలు సంగతి

తెల్సింది. క్రషింగ్ ఆగిపోయింది. ఫ్యాక్టరీ మల్లా ఎప్పుడు మొదలవుతుందో తెలియదు. రైతులందరూ మండిపడ్తా వుండారు. బెల్లం తయారీకి వెనక్కి తీసకపోదామనుకుంటే యూరియా, నత్రజని వాడిన చెరకుతో తయారైన బెల్లానికి రంగు, తీపి, నిల్వ సామర్థ్యాలుండవని రైతులే మాట్లాడుకుంటా వుండారు. ఎకరా చెరకు సాగుకు విత్తనం, సేద్యం ఖర్చు, కూలీ, ఎరువులు, తవ్వకాలు, కోత, రవాణా ఖర్చులన్నీ కలిపితే ఇరవై ఐదు వేలు దాటిపోతా వుండాది. పెట్టుబడి పోను రైతుకు యింగ ఏమొస్తాది?

చెక్కర ఫ్యాక్టరీ యిప్పట్లో మళ్లీ ప్రారంభమయ్యే పరిస్థితులు లేవంటా వుండారు. మునెయ్య ఒక అభిప్రాయానికి వచ్చినవాడిలా పైకి లేచినాడు. ఒంటెద్దుబండిలోని చెరకునంతా కిందకు తోసినాడు. అగ్గిపుల్ల గీసి మండిచ్చినాడు. పైన ఎండ... కింద సెగ... మంట ఎత్తుకుంది.

పంట కాలిపోతాంది.

పటపట... చిటపట... మంటూ పంట రగులుకుంటా వుంది. కల కాలిపోతా వుంది. రైతులందరూ గుమిగూడినారు. నిర్ఘాంతపోయి చూస్తా వుండారు.

'అంత కోపమైతే ఎట్టాబ్బా...' అని కొందరంటండరు.

'మొగోడు... మంచి పని జేసినాడు. పంటక్కాదు ఫ్యాక్టరీకి పెట్టాల మంట' అని ఇంకొందరు కవ్విస్తా వుండారు.

ఫ్యాక్టరీ ఆఫీసర్లు భయంతో బిక్కుబిక్కుమంటూ తలోదిక్కుకు ఉరికినారు.

మునెయ్య కాలిపోతాండే పంట దిక్కే చూస్తా వుండాడు. బిడ్డను సాకినట్లు సాకిన పంట, రాత్రీ పగలూ కాపలా కాచి కాపాడిన పంట. కళ్లముందు కాలిపోతా వుండాది. ఇంటికాడి కుటుంబం గుర్తుకొచ్చింది. కన్నీళ్లు పొంగుకొచ్చాయి.

'ఛా... మనిషి జన్మం' అని తిట్టుకుంటా గుండెలనిండా ఆవేదనతో ఒంటెద్దు బండిని వూరి దిక్కుకు నడపడం మొదలుపెట్టినాడు.

చివరాఖరి వరకు భరించి భరించి బద్దలైన అగ్నిపర్వతంలా, తిరుగుబాటు ప్రకటించిన శరణాగతుడిలా మునెయ్య గుండె రగిలిపోతానే వుంది. ఒంటెద్దు గిట్టల శబ్దం నిశ్శబ్దాన్ని ముక్కలు చేస్తోంది. బండి ముందుకు సాగుతూనే వుంది.

చీనీ చెట్లు

మళ్లీ తెల్లారుజామున వాన ఎత్తుకుంది. నాలుగేళ్ల నుంచి కరువు దాహంతో విలవిలలాడి ఎండిపోయి నెర్రలు పట్టిన చెరువు స్వాతి వానతో తనివితీరా దప్పిక తీర్చుకొని కుదుటపడిన నిండుకుండ తిన్నా తొణికి లేస్తా వయ్యారాలు పోతా వుండాది. దిగదాల బెస్తోళ్లు వలలెత్తుకొని, గాలాలు పట్టుకొని చెరువులోకి చేపలు పట్టను దిగుతాండరు. చెరువు కట్టకు ఆనుకొని ఎకరాల కొద్దీ వేసిన చీనీ చెట్ల తోటలు పచ్చంగా ఎదుగుతా వుండాయి. ఔ... ఆ తోటలు సగం రామిరెడ్డివి, మిగితా సగం వెంకటనాయుడివి !

❀❀❀

తెల్లారేపాటికి వూర్లో ఈ వార్త బగ్గుమని మండింది. గట్టిగా మాట్లాడుకుంటే ఎవరితో ఏ ప్రమాదం వస్తాదో... మనకెందుకులెమ్మని అందరూలోగా ఇండ్లలోకి పోయి గుసగుసలాడుకుంటా వుండారు.

వూర్లో అంతకుముందు రెండు పార్టీల వర్గాలే వుండేవి. మొన్న ఇంగో కొత్త పార్టీ వచ్చినాక మూడు పార్టీల వర్గాలైనాయి. దీంతో వూర్లోని జనానికి తనకలాట వచ్చిపడింది. వాళ్లతో వీళ్లు మాట్లాడినా, వీళ్లతో వాళ్లు మాట్లాడినా సంగతి గొంతు మీదికి వస్తా వుండాది. రోంత అటు ఇటు అయితే కులాల వారిగా, కుటుంబాల వారిగా అందరూ విడిపోయే పరిస్థితులు ఏర్పడతా వుండాయి.

పదైదు రోజుల క్రిందట వూర్లో డిష్ కేబుల్ కనెక్షన్స్ కాడ గొడవచ్చి పడింది. రామిరెడ్డికి, వెంకటనాయుడికి సరిపోలేదు. 'నెలకు నెలకు నువ్వు లెక్క పెంచుకుంటా పోతాంటే లెక్క ఏంటికిస్తాం? అంతా నీ ఇష్టమేనా? నీ కనెక్షను వద్దు... నువ్వూ వద్దు... పా...' అని కోపంతో ఎగిరినాడు వెంకటనాయుడు.

'నువ్వంత మొగోడివి అయితే... మీ వీధిలో కొత్త డిష్ బిగించుకోండి. మా కనెక్షన్ మీకు ఇయ్యం అని' ఎదురు మాటిచ్చినాడు రామిరెడ్డి.

అన్నుంచి రెండు వర్గాలైనారు. నాయుడు పార్టీ మారి మాధవరాయుడి పక్షం చేరినాడు. వూర్లో రెండు పార్టీలైనాయి. అట్నే గుంభనంగా రెండ్రోజులున్నారు. మూడోరోజు ఆధిపత్య పోరు మొదలైంది.

'రేయ్... మన ఇండ్లల్లోంచి ఈ దావ ఎంబిడి టౌనుకు పోయేదానికి దారి యియ్యాకండి. వాళ్లు ఆ ఎగువ పక్క వీరాపురం వంకకు ఆనుకొని వుండే దావను

బాగాజేసుకొని పొమ్మని చెప్పండి. వాళ్లకు ఆ దావ, మనకు ఈ దావ' అని పంచాయతీ పెట్టి తన వర్గానికి చెప్పినాడు నాయుడు.

పంచాయితీ తీర్మానాన్ని రామిరెడ్డికి జెప్పినారు.

'దావ ఎవడి సొమ్ము? ఎగువ వీధిలో మీరుండారు. మిమ్మల్ని దాటుకొని మేముండాము. ఇదే దావ టౌను దిక్కు పోతాది. మాదేంది? మీదేంది? గవర్నమెంటోళ్లు వచ్చి పంచాయితీ పెట్టమను చెప్తా. మీరే కావాలంటే వీరాపురం వంక దారిని బాగుజేసుకొని వాడుకోండి...' అని పంతానికి మీసం దువ్వినాడు రామిరెడ్డి.

ఒకటే వూరు రెండు ముక్కలైనట్లు అయ్యింది. చూస్తాండగానే వూర్లో నాయుడు కొత్త డిష్ బిగించినాడు. వాళ్లకంటే ఇంకో రెండు ఛానల్లు గూడా ఎక్కువ. నెలకు లెక్క కూడా వాళ్లకంటే తక్కువ. ఈ సంగతి రామిరెడ్డికి తెల్సి, తన వర్గానికి అందరికి డిష్ కనెక్షన్ ఉచితం చేసినాడు. అన్నుంచి ఇద్దరి మధ్యన పోరు నడస్తానే వుండ్య.

వెంకటనాయుడు, మాధవరాయుడులిద్దరూ కల్సి వ్యూహం జేసినారు. రామిరెడ్డి కాంట్రాక్టు పని మీద హైద్రాబాదు పోయినప్పుడు, వూర్లో ఆయప్ప లేకుండా వున్య సమయం జూసుకొని తమ మనుషుల్ని రంగంలోకి దింపినారు. శింగనమల కోన దాటుకున్యాక పడమటికి రాళ్ల చేను దిక్కుంటే చీనీ తోటలోకి యిడ్సినారు. ఆ చీనీ తోటంతా రామిరెడ్డిదే. పదునైన మచ్చు కత్తులు, గొడ్డళ్లతో చీనీ చెట్లన్ని నరికి పారేసినారు. మొత్తం ఆరు నూర్ల చీనీ చెట్లు ఎక్కడికక్కడ తలలు తెగిన మొండ్యాల తిన్నా కుప్పకూలిపోయినాయి. రామిరెడ్డిని ఆర్థికంగా దెబ్బ తీయాలని వీళ్లు కుట్ర వ్యూహం అమలు జేసినారు.

రెండ్రోజుల తర్వాత వూర్లోకొచ్చిన రామిరెడ్డి నిమ్మళంగా వుండినాడు. తన వర్గం వాళ్లు చెప్పిన మాటలన్ని విని మెల్లింగ నవ్వినాడు. తలాడించినాడు. ఊ కొట్టినాడు.

వాళ్లు చెప్పిన మాటలు అన్నీ విన్యాంక 'తొందరపడాకండి. ఇప్పుడిప్పుడే ఏం వద్దు. రోంత నా తిన్ననే నిమ్మళం పడండి...' అని చెప్పి శాంతపర్చినాడు తన వర్గాన్ని రామిరెడ్డి. మళ్ళా రెండ్రోజులు తిరుమలకు పోయి దేవుడి దర్శనం చేసుకొని వచ్చినాడు. వూర్లోకి వచ్చిన రోజు రాత్రే నాయుడి డిష్ కేబుల్ మొత్తం పెరక్కచ్చి నడిరోడ్లో బేసి అగ్గి పెట్టినారు. ఈ పని ఎవరు చేసింది అందరికి తెల్సు. కానీ ఎవరూ నోరు విప్పలేదు.

నాయుడు ఎస్సైని కల్సి కేసు పెట్టి వచ్చినాడు. ఇంగో రెండు రోజులకు తాడిపత్రి దావ దిక్కు మోరీ సత్రంకు తూర్పుకు వుండే నాయుడి చీనీ తోట మీదకు రామిరెడ్డి దృష్టి పడింది. అంతే రాత్రికి రాత్రి తన మనుషులతో తోటలోని ఎనిమిది నూర్ల చెట్లు తెగిపడినాయి. దెబ్బకు దెబ్బ. పగకు పగ. ప్రతీకారానికి ప్రతీకారం

తీర్చుకున్యట్లు మీసాలు దువ్వుకున్యాడు రామిరెడ్డి. కాయలకొచ్చిన చీనీ చెట్లు పంతానికి బలైనాయి. మామూలుగా అయితే చీనీ కాయలు గంపల కేసి కుట్టి బొంబాయికి పంపిస్తారు. రైల్వే స్టేషన్‌కు చేర్చుకొని మెయిల్‌కు, దాదర్‌కు లోడు ఎక్కిస్తారు. ఆదాయం వచ్చే పని ఇదే. ఇట్టనే చీనీ కాయలు అమ్ముకునే వాళ్లందరూ బాగుపడింది. ఇప్పుడు ఒకరంటే ఒకరికి సరిపోక ఎవర్ని ఎవరూ ఎదగనివ్వకుండా చేసుకుంటూ వుండారు. ఆర్థికంగా ఎవరు ఎదిగి బలపడినా మిగిలినోళ్లకు ప్రమాదమని ఇట్టా చీనీ చెట్లు నరుక్కుంటా వుండారు. ఈ జబ్బు ఇప్పుడిప్పుడు పట్టుకొనింది కాదు. అప్పుడెప్పుడో ఫ్యాక్షన్ వుండే చోటల్లా ఇట్నే చీనీ చెట్లను నరుక్కొని తమ పగ చల్లార్చుకుంటా వుండేటోళ్లు. దాని కొనసాగింపే ఇప్పుడు జరుగుతా వుండేదంతా.

చూస్తాండగా వారం రోజుల్లోనే రామిరెడ్డి తోటలోని ఆరునూర్ల చీనీ చెట్లు, నాయుడు తోటలోని ఎనిమిది నూర్ల చీనీ చెట్లు నేలకూలిపోయాయి.

వీరాపురం వంకకు కట్టకట్టే పని కాంట్రాక్టు కోసం పోటీ వచ్చింది. రెండు వర్గాలోళ్లు జీపులేసుకొని హైద్రాబాదుకు పోయి చక్రం తిప్పినారు. ఎట్టైనాగానీ కాంట్రాక్టు సంపాదించుకోవాలని ప్రయత్నాలు చేసినారు. ఎమ్మెల్యే గట్టిగా పట్టుకొని రామిరెడ్డికే వంక కట్ట నిర్మాణ కాంట్రాక్టు పని ఇప్పించినాడు.

వెంకటనాయుడు, మాధవరాయుడు ఇద్దరూ కాళ్లీడ్చుకుంటూ వూరికొచ్చినారు. తర్జనభర్జన పడినారు. అధికార పార్టీ వాళ్లని కాదని తమకు ఏ పనులు అందవని దిగులుపడినారు.

రామిరెడ్డి తోటనంతా దున్నిస్తా వుండాడు. మళ్లా కొత్తగా చీనీ చెట్లు తెప్పించి నాటిస్తా వుండాడు. దాన్లకు పాదులు చేయిస్తా వుండాడు. నీళ్లు పారబెట్టిస్తాండడు. పని చకచకా జరిగిపోతా వుండాది. పౌరుషానికి నాయుడు కూడా రంగంలోకి దిగినాడు. టౌన్లో వడ్డీకి అప్పు తెచ్చినాడు. తోట పనిలోకి దిగినాడు. చీనీ చెట్లు కోడూరుకు పోయి కొనుక్కొచ్చినాడు. కూలోళ్లను పనిలోకి పెట్టినాడు. పని జరుగుతా వుండాది. లెక్క సరిపోకపోతే ఇంట్లోని బంగారు నగలు కూడా బ్యాంకులో పెట్టి లెక్క తీసుకొచ్చి చీనీ చెట్లకే పెట్టుబడిగా పెట్టినాడు. బాగా కాయలు కాసే దశలో పోయిన చెట్లు గుర్తుకొచ్చినప్పుడు కళ్లనిండా నీళ్లు తిరుగుతా వుండాయి. నోటికాడి కూడు నేల రాలిపోయినట్లుండాది. మళ్లా తనకూ మంచి కాలం రాకుండా పోతుందా? అనే ఆశతోనే వుండాడు.

మూడ్రోజుల క్రితం మాధవరాయుడు ఏందో పనుండాదని జెప్పి 'రాయలసీమ' తాడిపత్రిలో ఎక్కి హైద్రాబాదుకు పయనమైనాడు. రైలుకాడికి పోయి నాయుడే దగ్గరుండి ఎక్కించి వచ్చినాడు. తను చీనీ చెట్ల పనిలో వుండగా పార్టీ ఆఫీసు కాన్నుంచి ఫోనొచ్చింది. మాధవరాయుడు కొత్తగా వచ్చిన పార్టీలో జేరినాడని!

వెంకటనాయుడికి కాళ్లూ, చేతులూ ఆడలేదు. ఇప్పుడు తన తన పరిస్థితి ఏమిటో అర్థం కాలేదు. ఈ పార్టీలోనే వుండాలా? ల్యాకుంటే రాయుడితో పాటి కొత్త పార్టీలోకి మారాలా? దిక్కు తెలియని పరిస్థితి వచ్చి పడింది.

తోట కాన్నుంచి వస్తాండేటప్పుడు రామిరెడ్డి జీపు ఎదురైంది. జీపు ఆపి పలకరించినాడు. వూరి రాజకీయమంతా నాయుడు పూసగుచ్చినట్లు చెప్పినాడు. ఇదంతా తనకు ముందే తెలుసునని అన్యాడు రామిరెడ్డి. 'ఇప్పుడు తన పరిస్థితి ఏందని అడిగినాడు' దిగాలుగా నాయుడు. 'నువ్వేం ఆలోచించాకు నువ్వు నువ్వుండే పార్టీలోనే వుండు. వూర్లో మూడు పార్టీలు వుండని. నీకు వంక కట్ట కాంట్రాక్టు పనిలో సగం వాటా యిస్తా. మనిద్దరం కల్సి వుందాం' అని నవ్వుతా జెప్పినాడు రామిరెడ్డి.

'అట్నేలే' అని తలాడించినాడు నాయుడు. మరుసటిరోజు మాధవరాయుడు కొత్త పార్టీలో చేరినట్లు ప్రకటన కూడా వచ్చింది. వూర్లో రాయుడి మద్దతు వర్గం పెద్ద ఎత్తున బాణసంచా పటాకులు పేల్చినారు. స్వీట్లు పంచుకున్యారు.

ఇదంతా రామిరెడ్డికి, వెంకటనాయుడికి ఏమాత్రం నచ్చలేదు.

మాధవరాయుడు వూర్లోకి రాకముందే ఏదో ఒకటి చేసి భయపడించాలని నిర్ణయించుకున్యారు.

ఇంగేం వుండాది? మామూలే... రాత్రికి రాత్రి వీరాపురం వంకకు ఎగువకు భైరవకోన దిక్కునుండే మాధవరాయుడి చీనీతోట పైకి గురి కుదిరింది.

తెల్లారేపాటికి ఐదు నూర్ల చీనీ చెట్లు ఎవరో నరికి పారేసినారని జనమంతా చెప్పుకుంటా వుండారు.

గట్టిగంటే ఏ ప్రమాదం ఎట్లా వస్తాదో అని జనం భయపడిపోతా వుండారు.

రైలు దిగి వూర్లోకి వచ్చిన మాధవరాయుడికి తన అనుచరులు ఈ సంగతి చెప్పినారు ఆత్రమాత్రంగా.

తన వర్గం వాళ్లు చెప్పిన మాటలన్నీ విని మెల్లింగ నవ్వినాడు. తలాడించినాడు మాధవరాయుడు.

'తొందరపడాకండి. ఇప్పుడిప్పుడే ఏం వద్దు. రోంత నా తిన్ననే నిమ్మళం పడండి' అని చెప్పినాడు.

రామిరెడ్డి, వెంకటనాయుడి తోటల్లోని చీనీ చెట్లు త్వరత్వరగా పెరుగుతా వుండాయి. పాపం పండినట్లు !

– 2 సెప్టెంబర్, 2008

వార్త దినపత్రిక



బొమ్మ : పినిశెట్టి

ఏడుతలల నాగు

చుట్టూ ఎడారి... అలలు అలలుగా ఇసుక పై పొరల్ని చీల్చుకొస్తూ చుట్టుముట్టే ఇసుక తుఫాను... పరిగెత్తాలి... పరుగు... ఎక్కడికి? ఎక్కడికైనా సరే... ఆగకూడదు! పరుగు... క్షణకాలమైనా నిలబడి నిబ్బరంగా ఊపిరి పీల్చుకోవడానికి లేదు. నువ్వేం చేస్తావో ఎవరికీ అవసరం లేదు. కానీ నువ్వు ఎక్కడా ఆగకూడదు. ముందుకు... మున్ముందుకు సాగుతూనే ఉండాలి...

నేనెవర్నో తెలుసా... నా దగ్గర ఎన్ని.. ఎన్నెన్ని డాలర్లు నిల్వలున్నాయో తెలుసా... నా ఆస్తి విలువ తెలుసా...

అవన్నీ అనవసరం ఇసుకలో కాళ్లు కూరుకుపోతున్నా... అలసటతో కాళ్ల నరాలు జివ్వుమని లాగుతున్నా... శక్తి సన్నగిల్లిపోయి గస వస్తున్నా... నువ్వు పరిగెడుతూనే ఉండాలి. పరుగు...

ఆగితే ఏమవుతుంది?

ఏమౌతుందని అడిగితే ఎవరేం చెప్పగలరు? నీ తలరాత...! ఏమవుతుందో నేను చెప్పడమెందుకు? నీకు ధైర్యముంటే, నీకు నిజంగా బతుకు మీద ఆశ ఉంటే నువ్వే ఒక్కసారి... ఒకే ఒక్కసారి... వెనక్కి తిరిగి చూడు!

నీ వెనుకే బుసకొడ్తూ... ఉప్పొంగుతున్న కడలి కెరటంలా ఏడుతలలతో వెంటాడి వస్తున్న కాలనాగును చూస్తావా? నీ ఇష్టం... దమ్ముంటే కాసేపు ఆగి చూడు... బలిష్టమైన ఏడుతలల సర్పం... వస్తోంది నిన్ను వెంబడిస్తూ. పరుగు... పరుగు... కమాన్...

నేనేం చేశాను? ఎవరికి హాని చేశాను? నా గురించి ఈ ఏడుతలల సర్పానికి సరిగ్గా తెల్సో లేదో... లేకుంటే ఎవర్నో వెంబడించాలనుకొని నా వెనుక పడిందో... దీనికి నిజంగా కావల్సింది నేనేనా? ఆగి అడిగితే సరిపోతుందా? అది నా గోడు వింటుందా? నా బాధ నిజంగా అర్థం చేసుకుంటుందా? పరుగు... పరుగు... గస...! బుస విన్పిస్తూనే ఉంది... ఈ సర్పంకు నాలా ఆయాసం రాదా? ఆకలి వేయదా? అవును ఆకలిగా ఉంది. ఇప్పుడేం చేయాలి... దూరంగా ఖర్జూర చెట్టు... అవును...

ఇక్కడ పైకెగరాలి... రెండు చేతుల్తో ఖర్జూర గుత్తి ఒకటి తెంపుకోవాలి... పరిగెడుతూనే కడుపుకింత ఆహారం నింపుకోవాలి... ఆకలి... పేగులు శబ్దం

చేస్తున్నాయి. టైం ఫిక్స్ చేసిన అలారంలా! ఎలాంటి ఆహారం తీసుకునేవాడిని... నాన్‌వెజ్‌లో ఎన్ని రకాలు రుచి చూసేవాడిని... ఫైవ్‌స్టార్ హోటల్లోని స్విమ్మింగ్‌పూల్ దగ్గర కూర్చొని అందమైన అప్సరసలు నోటికందించే ఆహారాన్ని భుజిస్తూ... ఒక్కోరోజు ఒక్కో దేశంలో... ఏడాదికి సరిపోయే బిజీ షెడ్యూల్ ఒకేసారి ఫిక్స్ అయిపోయి... ఎప్పుడూ విమానాల్లో, ఖరీదైన హోటల్స్‌లో ఉండే నేను... ఏమిటి నాకీ ఖర్మ... ఈ ఇసుక ఎడారిలో... పరుగు...

ఖర్జూర చెట్టు దగ్గరగా వస్తోంది... ఒన్... టూ... త్రీ... పైకెగురు... అందింది! గుత్తి ఇప్పుడు చేతుల్లో... వేళ్లు ఒక్కో పండును తెంపి నోటికి ఆత్రంగా అందిస్తున్నాయి... ఆకలి ... కరువు నేలపై చినుకులు కురుస్తున్నట్లు... కొంచెం కొంచెంగా తగ్గుతోంది... పరుగుకు మళ్లీ కొత్త శక్తి అందుతోంది... ఖర్జూరం కొంత వగరుగా, కొంత తియ్యగా, సగం పండి సగం పచ్చిగా... తప్పదు తినాలి... బతకడానికి ఏదో ఒకటి తిని చావాలి... తినడం కోసమే పుట్టడం వేరు. బతకడం కోసం తినడం వేరు...! ప్రొద్దునెప్పుడో పనిలోకి ఎక్కి మిట్టమధ్యాహ్నమప్పుడు ఎర్రకారంతో వేపచెట్టు నీడలో కూర్చుని చెట్టుకొమ్మ కేసిన చీర ఊయల్లోని బిడ్డని ఊపుతూ, ఏ రోజు సంపాదించుకుంది ఆ రోజుకు సరిపోయేలా జీవించే జీవితాల వారికి తెలుసు నిజంగా ఆకలి విలువ! గురూ... నిజంగా చెప్తున్నాను ఇప్పుడు నేనలాంటి నిజమైన ఆకలితోనే అలమటిస్తున్నాను. నువ్విప్పుడు ఏ పదార్థమైనా పెట్టు ఉప్పు తక్కువైందనో, కారం ఎక్కువైందనో, ఆయిల్ మరీ అంతెందుకు వేశావనో అనను... అన్లేను... లంచ్‌కు ఫిష్ ఫ్రై చేయలేదని వంట మనిషిపై చేయి చేసుకోను... డిన్నరప్పుడు టేబుల్ క్లాత్ మార్చలేదని అన్నం విసిరికొట్టను... ప్లీజ్... నన్ను నమ్మండి...! ఆకలి గురించి నాకు ఇప్పుడిప్పుడే బాగా ... తెలుస్తోంది... పాపం! ఈ భూమ్మీంద ఎంతమంది ఆకలితో అలమటిస్తున్నారో కదా...

పరుగు... పరుగు... ఛా!

ఏడు తలల సర్పం నన్ను ఇంకా వెంబడిస్తోంది ఏమిటి? ఎవరైనా పెద్ద మాంత్రికుడు కన్పిస్తే ఎంత బాగుంటుంది? ఏవైనా మంత్రాలు చదివి మహాసర్పాన్ని కట్టడి చేస్తాడు కదా... ఏదైనా వలలాంటిదో, ఉక్కు పంజరం లాంటిదో ఈ సర్పాన్ని తగులుకుంటే ఎంత బాగుండు...

బుస... బుస... సర్పం బుస విన్పిస్తోంది. గస... గస... కాళ్లు లాగేస్తున్నాయి. యింత ఎడారిలో నేను తప్ప యింకొకరు ఎవరూ కనపడరే... ఈ భూమ్మీద నేనొక్కడ్నే ఉన్నట్లు ఏమిటీ పరిస్థితి? ఒక్కరు కన్పించినా కొంత ధైర్యం వస్తుంది. పెదవులు

తడి ఆరిపోతున్నాయి... దాహమేస్తోంది. నీళ్లు కావాలి. ఎవరిస్తారు? ఎక్కడుంటాయి? ఎడారుల్లో ఒయాసిస్సులుంటాయని అంటారు. ఎక్కడ... ఒక్కటైనా కన్పించడం లేదే. ఎక్కడని వెతకను...? నీరసమైన చూపుల్తో ఎంత దూరమని చూడను... దాహం... దాహం... ! నో రెస్ట్... పరుగు ... పరుగు... ఇక్కడ ఈత చెట్లు ఉన్నట్లున్నాయి... వీటి కింద గుండ్రటి రాళ్లు ఉన్నాయి... ఒక రాయి అందుకొని మళ్లీ పరుగు... రాయి కింద చెమ్మ... హమ్మయ్య.

నాలికను తడుపుకొని... ఛా! ఏం బతుకు? రాళ్ల అడుగున తడే కాదు... ఖర్మ అడ్డం తిరిగితే ఎర్రటి ఎడారి తేళ్లు కూడా ఉంటాయి... జాగ్రత్త. ఎంత పరిగెడితే అంత దూరము... ఇది ఇసుక ఏడారేనా? దీనికి అంతం ఉండదా? ముగింపు ఎక్కడ? ఎడారిలో ఒంటెలుంటాయని వాటిని 'ఎడారి ఓడ' అని పిలుస్తారని చిన్నప్పుడెప్పుడో పాఠ్యపుస్తకాల్లో చదివిన గుర్తు... ఏది?

ఒక్క ఒంటైనా కన్పించదే? దేవుడా నాకెందుకీ శిక్ష? చాలు... చాలు... యిక నేను పరిగెత్తలేను... నన్ను ఆ ఏడు తలల నాగు మింగినా ఫర్వాలేదు... కళ్లు తిరుగుతున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. ఆపేస్తాను... పరుగు ఆపేస్తాను... నాకు ఈ జీవితాన్ని ఇమ్మని ఆ దేవుడ్ని అడిగానా? తనే ఇచ్చాడు. పుట్టించమని అడిగానా? మనిషిగా పుట్టించాడు. మగాడిగా పుట్టించాడు. చదువు ఇమ్మని అడిగానా? తనే ఇచ్చాడు. డబ్బున్నోడికి కొడుకుగా పుడ్తానని అనుకున్నానా?... పుట్టాను. అన్ని అవయువాలు సరిగ్గా ఉంటాయనుకున్నానా?... ఉన్నాయి. ఉద్యోగం చేస్తాననుకున్నానా? చేశాను. అమెరికా అవకాశం వస్తుందనుకున్నానా? వచ్చింది కోట్లు సంపాదిస్తాననుకున్నానా? సంపాదించాను.

జీవితాన్ని యిన్ని రకాలుగా ఎంజాయ్ చేస్తాననుకున్నానా? అన్నీ యిచ్చిన దేవుడే ఇప్పుడు ఈ ఏడు తలల నాగును నా మీదెందుకు ఉసిగొల్పాడు? అసలు ఈ సర్పం ఎక్కడిది? యింతకాలం ఎక్కడుండేది. ఏం చేసేది? ఎలక్ట్రానిక్ మీడియా ఎంతగా విస్తరించింది. ఒక్క ఛానెలూ ఇలాంటి సర్పాన్ని గురించి ఎందుకు చెప్పలేక పోయింది? ఏడు తలల సర్పం వింత కాదా? ఇదెందుకు ఎడారిలో ఉంది? యింతకాలం నుంచి ఏం తిని జీవిస్తోంది? ఎందుకు నన్ను కసిగా వెంబడిస్తోంది.

నేను ముసలివాడిని కాను కాబట్టి సరిపోతోంది. లేకుంటే ఈ మహాసర్పం నన్నెప్పుడో ఆరగించి శుభ్రంగా వెళ్లిపోయేది... కలలు... మిగిలిపోయిన కలలు కొన్ని ఉన్నాయి... వాటిని నెరవేర్చుకోగలిగితే బాగుండేది. ఆస్ట్రేలియాలో నా వాటాగా పెట్టుబడి పెట్టి డెవలప్ చేస్తున్న హోటల్ ప్రారంభోత్సవం ఇంకా జరగలేదు. రోమ్‌లో

నచ్చిన అమ్మాయితో మ్యారేజ్ విషయం ఇంకా చర్చించాల్సి ఉంది. కనీసం ఇద్దరు బిడ్డలకు తండ్రి కావాలని... వాళ్లు ఏడుస్తుంటే జోకొట్టాలని, పార్కులకి, జూలకి తిప్పాలని చాలా కలలున్నాయి...

అవన్నీ ఇంకా నెరవేరనే లేదు. అప్పుడే నా నుదుటన ఆ దేవుడు ఇలాంటి రాత రాశాడేమిటో... పాదాలు ముందుకు పడడం లేదు. అలసట, అలజడి, ఆందోళన... బుస... ఎగసిపడుతున్న బుస... మహాసర్పం... ఏడు తలలు...!

అడుగులు ఇసుకలో పడ్తున్నాయే కానీ కూరుకుపోతున్నాయి. వేగం తగ్గిపోతోంది. ఆయాసం... గస... కాదు... యిక నా వల్ల కాదు... కానే కాదు... యిక దేవుడిదే భారం.

ఎదురుగా గాలి... కళ్లలోకి ఈదురుగాలితో పాటూ సన్నటి ఇసుక రవ్వలు పడ్తున్నాయి. దుమ్ము... ఎర్రటి ఇసుకమట్టి... నన్నిలా చూస్తే ఎవరూ గుర్తుపట్టలేరు. తడారి ఎడారిలో ఎండిపోయిన దేహం నాది... పెదవులు వాడిపోయాయి. జుట్టు పిచ్చిగా రేగి వుంది. నా ఆకారాన్ని చూస్తే నాకే అసహ్యమేస్తోంది. ఏంటి నా పరిస్థితి? ఆకాశం నిశ్శబ్దంగా వుంది. కనీసం ఏదైనా విమానమో, హెలికాప్టరో వెళ్తే అందులో ఎవరైనా గుర్తిస్తారు కదా అనే చిట్టచివరి ఆశ. నాకూ, ఆ సర్పానికి మధ్యన భూమి రెండుగా చీలిపోయి నేనొకవైపున, ఆ సర్పం మరోవైపున ఉంటే ఎంత బాగుంటుంది?

పోనీ ప్రపంచవ్యాప్తంగా యింతమంది గుండెపోటుతో చస్తుంటారు కదా... అలాగే ఈ సర్పం కూడా గుండె ఆగి చస్తే ఎంత బాగుంటుంది? సర్పాలకు గుండె... అదే 'హృదయం' ఉంటుందా? సరేలే... నా పిచ్చి కానీ దీనికి హృదయమనేదే ఉంటే నా మీద కొంతైనా జాలిపడో, అభిమానంతోనో, ఆప్యాయతతోనో వదిలేసేది కాదా! సర్పాలకు హృదయాలుండవు. అందరూ మీ మీ డైరీల్లో కూడా ఈ మాట రాసుకోండి. దాన్ని రెడ్ యింక్ పెన్‌తో అండర్‌లైన్ కూడా చేసుకోండి. సర్పాలకు జాలి ఉండదు. సర్పాలకు కరుణ ఉండదు. అవి విషసర్పాలు. శరీరం అలసిసొలసి నీరసంగా కూలిపోతోంది. అడుగులు వేయడం సాధ్యం కావడం లేదు.

"ఓ మహాసర్పమా... నీకేం కావాలి? నన్నెందుకు వెంటాడుతున్నావు? నేను నీకేం హాని చేశాను? నీకేం ద్రోహం చేశాను? నా ఆస్తిపాస్తులన్నీ నీకే ఇచ్చేస్తాను. నన్ను వదిలేయ్... ప్లీజ్! నాకు భయంగా ఉంది. నీ బుస దూరంగా ఉండి వింటుంటేనే భయంగా ఉంది. నువ్వు దగ్గరిగా వస్తే నీ విశ్వరూపం చూస్తే నా గుండె ఆగిపోతుంది..." కళ్ల నిండా కన్నీళ్లతో వేడుకున్నాను...

"చూస్తున్నావుగా యిలా పరిగెడుతూ ఎన్ని ఉదయాలు,ఎన్ని మధ్యాహ్నాలు, ఎన్ని సాయంకాలాలు, ఎన్ని రాత్రులు వ్యర్థంగా గడిచిపోతున్నాయో... చాలు... యిక నా వల్ల కాదు... నేను ఓడిపోతున్నాను. నాకిష్టం లేని మాట 'ఓడిపోవడం'. సిగ్గు విడిచి ఆ మాటను కూడా చెప్తున్నాను. నన్ను క్షమించు... వదిలేయ్... చీకటవుతోంది. అంధకారంలో పరుగు నా వల్ల కావడం లేదు..." అడుగులు ఆగాయి. మోకాళ్ల పైన కూలబడిపోయాను. కానీ... ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. మృత్యువు ఈ రకంగా వస్తే రానీ... మన చేతుల్లో లేదు కదా. ఒక నిర్ణయానికి వచ్చేశాను.

నిశ్శబ్దం... నిశ్శబ్దం... కాసేపటి తర్వాత ఏవో మాటలు... దూరం నుంచి విన్పిస్తున్నాయి. సర్పం ఆగినట్లుంది. బుసతో పాటు నీరసంగా కొన్ని మాటలు...

"చాలు... చాలు... యిక పరిగెత్తకు... నేను నీయంత శక్తివంతుడ్ని కాను. నువ్వు కావాలంటే ఎంత వేగంగానైనా వెళ్లిపో. కానీ నీ నడుముకు కట్టుకున్న ఐరన్ చైన్ విప్పేయి. నేను ఆగిపోతాను.

నీతో పాటు ఎన్ని చోట్లకు నన్ను తీస్కెళ్తావు. నీ జీవితమే నేననుకున్నావా... ఎంతో సన్నగా... నీళ్లలో కదలాడే వానపాములా ఉండేదాన్ని... చూస్తున్నావుగా ఎలా తయారుచేశావో... నా రూపం చూస్తుంటే నాకే భయం కల్గేలా నన్ను తయారు చేస్తూ వచ్చావు. ఇప్పుడు ఏడు తలలయ్యాయి. చాలవా? ఇంక ఎంత దూరం పరిగెడతావు... ఆగు ఆగు. ఒక్కసారి మిగతా ప్రపంచాన్ని కూడా చూడు. ఆకలితో అలమటిస్తున్న అనాథల్ని, అభాగ్యుల్ని... దాహంతో గుక్కెడు మంచినీళ్లు కూడా దొరక్క యాతన పడుతున్న వాళ్లని... వ్యాధులతో మంచాల్లో ఉన్నవాళ్లని చూడు... యుద్ధాల బారినపడి అనాథలవుతున్న వాళ్లను చూడు... నీకు ఇలాంటి దృశ్యాలు అర్థం కావా? నువ్వు బాగుంటే చాలా? మిగతా ప్రపంచంతో నీకేం సంబంధం లేదా? నువ్వు ఎలాగైనా వెళ్లు... యిక నేను మాత్రం పరుగెత్తలేను... నన్ను వదిలేయ్... నేనే ఎన్నిచోట్ల ఉండగలను? నీ స్విస్ బ్యాంక్ ఖాతాల్లో నేనే.నీ ఇంట్లోని ఇనుప బీరువాలో కట్టలు కట్టలుగా నేనే. నీ షేర్స్‌లో, మ్యూచువల్ ఫండ్స్‌లో నేనే. ఖరీదైన కార్లకు, బిల్డింగ్‌లకు, వ్యాపారాలకు అన్నిటికీ నేనే.

నీ వెంట యింతకాలం పరిగెత్తింది చాలు. యిక నీ నడుముకు కట్టుకున్న ఐరన్ చైన్ విప్పేసి నాకు స్వేచ్ఛను ప్రసాదిస్తే నేను వెళ్లిపోతాను. ఎక్కడైనా విశ్రాంతి తీసుకుంటాను. నా ఆకారాన్ని తగ్గించుకొని మళ్లీ వానపాము సైజులోకి మారిపోతాను.

ప్లీజ్! ఎంతకాలం నుంచి గొంతు వాచిపోయేలా మొత్తుకుంటూ నీ వెంట రావాలి? నా గోడు విన్పించుకోవు. యికనైనా నాకు విముక్తి ప్రసాదించు...”

అవును ఏడుతలల సర్పం రోదిస్తోంది... ఆ స్వరంలో బాధ... ఆవేదన... అరే నేనెంత మూర్ఖుడ్ని. అది నా బానిస అని గుర్తించలేకపోయానా... ఛా! ఎంత పరుగు పెట్టాను. ఆఫ్టరాల్! ఒక సర్పం... నాగుపాము... అదీ ఏడుతలల ‘పాము’కే భయపడిపోయానా? పాముకు మనిషి ఎక్కడైనా భయపడ్తాడా? మనం రోజూ చూడ్డం లేదూ ... కాలనీల్లో ఇండ్ల ముందుకు బుట్టల్లో పాముల్ని ఆడించుకుంటూ, గంట కొట్టుకుంటూ వచ్చేవాళ్లని! ఇదీ అలాంటిదే గురూ... కాకపోతే మరో ఆరుతలలు ఎక్కువ. అంతే. డోంట్ వర్రీ... దాని ఆకారం పెద్దదే కావచ్చు. కానీ అది మన బానిస.

అరే... ఏమో అనుకొని ఎంతగా భయపడిపోయాను... ఇప్పుడర్థమైంది! నా వెనుక వస్తుంటే వెంటపడ్తోందని భ్రమపడ్డాను.

నిజాయితీగా మీరే చెప్పండి...ఎవరైనా ఎందుకు జీవిస్తారు? సంపాదించడానికే కదా! రాజకీయ నాయకులు ఎందుకు ఎన్నికల్లో పోటీ చేస్తారు? పదవుల్లోకి వచ్చిన తర్వాత వాళ్లేం చేస్తారు? పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు వీళ్లంతా ఎందుకు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడ్తూ ఉంటారు? ఇవాళ భూమి తన చుట్టూ తాను తిరుగుతూ డబ్బు చుట్టూ తిరుగుతోంది. జీతం కోసమే జీవితం అన్నట్లు అందరూ పని చేస్తున్నారు. తరతరాలకు కావలసినంతగా సంపాదించుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మనం బతుకుతున్నది ముమ్మాటికీ డబ్బు సంపాదన కోసమే!

నాకు తెలుసు ఇప్పుడు పైకి మీరంతా నన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. మేమంతా అలాంటి వాళ్లం కాదని గొడవకు, చర్చకు సిద్ధపడతారు.

‘జీవితం వేరు. అనుబంధాలు వేరు. అనురాగాలు వేరు, సంపాదన వేరు. డబ్బు సంపాదన పరుగులో పడి నీ జీవితం ఎన్నెన్ని ప్రేమల్ని కోల్పోయిందో డైరీలోని పాత పేజీల్ని తిప్పి చూసుకో...’ అని మీరు నాకు స్పెషల్ క్లాస్ తీస్కోకండి. ముందు మీ ముఖానికేసుకున్న ‘ముసుగు’ తొలగించి మాట్లాడండి! నటనలు వద్దు...!

హమ్మయ్య... రిలాక్స్‌డ్‌గా ఉంది... ఎడారి ఇసుకలో చల్లదనం... అరె... నేను యిన్ని రోజుల్నించి ఈ పరుగులో పడి సరిగ్గా గమనించనేలేదు. ఎడారి నిండా జనం... ఒక్కొక్కడి నడుముకు ఒక్కో ఐరన్ చైన్. వెనుక కాళ్లీడ్చుకుంటూ, తిట్టుకుంటూ వివిధ రకాల సైజుల్లో పాములు... ఎవడి ఆర్థిక స్థోమతను బట్టి ఆ సైజులో పెరిగిన

పాములు. అవున్లే వానపాములాంటి దానితో మా డాడీ పరుగు మొదలుపెట్టి ఆయన కండరాల్లో సత్తువ ఉన్నన్ని రోజులు దీన్ని పెద్ద చేస్తూ 'పోయాడు'... ఇదిగో ఇప్పుడు ఏడు తలల నాగు అయ్యింది. ఈ పరుగులో నాకంటే ముందుకెళ్తున్న వారిని చూస్తే నాకు అసూయ.

ఇప్పటికే కొన్ని నిముషాలు ఆలస్యమైంది. పరుగు మొదలుపెట్టాలి. సంపాదించాలి. ఏడు తలలు పది కావాలి... పద్దెదు కావాలి... పాతిక తలలు... అలా అలా విస్తరిస్తూనే ఉండాలి. ఐరన్ చైన్ మరోసారి సరిగ్గా గట్టిగా ఉందో లేదో చూస్కున్నాను... నాకు గుర్తే లేదు. మా డాడీ దీన్ని నాకు ఎప్పుడు తగిలించాడో. నా వెనుక నిదానంగా వస్తూ ఏడు తలల పాము ఏదో దీనంగా చెప్తోంది... లీలగా విన్పిస్తోంది...

"పరుగెత్తి... పరుగెత్తి... చివరికి ఏమైపోతావు? నువ్వే లేనప్పుడు నువ్వు ఎంత సంపాదిస్తే మాత్రం ఏం లాభం? యింతకాలం శ్రమించి నువ్వు పెట్టిన పరుగుకు అర్థమేముంది? విలువేముంది? ఒక్కక్షణం ఆలోచించు..." పాము ఏదో వేడుకుంటోంది.

బానిస చెప్పే మాటలకు విలువుండదు కదా! రెడీ...కమాన్... ఒన్... టూ... త్రీ... పరుగు మళ్లీ మొదలైంది!

– 17, ఆగస్టు 2008

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం.

'HIRANYARAJYAM'

deals with historical significance, transformation of factionalism

Kadapa District Collector M.T.Krishna Babu has called upon people to lead harmonious lives without turning villages into hot-beds of factionalism and avoid feuds and vengeance to ensure peaceful co-existence among families. Speaking at a seminar on 'Rayalaseema factionalism - solution angle', he observed that factionalism sprang up in places where unemployment, illiteracy and poverty ruled the roost. Kusuma Kumari, Vice-Chancellor of Sri Krishnadevaraya University released a book 'Hiranyarajyam' authored by Vempalle Gangadhar, at a function organised by P.T. Veera Reddy Foundation here.

Regional studies : Lauding the foundation for publishing the book which dealt with the historical significance and transformation of Rayalaseema factionalism, she complimented the author for recording this transformation at a time when the need for regional studies was imperative. Kadapa S.P. Mahesh M. Bhagwat called upon people to oppose factionalism and favour development.

Call for literary pursuits : Noting that factionalism was on the downslide in the district, he stressed the need for counselling of faction oriented families. A.Ranga Reddy, Professor in Economics of Sri Venkateswara University called for extensive literary pursuits from Rayalaseema and in-depth study of Rayalaseema history. Bhuman Subrahmanyam Reddy, Director of Sri Venkateswara Employees Training Academy, Tirupati said factionalists who led lives in fear, abandoning their fertile agricultural fields should shed factionalism and lead strife less lives. Rayalaseema agitation leader Maseema Rajagopala Reddy, P.T. Veera Reddy Foundation Chairman P.Adarsh Reddy participated.

- 2 September, 2008 - THE HINDU

ఉషస్సు ప్రచురణలు







For Copies : Ushassu Prachuranalu
4/432/A, Vivekananda Nagar, KADAPA - 516 001,
Andhra Pradesh - India. Cell : 9440074893



devarasila
selected short stories by
vempalli gangadhar

ఎండ పెడ్తాంది. వాన కురుస్తాంది.ఎండావాన.
మిట్టమధ్యాహ్నమప్పుడు ఈ సిత్రమేంది?
గరుడ స్తంభం పక్కలో పెట్టుకొని గుడిమెట్ల మీద కూర్చున్నవాడు పాడే పాట విన్పిస్తాందా?
ఇప్పపూలు శబ్దం లేకుండా చెట్టునుంచి రాలిపడ్తా వుండాయా?
పడమటి కొండ దిక్కు మోడాలు కమ్ముకొని చినుకులు కురుస్తాంటే మట్టివాసన వస్తాందా?
రావిచెట్టు కొమ్మలు ఊగుతా ఊగుతా అప్పుడప్పుడు నేలపైకి వాలి భూమి తల్లిని ప్రేమగా ముద్దాడతా వుండాయా?
ఒక కంట్లో సూర్య భగవానుడ్ని, మరో నేత్రంలో చంద్రబింబాన్ని చెక్కిన యుద్ధవీరుడి వీరగల్లు నెత్తుటి మాన్యానికి కాపలా కాస్తా వుండాదా?
ఓరి దేవుడా...
మన వూరి కథలన్నీ ఇవే కదా!

-కె.వెంకటేశ్వర రాజు